
# ప్రాచీనాంధ్ర కావ్యాలు

## రాజనీతి

47779




డా॥ పామిరెడ్డి దామోదర రెడ్డి

ఎం.ఏ; పిహెచ్.డి.,

# ప్రాచీనాంధ్ర కావ్యాలు - రాజనీతి

## (సిద్ధాంత గ్రంథం)



This Book is Published with the Financial aid of Tirumala Tirupati Devasthanam under their Scheme Aid toPublish religious Books

డా॥ పామిరెడ్డి దామోదర రెడ్డి

ఎం.ఏ; పిహెచ్.డి.,

**"Pracheenandra Kavyalu - Rajanithi"**
A Doctoral Thesis by
Dr. Pami Reddy Damodara Reddy

---

సర్వస్వామ్యములు రచయితవి

ప్రథమ ముద్రణ - **1994**

ప్రతులు - **1000**

47779

వెల : రూ. **50-00**

ప్రతులకు :-

డా॥ పామిరెడ్డి దామోదర రెడ్డి
ఆంధ్రోపన్యాసకులు
సి. వి. ఎల్. ఎన్. ఆర్. డిగ్రీ కాళాశాల
అనంతపురం.

.... .... .... .... .... ... .... .... .... ....

శ్రీమతి పామిరెడ్డి రాధ
దుద్దేకుంట (గ్రామము, పోష్టు)
బెలుగుప్ప (మండలం)
అనంతపురం (జిల్లా) 515 741

తిరుమల తిరుపతి దేవస్థానం వారి
ఆర్థిక సహాయంచే ప్రచురించబడినది.

ముద్రణ :

శ్రీ సత్యతీర్థ ప్రింటింగ్ ప్రెస్
కమలానగర్, అనంతపురం.

# రాజనీతి రహస్యం

కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం జెందరే
వారేరీ సిరి మూటగట్టికొని పోవంజాలిరే భూమిపై
పేరైనంగలదే శిబి ప్రముఖులున్ ప్రీతిన్ యశఃకాములై
ఈరే కోర్కెలు వారలన్ మరచిరే యిక్కాలమున్ భార్గవా! (భాగవతం – పోతన)

అని బలి చక్రవర్తి శుక్రాచార్యునితో అంటాడు తాను సంపాదించిన సిరి వెంట రాదని గ్రహించిన బలి చాలా జ్ఞానవంతుడు. అందుకే అతని కీర్తి ఇప్పటికీ మిగిలింది. జీమూత వాహనుడిలాగా ఆయన కథ మిగిలింది. బలి చెప్పిన పైమాటల్లో భారతీయ రాజనీతి పరమార్థమంతా ఇమిడి వుంది

ఈనాడు రాజులు పోయారు రాజ్యాలు పోయాయి. అయినా రాజనీతి మాత్రం దాదాపు ఆనాటికీ ఈనాటికీ ఒకలాగే ఉంది ప్రభుత్వాలను కూల దోయటంలో, కింవదంతులు వ్యాపింప చేయటంలో, ఎత్తుకు పైఎత్తులు వేయటంలో, ప్రజల అభిప్రాయాన్ని తమ అనుకూలంగా మలుచుకోవటంలో ఆనాటి రాజులకు, ఈనాటి రాజకీయ వేత్తలకు స్వభావంలో ఏమీ తేడా కనిపించటం లేదు. దీనికి కారణం తెలుసుకోవాలంటే ఈ గ్రంధం అవశ్యం చదవదగింది

ప్రజాస్వామ్యంలో రాజులుండరు ప్రజా ప్రతినిధులుంటారు. కాని వారి వైభవం ఆనాటి రాజుల కన్నా ఏమాత్రం తీసిపోవటం లేదు వారిని ఆశ్రయించి కవిత్వాలు రాసి అంకిత మిచ్చిన ఇస్తున్న ప్రభుత్వ కవులు ఈనాడు ఉన్నారు. ఎదిరించిన సామాన్యుడికి ఆనాడు శిక్ష తప్పలేదు. ఈనాడు తప్పడంలేదు. దీనికంతా కారణం ఒకటుంది అదే రాజనీతి రహస్యం

మనిషికి అధికార దాహం చాలా భయంకరమైన గుణం. భర్త పాలకుడు, భార్య పాలితురాలు కావటానికి మగవాడిలోని ఈ అధికార దర్పమే కారణం అలాగే అధికారి కింద ఉన్న చిన్న ఉద్యోగి విషయమూ అంతే. ఇలా పాలక–పాలిత సంబంధం ఎక్కడెక్కడ ఏ రూపంలో ఉన్నా అధికారి పాలకుడుగానే పాలిస్తాడు. అంటే రాజు తాలూకు లక్షణాలు వస్తాయన్న మాట అంటే వెంటనే వాడి చలనంలో రాజనీతి రహస్యం ప్రకటితమౌతూ ఉంటుంది. అందుకే తన క్రింది వాడిని తనకు అనుకూలంగా మార్చుకుంటాడు. సమాన బలవంతుడితో శత్రుత్వం పాటిస్తారు. తనదాక పక్షంగా అభిప్రాయాన్ని కూడ గడతాడు. సామదాన భేద దండోపాయాలు ఎప్పటికేది అవసరమో అది వాడి తన స్థానాన్ని కాపాడు కుంటాడు.

స్థూలంగా ఇదే రాజరికమంటే. ఇది ఎప్పుడూ 'అర్థం'తో ముడిపడి ఉంటుంది. అందుకే ప్రభువు తన వారిని డబ్బుతో మేపుతూ, వాళ్ళ గడి మీరకుండా చూస్తుంటాడు. అలాగని ఎవరూ తనకన్నా ధనవంతుడు కాకుండా కూడా జాగ్రత్త పడుతుంటాడు. అంచేత అర్థశాస్త్రం–రాజనీతికి జన్మించిన మరో శాస్త్రం ఉంది అదిదండనీతి ఎవరెవర్ని ఎలా అధికార నియంత్రణంలో ఉంచుకోవాలి అన్నది. ఈ మూడు రాజనీతి లో ఉంటే అదే ఒకనాటి రాచరికం. వ్యవస్థ చేతిలో ఉంటే ప్రజాస్వామ్యం. కాని వ్యవస్థను మళ్ళీ మనిషే నియంత్రించాలని ప్రయత్నిసూ ఉండటం వల్లనే ఆధునిక మా రాజులు, మహారాజులు, బూజులు ఏదో ఒక రూపంలో ఈనాటికీ కనిపిస్తునే ఉన్నారు.

భారతీయులు ప్రపంచ మేధావులు చాలా కాలం భావించినట్టి అమాయకులుకారు, అనాగరికులుకారు. వారు ఏ ఇతర దేశీయులు మేల్కొనంత ముందుగానే మేల్కొని ఇతరులకు ప్రబోధ గీతాలు ఆలపించారు. అలాంటి ప్రబోధ గీతాలు మూడున్నాయి. ఒకటి వేదం. మరొకటి పురాణం, మూడవది శాస్త్రం, కార్యాకార్య విచక్షణను శాస్త్రాన్ని ఆధారంగా గుర్తించడం మంచిదని భారతీయులు చాలా కాలం ముందే గుర్తించారు. అందుకే లిఖిత రాజ్యాంగ నిర్మాణం వంటి రాజనీతి శాస్త్రాన్ని సృష్టించారు, రాజు చేతిలో అధికారం ఇచ్చినట్లే ఇచ్చి 'ధర్మం' రాజు కన్నా గొప్పదని దాన్ని "రాజధర్మం" అంటారని నిర్వచించారు. ఒకనాడు రాజన్న వాడి అవసరం రాలేదని, మనిషిలో అన్యాయ ప్రవృత్తి ఏర్పడగా, పరమాత్మ అంశ ధర్మ పరిరక్షణ కోసం 'రాజు' రూపంలో అవతరించిందని రాజు ధర్మానికీ ప్రజలకు నడుమ అన్వయ కర్త తప్ప వాడు అధికార కాముకుడూ దర్మహీనుడు, లోభి అపకారి కారాదని అలా అయిన పక్షంలో వాడిని ప్రజలు నిర్దాక్షిణ్యంగా చంపి లేదా తిరుగుబాటు చేసి, వాడి స్థానంలో మరొకణ్ని స్థాపించుకుంటారని రాజనీతిని నిర్వచించిన మహర్షులకు తెలుసు అందుకే "ధర్మమతమే" ప్రాచీన రాజకీయ వ్యవస్థ అని, జ్ఞానసంపన్నుడైన ప్రభువు రాజ్యమనే క్షేత్రంలో ప్రజారక్షణమనే యజ్ఞం చేసి రాజయోగ సాధకుడు కావాలని శాసించారు జనక మహర్షి వంటి రాజ యోగులు ఈ విధంగా ముక్తిని సాధించారు. రాజు నిమిత్త మాత్రంగా సింహాసనం మీద కూడాలి తప్పు చేసిన వాడు తన కుమారుడైనా శిక్షించాల్సిందే (మాధవ వర్మ కథ) తన భార్యనయినా దండించాల్సిందే (సీతను అడవిలో వదలి వెయ్యటం)! అలాంటి రాజులను రాజర్షులు అన్నారు. వారి జీవితాల్ని కాళిదాసు ప్రభృతులు కావ్యాలుగా రాశారు. ఆ నమూనాలోనే నన్నయాదులు తమ గ్రంధాలలో రాజనీతిని జత చేశారు. ప్రబంధాలలో కూడా సందర్భం వచ్చిన చోట్ల 'రాజనీతి'ని వివరిస్తూ వెళ్ళారు. 18వ శతాబ్దం వరకు వచ్చిన కావ్యాలలో చాలా కావ్యాలలో రాజనీతి ఏదో ఒక రూపంలో తప్పనిసరిగా ప్రకటమవుతుంది

కాని చిత్రమేమిటంటే కావ్యాలలో కనిపించేది చాలా వరకు సమకాలీనమైన రాజనీతి స్వరూపం కాదు రాజులు ఎన్ని శతాబ్దులకైనా ఒకే విధంగా లేరు. సమాజ స్వభావమూ మారిపోయింది. అధికార రీతులు దండన పద్ధతులూ చాలా మార్పులు పొందాయి. సమకాలీన శాసనాలతో పోల్చి చూస్తే కావ్యాలలోని రాజనీతి యథా మూలకంగా ఆ సంస్కృత గ్రంథాలలో ఉన్నట్టుగానే చాలా వరకు చెప్పినట్టు తెలుస్తుంది ఎవరో అముక్తమాల్యదకర్త వంటివారు కొత్తగా కొన్ని అంశాలు చేర్చారు అవి ప్రాచీన స్మృతి గ్రంధాలలో ప్రసిద్ధమైనవిగా కనిపించటం లేదు (గిరిజనుల అను గురించి రాయలు రాసిన "ఎల్లుందానును ... " ఇత్యాది పద్యం ఇలాంటిది) ఇన్ని కావ్యాలలోని రాజనీతి స్వరూపం మహాభారతంలో సూక్ష్మ రూపంలో కనిపిస్తుంది.

మహాభారతంలోని 'రాజనీతి' మీద చాలా గ్రంథాలు ముద్రణ పొందాయి. అందుచేత ఆ గ్రంథాన్ని వదలి ఇతర కావ్యాలలో కనిపించే రాజనీతి స్వరూపాన్ని మా శాఖలోని పరిశోధక మిత్రుడు డా॥ పి. దామోదరరెడ్డి ఈ గ్రంథం ద్వారా ఆవిష్కరిస్తున్నాడు. సౌమ్యుడు సమర్థుడు మా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ అయిన ఆచార్య పి. యల్. శ్రీనివాసరెడ్డి గారి పర్యవేక్షణలో తయారయిన ఈ గ్రంథంలో రాజనీతి స్వరూపం చక్కగా వివరింపబడింది. దామోదరరెడ్డి బహు గ్రంథ పరనవల్ల పండిత సేవ వల్ల, చాలా ఓర్పుతో నేర్పుతో ఈ గ్రంథాన్ని నిర్మించారు. సాధారణంగా ఇలాంటి అంశాల మీద పరిశోధన చేయటానికి విద్యార్థులు ఇష్టపడరు. అలాంటి పరిస్థితిలో రాజనీతికి సంబంధించిన సప్తాంగ స్వరూపాన్ని, దండనీతిని, దౌత్య విధానాన్ని సమగ్రంగా విశ్లేషించిన డా॥ రెడ్డి అభినందనీయుడు.

ప్రతి అధ్యాయంలోనూ ఎంతో శ్రమకు ఓర్చి ఆయా గ్రంథాలలోని శాస్త్ర ప్రమాణాన్ని ఉదాహరించి కావ్యాలలోని ప్రయోగాలను చూపడం. ఈ గ్రంథంలోని పద్ధతి. ఈ పద్ధతి వల్ల ప్రాచీన కావ్యాలలో కేవలం ఉక్తి ప్రాధాన్యతే కాకుండా సాంస్కృతిక ప్రాధాన్యం ఎంత ఉందో బాగా తెలుస్తుంది

ఈ గ్రంథంలోని మెరుగులను ప్రశంసించాలంటే ప్రతి పుటనూ ఉదాహరించాల్సి వస్తుంది. 1–17 పుటల నడుమ ఉన్న రాజనీతి నిర్వచనం పరిశోధకునికి విషయంపట్ల ఎంత సమగ్రమైన అవగాహన ఉందో తెలుపుతుంది. ఉపయుక్త గ్రంథ సూచికను గమనిస్తే ఈ పరిశోధనాంశమెంత గగనమో గుర్తించవచ్చు ఇలాగే తక్కిన అధ్యాయాలలో కూడా నిశితమైన చూపుతో విషయాన్ని విశ్లేషించటం ముఖ్యంగా మనల్ని ఆకర్షించే అంశం.

చివరగా ఒక మాట పు 31లో ఉదహరించిన "భోగమను భవించు నెడను. బహిరంతరులపై దృష్టివలయు (ఆము 4–241) అన్న రాయల పద్యానికి అర్థం కేవలం జాగ్రత్త పాలన చేయాలనికాదు. రాజ్యం కేవలం సుఖానుభవానికి సంబంధించింది గాదని, ప్రవృత్తి-నివృత్తి మార్గాలను రాజు సమన్వయించుకొని బ్రతకాలని అర్థం ఇదీ ముందు చెప్పిన రాజయోగం–రాజనీతికి మూలం ఇదే. భారతీయులు ఈ రెంటినీ ప్రధానంగానే గుర్తించారు. డా॥ రెడ్డి భవిష్యత్తులో ఇలాంటి గ్రంథాలు రాసి, ప్రాచీన రాజనీతి నిఘంటువును నిర్మించి ఉత్తమ ఉపాధ్యాయుడుగా, పరిశోధకుడుగా రాణించాలని అధ్యాపకునిగా నా ఆశంస.

పాఠకులకు స్వాగతం

అనంతపురం ఆచార్య హెచ్. ఎస్. బ్రహ్మానంద

18–9–94



# కృతజ్ఞతలు

ప్రాచీనాంధ్ర కావ్యాలు-రాజనీతి అనే పరిశోధన అంశాన్ని సూచించి, పర్యవేక్షకుడిగా బాధ్యతలు స్వీకరించి నా పరిశోధన ఫలితాన్ని విశ్లేషణ చేయడమే కాకుండా నా మానసిక సంఘర్షణల్ని ఎప్పటికప్పుడు గుర్తించి, వాటిని తొలగిస్తూ, నాలో పరిశోధన పట్ల పట్టుదలను కలిగిస్తు పరిశోధన పూర్తి కావడానికి అన్ని విధాల సహకరించిన పూజ్యులు గురువర్యులు ఆచార్య పి. ఎల్. శ్రీనివాసరెడ్డి, రిజిస్ట్రార్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం గారికి,

విరాళ నిస్పృహల మధ్య ఊగిసలాడుతున్న నన్ను వెన్నుతట్టి ప్రోత్సహించి, పరిశోధన చేయడానికి స్ఫూర్తినిచ్చిన పూజ్యురాలు, మాతృశ్రీ డా॥ ఎం. కె. దేవకి గారికి,

నా సిద్ధాంత గ్రంథాన్ని సమగ్రంగా విశ్లేషించడమేకాకుండ ఛైర్మన్‌గా వ్యవహరించి, రాజనీతిపై నీ కృషి ఇంకా కొనసాగాలి, నీకు అండగా నేనుంటాను అని ప్రోత్సహించి, అనతికాలం లోనే ఈలోకానికి దూరమైన కీ॥శే॥ ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి గారికి,

నామీద ఆదరంతో విష్పాక్షికంగా నా కృషిని సమీక్షించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ గారికి, ఈ గ్రంథాన్ని ఓపికతో పరిశీలించి "రాజనీతి రహస్యం" విప్పి చెప్పిన ఆచార్య హెచ్. ఎస్. బ్రహ్మానంద గారికి,

పరిశోధనకు సంబంధించిన సలహాల్ని, సహకారాల్ని అందించిన "ఆంధ్ర భారతి" ఆచార్య అధ్యాపక బృందానికి,

నాకు పిహెచ్.డి పట్టాను ప్రధానం చేసి గ్రంధ ముద్రణకు అనుమతి ఇచ్చిన శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అధికార అనధికార వర్గానికి,

గ్రంధ ముద్రణకు ఆర్థిక సహాయం చేసిన తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతివారికి

ఈ సిద్ధాంత గ్రంథం ముద్రణకావాలని ఆకాంక్షించిన మిత్రవర్గానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయపడిన ఎందరికో మరెందరికో...

నా హృదయపూర్వక ధన్యవాదాలు.

# విషయసూచిక


| క్రమ సంఖ్య | అధ్యాయాలు | పుట సంఖ్య |
|---|---|---|
| 1 | రాజనీతి - నిర్వచనం - అవశ్యకం | 1 - 17 |
| 2 | రాజ్యం - సప్తాంగాలు | 18 - 80 |
| 3 | రాజు - రాజ ధర్మాలు, స్వరూప స్వభావాలు | 81 - 129 |
| 4 | రాజు - పాలనా వ్యవస్థ | 130 - 167 |
| 5 | రణ తంత్రం - విదేశాంగనీతి | 168 - 234 |
| 6 | ఆధార గ్రంథాలు | 235 - 236 |
| 7 | సంక్షిప్త పద సూచిక | 237 - 238 |

# 1. రాజనీతి - నిర్వచనం - ఆవశ్యకం

సామాజికాభివృద్ధి పరిణామదశలో వివిధశాస్త్రాలు వెలిశాయి. ఇవి మహాపురుషుల స్వానుభవంతో రచించబడ్డాయి. ఇలాంటి శాస్త్రాలలో రాజనీతిశాస్త్రం ఒకటి. "ప్రొఫెసర్ వింటర్ నిట్జ్, డా॥ పి.వి. కానే దండనీతి (రాజనీతి) ధర్మశాస్త్రాల నుంచి అవిర్భవించిందని పేర్కొన్నారు1. రాజనీతిశాస్త్రం రాజ్యసంబంధమైన అతి ప్రాచీనశాస్త్రం. "చర్చనీయమైన విషయాన్ని గురించి రుజువు చేయదగిన సూత్రాల సముదాయానికి శాస్త్రమని పేరు2. దీన్ని రెండు విధాలుగా వర్గీకరించవచ్చు. ఒకటి సామాజికశాస్త్రం, రెండు ప్రకృతిశాస్త్రం. రాజనీతి శాస్త్రాన్ని సామాజిక శాస్త్రంగా చెప్పవచ్చు. రాజనీతి తత్త్వాన్ని గురించిన విచారణ మొట్టమొదట గ్రీకుదేశంలో నగర రాజ్యాలు వర్ధిల్లేకాలంలో ప్రారంభమైందని కొందరు రచయితలు సిద్ధాంతీకరించారు3. క్రీ.పూ. నాల్గోశతాబ్దానికే ప్లేటో, అరిస్టాటిల్ మొదలైన పాశ్చాత్యులు రాజనీతి తత్త్వాలను కూలంకషంగా పరిశీలించి, చర్చించి, రాజనీతి శాస్త్రానికి మూలస్తంభాలై నిలిచారు. మన పూర్వులకు రాజనీతి తెలియదని కొందరు పాశ్చాత్యులు అభిప్రాయపడ్డారు4. భారతీయ సాహిత్యాన్ని క్షుణ్ణంగా పరిశోధిస్తే వాళ్ళ అభిప్రాయం నిరాధారమనీ, కేవలం సంకుచిత దృష్టితో చేయబడిందనీ తెలుస్తుంది.

## సంస్కృత సాహిత్యం – రాజనీతి -

భారతీయ సాహిత్యంలో రాజులకూ, తదితర పరిపాలకులకూ ఉపాదేయమైన రాజనీతిని తెలిపే ప్రయత్నం బృహత్తరంగా సాగింది. అతి ప్రాచీనమైన వేదాల్లోనే రాజనీతిని గురించి చెప్పబడింది. ఋగ్వేదం (10వ మండలం 173,174సూక్తాల్లో)లో రాజధర్మం, రాజనీతి గురించి పేర్కొనబడింది రాజసూయ, అశ్వమేధయాగాల్ని గురించి యజుర్వేదం చెబుతోంది. అదర్వవేదం అధిభూత ప్రకరణాలలో రాజులు, రాజశాసనాలు, యుద్ధాలు, శత్రు పరాజయ ఉపాయాదులు చెప్పబడ్డాయి. గౌతమ, బౌద్ధాయన, అపస్తంబ ధర్మసూత్రాల్లో రాజనీతి గురించి వుంది. అష్టాదశపురాణాల్లో రాజనీతి గురించి వర్ణనలు మాత్రమే వున్నప్పటికీ, అగ్నిపురాణంలో రాజనీతి విస్తారంగా లభిస్తుంది. స్మృతులలో మనుస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి రాజులకు పాలనావిధానాన్ని న్యాయ నిర్ణయాన్ని బోధించే రాజనీతి గ్రంథాలు. రామాయణ మహాభారతాలు జగత్ప్రసిద్ధిగాంచిన భారతీయ ఇతిహాసాలు. ఆదర్శరాజ్యపాలన గురించి రామాయణం పేర్కొంటే రాజ్యావిర్భావాన్ని, రాజరిక వ్యవస్థ స్వరూప స్వభావాల్ని, యుద్ధాల్ని, యుద్ధఫలితాల్ని గురించి భారతం వివరించింది. ఈ కావ్యాలు రాజనీతిని గురించి విశేషంగా పేర్కొన్నాయి. రఘువంశం, కిరాతార్జునీయం, 'శిశుపాలవధ' మొదలైన కావ్యాలలో

విస్తారమైన రాజనీతి కనబడుతుంది. ప్రతిజ్ఞాయౌగంధరాయణం, మృచ్ఛకటికం, ముద్రారాక్షసం రాజనీతి ఇతివృత్తంతో కూడివున్న రూపకాలు. కౌటిల్యుని అర్థశాస్త్రం, కామందక నీతిసారం, శుక్రనీతిసారం ప్రసిద్ధి గాంచిన నీతి బోధక గ్రంథాలు. వీటిలో రాజనీతి గురించి విపులంగా చర్చించబడింది. దశకుమార చరిత్రం, కాదంబరి రాజనీతి సంబంధిత గద్యకావ్యాలు. హర్షచరిత్ర, విక్రమాంక దేవచరిత్ర, రాజ తరంగిణి రాజనీతి ప్రశస్తమైన చారిత్రక కావ్యాలు. నీతి కథలకు సంబంధించిన పంచతంత్రం రాజనీతిని గురించి పేర్కొంది. రాజనీతిపట్ల ఆనాటి పాలకులకు అవగాహన కలిగించడానికి ఈ రచనలు తోడ్పడ్డాయి.

తెలుగు సాహిత్యం రాజనీతి -

రాజనీతిని బోధించడంలో తెలుగు కవులుకూడ తమవంతు కృషి చేశారు. తెలుగు సాహిత్యాన్ని అనువాద, స్వతంత్ర రచనలని రెండు విధాలుగా విభజించవచ్చు. వీటిలో ప్రత్యేకంగా రాజనీతిని తెలిపే రచనలున్నాయి. కథా సందర్భాన్ని బట్టి అక్కడక్కడ రాజనీతిని బోధించిన రచనలున్నాయి ఇవేకాక సంకలన గ్రంథాలని మరొక విభాగం వుంది. పై రెండు విభాగాలలోని రాజనీతిని ఏర్చి వివిధ శీర్షికల క్రింద కూర్చి ఒకే కృతిగా ఏర్పరిచిన గ్రంథాలివి. కవిత్రయ భారతం, కుమార సంభవం, మార్కండేయ పురాణం, హరివంశం, ఉత్తర హరివంశం, రంగనాధ, భాస్కర రామాయణాలు, కేయూర బాహుచరిత్ర, నీతిశాస్త్ర ముక్తావళి, చారుచర్య, పలనాటి వీరచరిత్రం, భాగవతం, పంచతంత్రాలు, శృంగార శాకుంతలం, విక్రమార్క చరిత్రం, సింహాసన ద్వాత్రింశిక, రుక్మాంగద చరిత్ర, ఆంధ్ర విష్ణుపురాణం, ఆముక్తమాల్యద, కళాపూర్ణోదయం, కువలయాశ్వచరిత్రం, సకలనీతి సమ్మతం మొదలైన కావ్యాలలో రాజనీతి విషయాలున్నాయి.

రాజనీతి నిర్వచనం ,- (పాశ్చాత్యులు)

ఏథెన్స్ నగర రాజ్యంలో సిరక్యూస్‌దుర్మార్గానికి జన జీవనంలో నైతిక విలువలు బలికాగా 'సౌశీల్యమే జ్ఞానం, జ్ఞానమే సౌశీల్యం' అనే నినాదంతో సోక్రటీస్ నైతిక విలువల్ని ఉద్ధరించడానికి ప్రయత్నించాడు5 రాజనీతి, నీతిశాస్త్రానికి దగ్గర సంబంధం వుందని, అవినీతిగా ప్రవర్తించే పాలకులు ఉత్తమ రాజకీయ వ్యవస్థను స్థాపించలేరని, అదేవిధంగా నీతి బాహ్యంగా వ్యవహరించే ప్రజలు ఉత్తమ రాజ్యాన్ని రూపొందించలేరని ఆయన పేర్కొన్నాడు6. సోక్రటీస్ శిష్యుడైన ప్లేటో "రాజ

నీతి శాస్త్రం, నీతిశాస్త్రంలో ఒక భాగం మాత్రమే. ప్రజలకు న్యాయం, ధర్మం, ప్రయోజనం చేకూర్చడమే రాజ్య లక్షణం. అందుచేత తత్వవేత్తలయిన రాజులు [Philospher Kings]పరిపాలించడం ఉత్తమ పద్ధతి" అని ధర్మ శాస్త్రాధ్యికాన్ని, పవిత్రతనూ ప్రశంసించాడు.7 మధ్యయుగంలో రాజనీతి మతాన్ని ఆశ్రయించిది. రాజులకు పీఠాధిపతులకు మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఇటలీ దేశంలో అరాచక పరిస్థితి నెలకొనివుంది. ఇలాంటి దశలో మెకియవెల్లి 'దిప్రిన్స్' (1513) అనే గ్రంధాన్ని రచించి అసాధారణ రాజనీతిజ్ఞతను కనబరచాడు. "మెకియవెల్లి" రాజనీతి శాస్త్రానికి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించి వాస్తవిక,ఆచరణాత్మక రాజకీయాలకు రాజనీతి సిద్ధాంతాన్ని సన్నిహిత పరచినాడు. రాజనీతి శాస్త్ర స్వతంత్ర ప్రతిపత్తికి అడ్డుగా నిలిచే మతాన్ని, నైతిక శాస్త్రాన్ని రాజనీతి శాస్త్రం నుంచి స్పష్టంగా వేరు చేసినాడు. కార్యసాధనలో మాత్రమే మతసంస్థలను ఉపయోగించుకొనవలెను కాని, వాటి ప్రభావానికి మాత్రం గురి కాకూడదు. వీటి ద్వారా సుస్థిరత, శాసన విధేయత రాజ్యంలో ఏర్పరచవచ్చు. మత నైతిక ధర్మాలు రాజనీతికి లోబడి యుండవలెనని మెకియవెల్లి వక్కాణించాడు. "8 కౌటిల్యుని అర్ధశాస్త్రం, మెకియవెల్లి 'దిప్రిన్స్' అనే గ్రంధాలు సిద్ధాంతవివరణలో పోలికల్ని కలిగి వున్నాయి. జయాభిలాషి అయిన రాజుకు వుండాల్సిన గుణాల్ని చెప్పడంలో ఇద్దరు పరస్పర సంబంధాన్ని కలిగి వున్నారు. వీరిద్దరు ప్రయోగాత్మక పరిపాలనా పద్ధతుల గురించి చెప్పడం వల్ల వాస్తవిక రాజకీయలతో సన్నిహిత సంబందాన్ని ఏర్పరచుకొన్నారు. ప్రయోగాత్మక రాజనీతికి ఇరువురూ నూతన దృక్పథాన్ని కలగ చేయడంలో సఫలీకృతులైనారు.

రాజనీతి – భారతీయుల నిర్వచనం :–

భారతీయ రాజనీతికి ధర్మం మూలం. ధర్మాన్ని రక్షించడమే రాజు కర్తవ్యం. ఇలాంటి రాజు అధర్మపరుడు కాకుండా వుండడానికే రాజనీతి శాస్త్రం రచించబడింది. ధర్మానికి ఏర్పడిన విపత్తు తొలగించడానికే బ్రహ్మ రాజనీతి శాస్త్రాన్ని తయారుచేశాడు (భార. శాం 2–198 నుంచి 203). కాబట్టి రాజుఅనేవాడు ధర్మరక్షణకై అవిర్భవించాడని స్పష్టమవుతోంది. ఇలాంటి గురుతర బాధ్యత స్వీకరించిన రాజు అవినీతిపరుడుగా మారకుండా, అతనికర్తవ్యాన్ని గుర్తు చేయడానికే రాజనీతిశాస్త్రం అవసరమవుతుంది. "అన్వీక్షకీ త్రయీ వార్తల యోగక్షేమములకు దండము సాధనము, దాని ప్రయోగమే దండనీతి. అది ఇది వరకు లభించని దానిని లభింపజేయును. లభించిన దానిని పరిరక్షించును, రక్షింపబడిన

దానిని వృద్ధి చేయును వృద్ధిగావించిన దానిని సత్పాత్రుల కందజేయును. లోక యాత్ర అంతయు దానిపైఆధారపడి యున్నది.9–" అని కౌటిల్యుడు దండనీతిని నిర్వచించాడు "సంపద కోసం ప్రయత్నించడం, సంపదను అభివృద్ధి చేయడం గడించిన దానిని రక్షించడం, రక్షించిన దానిని చక్కగా వ్యయం చేయడం రాజ విధులుగా" తిరక్కురళ్ చెబుతోంది.10 ప్రాచీన సాహిత్యంలో చెప్పబడ్డ రాజనీతి విషయాలు పరిశీలిస్తే, రాజ్యం అవలంబించే నీతినే రాజనీతి అనవచ్చు. అంటే రాజ్యపాలనకు అవసరమైన వనరులను సమకూర్చుకొని వాటిని సమన్వయించి తెలివిగా అధికారాన్ని ప్రయోగించి పరిపాలన చేయడమన్నమాట. రాజ్యం సప్తాంగ సంయుతం. రాజు సప్తాంగాల్లో ఒక అంగమే అయినప్పటికి రాజ్యాన్ని సక్రమంగా పాలించే బాధ్యత రాజుదే. అందువల్ల రాజు రాజ్యాన్ని పాలించేపద్ధతులను తెలిపేది రాజనీతి అని నిర్వచించవచ్చు.

రాజనీతి పర్యాయ పదాలు :–

మన సాహిత్యంలో రాజనీతికి పర్యాయ పదాలుగా దండనీతి, అర్థశాస్త్రం, నీతిశాస్త్రం, రాజనీతిశాస్త్రం, రాజశాస్త్రం, రాజధర్మం, క్షత్రియధర్మం అనేవి కనిపిస్తాయి.

దండనీతి - దండం నిర్వచనాన్ని గౌతముడు ఇలా పేర్కొన్నాడు.

" దండము అనే పదం, 'డం' అనే మూల పదం నుంచి వచ్చింది, 'డం' అనగా నియంత్రణ చేయు అని అర్థం. రాజు వర్ణాశ్రమ ధర్మాల్ని అతిక్రమించిన వారిని దండన ద్వారా నియంత్రణ చేస్తాడు"11

"The etymology of danda is derived from the root dad, 'to hold'. He also refers to the views of others citing their names. Thus, according to Aupamanyava, dand is to be derived insted from the root dam' to tame, to bring under control"12

దండం అనే పదం విపులార్థాలతో కూడుకొని వుంది

"పగ వారి కొద్దిగా భావించరాదు
కొంచెపు ఫణినైన కొట్టెడి కొరకు
ఘనమైన దండమే కావలె గాని
కూడదు చులకని కోలల గొట్ట
తప్పైనా తమకాన తరిమి కరిచెడిని. (ప.వీ.చ. పుట-330)

దండం అనే పదం కేవలం 'కర్ర' అనే అర్థంలో వాడబడింది.

"దండార్హుల దండింపమి
దండానర్హులగు వారి దండించుట యీ
రెండు నకీర్తిదముల భూ
మండల నాయకుల నిరయమగ్నులజేయున్" (క.7-269)

ఇక్కడ దండించడమనేది శిక్షించడమనే అర్థంలో వాడబడింది.

"దండము లేకున్నను బ్రజ
లొండొరువుల నాక్రమింతురుచిత స్థితి యై
యుండవు వర్ణాశ్రమములు
దండింపని భూమి పతికి దర యేర్పడునే." (స నీ.స-1-88)

"దండంబు రాజునకుం బరాయణంబు..." (భార, శాం-3-111) అని రాజనీతికి బదులుగా 'దండం' అనే పదాన్ని ప్రయోగించారు.

దండనీతిని గురించి కౌటిల్యుడిలా చెప్పాడు. "చతుర్వర్ణ చతురాశ్రమము లతో కూడిన ఈ లోకం రాజదండముచే పాలింపబడి, స్వధర్మ కర్మలయందభి రుచి కలిగి ప్రజలను తమతమ మార్గములందు నడుచునట్లు చేయుచున్నది "13 భీష్ముడు దండనీతి జన్మవృత్తాంతం చెబుతూ దండనీతికి మరోపేరు సరస్వతి అని అంటాడు.14

అర్థశాస్త్రం ,- రాజనీతి శాస్త్రాన్ని అర్థశాస్త్రం అన్నారు. "భూ సంపాదన పరిపాలనములనుద్దేశించిపూర్వాచార్యులచే ఎన్నెన్ని అర్థశాస్త్రములు రచింపబడినవో వానినన్నిటిని సమకూర్చి ఈ అర్థశాస్త్రము వ్రాయబడింది."15 అని కౌటిల్యుడు చెప్పడంవల్ల అంతకు పూర్వమే రాజనీతిశాస్త్రం అర్థశాస్త్రం అనే పేరుతో చెలామణీలో వుండేదని తెలుస్తుంది.

నీతి శాస్త్రం :- "నీతి అన్న పదానికి తీసుకొని పోయేది, 'చేర్చేది' అని అర్థం. అంటే మానవుని సన్మార్గంలోకి తీసుకొని పోయేది, సదాచరణవైపు చేర్చేది నీతి అని చెప్పవచ్చును."16 పాలకులను, పాలితులను సన్మార్గంలోనికి, సదాచరణ వైపుకు తీసుకుపోవడానికి నీతిశాస్త్రగ్రంధాలు రాయబడ్డాయి. రాజ్యాన్ని పాలించ డానికి రాజులకు తగిన సూచనలు ఇందులో వున్నాయి.

" వ్యసనములు మాని రాజు విద్వత్ప్రసంగ
సంగియై పురాణేతిహాసములు వినుచు
నీతి వినునేని నృపతికి నేర్పు మిగులు
వసుధ బాముసకెలుకలు వచ్చినట్లు " [స.నీ.స. 1-34]
" నీతి యెఱుగువాడు నిఖిలంబు లందును,
ఖ్యాతి లాభ పూజలందు నొప్పు —" [స.నీ.స. 1-33]

" Of the prince who does not follow Niti the Kingdom is weakened, the army is inefficient, and the civil service is disorganised

other elements of the state get topsy - turvy, in short, evils prevail everywhere - "[17] అని అంటాడు శుక్రనీతికారుడు.

నీతి శాస్త్రానికే న్యాయశాస్త్రం అని మరోపేరుంది. "...సకల శాస్త్రంబులందు నయ శాస్త్రంబు ముఖ్యంబవి తలంచి చెప్పం బూనితి..." (న.నీ.న 1-7) అని అంటాడు మడికి సింగన. " నయ మార్గంబున లక్ష్మి ..." [న.నీ.న. 1-33 అని నీతిశాస్త్రాన్ని ప్రశంసించడం వల్ల నయశాస్త్రం నీతిశాస్త్రం ఒక్కటే అని తెలుస్తుంది. నీతిశాస్త్రాలు కర్తల పేర్లతో చెలామణిలో వున్నాయి. కామందకనీతి శాస్త్రం, శుక్రనీతి సారం ఇలాంటివే.

<u>రాజశాస్త్రం :-</u> దండనీతిని రాజశాస్త్రం అనికూడ అంటారు. ఇది రాజులకు సంహిత [ code for the rulers ] వంటిదని అంటాడు జయస్వాల్.[18]

<u>రాజధర్మం ,-</u> ఇది రాజులకు చట్టం వంటిది. [Law for the rulers ] అని అంటాడు జయస్వాల్.[19]

" పట్టిన కార్యమీశ్వరుడు పట్టి పెనంగిన జేరనిక చే
పట్టుట రాజధర్మమని పల్కెడు నీతి . " [తె.భార. 4-50]

<u>రాజనీతి శాస్త్రం :-</u> ఇది రాజులకు సంబంధించిన నీతిశాస్త్రం. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని చదువు గురించి అడిగే సందర్భంలో రాజనీతి ప్రసక్తి వుంది. ఇతర విద్యలతోపాటు రాజనీతిని గురువులు బోధించే వాళ్లని తెలుస్తుంది. [అం.వి.పు. 2-281]

<u>క్షత్రధర్మం ;-</u> రాజునే క్షత్రియుడంటారు. 'క్షత్' 'త్రయ్' అనే ధాతువు నుంచి నిష్పన్నమైంది. అంటే గాయం నుంచి, ఉపద్రవం నుంచి స్వస్థత చేకూర్చే వాడు. క్షత్రియ ధర్మం, రాజధర్మం ఒకే అర్థంలో వాడబడుతున్నాయి ఋగ్వేద కాలానికే క్షత్రియ శబ్దమున్నట్లు తెలుస్తోంది. " యథా రాష్ట్రం గుపితం క్షత్రియస్య–"20 క్షత్రియశబ్దం ఇప్పటికీ, ప్రాచీనార్థంలోనే వాడుకలో వుంది. "క్షత్రియునకు శస్త్రధారణం బార్తత్రాణ రక్షణార్థంబుగాదే ...." [మా. పు. 8-165] అని అంటాడు మారన.

" దుష్ట శిక్షణము సంతృప్తిగా జేసి
శిష్ట రక్షణమును జేయంగ లేని
క్షత్రియులకు నేల సత్కీర్తి కలుగు" [ ద్వి.భార.శల్య. 3-64 ]

ఇది క్షత్రియ లక్షణం. కాశీ రాజుతో యుద్ధం చేసి ఎందరినో బలిపెట్టడం ఇష్టం లేక అలర్కుడు తన రాజ్యాన్ని కాశీరాజుకు ఇవ్వబోయాడు. అందుకు కాశీరాజు,

" క్షత్రియుడెందునాజి వెలిగా నిజ రాజ్యము వైరికిచ్చునే
క్షత్రియ ధర్మవేది విటుగాదన కెట్టులు పల్కితావాన
క్షేత్రమునందు శాత్రువుని గెల్చి ధరిత్రి పరిగ్రహించి స
తక్షిత్రియుడెల్ల భోగములు గైకొనుగాకిటు లేలగై కొనున్" [మా.పు 3-368] అని క్షత్రియ ధర్మాన్ని చెబుతాడు.

రాజనీతి శాస్త్రం – ఇతర శాస్త్రాలతో సంబంధం :- రాజనీతి శాస్త్రానికి చరిత్ర, అర్థశాస్త్రం, నీతిశాస్త్రాలతో చాల దగ్గర సంబందం వుంది.

రాజనీతి శాస్త్రం - చరిత్ర :- రాజ్యానికి సంబందించిన గత కాలపు రాజకీయ, ఆర్థిక, సామాజిక, మత పరమైన విషయాలన్ని చరిత్ర చెబుతుంది. చరిత్రలో జరిగిన కొన్ని సంఘటనలు రాజనీతికి ఆధారమవుతాయి.

" The Science of politics is the one science that is deposited by the stream of history like the grains of gold in the sounds of a river"21 అని అక్టన్ ప్రభువు రాజనీతి శాస్త్రానికి చరిత్రకు వున్న సంబంధాన్ని వివరించాడు.

"Political Science is the fruit of history and history is the root of Political Science"22 అని షెల్లి పేర్కొన్నాడు. "గత రాజకీయాలే నేటి చరిత్ర"23 అని అంటాడు ఎడ్వర్డ్ ఫ్రీమన్. రాజాంతఃపుర నియమావళిని పేర్కొంటూ తమ రక్షణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాలు కోల్పోయిన రాజుల పేర్లను ఉదహారణంగా ఇచ్చాడు కౌటిల్యుడు.24 ఇదే విషయాన్ని మడికి సింగన పేర్కొన్నాడు. [స నీ స. 1-288] ఇంద్రియ లోలురై పతనమైన రాజుల్నికూడ కౌటిల్యుడు పేర్కొన్నాడు.25 ఇలా చరిత్రలో జరిగిన సంఘటల్ని పేర్కొంటూ హెచ్చరించడం రాజనీతి గ్రంధాలలో కనబడుతుంది. రాజనీతి శాస్త్రానికి చరిత్ర పరిశోధనాలయమని [Laboratory] చెప్పవచ్చును.

రాజనీతి - అర్థశాస్త్రము :- కౌటిల్యుడు తన రాజనీతి శాస్త్రానికి అర్థశాస్త్రమని పేరు పెట్టాడు. "మనుష్యుల జీవితమునకు మూలము అర్థము. అట్టి భూమిని సంపాదించు ఉపాయములు పాలించు ఉపాయములు – దీనిని గురించిన శాస్త్రము అర్థశాస్త్రము"26 అని ఆయన పేర్కొన్నాడు. ఆధునికకాలం అర్థశాస్త్రానికి

కౌటిల్యుని అర్థశాస్త్రానికి ఎలాంటి సంబంధం లేదు. ఆధునిక అర్థశాస్త్రంలో వుండే ఉత్పత్తి, పంపకం, వినిమయం, వినియోగం అనే విషయాల్లో ప్రభుత్వ ప్రభావం వుంది. ఆర్థిక సమస్యలెన్నో రాజకీయ జోక్యం వలనే పరిష్కరించబడుతున్నాయి. ఈనాడు కొన్ని రాజకీయ పక్షాలు తమ రాజనీతిలో భాగంగా ఆర్థిక సమస్యలపై దృష్టిని సారించి పోరాడుతున్నాయి.

రాజనీతి శాస్త్రం–నీతిశాస్త్రం ,– సామాజిక, ధార్మిక, ఆర్థిక సంబంధ వ్యవహారాల రీతులను నీతిశాస్త్రాలలో చూడవచ్చు "అర్థశాస్త్రం ధర్మశాస్త్రాలలో అంతర్భాగమే. ఎందుకంటే యిది రాజు విధులనుగురించి చర్చిస్తుంది. కాబట్టి వీటికి సంబంధించిన చట్టాలుసూత్రాలు ధర్మశాస్త్రాలలో కనిపిస్తున్నాయని"27 డా॥ పి.వి.కానేఅభిప్రాయ పడ్డాడు. "రాజు నడిపించకెట్లు ధర్మంబు నడచు–" (కాశీ.7–31) అని అంటాడు శ్రీనాదుడు. అందుచేత రాజ్యమే ధర్మానికి మూలమని తెలుస్తోంది. రాజ్యానికి నైతిక ఆశయాలకు ప్రత్యక్ష సంబంధాలు లేవు. రాజ్యం ప్రవర్తన ప్రజల బాహ్య జీవితానికి సంబంధించింది. అదికారం, బలం దాని ముఖ్యసాధనాలు. నైతిక జీవితం అంతరంగికమైంది. కాబట్టి వ్యక్తి యొక్క ప్రత్యేక కృషి వల్లనే సాధ్యమవుతుండి. రాజ్యాధికారం వల్ల సాదించడానికి వీలుకాదు. ప్రత్యక్షంగా నైతిక జీవనాన్ని ఉద్ధరించడానికి రాజ్యాధికారాన్ని ఉపయోగిస్తే నైతిక జీవనమే నిరర్థకమవుతుంది. రాజ్యాదికారానికి భయపడి ప్రజలు తమలో నైతిక విలువలు వున్నట్లు నటిస్తారేకాని, నిజంగా సదాచార సంపన్నులు కాలేరు

రాజనీతి పుట్టుక '– సప్తాంగ సహితమైనది రాజనీతి. స్వామి, అమాత్యులు, రాష్ట్రం, దుర్గం, కోశం, సైన్యం, మిత్రులు అనేవి సప్తాంగాలు. మొట్టమొదట బ్రహ్మదేవుడే రాజనీతి శాస్త్రాన్ని తయారు చేసినట్లు భీష్ముని మాటల వల్ల తెలుస్తుంది. "కృతయుగం మొదట్లో మానవులను పాలించడానికి రాజులేడు. ప్రజలు ఒకరికొకరు రక్షకులు. కాలక్రమేణ వాళ్ళలో లోభం, దురాశ వంటి సంకుచిత భావాలు పెరిగి, ధర్మగ్లాని ఏర్పడింది. మునులందరూ కలసి బ్రహ్మ దగ్గరికి వెళ్ళి భయంతో మొరపెట్టుకొన్నారు. బ్రహ్మ వాళ్ళకు అభయమిచ్చి సప్తాంగాలతోకూడుకొన్న నూరువేల అధ్యాయాలు గల ఒక శాస్త్రాన్ని తయారు చేశాడు. దాని పేరే రాజనీతి లేదా దండనీతి. ఇది ప్రజాహితం కోసం ఏర్పడింది ప్రజలందరికీ సులభంగా అర్థమయ్యేందుకు విశాలాక్షుడనే మహాత్ముడు దీన్ని సంక్షిప్తం చేశాడు. ఆ తరువాత దేవేంద్రుడు కాస్త, బృహస్పతి మరికాస్త ఆ శాస్త్రాన్ని కుదించారు. చివరికి శుక్రుడుదాన్ని వేయి అధ్యాయాలకు తగ్గిస్తే అప్పటి నుంచి చాలామంది మనులు కాలానుసారంగా ఇంకా తగ్గిస్తూ చెబుతూ వచ్చారు." (భార.శాం. -2-199నుంచి 205).

ఇదే విషయాన్ని శుక్రనీతి ఇలా పేర్కొంది.

"For the good of men Bramha, the self-created Lord, had spoken that treatise on morals which contained 100 Lakhs, i.e. 10 million slokas By a process of selection, the essence of that Nitisastra, which was an extensive argumentative thesis, has been compiled in an abridged form by vasistha and others like myselffor the increase of prosperity of rulers of the earth and of others whose life is of short span"28 దేవతలపై మానవులకున్న ప్రగాఢ విశ్వాసాన్ని, భయాన్ని, భక్తిని దృష్టిలో పెట్టుకొని, సామాజిక నియమాల్ని, మార్పుల్ని లేదా ఇతర అంశాల్ని ప్రజలు గౌరవించడానికి వాటికి దైవికాంశాన్ని మేళవించేవారు. ఈ పరంపర లోనే రాజనీతి శాస్త్రం ఆవిర్భవించడానికి దేవతలే కారకులు అని ప్రకటించారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల చేత రాజనీతి శాస్త్రం మానవులకు సంక్రమించింది (భార.శాం. 3-155 నుంచి 121) అని చెప్పారు. రాజనీతి దైవసంబంధమైనా, మానవసంబంధమైనా అది ఆవిర్భవించింది మాత్రం ఖచ్చితంగా ప్రజాహితం కోసమే. రాక్షసుల గురువైన శుక్రుడు, దేవతల గురువైన బృహస్పతి రాజనీతి రచించినవారిలో ప్రథములని ప్రతీతి. అందుచేత కౌటిల్యుడు తన గ్రంథాది లోనే వాళ్లను స్తుతించాడు.29 (ఓం నమః శుక్ర బృహస్పతి భ్యామ్) భారద్వాజుడు, విశాలాక్షుడు, పిశునుడు, కౌణపదంతుడు, వాతవ్యాధి, బాహుదంతపుత్రుడు, బార్హస్పత్యులు, ఔశనసులు, మానవులు, పారాశరులు, అంభీయులు" మొదలైన వాళ్లు కౌటిల్యుని కంటే ముందున్న రాజనీతి శాస్త్రకారులని అర్థశాస్త్రం వల్ల తెలుస్తోంది.

రాజనీతి ఆవశ్యకం :- రాజ్యపాలకులు నీతి సూత్రాలను తప్పని సరిగా పాటించాలి. నైతిక చర్యలవల్ల సామాజిక విధానం పటిష్టమవుతుంది. సామాజిక అరాచకత్వం రాజరిక వ్యవస్థతకు పునాది వేసింది. బ్రహ్మచేత రాజనీతిశాస్త్రాన్ని రచింపచేసింది. సంఘంలో అరాచకత్వం తలెత్తకుండాఉండడానికి రాజుకుదండనాధికారం ఇవ్వబడింది. దండనీతిని తగిన రీతిలో ప్రయోగించడం రాజు గొప్పతనాన్ని చెబుతుంది. తిరుగులేని దండనాధికారం రాజులను నిరంకుశులుగా మార్చడానికి దారితీసింది. "అధికారం మనుషులను అవినీతిపరులుగా మారుస్తుంది. అంతులేని సంపూర్ణ అధికారమయితే అది హద్దూ పద్దూలేని అధమాధమాలుగా మనుషులను మారుస్తుంది" 30 అన్న అక్టన్ ప్రభువు అభిప్రాయం చాలా సమంజసమైంది. "....... సార్వభౌముడైన భూపతి యాజ్ఞ కెల్లవారు దల్లడిల్ల వలదె?"... (ఆము 4-206) అని రాయలు చెప్పడం రాజుల అప్రతిహతమైన అధికారాన్ని తెలుపుతోంది. దుర్మార్గుడైన రాజు చేతిలో అధికారం ఉన్మత్తుడి చేతిలో ఆయుధంలాంది.

"అల్పబుద్ధి వాని కధికార మిచ్చిన

దొడ్డ వారి నెల్ల దొలగ గొట్టు"- అని వేమన చెప్పివ మాట తిరుగు లేని వాస్తవం. విస్తృతాధికారాలు రాజులను నిరంకుశత్వపు బాటల గుండా పయనింప చేశాయి రాజుల స్వార్థం ప్రజల జీవితాలను మరు భూముల్లోకి నెట్టింది. రాజుల రాజ్యకాంక్షకు రాజనగరాలు, జనపదాలు తగలపడి పోయి శిదిలాలుగా మిగిలాయి. "పుడమితల్లిని రక్తలో పూసిన మందారంలా"31 చేసింది. ఇదిచారిత్రక సత్యం. ఇలాంటి దుస్థితి రాకుండా వుండడానికి, రాజులను నైతిక వ్యక్తులుగా తీర్చిదిద్దడానికి రాజనీతిశాస్త్రాలు అవసరమైనాయి. అసమానత్వం సంఘర్షనలకు మూలం. బలవంతుడు, బలహీనున్నిదోచుకునే 'మత్స్యన్యాయం' అమలు కాకుండా పాలకులు రాజ్యాన్ని కాపాడాలి. ఒకరినొకరు చంపు కోకుండా వుండే పరిస్థితులు కల్పించాలి. ఇంతటి గురుతర బాద్యత స్వీకరించిన రాజు స్వార్థపరుడు, అవినీతి పరుడైతే, నియంతగామారి సమాజాన్ని అదోగతిపాలు చేస్తాడు. ఇలాంటి రాజుల మనస్తత్వాన్ని, కార్యకలాపాలను మార్చడానికి, వారికి కర్తవ్య బోదచేయడానికి సచ్ఛీలురైన మంత్రులు, పురోహితులు, మునులు మొదలైన వారు రాజనీతిని మౌఖికంగా చెప్పడమో లేదా లిఖితంగా భద్రపరచడమో చేశారు. నైతిక వ్యక్తులు లేకుండా నైతిక సమాజం వుండదు. సమాజానికి ఆదర్శ వంతుడైన రాజు నుంచే నీతికూడా ప్రారంభం కావాలి. నీతితో రాజ్యపాలన చేయాలి. "....నీతికి బాహ్యులైన ధరణీవర మెత్తురే వారి నుత్తముల్" (భార.ఉద్యో. 2-71) అని అంటాడు తిక్కన. అవినీతి పరులైన చక్రవర్తులు ఎలా పతనమైపోయారో మన సాహిత్యం మోపిస్తోంది. వేనరాజు వృత్తాంతమే (హరి.పూ.భా. 1-108) దీనికి నిదర్శనం. అన్ని శాస్త్రాలు, శాస్త్రధర్మాలూ కలిసి పోయే మహాసముద్రం రాజధర్మం. దాని రహస్యాలను సంపూర్ణంగా ఆకళించుకోవడం సామాన్య విషయం కాదు. అందుకే రాజకుమారులకు విద్యాభ్యాస సమయంలో అన్ని విద్యలతో పాటు రాజనీతిని భోదించే వాళ్ళు. భరత, వాత్స్యాయన మొదలైన శాస్త్రాలలో నైపుణ్యాన్ని, రధ, గజ, తురగాలను అధిరోహించడంలో నేర్పును, కోదండం, కరవాలం, కుంతం మొదలైన ప్రసిద్ధ ఆయుధాల్ని ప్రయోగించడంతో పాటు వివిద కళలలో ప్రశస్తిని పొందడానికి రాముడు కుశలవులకు ప్రత్యేక శిక్షకుల నియమించి వాళ్ళకి జీతాలిచ్చేవాడు. (ని.రా. 10-156) రాముడు కుశలవులకు రాజవిద్యలు నేర్పినట్లు విదితమవుతోంది.

"నయ మార్గంబున లక్ష్మి, లక్ష్మి గలచో నారాయణుండుండు ని
శ్చయ మచ్చోవర దర్మ వృత్తికి నిజస్థానంబు తన్మూలమై
జయమెల్లప్పుడు నుల్లసిల్లు ద్విజగత్సం సేవ్యమై కావునన్
నయ శాస్త్రంబె వివేక ధన్యునకు జింతారత్న మెల్లప్పుడున్."

(స.నీ.స 1-33) అని అనడం వల్ల నీతిశాస్త్ర ప్రాముఖ్యం తెలుస్తోంది.

"పెక్కేల నీతిశాస్త్రము
దక్కక నెవ్వండు సదువు ధరనెవ్వడు పెం
పెక్కగ వినునాతడు దా
జిక్కడు సురపతికినైన సిద్ధంబెందున్." (స.నీ.స. 1-43)

నీతిశాస్త్రాధ్యయనం చేసినవాడు సురపతికి కూడాచిక్కడట! వాడికి లాఘవం ఎక్కు వవుతుందని అర్థం. ఇదినీతిశాస్త్ర ఆవశ్యకానికి పతాకస్థాయి. దుష్యంతుడు తన కుమారునికి (భరతునికి) పట్టం కట్టేటప్పుడు, (శృ.శా. 4-157 నుంచి 179) రుక్మాంగదుడు వేటకు వెళుతూ తన కుమారునికి (ధర్మాంగదునికి) (రుక్మా.చ. 3-14 నుంచి 67), యామున ప్రభువు రాజ్యాన్ని కుమారునికి అప్పగించి వానప్రస్థానికి పోయేటప్పుడు (అము. 4-204 నుంచి 285) రాజనీతిఉపదేశిం చబడింది.

"ఏమి సుభాషితంబు పరియించితి పుత్రక రాజనీతులే
మేమి యెఱుంగ జెప్పె గురిడిప్పుడు నీదగు పుస్తకంబునం
దేమి లిఖించి యున్నయదియిప్పుడు పారక శక్తి జూచెదన్
మామది కింపుగా జదువు మా యొక పద్యము వీరిముందఱన్"
(ఆ.వి.పు 2-281)

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని విద్యార్జనా శక్తిని పరిరక్షించే సందర్భంలో గురువు నేర్పిన రాజనీతి ఏమిటని ప్రశ్నిస్తాడు. ఇదే విషయం బాగవతంలో కూడవుంది. (7-136)ఉత్సాహ, ప్రభు, మంత్రశక్తికి సంబంధిం చిన పాలనాశాస్త్రాలు రాజకుమారులకు నేర్పేవారు. (భాగ. 7-139) రాయలు తిమ్మరుసునుఅడిగి రాజనీతిని ఆకలింపు చేసుకొన్నట్లు తెలుస్తోంది(కృ.వి 2-47) సంజయ నీతి, విదుర నీతి, చాణుక్య నీతి, భర్తృ హరి నీతి శతకం మొదలైన నీతి శాస్త్రాలను కర్నాటక రాజులు తెల్లవారుజామునే వినేవారని, వాటిని రాజుకు వినిపించడానికి ప్రత్యేక నీతి శాస్త్రపు చదువరి వుండే వాడని తెలుస్తోంది.[32] ఆ నీతిని విని రాజులు తదను గుణంగా ప్రవర్తించడానికి ప్రయత్నించే వాళ్ళు. అప్పాజి, అయ్యమరసు, కొండమరసు మొదలైన మంత్రులు రాయలకు రాజనీతిని ఉపదేశించడంతోబాటు "........సాధువులైన వార్లకున్ను, సాధు జంతులకున్ను బాధజేసేవారిని శిక్షింపక పరాకు జేస్తేను రాజధర్మత్వమున్ను, ఐశ్వర్యమున్ను, జేసిన పుణ్యమున్ను క్షీణమైపోవునని...."[33] హెచ్చరించడమూ కనిపిస్తోంది.

"రాజలక్షణమెయ్యది రాజ్యలక్ష్మి
శాశ్వతంబుగ నుండుటే నరణి రాజ

నీతులెన్ని విధంబులు నిఖిలమెలమి
దెలుపు మెంతయు నామది తేటపడగ" (కృ.వి.2-48)

అని రాయలు మంత్రి అప్పాజిని అడగడం, ఆయన రాయల వారికి రాజనీతి బోధ చేయడం గమనించదగిన విషయాలు.

"గురుడింద్రునకుం దెల్పిన
పరణిన్ బహునీతి ధర్మ శాస్త్ర స్ఫురణం
బెఱిగించితి వెంతయు సు
స్థిరమతి నింతయు గ్రహించితిన్ మంత్రిమణీ ! " (కృ.వి 2-60)

అని రాయలు సంతోషం వ్యక్తం చేయడం వుంది. నీతి కళాకోవిదుడైన రాజు సంపద, విజయ కీర్తి మొదలైన వాటితో ప్రకాశిస్తూ, శత్రువులచేత ఎప్పటికి నాశనంకాడు (స.నీ.స.-1-229). కాబట్టి రాజులు నీతి శాస్త్రాన్ని అపోశన పట్టడమేకాక ఆచరణలో పెట్టాలి.

"ఏ జాడవాడు రాజగు
నా జాడ ప్రజయు దిరుగువనుదినము' యథా
రాజా తథా ప్రజా' యను
నీ జనవాదంబు వింతయేయిపుడనుడున్ " (బై.వేం.పం.తం.1-401) ప్రజల్లో నైతిక విలువలు పెరగాలి. అంటే రాజు వారికి ఆదర్శవంతుడుగా నిలవాలి నైతిక విలువలు లేని వ్యక్తి రాజైతే ప్రజల్లో అవినీతి పెరుగుతుంది. రాజ్యం అరాజకమవుతుంది. రాజు నీతిమహిమతో భూమిని పాలిస్తే దేవేంద్రుని వలె ప్రకాశిస్తాడు. నీతిహీనుడైతే సంపదలు కోల్పోయి దీనుడవుతాడు. (రుక్మా.చ.3-15) నీతి శాస్త్రం యొక్క అవసరం, ప్రాదాన్యం ఇలా పేర్కొనబడ్డాయి. "నీతి శాస్త్రం అనేది సద్గుణాలు, సంతోషం, సంపద, పవిత్రతతో కూడు కొన్నదిగా భావించబడుతోంది. కాబట్టి పాలకుడు ఎల్లప్పుడూ జాగ్రత్తగా దాన్ని అధ్యయనం చేయాలి. నీతి శాస్త్రం తెలుసుకోవడం వల్ల పాలకులు శత్రువులను జయించడంలో, ప్రజల ప్రేమానురాగాన్ని పొందడంలో ప్రజల మధ్య సఖ్యత చేకూర్చడంలో, రాజ్యపాలనలో విజేతలుగా వుంటారు. ఆహారం లేకుండా మానవ శరీరాన్ని ఎలా కాపాడలేమో, అలాగే నీతి శాస్త్రం లేకుండా మానవ కార్యకలాపాలలో స్థిరత్వాన్ని సాధించడం కష్టం. నీతి శాస్త్రం అందరికీ ఉపయోగపడుతుంది. కాబట్టి అందరిచేత గౌరవించబడుతోంది. ప్రభువు ప్రజాపాలకుడు కావడం వల్ల ఈ శాస్త్రాన్ని తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. రోగగ్రస్తుడైన వ్యక్తి నిర్దేశించబడని ఆహారాన్ని గ్రహిస్తే రోగాలు వెంటనే

ఎలావృద్ధి చెంది, తమంతట తామే వేగంగా బహిర్గతమవుతాయో అట్లే రాజులు నీతి శాస్త్రాన్ని అధ్యయనం చేయకపోతే శత్రువులు హఠాత్తుగా రాజ్యాన్ని వశపరుచ కుంటారు. నీతిలేకుండా ప్రజారక్షణ, దుష్టశిక్షణ అనే రెండు ముఖ్య రాజవిధులు సాధ్యంకావు నీతిని పాటించే రాజు ప్రజలచేత గౌరవించబడతాడు. నీతినిపాటించని రాజుకు ఆదరణ వుండదు ఎక్కడైతే నీతి-శౌర్యం కలిసి వుంటాయో అక్కడ సర్వతోముఖాభివృద్ధి వుంటుంది. రాజ్యం మంచిని పెంచేవిధంగా, ప్రజానుకూలం గా ఆలవోకగా కొనసాగాలంటే నీతి ఆదరించబడాలి. రాజు తప్పనిసరిగా తన ఉనికి కోసం నీతిని అనుసరించాలి. నీతిలేకపోతే రాజు పరిస్థితి చిల్లులు పడిన పాత్రవలె వుంటుంది. ఇది రాజు శక్తి సామర్థ్యాలు తగ్గడానికి వీలునూ తద్వార శత్రువులకు సంతృప్తినీ కల్గిస్తుంది." ఆదర్శ రాజ్య పాలన రాజనీతిని పాటించ డం ద్వారానే సాధ్యమవుతుంది.

"నీతి పథమున గార్యంబు నిశ్చయించి
తగవుదప్పక సేయునతండు మీద
నిడుమ పొందడు, ధర్మంబు విడిచి చొప్ప
దప్పికావించు నతడు సంతాపమొందు."(భాస్క, యుద్ధ. 99)

"ఘనబాణ నిహతి యొక్కని గూల్చుగాని
విను నీతిదెగటార్చు విమతి కోటులను
నీతి లావున గాదె నృపుల భూవలయ
మాతంకములు లేక యరయుచున్నారు." (ద్వి.భార.ఉద్యో. 1-18)

నీతి యొక్క శక్తి సామర్థ్యాలూ, గొప్పదనం ఇలా కీర్తించబడ్డాయి.

<u>ధర్మతత్త్వం</u> - "ధరతి విశ్వం లోకాన్వా, యద్వాధ్రియతే ధర్మాత్మభి." అనేది ధర్మశబ్దానికి వ్యుత్పత్త్యర్థం. అంటే విశ్వాన్ని లేక లోకాన్ని ధరించేది -మహాత్ము లచే ధరించబడేది అని అర్థం. దర్మశబ్దానికి 'శ్రుతిస్మృత్యాది విహిత కృత్యము సుకర్మములు చేయుటచే కలుగు అదృష్టం, పుణ్యం, న్యాయం, ఆచారం, స్వభావం గుణం, అహింస, యజ్ఞం, ఉపనిషత్తు, వేదాంతం మొదలైన అర్థాల్ని చెబు తున్నాయని నిఘంటువులు.[35] "ప్రొఫెసర్ ఎఫ్ కిల్హార్న్ ధర్మపద ప్రయోగానికి గల అస్పష్టతను, అయోమయ అన్వయాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తూ 'ధర్మము' అనే సంస్కృత శబ్దానికి వివిధార్థాలను స్ఫురింజేసే ఆంగ్లపదం లేదని స్పష్టీకరించినాడు. డాక్టర్ పి.వి. కానే యీ అభిప్రాయంతో ఏకీభవిస్తూ ఖచ్చితమైన అర్థాన్ని వివరించడం కష్టసాధ్యమని అభిప్రాయ పడినాడు."[36]

ఈనాడు ధర్మం అంటే ఆర్థికసమత అని చాలామంది అనుకోవడం ఉంది. ప్రాచీన భారతీయులు ధర్మాన్ని విశాల దృష్టితో చూశారు. "ధారయతి ఇతి ధర్మః" అని ధర్మాన్ని మన మతగ్రంథాలు అభివర్ణిస్తున్నాయి. "ధర్మో రక్షతి రక్షితః" అనేవాక్యం కూడా ఇదేవిషయాన్ని చెబుతోంది. తనను రక్షించినవాళ్ళని ధర్మం రక్షిస్తుందని అర్థం. వ్యక్తి జీవితంలో వివిధ విషయాలను సక్రమంగా నిర్వహింపచేసి, లోకవ్యవస్థకు సామరస్యాన్ని కలిగించేది ధర్మం. అధర్మపరుడైన మానవుడు తాను ఇబ్బందులపాలు కావడమే కాక సమాజాన్ని ఆపదలపాలు చేస్తాడు ఇలాంటి స్థితి రాకుండా మానవుని కట్టుబాట్లలో ఉంచడానికై సాంఘిక, నైతిక శాసనాలు ఏర్పడ్డాయి. వీటిని అనుసరించి మానవుడు తన జీవితంలో నాలుగు పురుషార్థలను సాధించాలి. ఇవే ధర్మార్థకామ మోక్షాలు. మొదటి మూడు ఐహిక జీవితానికి సంబంధించినవి. వీటినే త్రివర్గం అంటారు. వీటిలో ధర్మం జీవితానికి పునాది వంటిది. ధర్మం మానవునికి మానవత్వాన్ని కలిగిస్తుంది. ప్రజల మధ్య సంబంధ బాంధవ్యాలను సక్రమంగా నడిపించేది ధర్మం. తనహక్కులను రక్షించుకొంటూ, పరుల హక్కులను గౌరవిస్తూ, స్వార్థాన్ని పరిమితం చేసుకొంటూ, త్యాగాన్ని పెంపొందించుకొంటూ మానవజాతి అభ్యున్నతికి కావలసిన గుణ సంపద అలవరచుకోవడం మనిషి బాధ్యత. కాబట్టి మానవ సమాజాన్ని పాలించే రాజు ధర్మస్థాపన చేయాలి. ధర్మాన్ని రక్షించాలి. అధర్మంతో పోరాడాలి.

యతో ధైర్యస్తతో లక్ష్మీః
యతో లక్ష్మీస్తతో హరిః
యతో హరిస్తతో ధర్మః
యతో ధర్మస్తతో జయః 37

ఇదే భారతీయ సాహిత్యం బోధిస్తున్న ధర్మ నినాదం.

"సాటివారు నిన్ను సాధింపగా లేరు
ధర్మమెపుడు నీవు తప్పకున్న"

"ధర్మమే నృపులకు ధారయోగంబు ....." అని వేమన రాజులకు తారకమంత్రం ఉపదేశించాడు. ధర్మంతోనే రాజ్యాన్ని పొందాలి. ధర్మంతోనే దానిని పాలించాలి. ధర్మం ద్వారా ప్రాప్తించిన సంపదను రాజు పోగొట్టు కొనలేడు అసంపద ఆ రాజును విడవలేడు.38 ప్రాచీన భారతీయ రాజనీతి తత్త్వవేత్తలందరూ, రాజనీతికి నైతిక ప్రాతిపదికను చేకూర్చారు. రాజుల స్వార్థాన్ని నిరశించారు. సమాజ శ్రేయిస్సే రాజధర్మమని నిర్ధారణ చేశారు. ఎక్కడైతే ధర్మ

శాస్త్రానికి, అర్థశాస్త్రానికి విభేదం ఏర్పడుతుందో అక్కడ అర్థశాస్త్రంలో చెప్పిన దాన్ని ఆచరించాలి39 అని నారదస్మృతి తెలుపుతోంది. ప్రాచీన భారత రాజరిక పాలనలో రాజు అర్థశాస్త్రాన్ని ప్రజలు ధర్మశాస్త్రాన్ని ఆచరించేవాళ్లు. ఈ రెండింటికి విభేదం ఏర్పడితే రాజు ప్రజల ధర్మశాస్త్రాన్నే అనుసరించాలి. ఎందుకంటే ధర్మ శాస్త్రం, అర్థశాస్త్రం కంటే బలవత్తరమైందని యాజ్ఞవల్క్యస్మృతి స్పష్టం చేసింది. అర్థశాస్త్రాతు బలవద్ధర్మ శాస్త్రమ్ ఇతిస్థితిః" [యా.స్మృ. 2-21] ధర్మం, ధర్మ స్వరూపం గురించి ఇలా పేర్కొనబడింది.

" రాజు ధర్మము తోడ రాజ్యంబు సేయ
భూజనులకు దర్మ బుద్ధి నుండుపురు
దర్మంబు దప్పక ధరణి పాలించు
నిర్మలాత్ములు గందు నిత్య సౌఖ్యములు.
.......... ... . ... . . ... .
ధర్మంబు రాజుల ధరణి యేలించు
ధర్మంబు శరణాగత త్రాణ కీర్తి
గలిగించి రక్షించుగాన ధర్మమున
గలుగని యర్థంబు గలదె లోకముల
ధర్మంబు నా నొండు తలపోయలేదు
ధర్మ స్వరూపంబు ధరణీశ వినుము
దానంబు సేయుట దయగలిగి యుంట
మానుగా పెద్దలు మన్నింపమనుల
వంచన సేయక వలయు బేహార
పతివ్రతసతి నాడు పడిరౌ ధర్మంబు "40

మనుస్మృతి ధర్మానికి పది లక్షణాల్ని నిర్దేశించింది. ప్రయత్న స్వభావాని బట్టి రాజులకు ధర్మం పది లక్షణాలతో కూడుకొన్నది. ధృతి, క్షమా, దయ, అస్తేయం, శౌచం, ఇంద్రియ నిగ్రహం, ధీ,, విద్యా, సత్యం అక్రోధం41 అనేవి.

"ధర్మంబు తన్ను రెపుమను
ధర్మంబభివృద్ధి పొంది తనుబ్రదికించున్
ధర్మము కర్మకరంబని
ధర్మం చేమబరు సంతతముతత్త్వజ్ఞుల్ (బై.వే.పం తం. 3-126)

అని ధర్మం ఆచరించడం వల్ల పొందే ప్రయోజనాలు పేర్కొనబడినాయి. ధర్మానికి హాని కలిగినపుడు, సాధుజనాన్ని రక్షించడానికి, దుర్మార్గుల్ని నిర్మూలించడానికి ధర్మాన్ని స్థిరంగా ప్రతిష్టించడానికి ప్రతి యుగంలో అవసరమైనపుడంతా అవత రిస్తానని కృష్ణుడు ధర్మరక్షణ గురించి అర్జునునితో చెప్పాడు.

# ఆధస్సూచికలు

| | | | |
|---|---|---|---|
| 1. | రాజనీతి తత్త్వశాస్త్రము – | పుట | 82 |
| 2. | శ్రీమదాంధ్ర మహాభారతం–రాజనీతి – | ,, | 1 |
| 3. | విజ్ఞాన సరస్వం (సంపుటి-3) | ,, | 244 |
| 4. | రాజనీతి – | ,, | 1 |
| 5. | గ్రీకు పొలిటికల్ థియరి – | ,, | 101 |
| 6. | దిసబ్‌స్టాన్స్ ఆఫ్ పాలిటిక్స్ – | ,, | 10 |
| 7. | ఏ హిస్టరి ఆఫ్ పొలిటికల్ థియరి – | ,, | 77 |
| 8. | రాజనీతి తత్త్వశాస్త్రం – | ,, | 147 |
| 9. | కౌటిల్యుని అర్థశాస్త్రము – | ,, | 6 |
| 10. | తిరక్కురళ్, – | ,, | 385 |
| 11. | రాజనీతి తత్త్వ శాస్త్రము – | ,, | 28 |
| 12. | . ఇంటర్ నేషనల్ ఆఫ్ ద్రవిడియన్ లింగ్విస్టిక్స్ (జూన్–1987) | ,, | 214 |
| 13. | కౌటిల్యుని అర్థ శాస్త్రము – | ,, | 10 |
| 14. | భారతి, (జనవరి–91) – | ,, | 5 |
| 15. | కౌటిల్యుని అర్థశాస్త్రం – | ,, | 1 |
| 16. | సంస్కృత సాహిత్య చరిత్ర – | ,, | 582 |
| 17. | శుక్రనీతి – | ,, | 5 |
| 18. | హిందూ పాలిటి – | ,, | 5 |
| 19. | "పైదే" – | ,, | 5 |
| 20. | ఋగ్వేద ఆర్యులు – | ,, | 133 |
| 21. | ది సబ్‌స్టాన్స్ ఆఫ్ పాలిటిక్స్ – | ,, | 7 |
| 22. | ,, – | ,, | 7 |
| 23. | చరిత్ర రచన శాస్త్రం – | ,, | 59 |
| 24. | కౌటిల్యుని అర్థ శాస్త్రము – | ,, | 59 |
| 25. | ,, – | ,, | 14 |
| 26. | ,, – | ,, | 600 |
| 27. | రాజనీతితత్త్వ శాస్త్రము – | ,, | 33 |
| 28. | శుక్రనీతి – | ,, | 1 |
| 29. | కౌటిల్యుని అర్థశాస్త్రము – | ,, | 1 |

30. ఆంధ్రుల ప్రాచీన చరిత్ర - ,, 111

31. భీష్ముడుచెప్పిన రాజనీతి కథలు - ,, 1

32. రాయవాచకము - ,, 73

33. ,, - ,, 13, 19

34. శుక్రనీతి - ,, 1నుండి4

35. సూర్య రాయాంధ్ర నిఘంటువు(4వ బాగం) - ,, 401

36. రాజనీతితత్త్వ శాస్త్రము - ,, 47

37. రాయవాచకము - ,, 37

38. విదురనీతి - ,, 60

"ధర్మేణ రాజ్యం విన్దేత ధర్మేణ పరిపాలయేత్
ధర్మమూలాంశ్రియం ప్రాప్యన జహాతిన హీయతే (2-31)

39. భారతి జనవరి 1974 పుట 45నుంచి

"యత్ర విప్రతిపత్తిః స్యా
ద్ధర్మ శాస్త్రార్థ శాస్త్రయోః ।
అర్థ శాస్త్రోక్త ముత్సృజ్య
ధర్మ శాస్త్రోక్తమ్ అచరేత్ ॥ [నారదస్మృతి-1-39]

40. ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర పుట 202

41. మనుస్మృతి 7-91

42. శ్రీ మద్భగవద్గీతా 4-7, 8.

# 2. రాజ్యం - సప్తాంగాలు

## రాజ్యం – నిర్వచనం – ఆవిర్భావం :-

రాజు ఆధారంగానే రాజ్యవిధులూ, రాజ్యపాలనా జరుగుతాయి. ఒక రాజ్య సుభిక్షపు ఘనత ఆ రాజ్యపాలకునికి దక్కుతుంది. రామరాజ్యం ఆదర్శ రాజ్యం అంటే రాముడు అనే రాజు పాలించిన రాజ్యం ఆదర్శరాజ్యం అనిఅర్థం. అందుచేత రాజ్యం–రాజు అనేపదాలు ఒకేఅంశానికి సంబంధించిన రెండు విషయాలు. రాజ్యం ఎప్పుడు ఏర్పడిందో అప్పుడే రాజు ఆవిర్భవించాడు. రాజు–రాజ్యం ఈ రెండు అంశాల్ని దృష్టిలోపెట్టుకొని రాజ్యోత్పత్తి గురించి వివరించాలి. అందువల్ల రాజ్యం ఏర్పడడానికి దారితీసిన పరిస్థితుల్ని గురించి తెలుసుకోవడం అవసరం. మానవ సృష్టిక్రమం గురించి విభిన్న ఆలోచనలు వున్నాయి. మన పురాణాలు 'మానవ సృష్టి ప్రజాపతి చేత' జరిగిందని పేర్కొంటున్నాయి. "....ప్రజాపతి ... మానవ సృష్టియయ్యెనంత దనర్చియ జాతక... స్త్రీ పురుషులచేత జగంబును వృద్ధిబొందె...." (మా. పు–4–36) ఈ ఆది మానవుడు కొండ కోనల్లో, అడవుల్లో జీవించాడు. ఆకలి తీర్చుకోవడానికి ... ... జంతువులను వేటాడి వాటి పచ్చి మాంసాన్ని తిని ... నుంచి నేటివరకు మరెన్నో పద్ధతులు, ఆలోచనలు చేస్తూనే వున్నాడు.

"దున్నక వెదవెట్టక యు
త్పన్నములై వట్టి విపుల బహుసస్యముల
న్బన్నుగ గైకొని జనుల
త్యున్నతి తో నెలమి బ్రతుకు చుండగనంతన్" (మా.పు 4–41)

ఆలాంటి దశలో రాజ్యం లేదు. రాజు లేడు ఆహారసేకరణలో ..., మానవ స్వభావంలో మార్పు సంభవించాయి. ఈ మార్పుల ఫలితంగా ...లో ... ... దోపిడి వ్యవస్థ ... చూపింది. ఈ స్థితులనే సమా... ... గురించి మానవుడు ఆలోచించసాగాడు. అతని ఆలోచనా ... ... ఆవసరాన్ని ఎక్కువగా గ్రహించాడు. ప్రకృతి వైపరీత్యాలను ఎదిరించడానికి, ఆహారసేకరణలో సంపూర్ణత్వాన్ని అంతా పెంపొందించడానికి, ఇతర ఆపదల నుంచి రక్షణ పొందడానికి సహకారంవు విలువల్ని గుర్తించాడు. ఈ ఆలోచన యొక్క తీవ్రతే సమాజ సృష్టికి దారి తీసింది. ఈ మానవ సమా

జంలో ఎన్నో మార్పులు - చేర్పులు జరిగాయి, రక్తసంబంధికులతో కూడిన గణ సమాజం ఏర్పడింది. ప్రకృతి వైపరిత్యాల నుంచి, ఇతర అపదల నుంచి రక్షణ పొందడానికి ఈ గణ సమాజ సభ్యులు సమిష్టిగా పనిచేశారు. "ఈ సభ్యులు (స్త్రీ పురుషులు) విపత్కరమైన ప్రకృతిలో ఒకరి నొకరు పరస్పరం అంటి పెట్టుకుని సమిష్టిగా పనిచేసి సమంగా అనుభవిస్తూ, పకృతి పరిస్థితుల ఒత్తిడికి లోనవుతూ గణ సమాజ సభ్యుల యొక్క అభిప్రాయాల ప్రకారం ఏర్పర్చిన మార్గంలో ప్రతివారు తాము నిర్వహించవలసిన సామాజిక విధికి కట్టుబడి సమిష్టిగా ఉన్నట్లు అథర్వవేదంవల్ల తెలుస్తుంది"1 "ఈ గణ సమాజం సమిష్టి ఆస్తి పైన సమిష్టి శ్రమ పైన ఆధారపడి వున్న సాముదాయిక ఆత్మ ప్రవర్తకమైన సాయుధ ప్రజా వ్యవస్థ."2 "సమాజం వ్యక్తిసృష్టి అనేది మౌలిక సత్యం. మానవుడిముందు సమాజంలేదు భూమి పై వ్యక్తులు వ్యక్తులుగా ప్రదమ దశలో ఉన్నారు. మనుగడ పోరాటంలో సమిష్టికృషి ఫలితంగా సమాజ నిర్మాణం జరిగింది"3 అని యం.యన్. రాయ్ అన్న మాటలు వాస్తవాలు. భీష్ముడు ధర్మరాజుతోదండనీతి గురించి చెబుతూ,

" విను తొల్లి కృతయుగంబున
మను జుల యెడ దండనీతి మంతుండై రా
జన నొకడు గలగి యరయుట
మనుజేశ్వర లేదు ధర్మమత మంద్రు తగన్" (భార.శాం.2-199)

"ఒండొరులకు రక్షకులై
యుండుదురట్లుండ దైన్యమొదవిన లోభం
బొండొండ పెరిగి ధర్మము
ఖండితమైన మొదలు కొని రకార్యంబులకున్"(భార.శాం.2-200)

అని రాజ్యం ఏర్పడక ముందు వుండే సమాజ స్థితిని వర్ణించాడు. ప్రజా పరిపాలనావశ్యకత రాజ్య నిర్మాణానికి మూలమైంది. సమాజంలో వుండే రాజకీయ వ్యవస్థ రాజ్యం.

<u>రాజ్యావతరణ సిద్ధాంతాలు</u> ,– రాజ్యాన్ని కలిగిన వాడే రాజు. రాజును కలిగిన దేశమే రాజ్యం. ఇలాంటి రాజరిక ఆవిర్భవాన్ని గురించి వివరించిన సిద్ధాంతాలు రాజ్యావతరణ సిద్ధాంతాలు.

రాజ్యావతరణ సిద్ధాంతాల గురించి భారతీయ సాహిత్యంలో వివిధ విధాలుగా ఉన్నప్పటికి కొన్ని సిద్ధాంతాలు మాత్రమే వ్యాప్తిలోకి వచ్చాయి. ఆంధ్ర మహాభారతం (శాంతి పర్వం), హరివంశం, మార్కండేయ పురాణం, ఆంధ్రవిష్ణుపురాణం మొదలైన వాటిలో ఈ రాజ్యావతరణ సిద్ధాంతాలగురించి పేర్కొనబడింది.

దైవదత్తాధికార సిద్ధాంతం :— రాజ్యావతరణ సిద్ధాంతాలలో దైవదత్తాధికార సిద్ధాంతం అతి ప్రాచీనమైంది. రాజ్యం ఎంత ప్రాచీనమైందో ఈ సిద్ధాంతం కూడా అంతే ప్రాచీనమైంది. ఈ సిద్ధాంతం ప్రకారం దేవునికి ప్రతినిధిగా రాజు రాజ్యాన్ని పాలిస్తాడు. ప్రజలు రాజ్యాధికారాన్ని ధిక్కరిస్తే అది భగవంతుని దిక్కరించడమే. ధర్మరాజుకు రాజధర్మాలను చెబుతూ భీష్ముడు రాజ్యావిర్భావాన్ని గురించి ఇలా వివరించాడు. "కృతయుగం మొదట్లో రాజు కానీ, రాజ్యం కాని లేదు. ప్రజలే ఒకరికొకరు రక్షకులుగా, సుఖ సంతోషాలతో జీవించేవారు. క్రమంగా వారిలో స్వార్థం పెరగడం వల్ల నీతి న్యాయం అడుగంటి వేద కర్మలు నశించాయి. మునులు భయపడి బ్రహ్మ దగ్గరకు వెళ్ళి ధర్మానికి ఏర్పడ్డ విపత్తు గురించి చెబితే బ్రహ్మ ప్రజలను రక్షించడానికి ఒక రాజనీతి శాస్త్రాన్ని తయారు చేశాడు, దాన్ని అమలు చేయడానికి విష్ణువు విరజుడనే వాణ్ణి సృష్టించాడు. కానీ అతనికి రాజ్యాధి పత్యం రుచించలేదు. అతని కొడుకు కర్ధముడు కూడ రాజ్యాధిపత్యంపై ఆసక్తి చూపలేదు. కర్థముని కొడుకు అనంగుడు దండనీతిని స్వీకరించి ప్రజాపాలన చేశాడు. ఆ తరువాత 'నీతి' రాజపదవి స్వీకరించాడు. మృత్యుదేవత కుమార్తె సునీత అతని భార్య. వారిద్దరికి వేనుడనే వాడు పుట్టాడు. తండ్రి తరువాత వేనుడు రాజై, నిరంకుశ చర్యలతో ప్రజా వ్యతిరేకిగా మారాడు. మునులందురు వచ్చి మంత్రాలతో వేనుణ్ణి శాంతపరచి అతని కుడి తొడను మధించారు. అందులో నుంచి కాలిన కొరివి లాంటి నల్లటి రంగుతో ఎర్రటి కన్నులతో ఒక మరుగుజ్జు రూపం బయటికి వచ్చింది. అతన్ని చూసి 'నిషీద' అంటూ మునులు పలికారు. అందుచేత అతని సంతానం నిషాదులనే పేరుతో వింధ్యకు దక్షిణభాగంలో జీవించారు. ఆ తరువాత మునులు వేనుడి కుడి చేతిని మథించారు. అందులో నుంచి మంచి తేజస్వి ఒకడు పుట్టాడు. అతనికి వైన్యుడనే పేరు పెట్టి, రాజ్యాన్ని అతనికి అప్పగించి ఆదర్శపాలన చేయమని హితవు చెప్పి మునులు బయల్దేరగా 'మీ సహా

యము లేకుండా పాలించడం ఎలా? అని వైన్యుడు వాళ్ళని ప్రార్థించాడు. శుక్రుని పురోహితుని గాను, వాలఖిల్యులలో సారస్వత గణాన్ని అమాత్య బృందంగాను, గర్గుని సాంవత్సరికుని గానూ నిర్ణయించి మునులు వెళ్ళిపోయారు. వాళ్ళసహాయం తో ప్రజారంజకంగా పాలనచేశాడు. కాబట్టి ఆయనకు రాజు అనే పేరు వచ్చింది. ఆయన తరువాత ఆయన సంతతి రాజరికాన్ని వహించి రాజధర్మాన్ని పాటించారు (భార శాం.2-999 నుంచి 215). ఈ సిద్ధాంతం ప్రకారం రాజ్యం మానవుడు తయారు చేసుకోన్నది కాదు. సహజంగా దానంతటదే ఏర్పడింది కాదు. రాజ్యం అనేది ప్రజల సౌభాగ్యానికి దేవుడు సృష్టించింది. అంధ్ర విష్ణుపురాణంలో రాజు లేని రాజ్యమెలా వుంటుందో చెప్పబడింది. బ్రహ్మ సృష్టించిన రాజులు అందరూ, ఒకరిపై ఒకరు పోరాడుతూ అంతమయ్యారు. 'మన్నీ'లు కుత్రులు పన్ని ఎక్కడి కక్కడ ఉపద్రవం కలిగించారు. జారచోరులు పెరిగారు. పంటలుపండలేదు తాపసులు భంగపడ్డారు.

> " ఈధరణీ తలంబునకు నేలిక యెవ్వడు లేడు గావునన్
> సాధుమతంబు లెవ్వియును సాగవు మ్లేచ్ఛకిరాతులొక్కటన్
> బాద యొనర్పగా బ్రజలు ప్రాణ భయంబుననున్న వారు నా
> నాధన ధాన్య సంపదలు నాశము నొందె ననేక భంగులన్"
>
> [అం.వి.పు. 2-130]

ఇలాంటి అరాచక స్థితిలో రాజు అవసరాన్ని గుర్తించి బ్రాహ్మణులు వేద మంత్రాలతో వేనుని శాంత పరచి, అతని కుడి తొడను మధించగా నిషాదుడు పుట్టాడు. వానికి రాజార్హత లేదని మ్లేచ్ఛ కిరాతాధిపత్యానికి అర్హుడన్నారు. ఆ తరువాత పుట్టిన పృధువు రాజైనాడు. మనువు కూడా దైవదత్తాధికార సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. "ఎప్పుడైతే మానవులు రాజులు లేకుండా జీవిస్తారో అప్పుడు అన్నివైపుల నుంచి భయం ఏర్పడుతుంది. అంటే ప్రజలకు రక్షణ కరువు అవు తుంది. అందువేత మొత్తం ప్రాణులన్నింటినీ రక్షించడానికి దేవుడు రాజును సృష్టించాడు" అని పేర్కొన్నాడు.[4] హరివంశంలో వైశంపాయన ముని 'జనమే జయుని' తో భూతాలు మొదలైన వాటికి బ్రహ్మ ప్రత్యేక అధికారులను నియమించి అభిషేకించిన విషయాన్ని చెబుతూ, నరులకు నృపతిని నియమించినట్లు తెలిపాడు.

భూమినంతటిని నాలుగు భాగాలు చేసి పూర్వదిక్కుకు విరాటుని పుత్రుడైన వైరాజుము, దక్షిణ దిక్కుకు అంగర్ధమ పుత్రుడైన శంఖపదుని, పశ్చిమ దిక్కుకు రజః పుత్రుడైన కేతుమంతుని, ఉత్తర దిక్కుకు పర్జన్య పుత్రుడైన హిరణ్యరోముని పరిపాలకులుగా ప్రతిష్ఠించాడు. ఆ నలుగురు రాజులకు మధ్య భూమీశ్వరుడైన పృథుకిని శాసనకునిగా నియమించాడు. ఈ విధంగా ప్రకాశిస్తున్న ఈ సామ్రాజ్యాన్ని తరువాత కాలంలో (చాక్షుష మన్వంతరం తరువాత) వైవస్వత మనువుకు ఇచ్చాడు (హరి. పూ.భా -1-96,97.) అని పేర్కొనడం దైవదత్తాధికార సిద్ధాంతాన్ని బలపరచడమవుతుంది. ఇలాంటి దైవదత్తాధికార సిద్ధాంతాన్ని పదహారో శతాబ్దం వరకు పాశ్చాత్యులు కూడా విశ్వసించారు. ఇంగ్లాండులో స్టూవర్ట్ వంశపు రాజైన మొదటి జేమ్స్ "భూమి మీద భగవంతుని సజీవ ప్రతిబింబాలే రాజులని తన నిరంకుశ పాలనను సమర్థించుకున్నాడు.[5]

" A true king was divine because he brought harmony to his kingdom as God brings harmony into the world. In a phrase widely current, he was an Animatelaw, a personalized form of the principles of law and right that govern the whole universe. For this reason he possessed a divinity which the common man did not share and which brought to disaster the unworthy usurper who claimed the high office without the blessing of Heaven."[6] అని రాజుకు దైవత్వాన్ని ఆపాదించడానికి కారణాలను సబైన్ పేర్కొన్నాడు.

కోలాహల పర్వతం శుక్తిమతి నదిని అడ్డగించడంవల్ల తమకుకలిగిన అపదల్ని ప్రజలు వసు రాజుకు చెప్పారు. ఆ మాటలు విన్న వసురాజు ప్రజల బాధల్ని నివారించడానికి గజేంద్రుని రక్షించడానికి విష్ణువు ఎలా వేగంగా బయలుదేరాడో, తాను అలావెళ్ళాడు. దుందుభికాయాన్ని రాముడు తన బొటన వ్రేలితో దూరంగా విసిరినట్లు, నదీ జలాన్ని నిరోధిస్తున్న కోలాహల పర్వతాన్ని వసురాజు తనకాలి బొటన వ్రేలి గోటితో ఆకాశానికి విసరివేశాడు (వసు-2-152, 153). ఇలా వసు రాజును విష్ణువుతోను, రామునితోను పోల్చడం, అధిక శక్తివంతుడని చెప్పడం అతనికి దైవత్వాన్ని ఆపాదించమే అవుతుంది.

రాజు భగవంతుని చేత సృష్టించ బడినప్పటికి దుర్మార్గుడుగా మారినట్లు చెప్పడం హాస్యాస్పదంగా కనిపిస్తోంది. భగవంతుడైన విష్ణువు అంశం నుంచే వేనుడు జన్మించాడు. అయితే అతడు

దుర్మార్గుడుగా నియంతగా మారి మునుల చేత చంపబడ్డాడు. వేనుడు ఇలా మార డానికి మాతృదోషం అని సమర్థించడం ఉంది. అతని తల్లి సునీత మృత్యు దేవత కుమార్తె. ఆ దోషం చేతనే వేనుడు దుర్మార్గుడిగా మారాడట! రాజు-రాజ్యం అనేవి దైవ నిర్మితాలని భావించడాన్ని భారత ప్రజ వ్యతిరేకించలేదు. ఈ సిద్ధాంతం ప్రకారం రాజు ప్రజలకు దేవుడిచ్చిన వరం. తనకు లభించిన అధి కారాలను దుర్వినియోగ పరిస్తే అలాంటి రాజులను తొలగించడానికి మేధావి వర్గం సిద్ధంగానే ఉంటుంది. నిరంకుశుడైన "వేన" రాజును మునులు తొలగిం చడం గమనార్హం. ధర్మ విరుద్ధంగా ప్రవర్తించేరాజు దైవత్వాన్ని కోల్పోతాడు. ఏరాజు పాలన ప్రజల సుఖశాంతులకు నిలయమవుతుందో అలాంటి రాజుమాత్రమే పరమేశ్వరునిచేత సృష్టించబడినట్లుగా గుర్తించబడతాడు. కాబట్టి రాజు ధర్మస్వ రూపుడు. శాంతియుతమైన సాంఘిక జీవనానికి పునాదిరాయి.

## దైవదత్తాధికార సిద్ధాంతం - విశ్లేషణ :-

(1) దైవదత్తాధికార సిద్ధాంతం రాజులకు విశేష అధికారాలు ఇచ్చినప్పటికి వాటిని దుర్వినియోగపరచడానికి హక్కును ఇవ్వలేదు.

2) దైవస్వరూపుడు ధర్మవర్తనుడైన రాజు సంఘ యొక్క అస్తిత్వానికి, అభి వృద్ధికి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం కనిపిస్తోంది.

3) రాజరికపు వ్యవస్థకు ఈ సిద్ధాంతం గట్టి పునాదుల్ని వేసింది.

4) రాజు దైవ స్వరూపుడనే (నా విష్ణుః పృథివీపతిః) అభిప్రాయాన్ని బాగా ప్రచారం చేసి ప్రజలతో రాజు అధికారాల పట్ల వినయ విధేయతలను భయాన్ని కలిగించడం జరిగింది.

5) ఈ సిద్ధాంతం రాజులు నియంతలుగా మారడానికి దోహదపడింది.

## సాంఘికమైన ఒడంబడిక సిద్ధాంతం :-

రాజ్యోత్పత్తిని తెలియ చేసే ఊహా వాదాలలో (Speculative theories) సాంఘికమైన ఒడంబడిక సిద్ధాంతం అత్యంత ప్రధానమైంది. సమాజంలో నైతిక విలువల్ని కాపాడడానికి ప్రజలను ధర్మమార్గాన నడిపించడానికి మత్స్య న్యాయం (చిన్న చేపను పెద్దచేప మింగే పద్ధతి)

అమలుకాకుండా ఉండడానికి, దుష్టశిక్షణ, శిష్టరక్షణకు ఒక నాయకుడు అవసరం. నాయకత్వం లేని సమాజం నావికుడు లేని నావలాగా ఉంటుంది. నీతి,వేద ధర్మాలు నశిస్తాయి.

" అవని యరాజకంబయిన యప్పుడు భూప్రజ యందు సర్వధ
ర్మవులు దొలంగు–"(అది. 4-250) అని భారతం చెబుతోంది.
"రాజులేకున్నచే మఱి రాష్ట్రమందు
గార్య మెట్లౌను–" (అయోధ్య – 39) అని మొల్ల రామాయణం

నొక్కివక్కాణిస్తోంది. రాజులేని రాజ్యంలో జరిగే దుర్మార్గాన్ని, దీనస్థితిని మన సాహిత్యం వర్ణించింది. ఇలాంటి దుర్భర పరిస్థితులు తొలగాలంటే రాజ్యానికి సరైన నాయకత్వం అవసరం. మహాభారతం (శాంతి పర్వం)లో భీష్ముడు "కృత యుగారంభంలో రాజ్యం లేదని, రాజులేడని చెప్పడం బట్టి గణ సమాజ వ్యవస్థ ఉండేదని తెలుస్తుంది. ఈ గణ సమాజాలు కాలక్రమేణ రాజ్యావిర్భావానికి దారితీశాయి. "కృత వీర్యుని మరణానంతరం అతని కుమారుడైన అర్జునుని దగ్గరకు మంత్రులు, పురోహితులు, పుర ప్రజలు వచ్చి రాజ్యాభిషిక్తుని కమ్మని ప్రార్థించగా 'నరకోత్తరంబైన యీ రాజ్యంబు చేయలేను' అని అతడు ప్రజలకు చెప్పే సమయంలో సాంఘిక మైన ఒడంబడిక సిద్ధాంతం ఉంది.

"పరనృప తస్కర బాధలు లేకుండ
తమ్మగాచుటకునై ధరణిపతికి
ద్వాదశాంశ ధనంబు వాణిజ్యపరులు గో
పాల కర్షకులు షడ్భాగ గవ్య
ధాన్యంబు లిత్తురు తప్పక యజ్ఞనా
వలుల రక్షింపగ నేను లేక
యవనితలేశ్వరుండప్పాళు లూరక
హరియించి దస్యుని యట్లు ఘోర
నరకమున బడు భూవహనమున కిప్పు
డేనశక్తుండ గావున నే వనమున
కరిగి తప మాచరించి యధ్యాత్మయోగ
సిద్ధి బొందెదనని యర్థి జెప్పుటయును" (మా.పు 2-213)

శత్రురాజుల, దొంగలవల్ల ఎలాంటిబాధలు లేకుండ, తమను కాపాడడానికి రాజుకు వ్యాపారస్థులు పన్నెండు వంతుల ధనాన్ని, గోపాలురు, కర్షకులు, ఆరుభాగాల గోవుల్ని ధాన్యాన్ని పన్నుగా ఇస్తారు వాళ్ళను రక్షించడం చేతకాక పోతే రాజు వాళ్ళ దగ్గర్నుంచి తీసుకొన్న గో, ధన, ధాన్యాల్ని దొంగిలించినట్లవుతుంది. అందువల్ల అతడు నరకకూపంలో పడతాడు. ప్రజల్ని వాళ్ళ ఆస్తిపాస్తుల్ని రక్షించలేని రాజు అడవుల్లో ముక్కు మూసుకొని తపస్సు చేసుకోవచ్చు. ఇలా చెప్పడం చేత ప్రజలు తమను తమ సంపదల్ని రక్షించడానికి తాము సంపాదించిన దాట్లో కొంతభాగంఇచ్చి రాజును నియమించుకున్నట్లు తెలుస్తుంది. ఇలాంటి ఒప్పందాన్ని భా-తంకూడ తెలియచేస్తోంది. ప్రాచీన సాహిత్యంలో దీన్నే "ప్రజా ఒప్పందంగా" భావించవచ్చును.

" జనులొక్క తఱి, దొల్లి సమయుంబు దమలోన
జేసి క్రూరతయు మెచ్చిమియు అంకు
నైపక యట్టిమర్యాద నందఱును గూడ
శాసించు వారుగా జాలి తమకు
నదిపతియుగ నొరునాస పడక యుండిన
డవడి బహుకారణముల జిక్కు
వడిన విషణ్ణులై బ్రహ్మగానగ బోయి
మాకు రక్షకుడుగ మహిమ డొకడు
వలయు రూపింపు మాతని గొలిచి బ్రదుకు
వారమనుటయు నజుడును వారి వలన
కరుణ మనువు నిరూపించె నరుల సత్య
చరితులని పాలనమునకు జొరడ యతడు" (భార.శాం. 2-257)

అప్పుడు బ్రహ్మ ప్రజలకు – మనువుకు మధ్యవర్తిత్వాన్ని నడిపి ఒక ఒడంబడిక కుదుర్చడానికి ప్రయత్నించాడు. మనువు ఒప్పుకోలేదు. ప్రజలు మనువుతో 'పశువుల్లో, బంగారంలో యాభైయవ అంశాన్ని, ధాన్యంలో పదవ అంశాన్ని, భాండాగారానికిస్తాం. దుష్టశిక్షణ, శిష్టనిగ్రహపాలనం చెయ్యి. ధర్మపరులు చేసిన ధర్మాలలో అరవపాలు నిన్ను చేరుతుంది, అని ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత మనువు రాజ్యపాలన చేయడానికి అంగీకరించాడు.

రాజ్యనిర్వచనం ;- "మానవునిపై అధికారంతో కూడిన ప్రాబల్యాన్ని రాజ్యమని" మెకియవెలి "ది ప్రిన్స్" అనే గ్రంథంలో నిర్వచించాడు. అప్పటి నుంచి చాల మంది రచయితలు వివిధ విధాలుగా రాజ్యాన్ని నిర్వచించారు. "రాజ్యానికి ఉడ్రోవిల్సన్ ఇచ్చిన నిర్వచనము సంక్షిప్తంగా ఉంది. 'ఒక నిర్ణీత ప్రదేశంలో శాసనబద్ధులై నివసించే ప్రజలు రాజ్యము' అన్నాడు. హాలండ్ నిర్వచనాము సారం రాజ్యమంటే ప్రజానీకం నివసించే నిర్ణీత ప్రదేశము. దీనిలో అధిక సంఖ్యాక వర్గం అభిప్రాయాన్ని ఇతరులంగీకరించి విధేయతతో అనుసరించవలసి ఉంటుంది. ప్రజానీకము తమ సార్వభౌమత్వానికి లోనై ఒక దేశంలో స్థిరపడితే రాజ్యమంటా మనీ న్యాయ శాస్త్రజ్ఞుడు ఒపెన్‌హీమ్ చెప్పినాడు. భౌతిక భూభాగంలోని ఒక పరి మితి, తదితర స్థలం మీద అధికారమున్న ఒక ప్రభుత్వము ఒక ప్రదేశంలో నివసించే సంఘాన్ని రాజ్యమని హెరాల్డ్ లాస్కీ నిర్వచించినాడు. జాన్ డబ్ల్యు బర్జెస్ రాజ్యమొక ప్రత్యేక సంఘటిత భూభాగమన్నాడు. బ్లంట్‌షిలీ ఒక నిర్ణీత మైన భూభాగంలో ఉన్న సంఘటిత ప్రజానీకము రాజ్యమని వివరించాడు"[7]

పై నిర్వచనాన్ని పరిశీలిస్తే రాజ్యానికి నాలుగు ముఖ్యలక్షణాలున్నాయని తెలు స్తోంది.

1) ప్రజలు :- రాజ్యం అనేది మానవ రాజకీయ సంస్థ. కాబట్టి ప్రజలు లేనిదే రాజ్యం లేదు. నిర్జన ప్రాంతాలను రాజ్యంగా గుర్తించలేం.

2) ప్రదేశం:- ఒక నిర్ణీత ప్రదేశంలోప్రజలు స్థిరనివాసం ఏర్పరచుకుంటే ఆ ప్రదే శాన్ని రాజ్యంగా గుర్తించ వచ్చు. రాజ్యం సరిహద్దులలో వుండే భూభాగం, నదీ జలాలు, గగన స్థలం, ప్రదేశమనే రాజ్య లక్షణాలలో ఉంటాయి. రాజ్యం యొక్క గొప్పతనం భౌగోళిక వైఖరి, వాతావరణం, సహజ వనరుల లభ్యత మొదలైన అంశాలపై ఆధారపడి వుంటుంది.

3) ప్రభుత్వం :- రాజ్యానికి మూడవ లక్షణం ప్రభుత్వం. రాజ్య శాసనాలన్నీ ప్రభుత్వం అమలు పరుస్తుంది. ప్రభుత్వం ద్వారా రాజ్యం తన మనుగడ సాగిస్తుంది.

4) సార్వ భౌమాధికారం :- రాజ్యానికి ఉన్న అత్యున్నత శాసనాధికారాన్ని సార్వభౌమాధికారమనవచ్చును. దీన్నే మన ప్రాచీనులు రాజదండం అన్నారు.

## సప్తాంగాలు (రాజ్య స్వభావం)

రాజ్యానికి ఒక నిర్దిష్టమైన నిర్వచనాన్ని మన సాహిత్యం పేర్కొనక పోయినప్పటికి రాజ్యానికి అవసరమైన సప్తాంగాల గురించి క్షుణ్ణంగా వర్ణించడం వల్ల రాజ్య స్వభావం తెలుస్తోంది. రాజ్యం సప్తాంగాలతో వర్ధిల్లాలని మన సాహిత్యం చెబుతుంది.

" స్వామ్యమాత్య జనపద దుర్గకోశ దండ మిత్రాది ప్రకృతయః "

అని కౌటిల్యుని అర్థశాస్త్రం.[8]

" స్వామ్యమాత్యా జనం దుర్గం కోశోదండస్త థైవచ ।
మిత్రాణ్యేతాః ప్రకృతయో రాజ్యం సప్తాంగముచ్యతే ॥

అని యాజ్ఞ వల్క్య స్మృతి (1-343)

"స్వామ్యమాత్యౌపురం రాష్ట్రం కోశం దండః సుహృత్తథా ।
సప్త ప్రకృతయోహ్యేతాః సప్తంగం రాజ్యముచ్యతే"॥ (9-294)

అని మనుస్మృతి రాజ్యాంగాలను గురించి చెబుతుంది.

1) స్వామి – రాజు
2) అమాత్యులు – మంత్రులు
3) రాష్ట్రం – ప్రదేశం
4) దుర్గం – రాజ్య రక్షణార్థం నిర్మింపబడ్డ కోట
5) కోశం – ధనాగారం
6) సైన్యం – రాజు యొక్క బలగం
7) మిత్రుడు - మిత్రరాజులు, మిత్రదేశాలు

ఈ అంగాలన్ని ఉంటే అది రాజ్యమని పిలువబడుతుంది.

"స్వామియు మంత్రియు దుర్గ
స్తోమము రాష్ట్రంబు వనము సుహృదులు బలముం
గా మహి సప్తాంగములని
తామదిలో నెఱిగి వీని దగ రక్షించెన్." (కే.బా.చ -4-205)

అని సప్తాంగాలను గురించి ఉంది.

"మహిమ వెడదు స్వామ్య మాత్య సుహృత్కోశ
రాష్ట్ర దుర్గ బల పరాయణులకు
నీవు నిదియు నెఱిగి కావింపు సప్తాంగ
సంగ్రహంబు నీతిశాస్త్ర నిపుణ" – అని తిక్కన "విజయ సేనం"

లోని పద్యంగా "ప్రబంధరత్నావళి" తెలుపుతోంది.9

"స్వామ్య మాత్య సుహృత్కోశ సకల రాష్ట్ర
దుర్గ బలముల సంగనెందుము నృపాలు
నకును సప్తాంగ బలములు నరవరేణ్య
వీవి దెలియంగ వలయును వేఱువేఱ" (కృ.వి. 2-51)

అని సప్తాంగాల గురించి రాజు తెలుసుకోవడం అవసరమని చెబుతుంది.

"శ్రీ పతి బోలు భూపతియు జెల్వగు మంత్రియు రాష్ట్ర దుర్గము
ద్దీపత కోశ సైన్యములు దీర్ఘ సుహృజ్జనులుంబర స్పర
వ్యాపి మహోపకారులగునట్లుగ రాజ్య జాంగబుద్ధి మై
నోపి పరీక్ష సేయవలయున్నిజ శిక్షణ లక్షణంబులన్" (స.నీ.స.

1-44) అని సప్తంగాల గురించి పేర్కొనబడింది.

"అంగములు పతికి వినుస
ప్తాంగములును వానిదగు సమంచితగతి సా
రంగాంక వంశతిలక హో
సంగును రక్షించుకొనగ జననాథునకున్." (శృ.శా. 4-77)

అని సప్తాంగాలను రాజు రక్షించుకోవడం ప్రధాన కర్తవ్యమని పేర్కొంది.

"పతియు నమాత్యుడు దుర్గము
క్షితియును మిత్త్రుండు ధనము సేనయు ననగా
నుతి కెక్కను సప్తాంగము
లతులితగతి రక్ష సేయనగు నరపతికిన్" (రుక్మా.చ. 3-20)

అనికూడా తెలపబడింది. రాజ్యానికున్న విశిష్టమైన ఈ సప్తాంగాలను మానవ అవయవాలతో పోల్చడం "శుక్రనీతి సారం"లో ఉంది.10

| | | |
|---|---|---|
| రాజు | - | తల, |
| మంత్రి | - | కన్ను |
| మిత్రులు | - | చెవులు |
| కోశం | - | నోరు |
| సైన్యం | - | మనస్సు |
| దుర్గం | - | చేతులు |
| రాష్ట్రం | - | పాదాలు |

ఈ సప్తాంగాలలో ఏ అంగం లోపించినా రాజ్యం యొక్క మనుగడ సాగదని "మనుస్మృతి" ఇలా చెబుతోంది.

సప్తాంగ స్నేహ రాజ్యస్య విష్టబ్ధస్య త్రిదండవత్
అన్యోన్య గుణవైశేష్యాన్న కించిదతి రిచ్యతే" [9-296]

రాజు

సప్తాంగాలలో రాజు ప్రథమాంగం మాత్రమే కాదు ప్రదానాంగం కూడా. రాజు లేకుంటే రాజ్యం అల్లకల్లోలంగా ఉంటుంది. సూర్యుడు లేకుంటే అన్ని ప్రాణులు చీకటితో కప్పబడతాయి. అలాగే రాజులేకుంటే మానవ కార్యకలాపాలకు అంతర్ధాయం ఏర్పడుతుంది.

రాజు నశించిన రాజ్యమందు
బలవంతుడగు వాడు బలహీను పశుదార
హయ సువర్ణాదుల నపహరించు
జారచోరాదులు సంచరింతురు ప్రజ
కన్యోన్య కలహంబులతిశ యిల్లు
వైదికంబై యున్న వర్ణాశ్రమాచార
ధర్మమించుక లేక తప్పిపోవు
నంత మీద లోకులర్థ కామంబుల
దగిలి సంచరింప ధరణి నెల్ల
వర్ణ సంకరములు వచ్చుమ మర్కట
సారమేయకులము మేర బుత్ర." (భాగ. 1-483) ఇది రాజులేని రాజ్యస్థితి. అరాజక రాజ్యస్థితి ఇంకా ఇలా వర్ణించబడింది.

"ఈ ధరణి తలంబునకు నేలిక యెవ్వడు లేడు గావునన్
సాధుమతంబు లేవ్వియును సాగవు మ్లేచ్ఛకిరాతులొక్కటన్
బాధ మొనర్పగా బ్రజల ప్రాణ భయంబుననున్నవారు నా
నాధన ధాన్య సంపదలు నాశము నొందె ననేక భంగులన్."
[ఆం.వి.పు. 2-130]

"కాపరి లేని గొఱ్ఱియలకై వడి గంటక చోరకోటి వేసే పఱి.." [భాగ. 1-482] ఉంటుంది రాజులేని రాజ్యం. 'మత్స్య న్యాయం' అమలు కాకుండా ఉండడానికి 'రాజు' అవసరమవుతాడు. ప్రజాపాలనే అతడి కర్తవ్యం. ప్రజలను కన్నబిడ్డలలాగా కాపాడడం అతని విధ్యుక్త ధర్మం.

"క్షత్రియస్య పరోధర్మః ప్రజానామేవ పాలనమ్
నిర్దిష్ట ఫల భోక్తాహి రాజా దర్మేణ యుజ్యతే" (మనుస్మృతి. 7-144) ప్రజా పాలనే రాజుకు ఉత్తమ ధర్మమని పై శ్లోకార్థం. రాజు గుణ గణాల్ని అర్హతల్ని గురించి, ఇతిహాసాలు ఇలా చెబుతున్నాయి.

"శమమును దానము ధర్మము
క్షమయును బటు విక్రమంబు సత్యంబున శీ
లము దుర్జన శిక్షయు భూ
రమణునకుం గలుగవలయు రాజిత గుణముల్"
(భాస్క.కిష్కి-309)

"కులము గలవాడు శౌర్యము
గలవాడును నధిక సేనగలవాడును భూ
తలమున రాజను నామము
విలసిల్లగ దాల్చుమూడు విధముల పేర్మిన్." (భార.ఆది.6-87)

'నా విష్ణుః పృథివీపతిః' అని దేవుడే రాజుగా పేర్కొనడం జరిగింది.

"రాజు లరసిన నెమ్మది బ్రదుకుగాన
రాజు సర్వోత్తముడు ధర్మరాజి యందు
రాజధర్మంబ యెక్కుడు రాజనంగ
ధర్మ దేవతయన వేఱె ? ధర్మతనయ." (భార.శాం 2-239)

అని రాజుకు దైవత్వం ఆపాదించబడింది.

రాజు సమాజానికంతటికి ఆదర్శవంతుడు కావాలి. రాజు ఎలా ప్రవర్తిస్తే ప్రజలు అలాగే ప్రవర్తిస్తారు. అందుకే 'యథారాజా తథా ప్రజా' అనే నానుడి వచ్చింది.

"కన్నొకటి నిద్రవో వెలుకంట జాగ
రంబు గావించు భూరుహాగ్రంబు మీద
యచ్ఛభల్లంబుగతి భోగమనుభవించు
నెడను బహిరంతరరులపై దృష్టివలయు" [ఆము. 4-241]

అంత జాగ్రత్తగా రాజ్య పాలన చేయాలి. సప్తాంగాలను కాపాడుకోవాలి. [రాజును గురించి వివరాలు తర్వాతి అధ్యాయంలో ఇవ్వబడ్డాయి].

## 2. మంత్రి

సప్తాంగాలలో రాజు తర్వాత అమాత్యుడు ప్రాముఖ్యం వహిస్తాడు. తెలుగు కావ్యాలలో అమాత్యుడు లేదా అమాత్యపదవి సరిగా నిర్వచించబడలేదు.

పర్యాయపదాలు :- అమాత్యడు,[11] సచివుడు,[12] ప్రెగ్గడ,[13] మంత్రి,[14] మూలభృత్యుడు,[15] సహాయుడు,[16] ప్రదాని[17] అనేవి మంత్రికి పర్యాయపదాలు. ఈ పదాల మధ్య తారతమ్యంఉన్నట్లు కౌటిల్యుని "అర్థ శాస్త్రం" వల్లతెలుస్తుంది. "వారి వారి సామర్థ్యాన్ని, అంతస్థును, వారు పనిచేయాల్సిన ప్రదేశాన్ని, కాలాన్ని, పనిని నిర్ణయించి వారిని అమాత్యులుగా నియమించాలే గాని మంత్రులుగా నియమించరాదు"[18] అని కౌటిల్యుడు చెప్పడం మంత్రి అమాత్యుల పదవుల తేడాను సూచిస్తోంది. తెలుగు సాహిత్యంలో మంత్రి గురించి వర్ణించేటప్పుడు ఈ తేడాను గమనించలేదు.

మంత్రి అవసరం :- రాజు, మంత్రులు ఇతర అధికారుల సహాయంతో రాజ్యాన్ని పాలిస్తాడు. "ఇతరుల సహాయం చేతనే రాజత్వం సాధ్యమవుతుంది. చక్ర మొక్క స్థానం ఉంటే బండి నడవదు" అనికౌటిల్యుడు మంత్రి అవసరాన్ని నొక్కిచెప్పాడు.

"అపియత్సు కరం కర్మతదప్యేకేన దుష్కరమ్ ।
విశేషతసహాయేన కింతు రాజ్యం మహోదయమ్ ॥

(మనుస్మృతి. 7-55)

పని ఎంత చిన్నదైనా, ఒంటరిగా చేయడం కష్టంగా ఉంటుంది. రాజు రాజ్యాన్ని ఇతరుల సహాయం తీసుకోకుండా పాలించలేడని మనుస్మృతి చెబుతోంది. కాబట్టి రాజు మంత్రుల్ని నియమించుకొని వాళ్ళ సలహాలు తీసుకొని రాజ్యపాలన చేయ్యాలి. మంత్రి అవసరాన్ని గురించి సుమతీ శతకకారుడు ఇలా చెప్పాడు.

"మండలపతి సముఖంబున
మెండైన ప్రధాని లేక మెలగుట యెల్లన్
గొండంత మదపుటేనుగు
తొండము లేకుండినట్లు దోచుర సుమతీ. (సు.శ 51)

అంతేగాదు,

"మంత్రి గలవాని రాజ్యము
తంత్రము చెడకుండ నిలుచు దఱుమగ ధరలో
మంత్రి విహీనుని రాజ్యము
జంత్రపుగీలూడినట్లు జరుగదు సుమతీ!" [సు.శ. 52]

"వాకు మోనీతి పదను సుశ్రీకి నెలవు
మంత్రిలేకున్న రాజ్యంబు మనుజపతికి
బెక్కువది యెంత గలిగిన బీలికాడు
లేని పేరోడ చక్రంబులేని రధము." [శృం.శా. 4-149] అని

మంత్రి అవసరం పేర్కొనబడింది.

రాజనే పామును పట్టి ఆడించే గారడీడు మంత్రి. మదగజంలాగా సంచరించే రాజుకు అంకుశం మంత్రి. దారి తెలిసి మాట్లాడే మంత్రి మాటలు ఆదరించే వాడే రాజని వేదవిదులంటారు. అన్యాయంగా ప్రవర్తించే రాజును సన్మార్గానికి తిప్పడానికి అతని మంత్రి ప్రయత్నించాలి రాజు అపరాధిని వధించమని ఆజ్ఞను హితులు, దొరలు వినకుంటే అతని మంత్రి ఆ కీడు తప్పించాలి. [సిం.ద్వా. - 1-194 నుంచి 198]

## మంత్రి అర్హతలు - ఎన్నిక [నియామకం]

ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని రాజుకు సలహాలు ఇస్తూ, రాజ్యయంత్రాంగాన్ని నడిపించడం, మొదలైన గురుతరబాధ్యతలు మంత్రికి వుంటాయి. అందుచేత సమర్థులు, బుద్ధికుశలురు మంత్రులుగా ఉండాలి. వాళ్ళ శక్తి సామర్థ్యాల్ని

పరీక్షించి తెలుసుకోకుండా రాజు మంత్రులను నియమించరాదు. ప్రాచీన కాలంలో మంత్రి ఎన్నికపై ప్రత్యేక శ్రద్ధ చూపబడేది. ఈ ఎన్నికలో వ్యక్తి యొక్క గుణ గణాలు, శక్తి సామర్థ్యాలే కాక వంశచరిత్రను కూడ పరిగణలోకి తీసుకోబడేది. స్వీయ రాష్ట్రంలో పుట్టినవాడు, మంచి వంశంలో జన్మించినవాడు, అదుపులో ఉంచగలవాడు, కళాకుశలుడు, చక్షుష్మంతుడు, ప్రాజ్ఞుడు, పట్టుదలగలవాడు, దక్షుడు, చక్కగా మాట్లాడగలవాడు, ప్రగల్భుడు, సద్యఃస్ఫూర్తి గలవాడు, ఉత్సాహవంతుడు, శుచి, మిత్రుడు, దృఢమైన భక్తి, శీలం, బలం, ఆరోగ్యం, సత్యం మొదలైన గుణాలు ఉన్నవాడు, మొండితనం చాపల్యం లేనివాడు, సంప్రియుడు, కలహించనివాడు - మంత్రి పదవికర్హుడు.[20]

" ఆరోగ్య వర్ధేహుడాకారశాలి సం
    శ్రక్రమాగత సువిస్తార బుద్ధి
ధీరుడాఢ్యుండు గంభీరుడవ్యసని ప్ర
    జా నందకరుడు దయాన్వితుండు
నిజ మర్మగోపన నిపుణుండు పరమర్మ
    భేదన నిపుణుడు సాదరోక్తి
శీలుడాచార విశిష్టుండు సర్వ వి
    ద్యానిధి ఘనుడుత్త మాన్వయుండు
లీలవాడు శూరుడాలస్య రహితుడా
విత్యపరుడు నిఖిల విత్తవిదుడు
భర్తవలను గలడు భక్తుండు చెలికాడ
నంగ మంత్రి ముఖ్యుడతడు వెలిసె "    [కే.బా.చ. 1-65]

ఇలా మంత్రి లక్షణాలు, అర్హతలు వివరించబడ్డాయి.

" పతిహితుండతి ధర్మపరుడు నీతిధురీణు
    డింగితజ్ఞుండు జితేంద్రియుండు
మంత్రరక్షకుడన్య మర్మ భేది ప్రజాను
    రాగి శశోత్ర నీరాగి భోగి
యుచిత యత్న తరస్వియుత్కోచవిముఖుండు
    శాంతుడతి ప్రౌఢ సత్యవాది
పరధన పరదార పరివాద వ
    ర్జితుడు ప్రఖ్యాతుండు శ్రీకరుండు

బ్రాహ్మణుడు మంత్రిగా దగు బరిగణింప
గుణము లిట్టివిగా సమకూరెనేని
క్షత్రియుని శూద్రునిందప్ప సచివ పదవి
వైశ్యనిలుపంగ దగవు భూవల్లభునకు" (శృ.శా.4-173)

ఇవీ మంత్రి పదవికి అర్హులైన వారి గుణగణాలు. మంత్రిగా నియమించ దగిన వ్యక్తిలక్షణాలు ఇంకా ఇలా వుండాలి.

"శద్ధియు బుద్ధియు శాంతియు
వృద్ధాచారమును నయవివేకము గర్మ
శ్రద్ధయు ధైర్యము గలుగు ప్రా
బుద్ధిని బతి మంత్రి పదవి బూన్పగవలయున్" (రుక్మా.చ 3-22)

అని ఉద్ఘాటిస్తోంది.

అన్ని రకాల సద్గుణాలున్నప్పటికీ తనపట్ల విశ్వాసం లేని వాళ్లను రాజు మంత్రులుగా నియమించరాదు.

"చదివి యధర్మ భీతినృప శాస్త్రవిధిజ్ఞతల న్వయుస్సుడె
బ్బదిటికి లోను నేబదికి బాహ్యమునై యరుజన్స్వరూపులై
మదమఱి రాజుప్రార్థన నమాత్యత గైకొని తీర్పుపాలువా
రొదవిన నంగము ల్మిగుల నూర్జిత మౌటకు బూట సాలదే"
(అము. 4-211)

శాస్త్రాల్ని పఠించి, అన్యాయం పట్ల భీతి, రాజనీతి పరిజ్ఞానం, డెబ్బై సంవత్సరాల లోపు-యాభై సంవత్సరాల పైన వయస్సు కలవారై, రోగం, లేమి పట్ల తమ పెద్దల నాటి నుంచి కనిపెట్టి వున్నవారై, మత్సర్యాదులు లేకుండా, రాజు వేడుకొనడం చేత మంత్రిత్వాన్ని అంగీకరించి, కార్యనిర్వహణ చేసే బ్రాహ్మణులు లభిస్తే రాజ్యాంగాలు బాగా అభివృద్ధి చెందడానికి ఒకపూటచాలు. ఇలాంటి మంత్రి లభించక పోతే రాజే రాజనీతి శాస్త్రాల్ని అనుసరించి రాచకార్యాలు నెర వేర్చుకోవాలి. అంతేగాని గుణహీనుడైన మంత్రిని నియమించుకొని ఆపదల పాలు కాకూడదు. మంత్రిలేకున్నా పరవాలేదు. గుణహీనుడైన మంత్రిని మాత్రం నియమించకోకూడదు. [అము. 4-212, 214].

<u>మంత్రుల సంఖ్య</u> :- దశరథ మహారాజు దగ్గర విజయుడు, ధృష్టి మంత్రపాలుడు, సిద్ధార్థుడు, రాష్ట్రసాధకుడు, అశోకుడు, సుమంత్రుడు అనే ఎనిమిదిమంది మంత్రులుండే వాళ్లు [భాస్క.బాల 51] వారి స్వామి భక్తి, శక్తిసామర్థ్యాలిలా కీర్తించబడ్డాయి.

" ఆ మంత్రులందఱు నన్యోన్యహితులు
స్వామి కార్య విచార చతుర మానసులు
పరమర్మ భేదనోపాయ దౌరేయు
లరసి ప్రజారక్ష యాచరింపుదురు " [రం.రా.బాల. పుట. 8]

తారకాసురుని దగ్గర కూడా చాలమంది ప్రధానులుండే వారట! కాసరాక్ష, తామ్రాక్ష, ధూమ్రాక్ష, చతురోదగ్ర, ఖడ్గరోమ, బాలబిడాల, కాలనేమి [హర. 3-9] మంత్రి, పురోహిత, సేనాపతి, యువరాజ, దౌవారికులను శాసనాలలో పంచ ప్రధానులుగా పేర్కొన్నారు. [శాసన సాజ్ఞప్తిః పంచ ప్రదానాః] రాజు ఏర్పాటు చేసే మంత్రి పరిషత్తులో పన్నెండు మంది మంత్రులుండాలని మనువు అనుయాయులు, పదహారు మంది మంత్రులుండాలని బృహస్పతి అనుయాయులు ఇరవై మంది మంత్రులుండాలని ఔశసులు, 'యథా సామర్థ్యం' వుండవచ్చునని కౌటిల్యుడు అభిప్రాయ పడ్డారు.

రాయబారిగా మంత్రి ,- రెండు దేశాల మద్య సత్సంబందాలు నెలకొనడానికి రాయబారి అవసరం. అయితే రాయబారిగా ఫలానా వారే వెళ్లాలి అనే నియమం ఏది లేదు.

" కృత మంత్రుడగుచు భూపతి
చతురుని నిజమంత్రి మంత్ర సమ్మతునెపుడున్
వ్రతసాభిమను గమ్య
క్షితిపతికడ కనుపవలయు జెచ్చెఱదూతన్ " [స.నీ.స. 2-338

అని మంత్రిని రాయబారిగా పంపాలని చెబుతునే,

" దూరపు బనులకు మంత్రికి,
బోరాదటు గాన నతని బోలెడి విప్రుం
భూరి గణాఢ్యుని దూతగ
గోరి నృపాలుండు పనులుగొనగావలయున్" [స.నీ.స, 2-336]

దూరదేశాలకు మంత్రి రాయబారిగా పోరాదు. కాబట్టి మంత్రికి వుండే అర్హతల్ని కలిగినగొప్ప గుణాఢ్యుడైన బ్రాహ్మణుని దూతగా పంపాలట! పాండ్య భూపతి మంత్రులు విక్రమార్క మహారాజు దగ్గరకు రాయబారులుగా వెళ్లడం "సింహాసన ద్వాత్రింశిక"లో ఉంది. [11-170 నుంచి 174]

## మంత్రి విధులు

రాజు రాజనీతిని తప్పకుండా పాలన చేయడానికి మంత్రి తన సలహాలతో తోడ్పడాలి. పెడతోవ పట్టే రాజును సక్రమ మార్గం వైపు మళ్ళించాలి.

" నృపతి మదోద్ధతుండయిన నేర్పున మంత్రివరుండు రాచకా
ర్యపు సరవుల్ ప్రజావితతి వంటని యాపద యంచి వేళ దె
ల్పిపడగ జెప్పివాని యవివేకము మాన్పి హితంబొనర్చినన్
విపుల యశమ్ము నొందు గుణవిశ్రుత ! విద్దయలక్ష్మధీమణి ।
[భాన.పం.తం. 1-277]

కొన్ని సందర్భాలలో మంత్రులు రాజులను సింహాసనాధిష్ఠితులను చేయడం జరిగింది. అర్థశాస్త్రాన్ని రచించిన కౌటిల్యుడు చంద్రగుప్త మౌర్యుని రాజుగా చేయడం, తిమ్మరుసు కృష్ణదేవరాయలను రాజుగా చేయడం మొదలైన వాటిని పరిశీలిస్తే మంత్రులకు రాజులకు రాజ్యాన్ని కట్టబెట్టే శక్తియుక్తులు ఉంటాయని స్పష్టమవుతుంది. మదమెక్కిన రాజుకు మంత్రి నేర్పుతో ప్రజలు బాధపడకుండా రాజకార్యాలకు అపద కలిగించి సమయానుకూలంగా అవి ఆ రాజుకు తెలియవేసి అతనియొక్క అవివేకాన్ని తొలగించి మేలు చేయాలి. ఇలా రాజును సంస్కరించడం వల్ల ఆ మంత్రి కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయి. రాజు ఏ కారణంతోనైనా రాజ్యంలో కనపడక పోతే మంత్రి ఆ విషయాన్ని అతి రహస్యంగా ఉంచి, రాజు వేటకు వెళ్ళినట్లో లేదా మరేదో కారణం చెప్పి సామంతులను, అధికారులను, ప్రజలను నమ్మించాలి. వారుల ద్వారా రాజు అచూకి తెలిసికొని అతనిని రాజధానికి తీసుకురావాలి. తిమ్మరుసుపై కోపంతో రాయలు ఒకనాటి రాత్రి నగరశోధన నెపంతో వెళ్ళి తిరిగి రాలేదు. దీన్ని గ్రహించిన తిమ్మరుసు అక్కడ సైనికులతో రాజు గురించి ఎవరైనా అడిగితే, తలనొప్పి రావడంతో ఇంకా నిద్రపోతున్నాడు అని చెప్పమన్నాడు. గూఢచారులను అన్ని దిక్కులకు పంపించి రాయల గురించి తెలుసుకున్నాడు. నగరంలో ఉండే దొరమన్నీలనూ, అమరనాయకులందరినీ రాజు వేటకు వెళ్ళాడనీ, వాళ్ళనూ వేటకు రమ్మని చెప్పాడు. వాళ్ళను వెంటబెట్టుకొని రాయల్ని కలిసి,

"అధిప యువ్వార్త పరులెవ్వరైన వినిన
వైపరీత్యంబు గాదె సర్వంబు నెఱుగు
నట్టి దస్యులు మీర లిట్లన్య జనుల
సరణి రాజెల్లునే సాధుజన శరణ్య." (కృ.ది. 2-86) అని

ఆయనను మందలిస్తాడు.

పై సంఘటనను బట్టి మంత్రి ఎంత దక్షుడో, ఎంతశక్తిమంతుడో అవగతమవుతున్నది. రాజు ఇబ్బందులన్నిటినీ మంత్రి తొలగించాలి. తిమ్మరుసు వారించినా వినకుండా బలవంతుడైన గజపతిపైకి రాయలు దండెత్తి వచ్చాడు.

"ఇలబదార్గురు రాజుల చెలువు గలిగి
యల చతుర్దశ భువనముల్ గెలువ బూను
నట్టి ఘను లౌనెకావారి నణచవశమె
పదరి వచ్చితి మప్పాజి పలుకు వినక" (కృ.వి. 3-97)

అని రాయలు ఆలోచనలో పడి, ఆ ప్రమాదం నుంచి రక్షించమని మంత్రి తిమ్మరుసును ప్రార్థించాడు. తిమ్మరుసు తన మేధాశక్తితో భేదోపాయాన్ని ప్రయోగించి గజపతికి ఓటమిని చవి చూపించాడు. ఈ సంఘటనకు రాయవాచకం, కృష్ణరాయ విజయం రెండూ అద్దం పట్టాయి. రాముడు సేతువు దాటి సేనతో వస్తున్నాడనే వార్త విని రావణుడు మంత్రుల్ని

" – – – – – మీరు నాకు
బనులకు గల వారలని చూతు బ్రెగ్గడ
లగుచున్న మీనేర్పు దగవు లెప్ప
జడనిధి బంధించి కడచి వచ్చిరి మార్తు
రీ వార్తలరయంగ వేవు లేద
రాజులేమఱియున్న రాజనీతి స్థితి
సచివు లేమఱి యుండుట చితమగునె-" (భాస్క.యుద్ధ-291)

అని ఆక్షేపించాడు. రాజులు ప్రమత్తులైనా రాజనీతి పట్ల మంత్రులు మాత్రం అప్రమత్తంగా వుండాలన్నది సారాంశం.

మంత్రి విధులు – ఆచరణ:-

శివుని శాపం వల్ల చిత్రరథుడు అనే గంధర్వుడు వజ్రదంష్ట్రుడు అనే పేరుతో పిశాచపతిగా రాజ్యాన్ని పాలించాడు. అతని మంత్రి వజ్రముఖుడు. అతడు తన దొరకు భయపడని వారిని భయపెట్టి లోబరుచుకున్నాడు. రాజును సేవించిన వారిపై ప్రేమచూపాడు. శివచిహ్నాలు లేని వారి గుండెలు అవియచేశాడు. కయ్యానికి దిగిన వారి రాజ్యాలను హరించాడు. తన స్వామి ఆజ్ఞ దిగంతాల వరకు వెళ్లేటట్లు చేశాడు. రాజ్య విస్తరణలో నేర్పుచూపాడు. సామ, దాన, భేద,

దండోపాయాలను సమయోచితంగా ప్రయోగించాడు. పిశాచ లోకమంతా తన రాజుకు అణగి వుండేటట్లు చేశాడు. (ఉ.చ. 1-145.)
దీన్ని బట్టి మంత్రి విధులూ, పట్టుదలా, శక్తిసామర్థ్యాలు వెల్లడవుతున్నాయి.

ప్రసిద్ధి పొందిన మంత్రులు చాణక్యుడు, యుగంధరుడు మొదలైన వారితో తరువాత మంత్రులు కొందరు పోల్చబడ్డారు.

"చతుర ప్రజ్ఞుడు చంద్రగుప్తున కిలం జాణక్యు భంగిన్ దివ
స్పతికిం దైవత మంత్రి యోజ సుమన శ్లాఘ్యుండు వత్సావనీ
పతికిం దొంటి యుగంధరాఖ్యు గతి శంభ త్పుణ్యుడమ్మేదినీ
పతికిం బ్రెగ్గడ భాగురాయణుడనం బ్రఖ్యాత దిద్దస్థితిన్"
(కే.బా చ.1-64) అని పేర్కొంది.

"నీతి యుగంధర సుకవి
వ్రాత ప్రస్తుత యశోధురంధర–" (ప్రభోద.2-80)

అని ప్రసిద్ధ మంత్రులతో తమ మంత్రులను పోల్చి వర్ణించడం ఉంది. పై పోలిక గంగయ మంత్రికి ఉపయోగించాడు.

"దిగ్గజ వరాహ మారుత
భుగ్గిరి కమఠముల బోలు భుజసత్త్వములన్
దుగ్గన మంత్రికి సరియగు
ప్రెగ్గడ లెవ్వారు గలరు పృథివి భరింపన్" (నాసి. 1–63)

అని దుగ్గన మంత్రిని పేర్కొంది. రాజశేఖర చరిత్రం సాళువ తిమ్మయ మంత్రిని (1-3) భీమేశ్వర పురాణంలో బెండపూడి అన్నమాత్యుని (1-19) "త్రిభువన రాయ వేశ్యా భుజంగ, కదన గాండీవి, జగనొబ్బ గండ" బిరుదాంకితుడైన సింగన మంత్రిని గురించి శృంగార నైషధం [1-37] వర్ణించింది. వైజయంతీ విలాసం నరసింహ మంత్రిని [అవతారిక–26]సవివరంగా కీర్తించాయి బంగారానికి తావి అబ్బినట్లు కొందరు ప్రసిద్ధులైన రాజులకు తగిన మంత్రులు లభించారు. దేవేంద్రునికి బృహస్పతి. వృషపర్వునికి శుక్రుడు, దశరథునికి వసిష్ఠుడు, రామునికి విశ్వామిత్రుడు, ధర్మరాజుకి ధౌమ్యుడు నలునికి దమనుడు ఎలాగో శబర రాజుకు 'అఖిలశాస్త్ర విద్యా కళాపావన గంభీరబుద్ధి' యజ్ఞదత్తుడు అనే బ్రాహ్మణుడు అలాగా ప్రధానిగా ఉన్నాడు [శివ.మహా 2-15] దశరథునికి వశిష్ఠుడు, పురోహితుడు మాత్రమే కాని ప్రధాని కాదనే విషయం కొన్ని చోట్ల చెప్పబడింది.

"మన పురోహితులగు మన్న మహిత మతుల
ఘను వసిష్ఠుని వామదేవుని సుయజ్ఞు
ననఘు జాబాలి గశ్యపు మునుల మఱియు
దగిన వారిని గొని సమ్మదమున దెమ్ము (భాస్క.బాల 52)

రాజు–మంత్రుల మధ్య సరైన అవగాహన ఉండాలి. మంచి మంత్రి రాజు అభివృద్ధిని కాంక్షించి సన్మార్గంలో నడిపిస్తాడు.

"పతికి నభివృద్ధి దనకు శోభనమునైన
బుద్ధి బోధించు నాతడు వోసుమంత్రిగా . ... ...."
(వై.వేం పం.తం. 1-669) అని చెబుతోంది.

కంసుడు తన జన్మ రహస్యాన్ని కూడ మంత్రితో చెప్పాడు. (హరి.పూర్వ బాగము 4-70 నుంచి 86 వరకు) రాముడు లంకపై యుద్ధానికి వచ్చినపుడు రావణుడు తన మంత్రులను పిలిపించి మీ తెలివి తేటలు ప్రకాశించేటట్లు ఎలా చేస్తే బాగుంటుందో సలహా ఇస్తే అందరం అలా చేస్తాం, అని చెబుతాడు.
(రం.రా.యుద్ధ పుట. 249-250)

" _ _ _ _ _ _ _ నీ వనిన మాట
లెక్క సేయ వినిబ్బోట జిక్క వలసె
దలప నిమ వంటి మంత్రియిద్ధాత్రి గలడె
చూడు మిందుల కొక యుక్తి సూక్ష్మమతిని " (కృ.వి. 3-100)

అని రాయలు గజపతిని ఓడించే ఉపాయాన్ని ఆలోచించవలసిందని తిమ్మరుసును ప్రార్థించాడు. (కృ వి,3-100). దీన్ని బట్టి మంత్రి బుద్ధి నైశిత్యం విదితమౌతున్నది. మంచి మంత్రుల మాట వినని మహారాజు ఇబ్బందుల్ని ఇబ్బడిముబ్బడిగా కొని తెచ్చుకుంటాడు. ఆ విషయం స్వయంగా రాయల వారే చెప్పారు. 'నీ వనిన మాట లెక్కసేయమి నిబ్బోట జిక్కవలసె' (కృ.వి. 3-100)

"మంత్రుల బుద్ధుల వినక, కు
మంత్రుల వాక్యముల దిరుగు మనుజేంద్రుడు దా
తంత్రమున బాసి పగతుర
యంత్రమ్ముల జిక్కువడు మహాత్ముండైనన్"
(భాన. పం.తం. 1-185)

మంత్రులంటే సన్మంత్రులన్న మాట. రాజులకు రాజనీతిని బోధించే బాధ్యత కూడ మంత్రుల పైనే వుంటుంది.

"రాజ లక్షణమెయ్యది రాజ్యలక్ష్మి
శాశ్వతంబుగ నుండుటే సరణి రాజ
నీతులెన్ని విధంబుల విఖిల మొలమి
దెలుపు మెంతయు నామది తేట పడగ" (కృ. వి. (2-48)

అని అడగడం, మంత్రి తిమ్మరుసు రాజనీతి పారంగత్వానికి ముగ్ధుడై

"గురుడింద్రువకుం దెచ్చిన
సరణిన్ బహునీతి ధర్మ శాస్త్ర స్ఫురణం
బెఱిగించితి వెంతయు సు
స్థిరమతి నింతయు గ్రహించితిన్ మంత్రి మణీ" (కృ.వి. 2-60)

శ్లాఘించడం ఇందుకు తార్కాణం.

## 3. రాష్ట్రం

రాష్ట్రం గురించి ఋగ్వేదంలో ఉంది. 'వరుణుని రాష్ట్రాలకు రాజు' అని వసిష్ఠుడు చెప్పాడు.

"యథా రాష్ట్రం గుపితం క్షత్రియస్య" (ఋగ్వేదం.-10-109-3)

రాజు సింహాసనాన్ని అధిరోహించేటప్పుడు చదివే మంత్రాలలో

"ఇంద్ర ఇవేహ ధ్రువస్తిష్ఠేహ రాష్ట్రము దారయ"

(ఋగ్వేదం 10-173)

[ఇంద్రుని వలె ధ్రువంగా ఉండుము. ఇక్కడి రాష్ట్రాన్ని వహించుము] అనిఅర్థం.

" జాంగలం సస్య సంపన్న మార్య ప్రాయమనావిలమ్।
రమ్య మానత సామంతం స్వాజీవ్యం దేశమావ సేత్॥"

[మనుస్మృతి -7-60]

పారవంతమైంది, నీటివసతికలది, పుష్కలంగా గడ్డికలది, మంచిగాలి, ఎండగలది ధనధాన్య సంపన్నమైంది. ఉపద్రవాలు లేంది, పుష్ప ఫల తరుల తాదులచే మనోహరమైంది, కృషివాణిజ్యాది జీవనోపాయం గల దేశాన్ని రాజు ఆశ్రయించాలని మనువు పేర్కొన్నాడు.

" ఎంతెంత గలుగు రాష్ట్రం
బంతంతియ రాజు పెద్దయగు గావునదే
శాంతరము లాక్తి కొనుట ని
లాంతము ధర్మంబు గాదె ధరణీశులకున్ "

[స.నీ స. -1-162]

రాష్ట్రాన్ని విశాలపరిస్తే రాజుకు గౌరవం ఎక్కువగా ఉంటుందనీ, అలాచేయడం రాజ ధర్మమని చెప్పింది. ఈ ధర్మాన్ని ఆచరించడానికి రాజులు యుద్ధాలకు దిగేవారు. రాయలు కూడా 'దేశవైశాల్య మర్థసిద్ధికిని మూల' మన్నాడు. [ఆ.ము 4-236]. విశాలమైన భూభాగమంటే ఆ రాజ్యానికి అర్థిక వనరులు సమృద్ధిగా వుంటాయని అయన విశ్వసించాడు కాబోలు. రాష్ట్రం రాణిల్లడానికి రాజు అత్యంత అవసరం. "రాజులేకున్న బురంబు రాష్ట్రంబు రాజిల్లదు" [రం.రా.అయోధ్య పుట-9] అనడం వల్ల రాజు–రాష్ట్రం వీటి ఆధారాధేయత్వం, అవినాభావ, సంబంధం సువిదం చేయబడింది. రాష్ట్రం, జనపదం, భూమి. విషయం, దేశం అనే పదాల మధ్య కొద్దిపాటి అర్థభేదమున్నా అన్నీ ఒకే అర్థంతో ఉపయోగించ బడ్డాయి. తన రాష్ట్రం అభివృద్ధి చెందడానికి రాజు శ్రద్ధ చూపాలి. వ్యవసాయం వాణిజ్యం వృద్ధి చెందేటట్లూ చూడాలి. రాష్ట్రాన్ని శత్రువుల, క్రూరమృగాల, దోపిడి దొంగల బారినుంచి కాపాడాలి.

" రాష్ట్రవర్ధన మెద గోరు రాజుమేలు
రాష్ట్రమును గోరు; దానగార్యమె యనంగ
రాదు; బ్రాహ్మోత్తరములైన ప్రజల యేక
ముఖపు గోర్కి దదంతరాత్ముండొసగడె?" (అము- 4-205)

రాజు ప్రజల మేలు కోరితే, ప్రజలూ రాజు మేలు కోరుతారు. అందుచేత రాజున కేమి ప్రయోజనం అని అడగడం సరికాదు. ఎందుకంటె ఏకరూపంగా బ్రాహ్మణాది ప్రజలు కోరే కోరికల్ని తదంతర్యామి అయిన పరమాత్ముడు తప్పక తీరుస్తాడని భావం ఇక్కడ రాష్ట్రం అంటే రాష్ట్రగతులైన ప్రజలని అర్థం.

## 4 దుర్గం

రాజ్య రక్షణకు పటిష్ఠమైన దుర్గ నిర్మాణం చాల అవసరం. కౌటిల్యుడు మనువు, యాజ్ఞవల్క్యుడు మొదలైన వాళ్ళు దుర్గానికి అధిక ప్రాముఖ్యాన్ని ఇచ్చారు. రాజ్యానికి ఉండాల్సిన సప్తాంగాలలో దుర్గం నాల్గవది. దుర్గమే కోట. కోటను పురం[21], దుర్గం[22], దేహి[23] అన్నారు. కోటలు నిర్మించడానికి రాళ్ళ[24], ఇనుము[25] వాడడం ఋగ్వేదకాలం నాటికే తెలిసి నట్లుంది. కోట అవిర్భావం గురించి ఇలా వుంది. దేవతల బారినుంచి రక్షణ పొందడానికి మాయ, విద్యున్మాలి తారకాసురుడు అనే దేవతలు బ్రహ్మను గురించి కఠోర తపస్సు చేశారు.

వారి తపస్సుకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమై, వరాన్ని కోరుకోమన్నాడు. ఆ మాటలకు సంతోషించిన మాయ భక్తితో ముందుకు వచ్చి ఇలా ప్రార్థించాడు. జరిగిపోయిన తారకామయ యుద్ధంలో దేవతలు దానవుల్ని తమ ఆయుధాలతో క్రూరంగా వధించారు. దానవులకు రక్షణ లేకుండా పోయింది. మీ ఆశీస్సులతో త్రిపుర అనే కోటను నిర్మించాలనుకున్నాం. అందుచేత భూ, జలచరాల నుంచి, మునుల శాపాలనుంచి, దేవతల దాడుల నుంచి ఆకోట సురక్షితంగా వుండే విధంగా వరాన్ని ప్రసాదించు అన్నాడు. బ్రహ్మ చిరునవ్వు నవ్వి ఏదీ శాశ్వతం కాదు కాబట్టి మట్టితో కోటను కట్టుకో అని చెప్పాడు. మట్టికోట యుద్ధసమయాలలో ఒకేఒక శివబాణంతో నాశనమవుతుందని వినయపూర్వకంగా మాయ బ్రహ్మకు చెప్పాడు. దానికి బ్రహ్మ "ఆ విధంగానే'' (మట్టితో)కోటను నిర్మించమని చెప్పి అదృశ్య మైనాడు. (మత్స్య పురాణం - చాప్టర్) (XXIX-11.25)

. శత్రువుల నుంచి రక్షణ పొందడానికి ఎంతటి బలవంతునికైనా దుర్గబలం అత్యంత అవసరం (స.నీ.స. 1-48)

"విమతుల కగమ్యమగుదు
ర్గము లేకుండినను బ్రజకు రాజుకు దమదే
శము లిడుమంబడు ధన ధా
న్యము లుండిన చిదప బ్రాణహానియు గల్గున్" (స.నీ.స 1-46)

దేవేంద్రుడు కూడా హిరణ్యకశిపుని దాడికి భయపడి గురువు అనుమతితో విశ్వకర్మ చేత అమరావతి కోట కట్టించాడు (స నీ.స 1-49)

"ఆయుధాలతో, రక్షణతో (కోట) వున్న ఒకే ఒక వ్యక్తి వందమందితోను. వంద మంది పదివేల మందితోనూ పోరాడగలరు. కాబట్టి రాజు కోటను కలిగి వుండాలి.26

కోట నిర్మించుకో లేని రాజు స్థితి ఇలా వుంటుంది.

"ధరణి మదము లేని కరులును బోలెదం
ష్ట్రములు లేని పన్నగములు బోలె
నరయ దుర్గరహితులైన ధాత్రీశ్వరు
లవని కెల్ల నసదు లగుదు రెపుడు." (స.నీ.స 1-50)

దీన్ని బట్టి దుర్గ ప్రాధాన్యం విస్పష్టమవుతోంది.

దుర్గం - విభాగాలు :-

జల, వన, కృత్రిమ స్థల, శైల దుర్గాలు నాలుగు అని రంగనాథ రామాయణం (యుద్ధ పుట 245) చెబుతోంది.

"అన్యోన్య ధన కాంక్షులై పోరు ధరణీశులకు నెల్ల నాడకాడకును శైల దుర్గంబులను, వన దుర్గంబులను. జలదుర్గంబులను హిమదుర్గంబులను—

....  .  ...  ....  ....  . .

....  . . .  . .  ....  (అం.వి.పు. – 1-100)

బ్రహ్మదేవుడు పుట్టించాడట!

"ధన్వదుర్గం మహీదుర్గమ బ్దుర్గంవార్క్షమేవతా।
నృ దుర్గం గిరిదుర్గం వా సమాశ్రిత్య వసేత్పురమ్॥" (7-70)

అని మనుస్మృతి పేర్కొంది.

జల, వన, పర్వత, ఎడారి దుర్గాలని నాలుగు విధాలైన దుర్గాలను కౌటిల్యుడు పేర్కొన్నాడు.[27]

1) జలదుర్గం – నీటితో చుట్టబడిన వున్నత ప్రదేశం.

2) వనదుర్గం:– తేమతోవున్న బురద ప్రాంతం లేక దట్టమైన పొదలతో వున్న ప్రదేశం.

3) పర్వత (గిరి) దుర్గం:– గుట్టలతో కూడివున్న గుహ లేక కొండలపై నిర్మించబడింది.

4) ఎడారి దుర్గం.– నీరు, పొదలు లేని ప్రాంతంలో నిర్మించబడింది

జలదుర్గాలు, పర్వత దుర్గాలు జనపద రక్షణకు, ఎడారి వనదుర్గాలు అటవీకులరక్షణకు, ప్రమాద సమయాల్లో పారిపోయి తలదాచుకోవడానికి ఉపకరిస్తాయి.

దుర్గ నిర్మాణం :– రాజ్య రక్షణకు కీలకమైన దుర్గాన్ని శత్రు దుర్భేద్యంగా నిర్మించాలి. దుర్గ నిర్మాణం వాస్తు శాస్త్రన్ని అనుసరించి కట్టాలి. "నీరు సంవృద్ధిగా వుండే ప్రవేశాలలోనే కోట నిర్మాణం చేపట్టాలి. ఆ పట్టణం వాణిజ్యానికి అనుకూలంగా వుండాలి. దాని చుట్టు మూడు అగడ్తలు త్రవ్వించాలి ఒకదానికి మరొకదానికి మధ్య పండ్రెండు దండాల దూరం వుండాలి. అగడ్తల వెడల్పు మొదట దానికి పద్నాలుగు, రెండవ దానికి పంద్రెండు, మూడవ వానికి పది దండాలు వుండాలి. లోతు వెడల్పులో సగం, అడుగు భాగం, పైభాగంలో మూడో వంతు చతురస్రంగా వుండాలి. అడుగు భాగాన రాళ్లను పరచి, రెండు ప్రక్కల రాళ్లతోగాని, ఇటుకలతోగాని కట్టాలి. అగడ్తలను నీటితో నింపాలి. ఎక్కువైన నీరు బయటికి వెళ్లడానికి ఏర్పాటు చేయాలి. అగడ్తలలో పద్మాలు, మొసళ్లు వుండాలి.

అగడ్తలు నాలుగు దండాల దూరంలో మట్టితో ప్రాకారం నిర్మించాలి. దానికి రెండింతలు ఎత్తు వుండాలి. ప్రాకారం పైభాగం ఇటుకలతో ఒక గోడను కట్టాలి. దాని ఎత్తు వెడల్పుకు రెండింతలు వుండాలి. దానిపై రథం పోవడానికి రహదారి వుండాలి. ఇటుక బదులు రాతి పలకలు ఉపయోగించవచ్చు, కాని ఎట్టి పరిస్థితులలో కలప వాడరాదు. ప్రాకారాలపై ఒకదానికి మరొకదానికి మధ్య దూరం ముప్పై దండాలు వుండే విధంగా గోపురాలు నిర్మించాలి. రెండేసి గోపురాలకు మధ్య ప్రదేశంలో ఒక గోపుర గృహం నిర్మించాలి, గోపురానికి, గోపుర గృహానికి మధ్య ముగ్గురు ధనుర్ధరులు పని చేయడానికి వీలుగా మూతవేసే మూడు కన్నాలతో వున్న పలకం కలిగిన ఒక ఇంద్ర కోశాన్ని నిర్మించాలి, మధ్య ఖాళీ ప్రదేశాలలో రెండు వైపుల రెండు హస్తాల వెడల్పు, నాలుగింతలు పొడవున్న దైవ పథం నిర్మించాలి.

వివిధ ఆయుధాల్ని కోటగోడలపై సిద్ధంగా వుంచాలి– ఇలా కోట నిర్మాణం గురించి కౌటిల్యుడు వివరించాడు.[28]

"అగడిత యూతనీరగునట్లు త్రవ్వించి
  క్రొత్తడంబుల తోడ గోట దీర్చి
యట్టళ్ళ గల్పించి యడ్వరి విరివిగా
  వలనొప్ప ఘటియించి వంకదార
గవనులు పరిపాటిగా వినిర్మింపించి
  లోన నూతలు బావులను నగాధ
తలములుగా జాల గలిగించి సనవర్గ
  ము లెల్ల సంపూర్ణములుగ నించి

చుట్టు నామడ చుట్టును సూది మోప
నెడము గల్గక యుండ బేరడవి పెంచి
నగ సమీపంబు గల పట్టనంబు రాజ
ధానిగా నుండు టురవగు ధరణిపతికి" (శృం. శా. 4-105)

కోట అగడ్తలలా వుండాలట.

కోట నిర్మాణం గురించి ఇంకా ఇలా పేర్కొనబడింది.

"గుడియ మంటపమును గొ్త్ర గావించి
కడునొప్ప జుట్టు నగడ్త ద్రవ్వించి
కోటయు గొమ్మల గొత్తడంబులుగ
వాటంబులును దిగు వంక దారులును
బెట్టించి వంపుడు గట్టి యిగడ్త
చుట్టును బోయించి యట్టళ్లు దీర్చి
హొలు పొంద డెంకణంబులు వెక్కువన్ని
నలి బడగలు దోరణంబులు గట్టి
కొత్తడంబుల గోటకొమ్ముల గొడుగు
లెత్తించి బలుమగ లెందఱో యనగ
వ్రాలిన కుసులును వసులు దూలములు
ఱాలు గుండ్లును నిస్సుసాల దెప్పించి
కోట కొమ్ముల దగు చోట బంచించి
కోట యీ క్రమమున బాటించియంత" (బ.పు. పుట-64)

ఇలాంటి కోటలు పటిష్ఠంగా, శత్రుదుర్భేద్యంగా వుండాలి. కోటలో అన్ని విధాల వస్తువులు సమృద్ధిగా నిలవ వుండాలి.

"బహు ధన ధాన్య సంగ్రహము బాణశరాసన యోధ వీరసం
గ్రహము నిరంతరాంతరుదకంబును జాలగ నింధనంబు సం
గ్రహమునకేక యంత్రములు గల్గియ సాధ్యములై ద్విషద్భయా
వహములనంగ నొప్పునె భవత్పురి రక్ష్యములైన దుర్గముల్."
(స.నీ.స. 1 56)

ఇలాంటి కోటల్ని కలిగివున్న రాజుని జయించడానికి ఎవ్వరికి సాధ్యపడదు. ఆ రాజే ఇతర రాజుల్ని జయిస్తాడు. కోటల చుట్టు పటిష్ఠమైన భద్రతా సిబ్బందిని నియమించాలి. రాత్రి, పగలు కోటకు కావలి పెట్టాలి.

దుర్గాలన్నిటిలో గిరి దుర్గం ఉత్తమమైంది. 'సర్వేణతు ప్రయత్నేన గిరి దుర్గం సమాశ్రయేత్' [29] అంటాడు మనువు. ఆంధ్రదేశంలో గిరి దుర్గ నిర్మాణమే ఎక్కువగా జరిగింది. [30]

మధ్య యుగంలో ముగ్గురు రాజులకు మోహం పుట్టించిన గిరిదుర్గం కొండవీడు. అని శ్రీనాథుడు పేర్కొన్నాడు.(శ్రీ.నా.బా. 113)

కొండవీటిపై మోహం పెంచుకొన్న ఆ ముగ్గురు రాజులు (1) అశ్వపతులైన బహుమనీ సుల్తానులు, (2) గజపతులైన కటక సూర్యవంశ రాజులు, 3) నరపతులుగా పేరుపొందిన విజయనగర రాజులు. అంతేకాదు

"ఘోటక భోట హాటకురు కొంకణ సింధు మరాట లాటక
ర్ణాట కళింగ వంగ ద్రవిళాంగ విదేహకరూశ దుర్గముల్
సాటియె యెన్న వేమ విపులా విభుడేలిన దుర్గమైనయా
ఘోటక హాటక ప్రకట కుంజర ధాటికి కొండవీటికిన్."(శ్రీ నా బా.)

అని కొండవీటి దుర్గం ప్రశంసించబడింది.

హనుమంతుడు రామునితో లంకా ప్రభావాన్ని తెలియచేస్తూ,

దట్టమై యట్టళ్ల దనరి చూపట్టు
విట్టిక కోటయు విరవైన జాతి
కోటయు బోరవున గొమరొందు నినుప
కోటయునట యుక్కు కోటయు గంచు
కోటయు మఱి వెండి కోటయు బసిడి
కోటయు నను నేడు కోట లొప్పారు
గాలుని పక్షంబు క్రరణి బొల్పెక్కి
మేలైన తలుపులు మెఱసి యెంతయును
అక్కోట లన్నిటి యందును జూడ
మిక్కిలి దీప్తుల మిక్కుటం బగుచు
నఖిల రత్నముల మేలైన వాకిళ్ల
నఖిలావనీ నాథ యరయ నాల్గేసి
వరమంత్ర విధుల దివ్యంబులై నట్టి
శరచాప చయముల సంఖ్యలై యుండు
వాకోట చుట్టును నఖిల లోకేశ
భీకరమకర సంభృతములై పరగు
నాలుగ గడ్తలు నాల్గు దిక్కులను
జాలంగ బాతాళ సమితి నొప్పారు"నని (రం రా.పుట-244-245)

కోటను సంపూర్ణంగా పేర్కొన్నాడు.

ఇలా కోటల్ని వర్ణించడం చాల కావ్యాలలో కనపడుతుంది. ఈ కోట వర్ణనల్ని చారిత్రక నేపథ్యంతో పరిశీలించాలి. గౌరన వర్ణించిన అసంపూర్ణ కోట వర్ణన పరిశీలిస్తే చారిత్రకంగా ప్రయోజనం చేకూరవచ్చు.

"ఆ కృష్ణవేణి మహానది చాటి
శ్రీ నేతేశ్వర విభు నుత్తరపు న
నాయతంబై మించు నశ్వమేదాద్రి
వాయువ్యమున నవద్వారక వాట
పరిఘ సమున్నత ప్రాకార యంత్ర .." (నవ చరి. పుట-239)

బహుశా పురాతత్వ పరిశోధనశాఖవారు వెలికి తీసిన విజయపురి గురించే గౌరన వర్ణించి ఉండవచ్చని ఆరుద్ర గారు అభిప్రాయపడినారు. [31]

"Recent excavations at Nagarjuna Konda, 32 in Andhra Pradesh exposed to view the vestiges of the city of Vijayapuri, the glorious capital of Ikshvakus in 3rd cent A.D. pertaining to it was exposed a fortification wall enclosing a trapezoidal area of 3000 x 2000 feet It distended along the right bank of the river Krishna on the west while on the South it ran over the Peddakundelugutta hill. Distinctly two building phases could be seen in this fortification. The early phase represented a rampart of morum or mud with basal width of 80 and rested on the natural soil. At another place, beneath this rampart could be seen a flooring and a few hearths The second phase represents a burnt brick wall of 9 to 14' thickness over the rampart. Save the portion overlying the Peddakundelugutta hill, the fortification wall was surrounded by a ditch 12, in depth and varying width of 74' to 132'. The fortification had two main gate ways on the east and west and a postern gate way on the northern side perhaps this postern gate way might have served as an emergency exit. Such postern gate ways were not uncommon for wall at Sisupalgarh had one such postern gateway—"33.

## 5 కోశం (TREASURY)

1. కోశం - అర్థం:— సమస్త కార్యాలకు కోశం మూలం కాబట్టి రాజులు మొదటగా కోశాన్ని గురించి జాగ్రత్తగా ఉండాలి' అని కౌటిల్యుడన్నాడు.[34] మనుష్యుల జీవితాలకు మూలం అర్థం. లేదా మనుషులతో కూడిన భూమియే అర్థం.

ఆలాంటి భూమిని సంపాదించే ఉపాయాలు, పాలించే ఉపాయాలు– వీటిని గురించిన శాస్త్రం అర్థశాస్త్రం అని కౌటిల్యుడు తన రాజనీతికి సంబంధించిన గ్రంథానికి 'అర్థశాస్త్రం' అని పేరు పెట్టడానికి గల కారణాన్ని వివరించాడు.

2. కోశం – ప్రాముఖ్యం:– కోశ సమృద్ధి ఉన్న రాజుకు ప్రజానురాగం కలుగుతుందని రఘువంశం తెలుపుతోంది.[35] కోశం, దండం, బలం అనే వాటిని ప్రభుశక్తిగా పేర్కొంటూ ముందుగా కోశాన్ని చెప్పింది మితాక్షరి అనే నిఘంటువు.

"కోశోదణ్డోబలం చైవ। ప్రభుశక్తిః ప్రకీర్తితా'[36] అని చెప్పటంచేత కోశం యొక్క ప్రాముఖ్యం తెలుస్తూంది.

"ఇలలో నెవ్వని కర్థము
గలదాతడు మాన్యుడు చితకార్యజ్ఞుడు ని
ర్మలుడు బలవంతుడార్యుడు
కుల తిలకుడు సభ్యుడధిక గుణగణ్యుండున్" (సిం ద్వా. 3-195)

ఇదీ ధనం విలువ.

విత్తవంతుని వేల్పుగా భావించి సేవించడం జరుగుతుంది.[37]

"ఎప్పుడు సంపద గలిగిన
నప్పుడు బంధువులు వత్తు రది యెట్లన్నన్
దెప్పలుగ జెఱువు నిండిన
గప్పలు పదివేలు చేరు గదరా సుమతీ!"

"చుట్టములు గాని వారలు
చుట్టములము నీకటంచు సొంపు దలిర్పన్
నెట్టుకొని యాశ్రయింతురు
గట్టిగ ద్రవ్యంబు గలుగ గదరా సుమతీ!"

అని ధనం విలువను పలు విధములుగా కొనియాడాడు సుమతి శతకకారుడు.

"ధనము లేమి యనెడి దావానలంబది
తన్ను చెరచు మీరిదాపు చెరచు
ధనము లేమి చూడ తలపనే పాపంబు"

అని దారిద్ర్యం ఎంత భయంకరంగా ఉంటుందో వేమన వివరించాడు. ఇంకా కొంచెము ముందుకు వెళ్లి—

"కలిగిన మనుజుండు కామండు సోముండు
మిగుల తేజమునను మెరయు చుండు
విత్తహీనుడెంత రిత్తయై పోవును—"

అని ధనం ప్రాముఖ్యాన్ని చెప్పడమేకాక "విత్తహీనుడెపుడు ఉత్త సన్యాసిరా" అని ధనహీనుని నిస్సహాయతకు జాలిపడ్డాడు కూడా.

"– – – – దరిద్రుడున్ మృతుడు నిక్కము తుల్యులుగారె ధారుణిన్" అంటాడు ఎర్రన. (హరి. ఉత్తర భాగం. 2-174)

"ధాత్రి దరిద్రుడు సభలన
పాత్రుడు, కడు ముప్పు మిత్ర బాంధవుల యెడం,
బుత్ర కళత్రంబుల యెడ

శత్రుండట వాని బ్రదుకు చౌకౌగాదే" (సిం.ద్వా. 3-194)

అంటాడు కొరవి గోపరాజు.

"అర్థమున బండితుండగు
నర్థమునం బలసమగ్రుడగు నర్థమునన్
బార్థివుడగు, బుణ్యుండగు.
నర్థమునను భువన పూజ్యుడగు నరుడెందున్" (పం,తం, 2-121)

అంటాడు బైచరాజు వేంకటనాథుడు.

"కమలనయన! నీవు కలబోటు సరసంబు
నీవు లేని చోటు నీరసంబు
కంబుకంఠి! నీవు కలవాడు కలవాడు
లేనివాడు నీవు లేనివాడు" (కాశీ 3-48)

ఉన్నవాడంటే డబ్బున్నవాడని మాత్రమే అర్థం. ధనం లేకపోవడం చావుతో సమానం. రాజ్యరక్షణకు ధనం అత్యంతావశ్యకం. దాన్ని సంపాదించడానికి రాజు నానా మార్గాలు అవలంబిస్తాడు. అందులో ప్రధానమైనది పన్నులు విధించడం.

"The collection of treasure is for the maintenance of the army and the subjects and for the performance of sacrifices. This leads to kings happiness in this life and hereafter, otheiwise to misery. 38

"The treasure is the root of the army and the army is the root of the treasure. It is by maintaining the army that the treasure and the kingdom prosper and the enemy is destroyed "39

3. కోశం - మూలం.– రాజు తన రాజ్యాన్ని ప్రజలను శత్రువులబారి నుంచి, కరువు కాటకాదుల నుంచి రక్షించుకోవడానికి తన భాండాగారంలో సంపదలను నిలువ వుంచాలి. ఈ ధన సేకరణ విభిన్న వనరుల ద్వారా సమకూరుతుంది.

"గోరక్షయు వాణిజ్యము
నారంభము నరియు సుంకమప్పనములు శ్రేం
గారవనంబులు గనులును
గారణములు ధనము గూర్చగా నృపతికిన్" (రుక్మా.చ. 3-36)

"వినుకర్షకులును వణిజులు
ననఘా! గోరక్షకులు ధరాధీశునకున్
ధనమొడ గూడెడు చోటుల
ననేక విధములకు నెల్ల నాధ్యక్షులముల్ (భార శాంతి. 2-3-1)

అని భారతం చెబుతోంది.

పనులు, సుంకాలు, శత్రువుల్ని గెలిచి పొందే ధనం రాజుకు చెందిన ద్రవ్యం అని తిరుక్కురళ్ చెబుతోంది.[40]

4. కోశ సేకరణ – రాజు తన భాండాగారం నింపడానికి పన్నులు, కప్పం, కట్నకానుకలతోబాటు దండయాత్రలు కూడా తోడ్పడ్డాయి. తగినంత ధనాన్ని మాత్రమే రాజు సేకరించాలి. మితిమీరిన సంపదల్ని సేకరించడానికి వేసే ప్రయత్నం అనర్థాలకు దారితీస్తుంది.

"అక్కఱ కలదని ప్రజాపతి
యెక్కువగా ధనము గొనుట యిలపై జెలువుల్
ప్రక్కలుగ ద్రవ్వి మూలను
గ్రక్కున బట్టుకొని తింట గణుతింపంగన్" (రుక్మా.చ. 3-27)

TIRUPATI
42779
VENKATESWA



<u>పన్నుల ఆవిర్భావం:-</u> పన్నుల ఆవిర్భావాన్నిలా వూహించవచ్చును. దోపిడి దారులు, దొంగలు, దౌర్జన్యపరుల నుంచి ప్రజలు తమ మాన ప్రాణాలతోపాటు సంపదల్ని రక్షించుకోవడానికి సామూహికంగా ఒక నాయకుణ్ణి ఎన్నుకోవడం జరిగింది. తమను రక్షించినందుకు ప్రతిఫలంగా అతనికి కొంత సొమ్మును, ధాన్యాన్ని ముట్టచెప్పారు. ఈ ప్రతిఫలాన్నే తరువాత వచ్చిన నాయకులు శాసనంగా మార్చి 'పన్ను' అని వసూలు చేశారు. ప్రేమనాధ్ బెనర్జి ఈ విషయాన్ని ఇలా పేర్కొన్నాడు,

"In the earliest period of Indian history the state perhaps depended for its own support on the voluntary contributions of the people But sum Method of compulsory contribution must have been found necessary in India as soon as a More improved form of government had come into existence. The early tax-system, however, was a very simple one, and the evolution of a complex system of public finance was doubtless a slow and gradual process.' [41]

ఈ పన్నులు విభిన్న రూపాలలో వసూలు చేశారు. వృత్తి సుంకాలు, వాణిజ్య సుంకాలు, సాధారణ సుంకాలు అని మూడు విభాగాలుగా పన్నులు వసూలు చేయబడ్డాయి.

విజయనగరం రాజుల కాలంనాటి పన్నుల స్వరూపం ఇలా వుండేది.

"నీరాకంబము (పల్లపు వ్యవసాయము) అని విభజించి పన్నులు వేసేవారు. పంటలో పదింట తొమ్మిది వంతుల వరకు పన్ను వుండేదని న్యూనిజ్ వ్రాసిన వ్రాత నమ్మదగినదికాదు మగ్గోరు, సంగోరు అనే మాటల వల్ల పంటలో మూడో భాగం, లేక సగం పన్నుగా వసూలు చేసేవారని తెలుస్తోంది. భాండార గ్రామాల ఆదాయం, మహానవమి ఉత్సవ సందర్భంగా ప్రతి ఏటా సామంతులు దణ్ణాయకులు, అ మ ర నా య కు లు చె ల్లిం చే కప్పాలు కట్నాలు కానుకలు రాజాదాయాన్ని పెంచేవి. జాతి సిద్ధాయాలనే వృత్తి పన్నులుండేవి. రాజ్యంలో 300 రేవులుండేవని అబ్దుల్ రజాక్ వ్రాసినాడు. ఈ రేవులలో ఎగుమతి, దిగుమతుల రేవు సుంకాలు రాజాదాయానికి మరొక మార్గము. విజయ నగర శాసనాలలో కావిక, కట్నం, సియం, గ్రామకర్ధాట్నం వెట్టు, వేమి, ఇల్లరి,

పుల్లరి, చెరువు మేర, బేడిగ, దుర్గనివర్తనం, దణ్ణాయ, అడుగుకోలు, సుర సుంక మొదలైన అనేక రకాల సాధారణ పన్నులు, మగ్గస్థావర, ఈడిగ-సిద్ధాయ, సింజణి-సిద్ధాయ మొదలైన వృత్తి పన్నులు ఉండేవి. స్థలసుంకము, చర సుంకము పేడా సుంకాలుండేవి. మొదటిసారిగా వీరనరసింహరాయలు సామ్రాజ్యంలోని కొన్ని సీమలలో పెండ్లి సుంకాలను రద్దుచేసినాడు. కృష్ణదేవరాయలు ఈ పెండ్లి సుంకాలను సామ్రాజ్యంలో పూర్తిగా రద్దుచేసినాడు. ఎడనెడ తిరుగుళ్లకు, జాత రకు, మహారాజ ప్రయోజనార్థం 'కానువీసాలు' వసూలు చేసేవారు. పన్ను ధన రూపంలోగాని, ధాన్య రూపంలోగాని చెల్లించవచ్చు పెద్ద గ్రామాలలో 'రాచగాదె లుండేవి." 42

"ఉమ్మడియును, రాణె, యుత్తరువమ్మర
మిమ్మెయిడింప మా కియ్యేటి వఱకు
చెల్లిన దసమెంత.... . .... " (పరమ. పుట. 458)

అనడం వల్ల ఉమ్మడి, రాణె, అమరం అనే పన్నులు విధించబడేవని తెలుస్తోంది.

ఈ పన్నులు భూములపై విధించబడేవి ఉమ్మడి అంటే సేవ (ఈనాం), రాణె అంటే భటుల సిబ్బందికి ఇచ్చింది. అమరం అంటే అగత్యమైనపుడు కొంత దండును తీసికొని రావలసిందనే నిబంధన మీద చిన్న రాజులకు విడువ బడ్డ సీమ అని బోధ్యం.

బంటుబడి (బంటుపై విధించే పన్ను) 43 బంట్లెల అయం (బిందెలపై వచ్చే ఆదాయం) 44 కూడా కోశాన్ని పెంచడానికి తోడ్పడేవి.

చివరికి ఈ పన్నులు లాగడం చాల హీనంగా తయారయింది. చావుకీ, పుట్టుకకీ అన్నిటికీ పన్నే. ఇంకా విపరీతంగా జుట్టు పన్ను, పురిటి పన్ను, పొయ్యి పన్ను ఇలాంటివి కూడా మొదలైనాయి.

"పరనృప తస్కర బాధలు లేకుండ
దమ్ము గాచుటకునై ధరణిపతికి
ద్వాదశాంశ ధనంబు వాణిజ్యపరులు, గో
పాల కర్షకులు షడ్భాగ గవ్య
ధాన్యంబు లిత్తురు.... ... .... ...." (మా.పు. 2-213)

ప్రజలు రాజుకు చెల్లించే ధన ధాన్యాదుల గురించి పేర్కొనబడింది.

కొందరు కొందరు రాజుల కాలంలో కొన్ని కొన్ని రకాల పన్నుల వసూలు ప్రారంభమయింది.

"కాకతీయ రాజులు దశబంధ ఈనాములంటూ ఒక కొత్త పద్ధతిని ప్రవేశ పెట్టేరు. చెరువును నిర్మించడం, సరైన స్థితిలో వుంచడం, బాగుచేయించడం వగైరా బాధ్యతలను నిర్వహిస్తూ, దానికింద సాగయ్యే భూమి మీది పంటలో పదోవంతు రాజుకు ధన రూపంలోనో, ధాన్య రూపంలో చెల్లించే షరతు మీద ఇచ్చే ఈనామును 'దశబంధ ఈనాము' అంటారు " [45]

ఆరవ విక్రమాదిత్యుని సామంతుడైన బేతరాజు చెరువు నీరు ఇచ్చినందుకు నీటి పన్నును నిర్ధారణ చేసినట్లు పశ్చిమ చాళుక్యుల కాజీపేట శాసనం బట్టి తెలుస్తుంది. దీని ప్రకారం "ఒక . ... . . కు ఒక కండుగ (ధాన్యం కొలత) ఇవ్వాలి. నీరుతోడే యంత్రానికి పది కలుగలు ఇవ్వాలి.

వ్యవసాయదారులపైనే పన్నుల ప్రభావం ఎక్కువగా వుండేది. కేవలం కాపులపైనే పన్ను వేయడం తగదనీ, అన్ని వర్గాల వారిపైనా పన్నులు విధించాలనీ చెబుతూ, కోశ సేకరణకు మార్గాల్ని సూచించింది బద్దెనీతి.

"గనులు కృషి ప్రపంచ మరి కప్పము సుంకము గోకులంబు నం
దన వనమున్ జలస్థల పథిస్థ వణిక్క్రియ దుర్గ రక్షణం
బన గలయిన్ని మార్గముల నర్థము రోయక కేవలంబకా
పునె పాలియించు రాజు సిరి పొందునె? రాజమనోజ భూభుజా"

(బద్ది - రాజ 9)

ప్రజ నుంచి గ్రహించిన పన్నురూపమైన ధనాన్ని ప్రజా సంక్షేమం కోసమే వెచ్చించాలి.

"తన యేలు పసుమతి జనుల బీడింపక
  యేరికి మొదలిచ్చి కోటుపాలు
సవరగా గొంచు దండవులు దర్శనములు
  కోలాస గొన కూళ్ల గుత్త కీక
కమ్మతంబులు వెట్టిగనులు ద్రవ్వించి బే
  హారమాడించి యన్యాయ ధనము
జొరనీక షష్ఠాంశ మటి గొంచు నీతి బా
  ధలు ఘటింపక యుండ ధనము గూర్చి

బహు క్రూరంగా వసూలు చేశాడు. ఒకసారి సవరం ఎల్లయ్య అనే రాజ సేవకుని భార్య ప్రసవించినపుడు, పన్నుకోసం రాజోద్యోగులు వారిని బాధించారు. ఎల్లయ్యకు ఆవేశం వచ్చింది. ఆ విసురున కోటలోకెళ్లి ముత్యాలమ్మ గుడి సమీపంలో రాజును పొడిచి చంపేసేడు" అని మేకంజీ కైఫీయతు తెలుపుతుంది."[49]

"పసుల పుల్లరి తలపన్ను సుంకంబు
తలవరి పన్నును దండాయములును
దిక్కు గల్గిన మీకు తెండుపొండనుచు
పంపించి పూటగా బత్తెముల్ కొల్చు
మనవి చెప్పిన వినక మన్నన లేక
అన్యాయముల గూర్చి యందుండ బేర్చి
మన్ను మోయింపుచూ మదమణంచుచును
మాటికి త్రోసి యవమానము చేసి
వెట్టి చేయించును వెడలి పోనీక."

(ప.వీ.చ. పుట -109)

మాచెర్ల నుంచి బయలుదేరే సమయంలో బ్రహ్మనాయుడుకి వచ్చిన శకున ఫలితాన్ని చెబుతూ గోపన్న ఆనాటి పన్నుల గురించి పన్ను కట్టలేకపోతే విధించే శిక్షలు గురించి పేర్కొన్నాడు.

మాలకరి పుష్పములు గోయు మాడ్కి, రాజు పన్నులు సేకరించాలి.

"జనపతి తన పని పాటల
జనములఖర దండనముల సమయింపక మె
ల్పున ధనము గొంట తుమ్మెద
వనజమరందంబు గ్రోలు వడువు దలిర్పన్."

(రుక్మా.చ. 3-39)

జనపతి తన ఆదాయాన్ని పెంచడానికై, ప్రజలను క్రూర దండనాలపాలు చేయరాదు. పద్మం నలగకుండా దాని నుంచి తేనెను గ్రహించే తుమ్మెదలాగ ఉపాయంతో రాజు ప్రజల నుంచి ధనాన్ని సంగ్రహించాలి.

"పొదుగొత్తి పితికి క్రేపుల
మొదలార్చుట ప్రజల నదికముగ నరిగొనుటల్
కదుపుల బెనుచుట తగనరి
యదనం గొని ప్రజల బ్రోచుటవనీ పతికిన్" (రుక్మాం ప. 3-30)

ప్రజల నుంచి అధికంగా పన్నులు వసూలు వేయడం పొదుగు ఒత్తి, పితికి దూడలను నశింప చేయడం వంటిది. అవసరమైనపుడు ప్రజల నుంచి తగుమాత్రం సుంకం తీసుకోవడం దూడల్ని పెంచి పెద్దచేసినట్లు శ్రేయస్కరంగా ఉంటుంది.

ఇలాంటి ఆలోచనే అంతకుముందు కూడా ఉంది.

"కోరి తోటవాడు కుసుమ ఫలంబులు
గోయునట్లు రాజు గొనగ వలయు
నప్పనములు నఱికి యంగారములు సేయు
భంగియైన భూమి పాడుగాదె" (భార. శాం. 2-300)

"అరయుట బ్రజ వర్ధింపగ
నరి యేట గ్రామ ప్రవృద్ధ మౌనట్టులుగా
నరపతికి గొనగ వచ్చు
న్వైరవుల బెంపంగ జాల నెఱయు ధనంబుల్"
(భార. శాం. 2-394)

ఇది పన్నుల ద్వారా కోశ సేకరణ చేసే విధానం. పన్నులు వసూలు వేయడంలో రాజులు ఖచ్చితమైన వైఖరివి అవలంబించినా, మెత్తదనాన్ని చూపాలి. పన్నులు విధించడంలోనూ, వసూలు వేయడంలోనూ కొన్ని నియమాలు పాటించడం అవసరం.

## కట్న కానుకలు

"కట్నం అంటే రాజుకు గౌరవార్థం చెల్లించే ద్రవ్యం. కానుక అంటే, దేవునికి భక్తితో సమర్పించే ఫలం లేక ద్రవ్యం. ప్రభువులకుగాని పై అధికారులకు గాని తాబేదారు ఇచ్చే బహుమానాన్ని కూడా కానుక అంటారు."[50] దేవాలయాలపై వచ్చే ఆదాయం కూడా రాజ భండారం చేరవలసిందే. ఈ ఆలయాలకు ఆలయపుటధికార్లు ఉంటారు. (వైజ వి. 4-63) (దేవాలయంలో దొంగతనం చేయబడ్డ బంగారు పళ్లెం గురించి ఆలయ అధికారికి తెలియచేసిన సందర్భం)

కప్పం :- దండెత్తి వచ్చిన రాజుతో ఓటమిని అంగీకరించిన సంధి చేసుకొని, తన రాజ్యాన్ని కాపాడు కోవడం కోసం అతనికి ఏటా చెల్లించే ధనం కప్పం, శత్రువును ఓడించాలి, లేదా కప్పం కట్టాలి. అలా కాకపోతే రాజ్యం నాశనమవుతుంది.

"అరితన పై వచ్చిన దగు
నరి గానీ సమర ముఖము నెదుర గానీ
మరలింపక తామరలిన
నరపతి రాష్ట్రంబు దక్షిణంబున బొలియున్"

(రుక్మా.ప. 3-5')

అంతేకాదు,

"తనదు శాత్రువుండు తనకంటె ఘనుడైన
నఖిలమైన ధనము నతని కిచ్చి
తన్ను గావకొనగ దగు నీతిపరుడు దా
గలిగెనేని ధనము గలదు గాన." (స.నీ.స. 2-597)

ఇది బలహీనుడైన రాజు లేదా పరిస్థితులు అనుకూలించని రాజు అనుసరించే నీతి.

అప్పుడు చేరవచ్చి సమయంబిది దర్శన యోగ్యమంచున
వ్వొప్పెడు కాంతలుం దురగ యూథము రత్న చయంబు మున్నుగా
గప్పములెల్ల దెచ్చి మదిగప్పెడు భీతి దొలంగ వమ్రులై
యొప్పన చేసి రాన్నృపతులజ్జయి నీ పతికిం గ్రమంబునన్"

(సింద్వా. 7-22)

ఉజ్జయినీ రాజుకు కొందరు రాజులు 'కప్పం' చెల్లించినట్లు చెప్పబడింది.

హంసడిబకులు రాజసూయ యాగం చేయాలనుకొని కృష్ణుని దగ్గరకు జనార్దనుని రాయబారిగా పంపుతూ,

"చని యా జనార్దనునిచే
ఘనమగు లవణంబు మనకు గప్పమడుగు మే
ధనములును సరకుగా విట
జనుదెమ్మను మతని యజ్ఞ సమయంబునకున్" (ఉ.హరి. 4-134)

అని ఉప్పును కప్పంగా అడగడం జరిగింది

రాయల వారికి గజపతి ధన కనక వస్తు వాహనములు బహుమానంగా తెచ్చినట్లు తెలుస్తోంది. (కృ.వి. 4-౭)

దండయాత్రలు:- (యుద్ధ సంపద)

రాజులు యుద్ధాలలో శత్రువుల్ని ఓడించి వారి సర్వసంపదల్ని స్వాధీన పరచుకునేవారు.

నరకాసురుడు ఇంద్రునిపై దండెత్తి ఐరావతాన్ని జయించి, ఊర్వశిని పిలిపించి ఆమెను తన సొంతం చేసుకోవడానికి ప్రయత్నించాడు.

"అవె సుత్రాము రథంబు, లల్లవె కుబేరానేక పశ్రేణు, ల
ల్లవె వార్ధీందుని తురంగమంబు, లవె ప్రేతాధీశ వీరావళుల్
దవులం బాఱిన బట్టి తెచ్చి రనిలో దైతేయులే సొమ్ములిం
దువిదా నీకు బ్రియంబు? గైకొనుము నీయుల్లంబు దెల్లంబుగన్"
(ఉ.హరి. 1-63)

అంతేకాదు అమరావతీపురంలోని అందమైన కన్యలను పట్టి తెప్పించి, సుందరోద్యాన వనాలను నాశనంచేసి, ఎనిమిది వేల ఏనుగులను తీసుకొని రాజధాని మాహిష్మతీపురానికి నరకాసురుడు తన సైన్యంతో కలిసి వెళ్లాడు.

(ఉ.హరి. 1-81)

"అక్కలహంబు చూచి చనియా నృపశేఖరు డాజి భూమిలో
జక్కిన యశ్వరత్నములు సింధుర బృందములు న్యధంబులుం
దక్క ధనంబు లస్త్రములు భేరులు జోళ్లను గోటలోనికిం
గ్రక్కున గొంపు నేగి యధికంబగు సంపద నేలె నప్పురిన్."
(సిం.ద్వా. 6-97)

ఇలా యుద్ధభూమిలోని సంపదలు పేర్కొనబడ్డాయి. యుద్ధాల్ని చేసి యుద్ధ సంపదల్ని సేకరించడం ప్రమాదంతో కూడుకుని ఉంటుంది. శత్రువు బలవంతుడైతే ఉన్న సంపద కూడా పోతుంది.

కోశాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు:-

కోశాన్ని లేదా కోశ సంగ్రహణకు మూలమైన వనరుల్ని రాజు అభివృద్ధి పరచాలి. వ్యవసాయాభివృద్ధికి చెరువులు తవ్వించడం, గనుల నుంచి బంగారు వగైరాలను వెలికి తీయించాలి. రాజ్యాన్ని విస్తరించడం కూడా కోశాభివృద్ధికి కారణమవుతుంది.

"దేశ వైశాల్య మర్థ సిద్ధికిని మూల
మిల యొకింతైన గుంటకాల్వలు రచించి
నయము చేదకు వరి గోరునను నొసంగి
ప్రబల జేసిన నర్థ ధర్మములు పెరగు" (ఆము. 4-236)

రాజు రాజ్య విస్తరణతో పాటు, దాని రక్షణ కూడా చేయాలి.

"ధరణి యభివృద్ధి నొందిన
ధరణీ నాయకుడు సకల ధనయుక్తుడగున్
ధరణీ రక్షయై నిరతము
ధరణీ పతిసేయ వలయు దత్పరమతియై" (రుక్మాం.చ, 3-29)

ఇలా ఎన్నో విభిన్న మార్గాల ద్వారా కోశాన్ని సేకరించి కోశాగారాన్ని నింపాలి.

కోశం-నిర్వహణ:- సేకరించిన సిరి సంపదలను నిల్వచేయడానికి కోశాగారం కట్టించాలి. నేలమట్టంలో పలు ఏర్పాట్లున్న మూడంతస్తుల గృహాన్ని కట్టించి, ఒకే ద్వారాన్ని మాత్రమే ఏర్పరచి, యంత్ర సహితమైన ఒక సోపానాన్ని నిర్మించాలి. దానిపైనే కోశాగారాన్ని నిర్మించాలి. దాని గోడలు రెండింటికి ద్వారాలు

ఉండరాదు. దానికి ముందు భాగాన ఇటుకలతో కట్టబడిన ప్రవేశ మందిరం ఉండాలి. దీని చుట్టు వస్తు సామగ్రిని దాచడానికి అనువైన కాలువలుండాలి, అని కోశ గృహనిర్మాణాన్ని గురించి కౌటిల్యుడు తెలిపాడు.[51]

కోశాధ్యక్షుడు:- ఇతన్నే భండాగారాధికారి లేదా అయతికాడు అని అంటారు. కోశ సంగ్రహణాధికి సంబంధించిన మెలకువలన్నీ ఇతనికి తెలిసి ఉండాలి. విశ్వాసపాత్రుడినే కోశాధ్యక్షుడుగా నియమించాలి.

> "-బండారముల యందు బరమ విశ్వాసుల భక్తుల దక్షుల
> బంచితయ్యా!" (భార.సభా 1-47)

అని అడగడం వల్ల భక్తి విశ్వాసాలతోబాటు దక్షతగల వ్యక్తి దీనికి తగినవాడని స్పష్టమవుతుంది

"నాలుకపై ఉండే తేనెనుగాని విషాన్నిగాని రుచిచూడకుండా ఉండడం ఎలా సాధ్యంకాదో, అలాగే రాజ ద్రవ్యంతో సంబంధం కలవానికి దానిలో అల్ప భాగమైనా రుచి చూడకుండా ఉండడం సాధ్యం కాదు."

నీటిలో తిరిగే చేపలు నీటిని ఎప్పుడు త్రాగాయో తెలుసుకోవడం సాధ్యం కాదు. అలాగే కార్యనిర్వహణకై నియమింపబడిన అధికారులు ఎప్పుడు రాజ ద్రవ్యాన్ని అపహరిస్తారో తెలుసుకోవడం సాధ్యంకాదని''[52] నిష్కర్షగా, నిర్మోహమాటంగా చెప్పాడు కౌటిల్యుడు.

> "మండలమున వాలుక చవు
> లొండొక భోగంబు లెఱుగ కొని జిహ్మరులై
> యుండెడి కుల భృత్యుల బతి
> భండాగారంబు గాపు పంపగ వలయున్" (స.పీ.స. 1-138)

కోశాగారానికి కావలి పంపబడే వాడు విప్పులాంటి వాడయి వుండాలి. అంతేకాక

> "శిక్షింప రాక మిక్కలి
> పక్షంబున మెలుపు వారి బహు ధనధాన్య

ధ్యక్షుల జేయంగా దగ
దక్షిణ కృపా సమృద్ధి నవనీపతికిన్," (రుక్మాం.చ. 3-37)

రత్నాలు, బంగారు. ధాన్యం, ఏనుగులు, గుర్రాలు మొదలైన వాటిని పరీక్షించడానికి విడిగా ఆయా రంగాలలో ప్రసిద్ధులైన వ్యక్తులను నియమించాలి. వీళ్లకు ఇతరుల నుంచి ప్రమాదం పొంచి ఉంటుంది. కాబట్టి రాజు వీళ్లకి ప్రత్యేకమైన రక్షణ ఏర్పాట్లు చేయాలి. కారాగారాధ్యక్షుడు తత్సంబంధమైన విషయాలన్నిటిని క్షుణ్ణంగా తెలుసుకొని ఉండాలి.

కోశం - విభజన:-

రాజు తన ఆదాయాన్ని నాలుగు సమ భాగాలుగా చేయాలి. తన స్వంతానికి ఒక భాగాన్ని చతురంగ బలాల భరణార్థం రెండు భాగాల్ని సకల ధనసమృద్ధంగా భండాగారాన్ని నింపడానికి ఒక భాగాన్ని వినియోగించాలి. దీన్ని ధృవపరుస్తున్నదీ కింది పద్యం.

"ఉరవౌబాగంబు భోగంబు భయము నొక పాలు గసేనాప నార్థం
బీరువాల్నిండారు బండారెలు చొర నొక పాలిట్లుగా నాయమొప్పం
జరదృష్టిన్ వైరిపక్షే క్షణము సచివ ముఖ్య స్వపక్షే క్షణంబున్
దరణీ నాథుండొనర్పందగు దగు దనుమందస్కరాళిన్ని జోర్విన్"
(అము. 4-238)

"డెబ్బైయేడు మంది నాయకులకు తన రాజ్యంలో ఒక భాగాన్ని మూల బలానికి ఒక భాగాన్ని, విప్రులకు ఒక భాగాన్ని పంచిపెట్టి మిగిలింది తన భండాగారానికి చెందునట్లు"[53] ప్రతాపరుద్ర చక్రవర్తి కోశ విభజన చేశాడు.

ఆయా వ్యయాలు -

రాజు సంపదల్ని విచ్చలవిడిగా ఖర్చుచేయరాదు. అయితే ప్రజాసౌకర్యాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చుచేయటానికి వెనుకాడరాదు.

"కాని వ్యయ మెన్నడును నొక
కానియు జేయంగ దగదు, కార్యముగలచో
మానెక ధనము తృణంబుగ
మానవ పతి సేయనగు సమగ్ర విభూతిన్" (రుక్మాం.చ. 3-45)

అని అంటాడు ప్రౌఢ కవి మల్లన.

తనకు న్యాయమైన దనములో నాలవ
భాగమొండె మూడు పాళ్ల పాల
నొందె నర్థమైన నుచితంబు గాన మి
క్కిలి వ్యయంబు సేయ వలవదధిప. (న.నీ.స. 1-131)

రాజు ఎక్కువ వ్యయం చేయరాదన్నది నిర్ధారణ.

"ఆ యంబు వ్యయము నొడివిన
శ్రీయగు, సమమైన దళము చెడకుండు, వ్యయం
బాయమును నొడిచె నేనియు
బాయదు పేదఱిమి సార్వభౌముని కైనన్" (బద్ధి. రాజ -44)

అయవ్యయా లెక్కువైతే వరసగా సుఖదుఃఖా లెక్కువవుతాయి.

"గోష్ఠాగార సురక్షా
నిష్ఠితుడై చూడవలయు నృపతి కది మహా
శ్రేష్ఠంబగు నాయము నగ
రిష్ఠంబగు వ్యయము నాచరింపగ వలయున్" (న.నీ.స. 1-132)

అని అంటాడు మడికి సింగన.

రాజు తన ఉద్యోగులను అడిగి అయవ్యయానికి సంబంధించిన లెక్కలు ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా తెలుసుకుంటూ, ఖర్చుపోగా నిలువ వ్రాయించుకుంటూ వుండాలి,

" . ధనమెంత గల్గిన రాజులక్క జూడక
యాయవ్యయంబుల నడుగ వలయు

వాని విస్తరమెల్ల వరుసగా గూర్చి
నెలయు దెలుపు లెక్క నెఱుగు కొనుచు
వ్యయము పుచ్చి నిలువ వ్రాయించి కైకొంట
ప్రభువుల కిదియ నీతి విభవ మింద్ర" (సిం.ద్వా. 11-98)

అయా వ్యయాలపై రాజు ఎంత జాగ్రత్త వహించాలో వివరించబడింది, ఆయా వ్యయాలను సరైన పద్ధతిలో నిర్వహించడం రాజనీతిలో ఒక ముఖ్యమైన భాగం.

"భూరమణుడు పేదైనను
దారుణి నెచ్చోట దగదు ద్రవ్యము వెదకన్
వారాశి వట్టి పోయిన
నీ రొండక దెవపఘటింప నేరగనగునే" (న.నీ.స. 1-140)

కాబట్టి రాజు అయవ్యయాల పట్ల అప్రమత్తంగా వుండాలి.

**కొన్ని కోశాగారాలు-వివరాలు -**

విజయనగర రాజ్య కోశాగారాన్ని గురించి రాయవాచకం, కృష్ణరాయ విజయం మొదలైన కావ్యాలు వివరించాయి.

విద్యారణ్యస్వామి విద్యానగరాన్ని నిర్మించేటప్పుడు తొంభై ఆరు కోట్ల రూకలు, 'గురుమణివిభూషణాలు' నాలుగు కోట్ల వరకు కోశాగారంలో ఉంచాడు. (కృ వి, 2-69)

"వినుడీ వరకున్ సింహా
సన మేలిన నృపులు బొక్కసము గూర్చిన సొ
మ్మైన యగ దొమ్మిది కోట్లకు
నసువై యున్నది ధరాతలాధిపతిలకా!" (కృ.వి. 2-70)

రాయల కాలం నాటికి కోశాగారంలోవున్న సంపద విలువల నిల్వలు పేర్కొన బడ్డాయి.

విద్యారణ్యస్వామి విద్యానగరాన్ని నిర్మించినప్పుడు రాజ భండాగారంలో నిక్షేపించిన సంపద వివరాలు.

ద్రవ్యం :- తొంభై తొమ్మిది కోట్ల యాభై ఆరు లక్షలు.

భూషణాలు :- నాలుగు కోట్లు

నవరత్నాలు :- ఆరు కోట్లు

మొత్తం నూట తొమ్మిది కోట్ల యాభై ఆరు లక్షలు ఉన్నట్లు రాయవాచకం వివరించింది.

"అవి గాక యీ వరకున్ను సింహాసనస్థులు సింహాసనమున్ను నడుపుకొని శెలవు శిద్ధాయాలు పోగా బొక్కసాన వుంచినది పందొమ్మిది యాభైయారు లక్షల ద్రవ్యం. (రా.వా.పుట -24) రాయల కాలానికి ఉన్నట్లు తెలుస్తోంది.

పదాతి దళాల ఖర్చులు, ఇతర ఖర్చులు, ఆదాయ వ్యయాల గురించికూడా తెలియచేయబడింది. (రా.వా. పుట 24-25)

వర రుచి భట్టారకుడు (శకాంతకునికి) విక్రమార్కునితో చెప్పే సందర్భములో విక్రమార్కుని భండాగారం వర్ణించబడింది. (విక్ర. చరి. 5-120)

## 6. సైన్యం

రాజ్య రక్షణకు రాజు మనుగడకు సైన్యం తప్పనిసరి. అర్థ బలం, అంగ బలం ఉన్నవాడే దొరగా చెలామణి అవుతాడు సైన్య పోషణకు సంపద రక్షణకు సంపద రక్షణకు సైన్యం అవసరం.

రాజు తన సైన్యంలో చతుర్విధాలైన బలగాలను చేర్చుకోవాలి. ఇవి రథ, గజ, తురగ పదాతిదళాలు. వీటినే చతురంగ బలం అని అంటారు. ఈ బలగాలు లేకుండా ఏ రాజు సజావుగా పరిపాలన సాగించలేడు. ఈ చతురంగ బలగాల్ని క్రమశిక్షణలో వుంచడానికి సేనాధ్యక్షుడు కావాలి. సైన్యం పరిమాణం ఎంత వుండాలి అనేది రాజు యొక్క శక్తి సామర్థ్యాలు, రాజ్యం యొక్క కోశ సంపదలపై ఆధారపడి వుంటుంది. "తన కోశంలో రెండు భాగాలు చతురంగ బలాలకు కేటాయించాలట!" (ఆము. 4-238) ప్రాచీన రాజులు అపారమైన సైన్యాన్ని పోషించారు. పాలనా సౌలభ్యానికి సైన్యాన్నికొన్ని విభాగాలుగా చేశారు.

> "గ్రమ్మన నెత్తురు టేఱులు
> గ్రమ్మనఖండ ప్రచండ కాలానల కీ
> లమ్ముల దెగడు మెఱుగువా
> లమ్ముల నక్షౌహిణీత్రయము మడియించెన్" (జై.భార. 7-161)

అని 'అక్షౌహిణి' అనే పద ప్రయోగం ఉంది. ఈ అక్షౌహిణిలో వివిధ విభాగాలు ఉన్నాయి. ఈ విభాగాల పేర్లను, సంఖ్యా పరిమాణాన్ని గురించి ఆంధ్ర మహాభారతం పేర్కొంది. (ఆది. 1-80)
దాని స్వరూపం ఇలావుంది.

| క్రమ సంఖ్య | సేనల పేర్లు | రథాలు | గజాలు | అశ్వాలు | కాల్బలం |
|---|---|---|---|---|---|
| 1 | పత్తి | 1 | 1 | 3 | 5 |
| 2 | సేనాముఖం (3 పత్తులు) | 3 | 3 | 9 | 15 |
| 3 | గుల్మము (3 సేనాముఖాలు) | 9 | 9 | 27 | 45 |
| 4 | గణం (3 గుల్మాలు) | 27 | 27 | 81 | 135 |
| 5 | వాహిణి (3 గణాలు) | 81 | 81 | 243 | 405 |
| 6 | పృతన (3 వాహినులు) | 243 | 243 | 729 | 1215 |
| 7 | చమువు (3 పృతనలు) | 729 | 729 | 2187 | 3645 |
| 8 | అనీకిని (3 చమువులు) | 2187 | 2187 | 6561 | 10935 |
| 9 | అక్షౌహిణి (10 అనీకినులు) | 21870 | 21870 | 65610 | 109350 |

రథ వర్ణన :-

మధ్యయుగాలలో యుద్ధంలో రథ బలాన్ని ఉపయోగించక పోయినప్పటికీ అనాటి కావ్యాలలో రథ బలానికి సంబంధించిన వర్ణణలున్నాయి. దీనికి కారణం ప్రాచీన సంస్కృత కావ్యాలను తెలుగులోకి అనువదించడం, పురాణాల నుంచి కొన్ని భాగాలను లేక మూల కథలను గ్రహించి తెలుగులో కావ్యాలుగా, ప్రబంధలుగా రచించడమే. ఈనాడు కూడా 'తేర్లు' (రథాలు) అనేవి దైవ సంబంధమైనవిగా ఉన్నాయి. అయితే ఇవి యుద్ధాలలో ఉపయోగించే రథాలుకావు. యుద్ధ రథాలు ఇలా వుండేవి

"చక్రముల్ జతగూడ బంగరు బాయ నింగి జెలంగగా
బ్రక్రమార్పిత పద్మతన్ శరవర్షణాస్పద వృత్తులై
వక్రగామిత లేమి జైత్ర నవప్రతాప విజృంభణో
పక్రమ స్థితి మీఱు దేరులు భానుమండల వైఖరిన్"

[తా.శ ?-?]

రథాలను మాణిక్యం, బంగారు, ఇనుము, చెక్క, చర్మం మొదలైన వాటితో తయారు చేసేవారని తెలుస్తుంది.

మాణిక్య, బంగారు రథాల్ని గురించి జైమిని భారతం[8-130,5-1 ?] ఇనుప, భల్లూక చర్మాలతో కప్పబడిన రథాల్ని గురించి హరివంశం [పూ భా 4-87, ఉ భా. 7-236] శృంగార నైషధం [7-140], కొయ్యతో చేసిన రథాన్ని గురించి ముకుంద విలాసం [1-121] పేర్కొన్నాయి

"ఏకచక్ర రథం, అష్టచక్ర రథం, షోడశ చక్ర రథం, ఎనిమిది గుర్రాల రథం, పదహారు గుర్రాల రథం, వేయి గుర్రాల రథం, పదునెనిమిది ఏనుగుల రథం వేయి గాడిదల రథం."[54] మొదలైన రథాలు చక్రాలు ఆధారంగాను, లాగే జంతువుల ఆధారంగాను పేర్కొనబడ్డాయి

"పంకరుహంబులు బండికండులు, చంప
కంబులు నొగ, లుత్పలంబు లిరుసు,
గరవీరములు పలుగాడి, జాదులు సను
గొయ్య లశోకముల్ గోడి పీట,
సిందు వారంబులు సీలలు, గేతకుల్
మెట్టులు, మొల్లలు మెట్టుగుదెలు,
పోగడలు పలువులు, పున్నాగములు పగ్గ
ములు, సహకారముల్ పూనుగాడి,

కురవకానీక మూలంపు గోల, క్త్రైర
వములు మునుకోల, కోకముల్ వాహనములు
గావసంతుండు సూతుడై పూవుదేర
నెరయ గుసుమాయు దంబులు——" (కుమా. 4-83)

ఇందులో రథసంబంధమైన సర్వాంగాలు పేర్కొనబడ్డాయి. సాంగ్రామికరథ, చైత్రరథ, పాండుకంబళి, వైయాఘ్ర అనే పేర్లు రథానికి ఉండేవి. ఇతిహాసాల్లో చెప్పబడిన రథం రెండు లేక నాలుగు చక్రాలు, సామాన్యంగా నాలుగు అశ్వాలతో పూన్చబడి వుండి యుద్ధవ్యూహాల్లో ప్రముఖ స్థానం ఆక్రమించేది.

భారతంలో అర్థరథులు, అతిరథులు మహారథులు అనే బిరుదాలతో యోధులను పేర్కొనడం వుంది.

రుద్రదామ,[55] ఖారవేలుల[56] శాసనాలలో రథ ప్రసక్తి ఉంది.

నాలుగు అశ్వాలని పూన్చిన రథాన్ని వలయాకారంగా పరిగెత్తించడం అనుభవజ్ఞులకే ఒక పరీక్ష అంటాడు మెగస్తనీసు.[57]

మగధ చక్రవర్తికి 2,000 రథాలున్నట్టు గ్రీకుల లెక్కలవల్ల తెలుస్తుంది. ఆ తర్వాత ఆ సంఖ్య వేలకు, లక్షలకు చేరుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

"అఱువది వేల రథములతో
డై అసిడల సదగ్ర డడరె దేవి పయిందా
నలక రథకోటి తోడి
దలమె మహాహనుడు శౌర్యదర్పమెలర్పన్" (మా.పు. 6-86)

"మఱియు నేబది లక్షల రథంబులతో నసిలోముండను గాలుండను, నెబ్బది లక్షల రథంబులతోడ బాష్కలుండును, గోటి స్యందనంబుల తోడను ఉగ్రదర్శుండును, నేనూఱుకోట్ల రథంబులతో బిడాలుండును నను మహాసురుల మ్మహాదేవిం జుట్టుముట్టి ఘోర యుద్ధంబు సేయుచుండ" (మాపు 6-87)

ప్రాచీన సేనా విభాగంలో రథాలు నేటి వైమానిక దళం లాంటివనిపిస్తుంది. రథయోధులపైనే విజయం ఆధారపడినట్లు ఇతిహాసాల్లో వర్ణనలున్నాయి.

"ఉరుతర హేమదండరుచి నొప్పుచు సింహపతాక మింటితో
నొరయగ రోహిణాచల సముజ్జ్వలమైన రథోత్తమంబు పై
నరుదుగ జాపమింద్ర ధనురాకృతి నెత్తి చెలంగుచున్నపో
టరి యతడింద్ర జిత్తనికి డాయరు వీని సురాసురాదులన్"
(బాస్క. యుద్ధ 797)

"ఉరగ రాజ కేతనోజ్జ్వలమై వచ్చు
తేరి మీద విల్లు ద్రిప్పవచ్చు" —వాడు కుంభుడు.

"త్రిదశహితము గోరి ధీరాగ్రగణ్యుండు
పూని దైత్యుతోడ బోరు సలుపు
చున్న వాడు నీవు సుచితత్వ మేర్పడ
రథము గొంచు బొమ్ము రాము కడకు." (భాస్క.యుద్ధ 2023)

అని దేవేంద్రుడు మాతలిని పూరమాయించాడు.

"కింకిణీ మాలికా ఝుంకార ముఖరంబు
సురుచిర నవరత్న శోభితంబు
దటిదుజ్జ్వలోచ్చకేతన దండ సహితంబు
గురుతర వైదూర్య కూబరంబు
జల జలోచన చక్ర చక్ర సన్నద్ధంబు
నక్షత సంకలితాక్ష యుగము
దుస్సహానిల వేగ తురగో హ్యమానంబు
దరుణార్క బింబ సుందరము నగుచు

విమల వజ్ర కల్పకమనీయ కంకట
దివ్యచాప తూణ దీప్త శస్త్ర
సహితమైన రథము జపమున గొనివచ్చి
మొనసి రామచంద్రు మ్రోల మెఱయ" (భాస్క.యుద్ధ –2025)

ఇలా ఇంద్రుడు రామునికి ప్రత్యేకించి రథాన్ని పంపడం చేత యుద్ధ విజయానికి రథబలం ఎంత అవశ్యకమో అవగతమవుతోంది.

నాయికులు, రథాల నధిరోహించి సమరంలో పాల్గొనేవారు. అర్జునుని సారథి కృష్ణుడు ఉత్తర గోగ్రహణంలో అర్జునుని సారథిగా ఉత్తరుడు. ఇలా పెక్కుచోట్ల రథాన్ని గురించి, రథి-సారథి సంబంధాల గురించి పేర్కొనబడింది. రథాలను, రథికుల్ని సంరక్షించడానికి 'చక్రరక్షకులనే' వీరులుండేవారు.

రథ ప్రయోగానికి మైదాన ప్రదేశాలే అనుకూలం. కొండ ప్రాంతాల్లోనూ, వర్షాకాలాల్లోనూ రథాలను ఉపయోగించడానికి వీలులేకపోవడంవల్ల వీటి ప్రాముఖ్యం ఏడవ శతాబ్దికే దాదాపు తగ్గిపోయిందని చెప్పవచ్చు. మానసోల్లాసం వల్ల జబల్పూరులో దొరికిన క్రీ.శ. 1122 సం॥ చెందిన 'యద్ధకారణదేవుడి' రాగిరేకులవల్ల"[58] ఈ విషయం బుజువవుతుంది.

మధ్యయుగపు రాజుల సైన్యంలో రథాలు లేవనడానికి చతురంగ బలాల్ని గురించి వర్ణించేటప్పుడు రథవర్ణన లేకపోవడం ఆధారమవుతుంది.

"ఔరా చూచితెగాని రాయల బలం బౌదార్య యేనుంగుల
య్యారే వారు తురంగ సంఘముల హాహా మన్నె వారల్ భళీ
ధీరుల్ రాజకుమారు లంచమదినెం తేయద్భుతం బొందుచున్
బోరన్ శక్యమె యీ నృపాల మణితో భూరి స్థిర ప్రౌఢిమన్"
(కృ వి 3-70)

ఈ విషయాన్నే ఈ క్రింది శ్లోకం బలపరుస్తోంది.

ఆబద్ధ కుధ మాతఙ్గమాత్త పర్యాణ సైన్ధవమ్।
సంవర్మిత భటం సద్యస్సమనహ్యత తద్బలమ్॥ (మ.విజ 4-7)

"ఏనుగులపై చిత్ర కంబళులు పరిచారు. గుర్రాలపై జీనులమర్చారు. యోధులు కవచాల్ని ధరించారు. ఇలా సైన్యం అప్పటికప్పుడే యుద్ధానికి సిద్ధమైంది" అని చతురంగ బలాల్ని పేర్కొంటూ రథబలాన్ని వదిలేయడంవల్ల బుక్క రాయల కాలానికి రథబలం లేదని తెలుస్తుంది. ఇది ఆనాటి సైనిక స్థితిని యదాతథంగా తెలుపుతోంది. రథబలం బుక్కరాయల కాలానికేకాదు అంతకు పూర్వమే ఎప్పుడో చతురంగ బలం నుంచి అదృశ్యమైంది. తరువాత కాలంలో అది కేవలం ఊహాత్మకంగా లేదా ప్రాచీన సాహిత్య ప్రభావంవల్ల మాత్రమే తెలుగు కావ్యాలలో వర్ణించబడింది. అయితే రాయలు చతురంగ బలంలో రథాలు వున్నట్లు రాయలు పేర్కొన్నాడు,

"గజ ఘోట స్యందనాళీకబళిత ధరణిం గాద్రవేయాధిరాణ్మా
ర్థజరత్న శ్రేణులంతర్మణుల సపక్షులై మగ్గ బాదాతకుంత
ధ్వజ వాతాహూత మార్ణవధ్వనధుల రవము ల్వాద్యము ల్మీఱగా ద
ద్ద్విజ రాజన్యుండు పద్విడ్వి దళనమని గాంచె దిగ్జైత్రయాత్రన్"
(ఆము. 4-185)

(ఏనుగులు, గుర్రాలు, రథాల యొక్క సమూహం చేత కబళించబడిన భూమిలో పాములకు రాజైన శేషుని యొక్క తలలో పుట్టిన రత్నరాసులు అంతర్మణుల సవతులై (భూమి రత్నగర్భ కాబట్టి తాము ఆ భూమిలో వున్న రత్నాలతో సమానమనుట) అవిలిపోగా, గాలి తాకిడిచేత పదాతి సేన యొక్క ఈటెలకు వున్న టెక్కపు బట్టలు పొంగుతున్న సముద్రముల ధ్వనులు వలె వాద్యాలను అతిశయించుచుండగా విప్రుడైన ఆ రాజు (యామునాచార్యుడు) దిగ్విజయ యాత్రలో (యుద్ధంలో) పగతురను సంహరించెను), ఇలా చెప్పడంవల్ల రాయల కాలంలో

రథాలు వున్నాయని అంగీకరించవలసి వుంటుంది. రదాలు లేవని గట్టిగా విశ్వ సించడానికి వీలు లేకుండా పోయింది. రదాలువున్నా నామమాత్రంగా వుండేవని వూహించవచ్చును.

## గజ బలం

ఆనాటి సైన్యంలో గజబలం ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది రాజులందరూ గజ బలాన్ని పెంచి పోషించినవారే కాల ప్రవాహం లో ఎదురీది శిదిలాలుగా మిగిలిన కొన్ని కోటలు, దుర్గాలు పరిశీలిస్తే గజశాలలు కనిపిస్తాయి. రాజులు గజ బలగాలపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపారనటానికి శిథిల గజశాలలే తార్కాణాలు. గజబలం అవసరమైనప్పటికీ చాల తక్కువ సంఖ్యలో ఉండడం శ్రేయస్కరం. గజబలాన్ని పోషించడం చాలా వ్యయప్రయాసలతో కూడిన పని

"స్ఫుట పరికల్పితంబు నక్రియూదస సంయుగ దృష్ట సార్గముం
బటుతరదంత ఘాతపతి బందు పీరతమూది రూడమున్
గట తట విభ్రమద్భ మదగాన సముత్కటమైన యేనుగొ
క్కటియ వధించు నాజి నరకన్నితపట్టిక తాశ్వయూదమున్"
(స నీ వ శ 828)

శత్రువులు కొట్టే వివిద విదాలైన దెబ్బలకు ఏనుగులు తట్టుకుంటాయి. విజయానికి మూల కారణం ఏనుగులు తన ఆకారంతో శత్రువుల్ని భయపెడతాయి, తన అంగాల్ని ఆయుధంగా ఉపయోగిస్తూ చని పరాక్రమంతో విజయాన్ని చేకూరుస్తాయి ఇలాంటి ఏనుగులు రాజులకు నిక్షేపాలు. (స నీ స 3 829 నుంచి 831)

ఏనుగుల్ని రదాలకు పూన్చినట్లు కూడా వర్ణన వుంది కట్టి ఎన్ని వ్యయప్రయాసలెదురైనా గజబలాన్ని పోషించడానికి ఆనాటి రాజులు వెనుకాడలేదు.

ఏనుగులలో భద్ర, మంద్ర మ్రిగ, మిశ్ర అని నాలుగు తెగలున్నాయి.[క]

మధు వర్ణనం (Honey coloured) బలంగా నిర్మింపబడ్డ దంతాలు, గుండ్రంగా, లావుగా వున్న శరీరం, అందమైన ముఖం, మంచి అవయవ సౌష్టవం కలిగివున్న ఏనుగు భద్రజాతి ఏనుగు. లావు పొట్ట, సింహంవలె కండ్లు (Lion like eyes) దళసరి శరీరం, కంఠం, తొండం, మధ్యరకం అవయవ సౌష్టవం, పొడవైన దేహం వుంటే అది మంద్రజాతి ఏనుగు.

సన్నని కురుచైన గొంతు, దంతాలు, చెవులు, తొండం, పెద్ద కండ్లు, అతి సన్నని పెదవులు, పొట్టి లింగావయవాలు (Genital organs) వున్న ఏనుగు మృగ (Mriga) జాతి ఏనుగు. పై మూడు జాతుల లక్షణాలున్నది మిశ్రజాతి ఏనుగు.

ఏనుగుల అవయవాల కొలతలు, లక్షణాల గురించి వివరంగా పేర్కొనడంవల్ల ప్రాచీన కాలంలో భారతదేశంలో గజశాస్త్రం అత్యున్నత స్థాయిలో అభివృద్ధి చెంది వుండేదని తెలుస్తుంది.

"భద్రజాతి యేనుగు స్పష్టిణమున
ప్రకటిత స్ఫూర్తి నొప్పుసిబ్బెముల తోడ
విమల వారాశి ఫేన ఖండముల తోడ
కవ్వపుం గొండ బందులో కాక యనగ" (శి.మ. 2-10)

ఇది శ్రీనాథ కవి చూసిన భద్ర జాతి ఏనుగు.

"పగవారలకు నెల్ల భయములు చేయు
పట్టుతరోన్నతమైన భద్ర గజంబు" (ప.వీ.చ, పుట 337)

శ్రేష్ఠమైందని తెలుస్తుంది.

"నడపు గోపంబు గల కొండ నాగ, గలిత
దాన విఘ్నరార్ద్రంబగు తన గజంబు
లీలనంకుశాహతి గెరలించు చున్న
వాడు యూవాంక్షుడు వాడు నసుపతీశ" (భాస్క. యుద్ధ. 796)

నడిచే కొండలాగా కోపమున్న కొండలాగా వుండే ఏనుగుల్ని సునాయాసంగా అంకుశంతో ఆడించే యుద్ధ వీరులు మన కనుల ముందు నిలబడతారు.

ముఖమలు పరుపులతో, బంగారు, రత్నాలు తాపిన చౌడోలతో, బంగారు కంబాలతో, మణులతో, మువ్వ గంటలతో, తెల్లని వస్త్రాలతో, వాడి అయిన అస్త్రాలతో, ముఖానికి రక్షణగా ఇనుప రేఖలతో ఏనుగుల్ని అలంకరించేవారు. (ప.వీ.చ. పుట 338)

దోషులను శిక్షించడానికి, కోట గుమ్మాలను పగులగొట్టడానికి శత్రుసేనను చిందరవందర చేయడానికి ఏనుగులకు శిక్షణ ఇచ్చేవారు.

శాన్‌థోమ్‌లోని పోర్చుగీసు మత బోధకుల వద్ద ఎంతో సంపద ఉన్నట్లు

అసత్య సమాచారం ఇచ్చిన పోర్చుగీసు సైనికుడు ఫిడెల్గోను రామరాయలు ఏను గుల కాళ్ల కింద తొక్కించి చంపించేడు. రెండవదేవరాయల కాలంలో ఈ శిక్షలు ఉన్నట్లు అబ్దుల్ రజాక్ వ్రాసేడు. [60]

చివరికి రాజును ఎన్నుకోవడానికి కూడా కొన్ని సందర్భాల్లో ఏనుగు ఉప యోగపడేది. [61] ఏనుగులు, గుర్రాలు మొదలైన వాటిని అమ్మకానికి తెచ్చే దూర ద్వీపాంతర వర్తకులకు గ్రామాలు పట్టణంలోని మంచి ఇండ్లు, బహుమానాలు ఇచ్చి వారికి ఆదాయం వచ్చే విధంగా చేయాలి. గజ, అశ్వ బలగాలు శత్రువు లకు చేరకుండా వర్తకులను రాజు తన వారిగా చేసుకోవాలి. (ఆమ. 4-258) ఇలా రాయలు చెప్పడాన్నిబట్టి గజ, తురగ బలగాలకున్న విలువ తెలుస్తోంది.

" పెట్టని కోటగాదె గజ బృందము లెందును రాజదానికిన్" (విజ.వి. 1-74)

అశ్వికబలం :-

". శ్వములు గలుగు రాజుకు
విశ్వంభర చేత నుండు విమతులమును భూ
మీశ్వర లెవ్వరు వెఱతురు
శశ్వద్ధాటి విహార సామర్థ్యముచన్" (న.నీ.స. 3-823)

దూరంగా వున్న శత్రువులను త్వరగా చేరడానికి, వేగంగా వెళ్లడానికి రాజుకు అశ్విక బలం అత్యంత అవసరం. (న.నీ.స 3-824)

సైన్యంలో అశ్వికి బలం ఉండడం రాజ్య రక్షణకు అయువుపట్టు విజేతలు కావాలనుకునే రాజులు అభిమానించేది అశ్విక బలాన్నే. రథాల్ని లాగడానికి, కోట రక్షణకు, గమ్యస్థానానికి వేగంగా వెళ్లడానికి, యుద్ధభూమిలో వీరవిహారం చేయడానికి అశ్విక బలం తప్పనిసరి, వాటి రంగు, అవి లభించే స్థలాన్నిబట్టి గుర్రాల్లో చాలా రకాలున్నాయి.

"కాంభోజ, వనాయుజ, పారసీక, బాహ్లిక
సముత్పన్న సముత్తుంగ తురంగంబులు...." (భాస్క. బాల 4[?]0)

"ఒనరించిన నీలని నడ
గని బొల్లని గత్తలాని గైరని సారం
గని జారని జన్నని నిమ
వని మొదలుగ దెచ్చి నిలిపె వాహకుడెదురన్" (సిం.ద్వా. 314)

ఇవి అనాడున్న అశ్వజాతులు.

అశ్వాల గురించి మనోహరంగా వర్ణించడం వల్ల అనాటి కవుల మనస్సుల్లో అవి ప్రత్యేకమైన స్థానాన్ని పొందాయనవచ్చు.

"పచ్చని హారు ముంజిపనివాగె పక్కెర
  సారశి పల్లంబు పట్టమయము
రాణ నొప్పార్గు పైరాణంబు సింగణి
  తళకులకోరిలతరకసంబు
మిహి పసిండి పదుంజు మొహదా కెలంకున
  రావు గుజ్జరి సేతకేవడంబు
డాకులంకునసిరాజీకరాచురకత్తి
  కుఱగట గ్రొవ్వాడి గొరకల పొది.

పీలికు చెతలాటంబు బేరొజంబు
మణుల మొగముట్మ వన్ని సాహిణి యొకండు
కత్త యెదుటికి గొని వచ్చె గ దవాహ
బాంధవంబైన యొక మహాసైందవంబు" (మను 4-28)

అందమైన అశ్వాన్ని మనకళ్ల ముందు నిలిపాడు అల్లసాని పెద్దన. పుర వర్ణన చేసే సందర్భంలో ఆపురంలో వుండే అశ్వాల్ని కూడా కవులు వర్ణించడం ఉంది. అస్కంధితం, ధౌరితకం, రేచితం, వల్గితం, ప్లుతం అని ఐదు రకాల అశ్వగతులున్నాయి.

అస్కంధితం (రవగాలు) - అతి వేగంగా అతి మందంగా కాకుండా మధ్య రకంగా పరుగెత్తే ధార.

ధౌరితకం (బోడన):- అస్కంధితం కంటె వేగమైన ధార.

రేచితం - వంకర లేకుండా వేగంగా పోయే ధార.

"జవమున భంజళిన్ మురళి జౌకమువన్ నడునైదుధారలన్
వివిధ విచిత్రవల్గన వివేకములన్ బొలపంబునన్ శుభ
భ్రువముల దూర భావముల సూప బలంబుల రూఢి కెక్కియా
హవ జయ శీలముల్ గలుగు నశ్వము లెన్నగ బెక్కులప్పురిన్"
(భాస్క.బాల. 37)

ఇంకా వీటిని గురించి సింహాసన ద్వాత్రింశిక (18-71), శృంగార శాకుంతలం (1-17) పేర్కొన్నాయి.

గుఱ్ఱపు కళ్లెం కూడా వర్ణింపబడింది.

"భైరవ మతంబు భారంగి లంగిణి కలియ విలాసంబు
మొదలగు ఖలీనంబుల ... ... .... (ఉ.హరి. 4-209)

అశ్వశాలాధ్యక్షుల్ని 'సాహిణి' లంటారు. అశ్వాల్ని వర్ణించడంతో పాటు యుద్ధభూమిలో వాటిపై స్వారీచేసే యోధుల్ని కూడా పేర్కొనడం ఉంది.

"సంజమొగులు సిద్ధంపు గెంజాయ మేను
గలుగు తురగ రత్నము చిత్రగతుల మెఱయ
వడిమహా శని వడుపున వచ్చునన్ని
శాంతకుంత హస్తుండు పిశాచరాజు" (భాస్క. యుద్ధ 800)

ముప్పై రెండు అంగుళాల ముఖం, ముఖానికి అయిదు రెట్లు పొడవు, చుట్టు కొలత నూరు అంగుళాలున్న అశ్వం ఉత్తమమైందని కౌటిల్యుడు పేర్కొన్నాడు[62] ఉత్తమమైన గుఱ్ఱాల్ని ఎన్నుకొని వాటికి ఆహారం, వైద్యం, శిక్షణ ఇవ్వాలి. వాటికి కావలసిన ధనాన్ని రాజ్యకోశం నుంచి తీసుకోవాలి

ఉత్తమాశ్వాలను, గజాలను, ఆప్తుడైన యోధునికే ఇవ్వాలి సమయం వచ్చినప్పుడు ఆ యోధుడు వాటిని రాజ సేవకే తెస్తాడు. అశ్వ గజ శాలల్ని జాగ్రత్తగా కాపాడాలి. ఎప్పుడూ వాటిని అధికారుల పై వదలరాదని రాజుల్ని హెచ్చరించడం కనిపిస్తుంది. (ఆము. 4-226)

<u>పదాతి దళం -</u>

"నచ్చి కడు గడిదిరిపుతో
వచ్చగ బోరంగ గిరి గుహా పరిఖంబుల్
చొచ్చిరిపు దుర్గములు గొన
వచ్చునెకాల్బలము లేని వసుదేశునకున్, (వ.నీ స. 3-838)

సేనా విభాగంలో చాలా పెద్దది కాల్బలం. యుద్ధ విజయాలను నిర్ణయించేది కాల్బలమే. విభిన్న ఆయుధాల ప్రయోగం పదాతి దళవీరులకు తెలిసి ఉండాలి.

"కృపాణ కర్పణ ప్రాసకున్త కోదణ్డ పాణయః।
సమగచ్ఛన్త సహస్రానైక దేశ్యాః పదాతయః॥ (మ.విజ. 4-10)

కత్తులు, కర్పణాలు, ప్రాసలు, బల్లేలు, ధనువులు హస్తాలలో ధరించి ఎక్కడ మాసిన కాల్బలమే నడిచిందట!

ప్రాతబంట్లు, కూలిబంట్లు, మన్నీల బంట్లు, మిత్రపు బంట్లు, అవసరం వల్ల సేవించే పగవారి బంట్లు, అటవిక బంట్లు అని ఆరు విధాల బంట్లు పూర్వం నుంచి సేవించే ఇష్టులైన మూల బలం కూడ దీనిలోకే వస్తుంది. అంతేకాదు ప్రజలలో ఉత్సాహవంతులైన అయుధధారులకు ప్రోత్సాహాన్ని ఇవ్వాలి. వాళ్లు ఆపద సమయాలలో పనికి వస్తారు. (స.నీ.స. 3-834, 835)

కాల్బలం నాలుగు శాఖలు, సెలగోల బలం (ఈటేగాండ్రు) విలుకాండ్రు, కైజీతగాండ్రు, ఎక్కట్లు.

దినభత్యం మీదనో, వారభత్యం మీదనో యుద్ధకాలంలో తాత్కాలికంగా చేర్చుకోబడేవాళ్లు కైజీతగాళ్లు విజయవకాశాలు సన్నగిల్లినపుడు చివరి దశలో యుద్ధ రంగంలోకి విడవడానికి 'ఎక్కట్లు' వుండేవాళ్లు.

జీతాలిచ్చి పెట్టుకున్నవాళ్లు, భూములిచ్చి పెట్టుకున్న వాళ్లని సైనికులు రెండు విధాలు.

"జడలు మలంచి బొళ్లెముగ సన్నపు బాగలడుగ జుట్టి చ
ల్లడములు పూవి మీద బదిలంబుగ గట్టిన మట్టి కాసెలం
బిడియములంట దోపి .." (మను. 4-30) పదాతిదళ వీరులు

యుద్ధాలకు వెళ్లేవారు.

ఇంకా పదాతిదళం యొక్క వేష వర్ణన ఇలా ఉండేది.

"బిల్లాడంబుల మీదటన్ బిగువు కాసెల్ చుట్టి హొంకంబువా
టిల్లన్ వంకులు చెక్కి శూలములు నీటెల్ గత్తులుంగేశముల్
ఎల్లెంబుల్ పెదలైన సాధనతతుల్ బాహా బలోద్వృత్తి సం
దిల్లం దాల్చి పదాతి కోటి నడిచెన్ దిక్చక్రమల్లాడగన్.
(అని.చ. 4-34)

ఇలాంటి పదాతిదళం మాత్రమే యుద్ధ రంగంలో విజయాన్ని సాధించడానికి వీలుండేది. ఈ పదాతిదళానికి వున్న ధైర్యసాహసాలకు తగ్గట్లుగా యుద్ధ పరికరాలు వుంటే శత్రువుల్ని ఓడించడం తేలిక.

7. మిత్రులు;-

"భూపతికి మిత్రవర్గము
ప్రాపైనంగాక భూమి భరణము దలమే
యోపునె ఫణి పతియును ధర
మోపునకుం గూర్మకు ధరమలు లేకున్నన్." (స.నీ.స. 1-244)

అవసరాల్ని బట్టి రాజు మిత్రత్వాన్ని, శత్రుత్వాన్ని పాటించాలి. 'శత్రువుకు శత్రువు మిత్రుడు' అనే నీతిని రాజులు పాటించారు.

"రాజులకు మిత్రులుండరాదు. ఎవరికి మిత్రునిగా మిగులరాదు, కొన్ని సందర్భాల్లో కృత్రిమ మైత్రిని పాటించాలి. ప్రకృతి సిద్ధంగానే మిత్రులు శత్రువులు ఏర్పడతారు."[63]

"బలధర్మ పరాక్రమములు
గల భూపతి తోడ మైత్రిగావింపగా
వలయు బడియొండు పాయం
బొలసిన చోటును సహాయ మొనరించుటకున్" (రుక్మాం చ. 3-61)

ఎలాంటి వారితో మైత్రి చేయాలో పేర్కొనబడింది.

మిత్రుడూ, వెండీ, బంగారూ, బుద్ధి అనేవి మానవుని దారిద్ర్యాన్ని పారదోలుతాయని బృహస్పతి చెప్పాడు.[64]

సజ్జన మైత్రి వత్పలితాలిస్తుంది. రాజు తమ సమానులతోనే మైత్రిని పాటించాలి. రాజ్య రక్షణకు మిత్రులు చాల అవసరం. రాజ్యానికి కోశాగారం నుంచి లభించే బలం ఎలాంటిదో అలాంటి బలం మిత్రుల నుంచి లభిస్తుంది.

"హిరణ్య భూమి సంప్రాప్త్యా పార్థివోనత థైధతే।
యథా మిత్రం ధ్రువం లబ్ధ్వా కృశామప్యాయి తిక్షమమ్॥
ధర్మజ్ఞంచ కృతజ్ఞంచ తుష్ట ప్రకృతి యేవచ।
అనురక్తం స్థిరారంభం లఘుమిత్రం ప్రశస్యతే॥
(7-208, 209) అని మనుస్మృతి

దుర్యోధనుని ఆప్త మిత్రుడుగా కర్ణుడు, పాండవుల ఇష్ట సఖుడుగా కృష్ణుడు ఆంధ్ర మహాభారతంలో కనబడతారు. కర్ణుడు గొప్ప యోధుడు. కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొని అసువులు బాసి తన మైత్రిని నిరూపించుకొన్నాడు. కృష్ణుడు అవతార పురుషుడు తన మేధా సంపత్తితో పాండవులకు విజయాలు చేకూర్చడమే కాదు పాండవులకు వచ్చిన ఎన్నో ఇబ్బందుల్ని పరిష్కరించాడు.

మిత్ర లాభాన్ని గురించి రామాయణం కూడా వివరించింది. సుగ్రీవాది కపివీరులు రాముని మైత్రివల్ల ప్రయోజనం పొందారు. రాముడు వాలిని వధించి మిత్రుడైన సుగ్రీవుని రాజుగా చేశాడు. రాముడు కూడ కపివీరుల మైత్రివల్లే రావణాసురుని వధించి, సీతను దక్కించుకొన్నాడు.

సుగ్రీవునితో మైత్రి చేసుకోమని శబరి రామునికి సలహా ఇచ్చింది.

"ఇన కులాధీశ! సుగ్రీవుడనెడు వాడు
కపికుల శ్రేష్ఠుడత్యంత ఘనుడు తలప
నతనితో పొత్తుగావింపు మన్ని పనులు
ఒక్కనాటకు నాత్మ నిస్సంశయంబు". (మొ రామా అరణ్య. 73)

శబరి సలహా పాటించి రాముడు సుగ్రీవునితో మైత్రి చేశాడు. రాజు విలువైన బహుమతి ఇచ్చి లేదా వివాహ బాంధవ్యాలకోనైనా మిత్రుల్ని పొందాలి. బలవంతులైన మిత్రులు కలిగి ఉన్న రాజు వైపుకు శత్రువు కన్నెత్తి కూడా చూడలేడు.

"బలవంతుడైన శత్రువును సాధించవలసి వస్తే రాజు ఉత్తమాశ్వాలు, కనకాంబరాభరణాలిచ్చి, ప్రియ వాక్కుల చేత ఇతర రాజుల మైత్రి సంపాదించాలి." (కామం.ప. 8-5) [illegible] చిన్న రాజులు బలవంతుడైన రాజును ఎదుర్కోవడానికి మిత్రులుగా మెలిగేవారు. ఇలాంటి రాజులను భేదనోపాయం చేత విడదీసి ఆ రాజ్యాలను [illegible] ాలి.

కృష్ణదేవరాయల మంత్రి అప్పాజి (తిమ్మరుసు) భేదోపాయాన్ని ప్రయోగించి గజపతి మిత్రులను [illegible] (షోడశ పాత్రుల) వేరుచేసి విజయాన్ని సాధించాడు.[55]

కృష్ణుని [illegible] జరాసంధుడు

"దివసకి దగ మిత్రులు ఘా
సేనా సముదయముతో విశ్వంభల లీలం
బూని నడచి పగతు పురం
బైన మధుర పొదిలి వైరపుడపగ వలయున్" (హరి.ఉ భా. 2-7)

అవి మిత్రులైన రాజుల్ని కోరాడు. వీళ్ళంతా విష్ణు ద్వేషులైన రాజులు కాబట్టి 'శత్రువుకు శత్రువు మిత్రుడు' అనే నీతి ఆధారంగా జరాసంధునితో మైత్రి చేశారు. పౌండ్ర కళింగ, దంత వక్త్ర శిశుపాల సాల్వ రుక్మి యవన వేణుధారి సౌవీర గాంధార త్రిగర్త, భగదత్తులును మఱియు నంగ వంగ సుహ్మ విదేహ కాశ కరూశ దశార్ణ మద్ర పాండ్య దేశాధీశులు జరాసంధునితో కలసి శ్రీ కృష్ణునిపైకి దండయాత్రకు వెళ్లారు." (హరి. ఉ.భా. 2-9)

## అధస్సూచికలు

| | | | |
|---|---|---|---|
| 1 | భారతి సెప్టంబరు-1980 | పుట | 45 |
| 2 | "పైదే" | పుట | 45 |
| 3 | రాజకీయాలు, అధికారం, పార్టీలు | పుట | 21 |
| 4 | మనుస్మృతి - 7-3 | | |
| 5 | రాజనీతి శాస్త్రము ప్రాథమిక సూత్రాలు | పుట | 98 |
| 6 | ఏ హిస్టరి ఆఫ్ పొలిటికల్ థియరి | పుట | 146 |
| 7 | రాజనీతి శాస్త్రము ప్రాథమిక సూత్రాలు | పుట | 41 |
| 8 | కవిత్రయ భారతము రాజనీతి | పుట | 31 |
| 9 | ప్రబంధ రత్నావళి | పుట | 8 |
| 10 | శుక్రనీతి | పుట | 11 |
| 11 | భార.శాం. 2-27 | | |
| 12 | శృ.శా. 4-173 | | |
| 13 | కే.బా చ. 1-64, బద్ధి - రాజ 14 | | |
| 14 | కృ వి. 2-60, జై.భార. 2-18, శృ.శా 4-173, స నీ స. 2-338, బాస్క.బాల. 34 | | |
| 15 | భార.శాం. 3-64, 69. 73 | | |
| 16 | శ్రీ మదాంధ్ర మహాభారతం-రాజనీతి | పుట | 114 |
| 17 | హర. 3-9, శి మ 2-15 | | |
| 18 | కౌటిల్యుని అర్థశాస్త్రము | పుట | 20 |
| 19 | "పైదే" | పుట | 17 |
| 20 | "పైదే" | పుట | 21 |

21 Rv. I. 53.7; 58.8; 131 4; 166.8; III 15.4; IV, 27 1 etc , Also vide S.Cr sarkar, some aspects of the earliest social History of India; (Pre-Buddist Ages London, 1928) pp.21-24 — సోషియల్ కల్చరల్ లైఫ్ ఇన్ ఏన్షియంట్ ఇండియా-పుట 23 నుంచి

22 RV. V. 34.7; VII, 25 2 ,,

23 RV. VI, 47.2, VII, 6.5, Schroder, pre-histosic Antiquities of the Aryan people (London 1890) 344, Zimmer. All lib. 143 as in the names vaideha or even Delhi. ,,

24 RV. IV, 30, 20; perhaps sun-dried bricks are alluded to tyama (lit. raw umbaked), RV II. 35-6. ,,

25 RV. I., 58 5; II, 20.8: IV, 27.1: VII, 3.7: 15.4: 95.1: X, 101.8: సోషియల్ కల్చరల్ లైఫ్ ఇన్ ఏన్షియంట్ ఇండియా-పుట 23 నుంచి

26 శుక్రనీతి పుట 215

27 కౌటిల్యుని అర్థశాస్త్రము పుట 73

28 "పైదే" పుట 73, 74

29 మనుస్మృతి 7-71

30 భారతి-ఏప్రిల్ 1990 పుట 13

31 సమగ్ర ఆంధ్ర సాహిత్యం (5వ భాగం) పుట 54, 55

32 ఇండియన్ ఆర్కాయిలజీ-ఏరివ్యూ 1957-58 పుట 5, 6

33 సోషియల్ అండ్ కల్చరల్ లైఫ్ ఇన్ ఏన్షియంట్ ఇండియా పుట 29

34 కౌటిల్యుని అర్థశాస్త్రము పుట 95

35 రఘు వ శం 17-60

"కోశే నాశ్రయణీయత్వ। మితిత స్వార్థ సంగ్రహః।
అ గ్ని గర్భోహి జీమూత। శ్చాతకై రభినన్ద్యతే॥

36 మధురా విజయం పుట 179 నుంచి

37 బై. వేం. పం. తం 3-41

38 శుక్రనీతి పుట 138

39 "పైదే" పుట 139

40 తిరుక్కురల్ 756

41 పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ ఏన్షియంట్ ఇండియా పుట 173

42 దక్షిణ భారతదేశ చరిత్ర పుట 379

43 యస్ ఐ కందుకూర్ 18, శ-1330 శాసనశబ్దకోశం పుట 208 నుంచి

44 SII X 521 క్రీ.శ. 1239 " "

45 ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర ॥ పుట 25

46 "పైదే" పుట 25

47 "పైదే" పుట 21

48 ఎ.ఆర్.ఇ. నెం. 23 ఆఫ్ 1965

49 ఆంధ్రుల సంస్కృతి-చరిత్ర ॥ పుట 82, 83

50 శాసన శబ్దకోశం పుట 58

51 కౌటిల్యుని అర్థశాస్త్రము పుట 83

52 "పైదే" పుట 101

53 ప్రతాపరుద్ర చరిత్రము పుట 40

54 భారతి-జనవరి 1962 పుట 31
55 ఎపిగ్రాఫియా ఇండికా వాల్యూం -8 పుట 48.
భారతి జనవరి 1962 నుండి
56 "పైదే" వాల్యూం -10
57 భారతి జనవరి 1962 పుట 31
58 భారతి నవంబర్ 1961 పుట 85
59 శుక్రనీతి పుట 220
60 ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర II పుట 201
61 (అ) సిం.ద్వా. 6-83, 87
(ఆ) విక్ర.చరి 2-67
62 కౌటిల్యుని అర్థశాస్త్రము పుట 187
63 శుక్రనీతి పుట 127
64 భార.శాం. 3-484
65 (అ) రా.వా. పుట -72, 73
(ఆ) కృ వి, 3-101 నుండి 112

## 3. రాజు - రాజ ధర్మాలు స్వరూప స్వభావాలు

రాజు రాజ్యానికి ప్రధానాంగం. రాజు లేకుండా రాజ్యం లేదు. ఈ రాజరిక వ్యవస్థ ఎప్పుడు ప్రారంభమైందని చెప్పడానికి వేదాలు, ఇతిహాసాలు, పురాణాలు ఆధారాలు.

" ...ఋగ్వేద కాలంలో 'రాజులు' సర్వ స్వతంత్రులు కారు గణ ముఖ్యుల సభ వాళ్లను ఎన్నుకునేది. ఈ సభ ఆధ్వర్యంలో వాళ్లు నడుచుకొనేవారు. యజుర్వేద కాలం వచ్చేసరికి రాజులు సభ నియంత్రణ నుండి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు కనబడుతుంది. దానికి ఒక నిదర్శనం, రాజులకు కొత్తగా వచ్చిన అభిషేకకాండ రాజుగా ఎన్నుకోబడడం కాక అభిషిక్తుడు కావడం అంటే అతని అధికారానికి మంత్ర సంబంధమయిన లక్షణం అపాదించడం అవుతుంది. దీనికి పురోహితుల అండకావాలి... "[1] అని కోశాంబి రాజు పరిణామ దశల్ని విశ్లేషించాడు.

భీష్ముడు ధర్మరాజుకు చెప్పిన మాటలవల్ల కూడా కృతయుగ ఆరంభంలో రాజులు, రాజరిక వ్యవస్థలు లేనటు తెలుస్తోంది. గణతంత్ర రాజ్యవ్యవస్థ వుండేదని వూహించవచ్చు. (భార.శాం. 2.199, 200)

### రాజు - నిర్వచనం

'రాజ్ఞిరాట్పార్థివక్ష్మాభృన్నృపభూపమహీక్షితః' అని అమరకోశం చెబుతుంది. ప్రజలను రంజింపజేయువాడు రాజు. ప్రకాశించువాడు రాట్. భూమికి ప్రభువు పార్థివుడు. భూమిని భరించువాడు క్ష్మాభృత్. నరులను పాలించువాడు నృపుడు. భూమిని పాలించువాడు భూపుడు. భూమి నధివసించినవాడు మహీక్షితుడు.[2]

రాజన్ శబ్దానికి 'రాజృదీప్తౌ' దాతువు మూలమని నిరుక్తం. 'రాజ్' అంటే ప్రకాశించేదని అర్థం. ప్రజలను రంజింపచ్చేసేవాడు కాబట్టి రంజ్ అనే ధాతువు నుంచి రాజశబ్దం వచ్చిందని చెప్పవచ్చు.

> "బ్రాహ్మణ క్షత త్రాణ తత్పరత జేసి
> క్షత్రియాభి ధానంబు రంజనమునెల్ల
> ప్రజలకు జేయుట కతమున రాజనామ
> మును బ్రవర్తిల్లె నానృపాలునకు నధిప" (భార.శాం. 2-215)

అని నిర్వచించింది.

రాజులేకున్న బురంబు రాష్ట్రంబు
రాజిల్ల........" దని (రం.రా. అయోధ్య పుట 11[illegible])
పేర్కొనడాన్ని బట్టి రాజు ప్రజల్ని రంజింప చేసేవాడని తెలుస్తుంది

ఇదే భావాన్ని కాళిదాసు ఇలా హృద్యంగా వర్ణించాడు.

"యథా ప్రహ్లాదనాచ్చంద్రః ప్రతాపా త్తపనోయథా।
తథైవసో[2] భూదన్వర్థో రాజా ప్రకృతిరంజనాత్॥ (రఘు 4-12)

**రాజు-అర్హతలు:-**

"శుచినా సత్య సందేన యదా శాస్త్రానుసారిణా।
ప్రణేతుం శక్యతే దండః సుసహాయేనధీమతా॥"
(మనుస్మృతి [illegible])

శుచిమంతుడు, సత్యసంధుడు, శాస్త్రం తెలిసినవాడు, మంచి [illegible] కలవాడు, తత్త్వజ్ఞుడు, సకల లక్షణోపేతుడు, సుసంపన్నుడైనవాడే రాజని [illegible] స్మృతి చెబుతోంది.

రాజుకు వుండాల్సిన అర్హతల గురించి ఇలా పేర్కొన[illegible]

"సత్యవచో విశారదుడు, శారదనీరద [illegible]
నిత్యుడు నిత్యదాన గణనీయుడు విజ్ఞ[illegible]
వృత్యనుసారిసార బలవిక్రమకృత్యుడు [illegible]
దిత్యుడవంతి యేలె నలుదిక్కుల రాజు[illegible] పం[illegible]యగన్"
([illegible] 5-51)

అని అవంతి నగరాన్ని పాలించే విక్రమాదిత్యుని [illegible] వుండాల్సిన గుణాల్ని చెప్పాడు

"[illegible]షమును దానము ధర్మము
క్షమయును బటు విక్రమంబు సత్యంబున శీ
లనము దుర్జన శిక్షయు భూ
రమణునకుం గలుగ వలయు రాజిత గుణముల్"
(భాస్క.కిష్క. 309)

అని వాలి రామునితో అంటాడు.

"కులబల లలితుడు సూనృత
కలితుండు జితేంద్రియుండుగణనాన్వితుడున్

విలసిత ధర్ముడు నగు రా
జిలలోనతి పూజ్యుడగుమనేపాటు సిరిన్" (భాస్క.కిష్క. 472)

అని లక్ష్మణుడు సుగ్రీవునితో పరుషంగా మాట్లాడే సందర్భంలో రాజుకు వుండాల్సిన అర్హతల్ని గురించి పేర్కొన్నాడు.

"సతతము ధర్మార్థార్జన
గతుడు సత్యము విహిత ... యు రక్షింగ మో
... సల్పెడు జనపతి
యతులిత రాజ్యము నొంపి వర్ధిల్లెడున్"

(భాస్క.కిష్క. 532)

రాజుకు ఇలాంటి గుణాలు వుండాలని రాముడు సుగ్రీవునితో అంటాడు.

రాజుకు వుండాల్సిన సుగుణాలు గురించి పోతనామాత్యుడు ఇలా పేర్కొన్నాడు.

"శౌర్య ... దాన శీలముబ్రసాదము నాత్మజయంబు దేజమున్
ధైర్యము ... భక్తియును ధర్మము నర్థము గామమున్ బుధా
చార్యుల కూడ సేవలును సత్కృతియుం బరితోషణంబు స
ద్వీర్యము రక్షణంబు బృథివీపతి శేఖర రాజచిహ్నముల్"

(భాగ. 7-413)

ఇలా ... రాజు అన్ని విధాల ప్రజలను రంజింపచేయడమే కాకుండా శత్రువులను సులభంగా ఓడించి విజయాన్ని పొందుతాడు.

రాజు – ఎన్నిక –

"కులక్రమాగత సంప్రాప్త రక్షణ జాగరః" (ము విజ. 1 72) వంశక్రమానుగతంగా సంప్రాప్తమైన రాజ్యాన్ని రక్షించడంలో జాగరూకుడై.... అని చెప్పడం వల్ల రాజ్యం వారసత్వంగా సంక్రమించేదని తెలుస్తోంది. రాజ్యం జేష్ఠులకే రావాలంటూ "అమరుల తల్లి కంటెను మదంబ వరిష్ఠ త్రిలోకరాజ్య భోగములు నాకయోగ్యములు గాలినిలింపులకెట్లు గల్గును?" (నృ.పు 2-8) అని హిరణ్యకశిపుడు ప్రశ్నిస్తాడు "జ్యేష్ఠ పుత్రుడే పట్టాభిషిక్తుడు కావలెను, గొప్ప ఆపదలు సంభవిస్తే రాజ్యం రాజ వంశానికి సమిష్టిగా చెందాలి"[3] అని కౌటిల్యుడు పేర్కొన్నాడు జ్యేష్ఠ పుత్రుడు దుర్బుద్ధి అయితే లేదా ఇతర కారణాల వల్ల సింహాసనార్హుడు కాకుంటే రాజవంశానికి చెందిన ప్రముఖులు అందరు కలసి కొంతకాలం పాలన సాగించవచ్చని కౌటిల్యుని అభిప్రాయం.

రాజును రాజ్యంలోని ప్రముఖులు, ప్రజలు ఎన్నుకునేవాళ్ళ యయాతి మహారాజు పురుని రాజుగా ప్రకటించాడు. బ్రాహ్మణులు ఇతర ప్రజలు సహావేశమై 'యదు, తురువసు, దృహ్యు, అను, అనే పెద్ద కుమారులను కాదని చిన్నవాడైన పురుని రాజుగా నియమించడం అన్యాయమని యయాతి మహారాజును నిలదీశారు. నా జ్యేష్ఠ పుత్రుడు నా ఆజ్ఞలను ధిక్కరించాడు. అవిధేయుడైన పుత్రునికి సామ్రాజ్యాన్ని అప్పగించలేను. తురువసు, దృహ్యు, అను అనేవారు కూడా నాపట్ల విధేయత చూపలేదు. పురుడు నాపట్ల చక్కటి విధేయత చూపాడు అతడొక్కడే ఈ సామ్రాజ్యానికి తగిన వారసుడు. అతనిని చక్రవర్తిగా నియమించడాన్ని శుక్రుడు కూడా ఆమోదించి ఆశీర్వదించాడు అని యయాతి వారితో జ్యేష్ఠుల్ని కాదని చిన్నవానికి రాజ్యాన్ని అప్పగించడానికి గల కారణాల్ని వివరించాడు.[4]

దశరథ మహారాజు రామునికి పట్టంకట్టడానికి మునులు, మంత్రులు, సామంతరాజులు, పుర ప్రముఖులు, ఆశ్రితులు మొదలైన వాళ్ళతో ఆలోచించాడు.

"బ్రజల బాలింపగ బట్టంబు గట్టి
సుజనులు గొనియాడ సుఖకరంబైన
యూరట గోరుచు నున్నాడ మీకు
నీ రీతి సమ్మతియే...." (రం.రా. అయోధ్య పుట 75)

అని దశరథుడు వాళ్ళని అడిగాడు. ఆ మాటలు విని

"... భూసుర ముఖ్యులగు భూమి ప్రజలు
దమలోన దాము ముంతనమాడి కూడి
కమలాప్తకులునకుత్కంఠత ననిరి
మీరానతిచ్చిన మేలిమ మాట
వారు వీరన కెల్ల వారికి హితమే
హృదయ రంజకము నభీష్టదంబయ్యె
.... ... ... .... ....
కావున బట్టంబు గట్టు మీవతని
కేవేళమేమును నిదియె కోరుదుము
అనుచు బద్ధాంజులులై విన్నవింప,"
(రం.రా. అయోధ్య. పుట 76)

అని రామునికి పట్టం కట్టడానికి దశరథుడు ప్రజల అనుమతిని పొందాడు.

రాజుకు వుండాల్సిన లక్షణాలన్ని రామునిలో వున్నాయి.

"ఆయంబు గూర్చు నేర్పు ను
పాయము గలవాడు ధరణి పాలురలోనన్
దీయుతడు సత్య సంధుడు
కాయజనిభ మూర్తి వినయ గాంభీర్యుండున్"

"బలవంతుండౌదార్యుడు
బలరిపు సమభోగి విజిత బంధుర విమతుం
డలరార బీనవక్షుడు
విలసిత పద్మాక్షుడతుల విపులాంసుండున్"

(భాస్క. అయోధ్య-ప 7,8)

ఇలాంటి లక్షణాలున్నాయి కాబట్టే ప్రజలందరూ రామునికి పట్టం కట్టడానికి తమ ఆమోదాన్ని సంతోషాన్ని తెలిపారు.

"మీమనములు రోయుటకై
నేమిటులాడితిమిగాక నిక్కము నేనున్
భూమి ధరింపగ నేరనె
యేమీ జనులార యిట్లు లేటికి పల్కన్"

(భాస్క. అయోధ్య, 15)

అని దశరథుడు చెప్పడం వల్ల ప్రజానుమతి నామ మాత్రంగా వుండేదని వూహించవచ్చును.

రామునికి పట్టం కట్టే సుముహూర్తం దగ్గర పడింది. దశరథుని పిలవడానికి మంత్రి సుమంత్రుడు సంతోషంతో వచ్చాడు. అతనితో దశరథుని భార్య కైక,

"అనిలోనున్న నృపాలు చిత్తమునకే నాహ్లాదముం గూర్చి నా
తనయుం బట్టము గట్టి రాఘవుని బద్యాళ్లేండ్లు కాంతారమం
దునువర్తిల్లగబంప గొన్నవరమున్ ద్రోయంగరాదెంతయున్
వన సీమన్ ముని వృత్తి నుండు మనుడీవైళంబయా రామునిన్"

(మొ రా. అయోధ్య -28)

అని తన రాజ్ఞిత్వాన్ని చూపింది. అంతే ప్రజల అభీష్టం నెరవేరలేదు. రాముడు పట్టాభిషిక్తుడు కాకుండా వనవాసం బయల్దేరాడు.

పౌరులు రాజును ఎన్నుకోవడం ఇంకా ఇలా పేర్కొనబడింది.

"....అంతగొంతకాలంబునకు విజపురవిభుండు మృతుండైనం, బౌరులు రాజర్షియైన భగీరథుకడకుం జనుదెంచి ప్రార్థించిన గ్రమ్మఱంజని రాజ్యాభి

పిక్తుండై" (వా.రా యు 5-120) అని ప్రజలు భగీరథుని రాజుగా వుండమని ప్రార్థించారు.

రాజ పదవి కోసం ఎన్నో కుట్రలు కుతంత్రాలు జరిగేవి. అన్నదమ్ముల మధ్య తండ్రి కొడుకుల మధ్య కూడ ఈ పోటీ తప్పలేదు. "రాజపుత్రులు ఎండ్రకాయతో సమానమగు ధర్మము కలవారు. అందువలన తండ్రినే భక్షించెదరు" అని భారద్వాజుడు అంటాడు [5] రాజ పదవికై రాజపుత్రులు తండ్రిని సైతం చంపడానికి వెనుకాడరని ఆయన మాటలు ధృవీకరిస్తున్నాయి ఇక ప్రజాభిప్రాయానికి విలువేముంటుంది? రాజును ఎంపిక చేయడంలో ప్రజాభిప్రాయాన్ని పాటించాలన్న నియమం లేదా సంప్రదాయాన్ని నామమాత్రంగానైనా ఆచరించాలన్న ఆలోచన కనబడుతుందే తప్ప, వాస్తవానికి వంశపారంపర్యంగానే రాజపదవిని చేజిక్కించుకోవడం జరిగింది.

రాజును ఎన్నుకోవడం కాకుండా, రాజపదవి కావాలనుకునే వ్యక్తి బల ప్రయోగం ద్వారా అధికారంలోకి రావడం వుంది అందుకే "రాజ్యం వీరభోజ్యం" అన్నారు. ఇతర దేశాల రాజుల్ని జయిస్తే ఆదేశాల్ని ఏరాజు జయించాడో ఆ రాజే అక్కడ కూడా రాజుగా చెలామణి అవుతాడు.

కృష్ణుడు కంసుని వధించాడు కంసుని మరణానంతరం అతని తండ్రి ఉగ్రసేనుడు తన భార్యతో, "ఇతనికింగాలోచిత-బు లయిన సంస్కారంబు లొనరింపవలదె రాజ్యంబు వీర భోజ్యంబుబు గావున రాజు కృష్ణుండ నీవు పోయి యన్వీయునెంగని వైరంబులు మరణానంతంబులు మనంబున గంసాపరాధంబులకు రోషింపక తదుత్తర క్రియలకు ననుమతింప వలయునని విజ్ఞాపింపు మని...." అడగమన్నాడు. (హరి పూ.బా. 9 173) ఇలా చెప్పడం వల్ల 'రాజ్యం వీరబోజ్యం' అనే విషయం ధ్రువపడుతుంది

"రాజ్యమింతయు నీ సొమ్ము రాజవీవు
గుడువ గట్టను బెట్టను గొఱత లేక
యేనుగుల గుఱ్ఱముల నెక్కి యెల్లవారు
గొలువ సాధు రక్షకుడవై కొలువు మింక"

(హరి.పూ.భా. 9-178)

అని ఉగ్రసేనుడు కృష్ణునితో అంటాడు. నాకు రాజ్యంతో పనిలేదు రాజధనంపై ఆశలేదు, లోక కంటకుడైన కంసుని వధించానన్న కీర్తి చాలు అని కృష్ణుడు ఉగ్రసేనునికి రాజుగా పట్టం కడతాడు.

'నిరంకుశ శాసనాఢ్యుడై' (భాస్క. యుద్ధ. 2269) సప్తలోకాల్ని పాలించిన రావణుడు రాముని చేతిలో మరణించడానికి విభీషణుడు సహాయ పడతాడు. అందుకు ప్రతిఫలంగా రాముడు జయించిన లంకా రాజ్యానికి విభీషణుని రాజుగా చేశాడు. (భాస్క. యుద్ధ. 2285)

రాజు ఎంపిక గురించి విచిత్రమైన పద్ధతి ఒకటి వుంది. ఏనుగు ద్వారా రాజును ఎంపిక చేసుకోవడాన్ని గురించి మన సాహిత్యం వర్ణించింది.

"... నా ప్రోలి ధరణి విభుడు
మరణమొందిన నా రాజమంత్రులొక్క
కరినలంకారమొనరించి పురము నడుమ
విడుచుటయు, నదియంగళ్ల వెదకి వెదకి."

"గుండుకొని సూచు మానిసి
తండము తలగంగ ద్రోచి తత్కరి వెసనా
చండాలు దెచ్చి భూజన
మండలి కభిషిక్తు జెసె మంత్రులు సూడన్"

(వా.రామా. 4-102, 103)

ఇలా ఏనుగు ద్వారా చండాలుని కూడా రాజుగా ఎన్నుకోవడం కనబడుతుంది.

ఇలాంటి ఎంపిక విధానాన్ని గురించి ఇంకా ఇలా వుంది.

అట బరీశుడు మృతుడైన దన్మంత్రి
పుంగవుడైన ప్రబుద్ధుండు నేర్పు
చెంగలింపుచు నుల్లసిలు వాకిళ్ళ
జాల బెంపగు గజశాలల నశ్వ
శాలల వడి రథశాలల కడను
భండార మిండ్లతో పలివంక సేన
లుండగ దగిన తావులను విశ్వాసు
లగువారి నునిచి యయ్యె వనీశ్వరునకు
దగ నందనులు లేమిదలపోసి చూచి
పట్టమేనుగు చేత బట్టిన వాని
దట్టంబు గట్ట నేర్పడ నిశ్చయించి
యాసామజమునకు ప్రియంబుతో బూజ
చేసిన.... .... .... ...." (నవ.చరి. 4 అశ్వ. పుట 224)

అని పేర్కొంది.

ఇలాంటి పద్ధతినే జక్కన కూడ వర్ణించాడు.

"అట్టియెడన్ బ్రసేనుడనుప్పరమేలెడు రాజు చన్న నా
పట్టపుదంతి మంత్రుల యుపాయమునం జనుదెంచికీర్తికిం
గట్టనుగ్గైన హారలత గంఠమునందిడ, రాజ్యలక్ష్మికిం
బట్టముగట్టి రాష్ట్రులనుబంధులు భృత్యులు నన్నరేంద్రునిన్
(విక్ర చరి. 2-67) అని వుంది.

ఈ ఎంపిక విధానాన్ని గురించి ఇంకా సమగ్రంగా చర్చించడం వుంది. ప్రజలు కూడా ఈ పద్ధతిని సమర్థించినట్లుగా పేర్కొనబడింది. ముద్ర పురాధిపతిగా ఎవర్ని ఎన్నుకోవాలి? ఎలా ఎన్నుకోవాలి? అని ప్రజలు చర్చించారు.

''మదకరిణి చేఁ గొంక చ
క్కగ నవ్వు వనమాల యిచ్చి కదలించిన బో
నది యెవ్వని మెడ నిడునో
విదితంబుగ నతఁడె మనకు విభుఁడౌనను చున్" (సిం.ద్వా. 6-83)

అని నిర్ణయించారు.

"అందఱు నొక మదహస్తిని
సంగముగ నలంకరించి హస్తాగ్రమునం
బె నొవ్వల దండయిడి వే
డ్కం దూర్యధ్వనులు చెలఁగ గదలించినచోన్"

''ఇంభారి నెదురు కొనజను
కుంభీంద్రుని జోడి పిదియొకో యిది యనగా
గుంభిని పురి వెల్వడి యా
కుంభిని పతియుత దండకొమరుగ వైచెన్"
(సిం. ద్వా. 6-84, 85)

ఇలా ఏనుగు ఎవరి మెడలో పూలమాల వేస్తే వానిని రాజుగా నియమించడం వుంది. ఇది లాటరీ వేయడం లాంటిదే. ఒక విధంగా దీన్ని అదృష్టపు ఎన్నిక విధానమని చెప్పవచ్చు.

కవులు ఇలా చెప్పడానికి ఏదో బలవత్తరమైన కారణాలు, లేక ఆధారాలు వుండాలి. బహుశా లోపభూయిష్టమైన రాజరిక విధానం ఇలా వర్ణించడానికి ప్రేరేపణ కలిగించి వుండవచ్చు. లేకుంటే ఏ అర్హతల్ని పరిగణించకుండావని ఎ

మెడలోనో ఏనుగు పూలమాల వేస్తే వాన్ని రాజుగా నియమించేటట్లు వర్ణించి వుండరు.

మధ్యయుగంలో రాజులు నిరంకుశులై ప్రజా పీడకులుగా మారారు. ఎన్ని రాజవంశాలు మారినా, ఎందరు రాజులు వచ్చినా ప్రజాపీడన తగ్గలేదు. రాజులు వున్నా లెకున్నా ఒక్కటే. ప్రజలకు బాధలు తొలగవు అనే అభిప్రాయం కవులలో ఏర్పడి వుండవచ్చు. రాజవంశాలలో రాజ్యాధిపత్యానికై జరిగే పితృ, భ్రాతృ హత్యలు కూడా ఒక కారణంగా చెప్పవచ్చును ఇలాంటి కారణాల వల్ల అనాటి కవులు సరైన పాలకుని ఎన్నుకోవడానికి అదృష్టపు ఎన్నిక విధానాన్ని వర్ణించినట్లు ఊహించవచ్చు

పట్టాభిషేకం :-

ప్రాచీన కావ్యాల్లో రాజుల పట్టాభిషేకాన్ని గురించి మనోహరమైన వర్ణన లున్నాయి. సుగ్రీవుని పట్టాభిషేకం ఇలా వుంది.

ఇంద్రునికి దేవతలవలె సుగ్రీవునికి వానర వీరులందరు కలిసి అభిషేకించి సింహ చర్మాన్ని పరచిన రాజపీఠంపై కూర్చోపెట్టారు విప్రులకు వస్త్రాలు, పణులు, బంగారం మొదలైన వాటిని పంపారు, వారు అగ్ని చుట్టు దర్భలు పరచి పూజలు చేశారు. 'గంధమాల్య వస్త్రాలాజా సువర్ణాక్షతాలంకృతాలతో, పుణ్య నదీనద సముద్రోదకంతో' నింపిన రెండు బంగారు కలశాల్ని ధాన్యవేదికలపై, విలిపారు వివిధ విధాల ఆశీస్సులు, మంత్రాలు, పవిత్ర హెూమ వాక్కుల్ని చదువుతున్నారు. ఇరువైపుల వార కాంతలు ఆడుతూ పాడుతున్నారు. పంచ మహా శబ్దాలు వ్యాపించాయి. మణిగణక నత్కరీకణ మోతలు వినపడుతుంటే పుణ్యకాంతలు బంగారు కుంభాలతో పవిత్ర పానోదకాన్ని అందిస్తున్నారు వసువు ఇంద్రునివలె సుషేణ జాంబవంతులు సుగ్రీవునికి అభిషేకం చేశారు. (భాస్క. కిష్కి. 373)

విభీషణుని పట్టాభిషేకాన్ని గురించి ఇలా వుంది.

"సంచితమణిమయస్తంభాభిరామంబు
బహువిచిత్ర వితాన భాసురంబు
ఘన సముత్తేజిత కనక వేదికమును
స్వామ పల్లవహేమకమ్ర కుంభ
ముపకంఠగత మదద్వీప సంకులంబును
బుణ్యాంగనాగేయ పూరితంబు
మంగళతూర్యాది సంగీత, ముఖరంబు
వందిమాగధ జనానందితంబు

నైమనోజ్ఞమైన యాస్థాన మండపం
బమర నందు రత్నహైమ తుంగ
భవ్య సింహయుక్త భద్ర పీఠంబున
నునిచె దానవేంద్రునుత్సహించి"

అతని పురోహితులు, మంత్రులు సంతోషపడుతుండగా, రాముడు ప్రేమతో విభీషణునికి లంకాధిపతిగా పట్టం కట్టాడు (భాస్క. యుద్ధ 2284 2285)

దుష్యంతుడు తన కుమారుడైన భరతునికి పట్టం కట్టడానికి తను మంత్రులతో సంప్రదించాడు. రాజుకు వుండాల్సిన గుణాలన్నీ తన కుమారునిలో వున్నాయి అని వాళ్ళతో ఏకరువు పెట్టాడు

"....నీ తనూజుండు పెరిపున నెన్నపోలు
గట్టు పట్టంబు యువరాజు గాగ నధిప" (శృ శా. 4-154)

అని మంత్రులు తమ ఆమోదాన్ని తెలిపారు. అందుకు దుష్యంతుడు సంతోషించి పురోహిత భృత్య బంధు మిత్రాది మాన్యజనాలను పిలిపించి వాళ్లను గౌరవించి భరతునికి పట్టం కట్టాలనే తన నిర్ణయాన్ని తెలిపాడు. మంత్రుల, ప్రజల అనుమతితో 'కార్తాంతి కోపదిష్టంబగు శుభ ముహూర్తం'లో భద్ర పీఠంపై భరతుని అలంకరింపచేసి కూర్చోపెట్టాడు. విప్రులు హోమ మంత్రాల్ని ఉచ్చరించగా, మంగళ వాద్య ఘోషలు పక్షుల కూతల వలె శబ్దం చేస్తున్నాయి. ప్రజలందరు పొగడుతుండగా, బంధువులు సంతోషపడుతుండగా, గొప్ప వైభవం అతిశయించగా భరతునికి యువరాజ పట్టాన్ని కట్టాడు దుష్యంతుడు. (శృ శా. 4-149 నుంచి 156)

కుమారుని పట్టాభిషేకాన్ని గురించి ఇలావుంది.

"... సముచితాసన తాంబూలాను లేపనాంబర మాల్యాలచేత తుష్టి జేసె కుమారు మణిమయ వేదికాసీనుం జేసి మంగళపాఠక పఠన గీతాతోద్యంబులు దిగ్బధిరీకృతంబై చెలంగ హరిపురాణ మునిపురందర ప్రముఖాఖిల సురవరులాగమ ప్రబోధిత క్రమంబున సేనాధిపత్యాభిషేకంబు సేసి యువరాజ పట్టంబు గట్టిన" (కుమా 10-110) అని మనోహరంగా వర్ణించబడింది.

రాజ విద్యలు:-

ఏది ధర్మార్థాలను తెలుసుకోవడానికి సాధనమో అది విద్య అని కౌటిల్యుని నిర్వచనం. అన్వీక్షకి, త్రయి, వార్త దండనీతి అనేవి విద్యలు. సాంఖ్యం,

యోగం, లోకాయతం అనేవి అన్వీక్షకికి అంగాలు, సామ వేదం, ఋగ్వేదం, యజుర్వేదం. అనేవి త్రయీ విద్యలు. శిక్ష, కల్పం, వ్యాకరణం, నిరుక్తి, ఛందస్సు, జ్యోతిష్యం అనేవి అంగాలు; వ్యవసాయం, పశుపాలనం, వాణిజ్యం అనేవి వార్త, వృత్తి నుంచి పుట్టింది వార్త వ్యవసాయం, పశుపాలన, వాణిజ్యం మొదలైనవి వృత్తులు.[6]

"భువినాన్వీక్షకి మిళితా
ర్థ విదుండై దండనీతిత్రయి యను విద్యం
బ్రవణుడయి వార్త లోక
వ్యవహారము నూచి యెఱుగపలయుం బతికిన్" (స.నీ.స. 1-185)

అన్వీక్షకి, దండనీతి, త్రయీ, వార్త అనే విద్యల్ని రాజు క్షుణ్ణంగా నేర్చుకోవాలి.

"రాజు వార్త సకల పరిరక్షణంబు
సేయకుండిన లోకము జీవశవము
అట్టి జగదేక రక్షణ మాచరించు
మానవేంద్రుడు దీనస్యసామాన్యుడరయ" (స.నీ.స. 1-186)

వృత్తులను రక్షించకుంటే లోకమంతా జీవచ్ఛవం. కాబట్టి లోకరక్షణ ఆచరించడం రాజు బాధ్యతగా చెప్పబడింది.

"ఉపనయనానంతరము శిష్యుల శిష్ట త్రయీ విద్యనూ, అన్వీక్షకీ విద్యను (ప్రభుత్వ) అధ్యక్షుల వద్ద వార్తను, సిద్ధాంతము, ప్రయోగము తెలిసిన వారివద్ద దండనీతిని నేర్చుకోవలెను" అని కౌటిల్యుడు పేర్కొన్నాడు.

రాజులకు విద్య వుంటే వింతశోభ కలుగుతుందట.

"చెఱుకునకు బండు; పసిడికి
బరిమళమును జిత్తమునకు బ్రాణంబును,
నరుగద గలిన రీతిని
నరపతులకు విద్య గలిగినన్నలు పెసగున్ (శో.వి. 2-37)

రాజకుమారులకి విద్యాభ్యాసం ఇలా వుండేది.

[illegible]

"అక్షరాభ్యాసంబు మొదలుగా కావ్య నాటకాలంకార వేద శాస్త్ర పురాణేతిహాస ప్రకారంబు లెఱిగించి గజ తురగ స్యందనారోహణ నిపుణత్వంబును నసి కుంత తోమర గదా ప్రాస త్రిశూల పరశు చక్ర కోదండ ఖండివాలాయుధాది నానా యుధాభ్యాసంబులునుం గావించిన...." (రుక్మాం.చ. 1-147)

దశరథుడు తన కుమారులకు విద్యలు నేర్పమని వసిష్ఠుని ప్రార్థించాడు.

"అలవసిష్ఠుని నయోధ్యకు రావించి
వలగొని మ్రొక్కి యోవరముని చంద్ర
వీరికి వేదాది విద్యలన్ని యును
నేరుపుడనుచు నావృపుడప్పగింప
వసఘుడమ్ముని వాధుడట్లు కావించె
జననాధు తనయులాసంయమి కరణ
గరి హయారోహణ క్రమము లెఱిగి
వరరథారోహణ వైఖరుల్దెలిసి
యఖిల వేదంబులు నఖిల శాస్త్రములు
నఖిల శస్త్రాస్త్ర విద్యలు నేర్పిరంత" (రం.రా.బాల.పుట 18, 19)

కుశలవులకు రాముడు రాజ విద్యలు నేర్పాడు.

"భరత వాత్స్యాయన ప్రభృతి నాగరిక శా
స్త్రంబులదెస నైపుణ్యంబు వడయ
హయగజస్యందనాద్యారోహణక్రియా
దక్షతవలన వైదగ్ధ్యమొంద
గోదండ కరవాలకుంత ముఖ్యాయుధ
శ్రమముల యందు ప్రశస్తినొంద
వేణు వీణా ప్రౌఢ వివిధ కళాభ్యాస
ములయెడ బ్రాశస్త్యములు వహింప

జేసి తజ్ఞుల మనము లచ్చెరువడంగ
నక్కుమారుల నొక్కొక్క యవసరమున
నేర్పు మెఱయించి ముదము దలిర్ప శిక్ష
కులకు బసదన మొసగు నిట్టులమునగాగ" (ని.దా 10-156)

ఈ విద్యలు నేర్చుకోవడానికి సరైన గురువు అవసరం. ప్రాచీన కాలంలో అలాంటి గురువు దగ్గర శిష్యరికం చేయడం చాలా కష్టమైన విషయం. విద్యలు నేర్పే గురువు శిష్యుని పూర్తిగా నమ్మితే గాని విద్యా బోధన చేయడు.

దేవ గురువు బృహస్పతితో చంద్రుడు తనను శిష్యునిగా చేర్చుకోమని ప్రార్థించాడు.

"సదమల గురు విశ్వాసము
త్రిదశులు మనుజులును మెచ్చధృతి మీ యొద్దన్
జదివెద. మీ పరిచర్యకు
నొదవెద, దుదగీర్తి, దెత్తునురుతర లీలన్" (శ.వి. 2-45)

అని ఆయనను మెప్పించి శిష్యునిగా చేరాడు.

విలువిద్య నేర్చుకుంటే వుండే ఆధిక్యం పేర్కొనబడింది.

"బంగారు పరిమళించిన
భంగిన్ బాహాబలానుభావోజ్వలుడై
పొంగి విలువిద్య బడసిన
సింగము వలెసకలనుల్లసిల్లునధికుడై" (ధను.గురు ప్రశంస. 122)

సద్విద్య ఎక్కడున్నా స్వీకరించవచ్చు.

"....వీరు వారనగ వలవ, దనఘ! సద్విద్య యెందున్న గొనగవలయు"
(మను 4-93)

స్వరోచి, ఇందీవరాక్షుడు అనే రాక్షసుని చంపడానికి మనోరమ అనే స్త్రీ నుంచి అస్త్ర విద్యలు గ్రహించాడు.

అనాటి రాజ విద్యల గురించి ఇలా చెప్పబడింది,

సాందీపని దగ్గర బలరామకృష్ణులు నాలుగు వేదాల్ని ఆరు వేదాంగాల్ని, అరవై నాలుగు దినాలలో చదివారట. దర్మ, తర్క, న్యాయ గణిత శాస్త్రాల్ని, గాంధర్వ లేఖ్యములు, గంధర్వ దంతి రద శిక్షలూ పండ్రెండు దినాలలో తెలుసుకున్నారట! సాంగమై ప్రకాశించే అస్త్ర, నిగమ శాస్త్రాల్ని ఎనభై దినాలలో నేర్చుకున్నారట! (హరి పూ భా. 9-193)

వేదవేదాంగాలు, వివిధ పురాణాలు, ఇతిహాసాలు, తర్క, ధర్మార్థ శాస్త్రాలు, ఆయుర్వేదం, ధనుర్వేదం, భరత శాస్త్రాలు, కామ శాస్త్రం కామందక, చాణక్య, భార్గవ్య మొదలైన రాజనీతి శాస్త్రాలు, శిల్ప, కావ్య లక్షణ, నాటకాది విద్యాప్రణాళికలుగా వున్నట్లు తెలుస్తోంది. సద్విద్యల్ని అభ్యసించడం అవసరమంటాడు బైచరాజు వేంకటనాథకవి. (పం.తం. 1-162) విక్రమార్క చరిత్ర (1-190), షోడశ కుమార చరిత్ర (1-34), కళాపూర్ణోదయం (5-154) లో ఇలాంటి రాజ విద్యల గురించివర్ణించబడ్డాయి.

ఇలా విద్యల గురించి చదువు సంధ్యల గురించి చాలా కావ్యాలు వర్ణించ డమేకాదు, చదువని వాణ్ణి గురించి కూడా ప్రస్తావించబడింది.

'చదువని వాడజ్ఞుండగునని (భాగ. 7-130) పేర్కొనడాన్ని బట్టి చదువుల పట్ల మన కవులకున్న జిజ్ఞాస గురించి తెలుస్తుంది.

## రాజు - అలంకరణ

రాజు సామాన్య ప్రజల కన్న భిన్నంగా వుంటాడు. వస్త్రాలు, ఇతర అలంకరాలు విలువైనవి వుంటాయి. ఇవి రాజుకు దర్పాన్ని కలిగించడమేకాదు అతని విలాసవంతమైన జీవితానికి తార్కాణంగా నిలుస్తాయి. ఖరీదైన వస్త్రాలంకా రాల్ని ధరించిన వాణ్ణి రాజులాగ వున్నాడు అనడం ఈనాడు కూడ లోక వ్యవహా రంలో వుంది.

సాకేతపురపాలకుడైన ఋతధ్వజుడు అనే రాజు అలంకరణ గురించి ఇలా వుంది.

"పచ్చ కప్పురము సాబాలు గూర్చి, గురించి
మడమున గీఱు నామంబు దిద్ది,
యేలకు లొత్తుల చూపు వెలిసూపు వలి పెంపు
జాళు వాసరిగరుమాలు చుట్టి,
మొలక వెన్నెలబొ బారులు దీరు కట్టాణి
తెలిపాలకాయ యెుంటులు ధరించి
క్రొత్త ముత్యపు మేలుకుట్టు జీనా పట్టు
దళకు బంగారు పూలదట్టి బూని

పిలికి పూబంతి దంతపు బిడి కడాని
పోత యొఱవంక మొలవంకి పొంక పఱచి,
తమ్మిదోదుమ్మి జోదు సాదనల హరువు
వ్రాతపని దుప్పటి వలెవాటు వైచి," (కువ చ. 2-4)

"ఉడిగవుటింత కట్టెదుట నుంచిన పావలు రాజ సంబునం
పొడిగి. మెఱుంగుటుంగరవుదోరపు హీరపు మించు మంచుపై
ఎడ దులకించు కల్వవిరి బంతుల మించు మదాళి మాలికల్
బడి నిరువంక వైచు తెలిపావడ బోపుల వీగి పోవగన్"
(కువ చ. 2.5

బహుశా ఈ అలంకరణ,

> "శ్రీ రంగరాజకుమార వీర వేంకటరాయ భుజాబల
> సహాయ. బహువిద ఉపాయ ధురీణుడు ..." (కువ.చ. 1-5)

అని సవరం విన నారాయణ నాయకుడు ప్రస్తావించిన ముమ్మడి వేంకటరాయలదే అయివుంటుందేమో!

కొలువు కూటానికి వెళ్ళే పాలెగాని వర్ణన ఆనాటి రాజుల వేషాలంకరణకు ప్రతీకగా నిలుస్తుంది.

> "నిలువు టద్దము చూచి నేరుపు మీర
> తిలకంబు నుదుటను తిన్నగా తీర్చి
> . . . . . . . . . . . .
> శ్రీ చందనము మేన చెన్నుగా పూసి
> తగటు కూబెంబులు ధరియించి తలను
> ఒక వింతయుష్టీష మొప్పుగా పెట్టి
> హారి రత్నాల బిళ్ళనను వొందకట్టి
> నగకుండలంబులు ఘనముగా మెరయ
> అఖిల రత్నములతో నమరికై నట్టి
> పతకచయముపెక్కులు పైడి మాలికలు
> మెడ జుట్టి సొమ్ములు మించి వెలుంగ
> భుజకీర్తులను రెండు భుజముల దాల్చి
> మేలికి రక్షయె పెంచు తాయెతులు
> దండ చేతుల రెండుదారణ చేసి
> మురుగులు గొలుసులు ముంజేత నొప్ప
> పదివేళ్ళ చంద్రికల్ నశికట్టు దాల్చి
> గండ పెంచేరంబు కాలికి తొడిగి
> తగట్టు దుప్పటి గప్పి తన పాదములు
> బంగారు పావాలు పన్నుగా తొడిగి"
>
> (ప.వీ.చ. పుట 317, 318)

> "అందంబుగ నలికమందొప్పు తిరుమణి
>     తిరుచూర్ణమును వింత మెలుగులీన
> సిద్ధంపు జెక్కుల ముద్దుగుల్కకడాని
>     కుండలంబుల కాంతి మెండుకొనగ

శంఖచక్రాకీర్ణ సౌవర్ణమకుటముల్
ధళధళద్యుతులు దిక్తటుల నింప
బది యాఱుమూరడంబపుటంపు కమ్మిడాల్
కంచిదోవతి చెల్వుమించు లెసగ

కంఠవలమానవపమాలికల్ రహింప
గేల బద్మాక్షమాలికల్ గేలుగొల్ప
వియ్యమందంగ ధారళశయ్య సత్ప్ర
బంధరావంబు నెఱయంగ ప్రౌఢివెలయ" (కృ వి 2-2)

ఇది కుమార ధూర్జటి చిత్రించిన వీరనృసింహరాయల అలంకరణ.

పరరాజు పంపిన ఆభరణాలు సుగంధద్రవ్యాలు వస్త్రాలు, విష, యంత్ర పూరితాలు కావని పరీక్షలో తేలిన తరువాతే రాజు ధరించాలి (రుక్మా ప. 3 19) రాజు ఉజ్జ్వలుడై వుండడానికి, మేలు కలిగించే ఒక మణిని దరించాలి. వారం. వారం రకరకాల మణులు ఆభరణాలతో ప్రకాశించాలని రాయలు పేర్కొన్నాడు. (అము. 4-283)

రాజ అవసరాన్ని, సమయాన్ని బట్టి దుస్తుల్ని, అలంకారాల్ని ధరిస్తాడు. వేటకు వెళ్ళేటప్పుడు చలువ చెంగావి పచ్చడాన్ని, పచ్చల పోగులను, కెంపుల హారాన్ని కుడివైపు మొలలో బాకును, తళుకువన్నెల కుళాయిని తలకు దరించి, కస్తూరి తిలకాన్ని దీర్చి, డాలును చేతబూని బయలుదేరేవాడు. (చ భా. 2-15)

వేటకు పోవు రాజకుమారుల వేషం ఇలావుండేది:

"జడలు మలంచివాళ్లెము సన్నపు బాగలడంగ జుట్టి చ
ల్లడములు పూని మీద బదిలంబుగ గట్టిన మట్టికాసెలం
బిడియములంటదోసి మృదుబీషణ బాహుల సాళువంబుల
న్నడవి కెరల్చుచుంజనిరి నాథుని మ్రోల నృపాల నందనుల్
(మను. 4-30)

జడల్ని చుట్టగా చుట్టి, ఆచుట్టలు కదలకుండా వానిపై బట్టలతో సన్నని తలపాగ చుట్టి, బిగువైన చల్లడం(లాగులు) కాసెకోకలు ధరించి ఆకాసెకోకలతో బాకు వుంచు కొనేవారు. ఇలాంటి అలంకరణ వేటాడేటప్పుడు పరగెత్తడానికి వీలుగా వుండేది.

రాజు 'భోగినీ సంగతికి వెళ్లేటప్పటి అలంకారాన్ని గురించి వర్ణించబడింది. రాజు పన్నీరు కలిపిన కస్తూరి పూసుకొని పొడవైన కుచ్చు టోపీలు. చెవులకు ముత్యాల పెద్ద పోగులు. కంఠానికి ముత్యాల హారం, ఎర్ర అంచుగల తెల్ల వస్త్రాలు ధరించి, బంగారు పిడికత్తిని చేతిలో వుంచుకొని పరిచారిక తాంబూల కరడమును పట్టుకొని వెంటరాగా, ముందర తలారులు నడువగా భోగం దాని ఇంటికి బయలుదేరాడు. (మను. 2-75)

ఇలాంటి వర్ణన మాత్రమే కాదు. ప్రాచీన రాజులు ధరించే రాజముకుటం గురించి కూడా తెలుస్తోంది.

కృష్ణరాయల రాజముకుటాన్ని గురించి తెలుసుకోవడానికి హంపి తులా తోరణ ఉత్తరపు కంబం దిగువన వున్న రాయల చిత్రశిల్పం, చిదంబరం ఉత్తరపు గోపురంలోని చిత్ర శిల్పం, తిరుమలలోని కృష్ణరాయల శిల్పం తోడ్పడుతున్నాయి. తిరుమలలో కృష్ణరాయులు ధరించిన ముకుటానికి రెండు నిలువు పట్టీలు వున్నాయి.

## రాజు దినచర్యలు

"మంగళ పాఠక ధ్వనులు మాగధగీతులు వంది బృందము
ప్పొంగి యొనర్చు సంస్తుతులు బూర్ణపయోధిరవంబు బాడ్పునన్
సంగతమై ప్రతిధ్వితయ సౌఖ్యమొనర్చగ జేర్చి భూమి భృ
త్పుంగవు డార్య సమ్మతుడు భోజుడు మేల్కనియెం బ్రియంబునన్"
(భోజ 2-90) ఇదీ భోజరాజు మేల్కొన్న తీరు.

రాజులను నిద్రలేపడానికి వైతాళికులు వుంటారు, వీరు వైతాళిక గీతాలను అలపిస్తారు. వైతాళికులు రాజును నిద్రలేపడానికి గీతాలు అలపిస్తే నలమహారాజు నిద్రలేచి వారిని ఆదరించాడు. (శృం నై 8-3, 18, 21) నలమహారాజు ఉదయాన్నే అత్యంత శ్రద్ధతో పంచాంగాన్ని పఠించాడు. [illegible]చరించాడు. దేవతలకు, ఋషులకు, పితృదేవతలకు తర్పణం ఇచ్చాడు. సూర్య [illegible] వేశాడు. ఆకాశంలో మునిరాజులైన చుక్కలకు మ్రొక్కాడు. దివ్యరథం [illegible] వేగంగా వెళ్లి సురనదిలో తీర్థమాడాడు. (శృం.నై 8-29)

మాధ్యాహ్నికం గురించి వైతాళిక పురంధ్రి చెబితే,

"ధరణినాథుండు కేళి సౌధంబు డిగ్గి
జలక మింటికి నేతెంచె సమ్మదమున

నవసరము వేచియున్న వానా వనిపులు
దవ్వు దవ్వుల నిలిచి వందన మొనర్ప" (శం.నై. 8.93)

వారితో ఆదరంగా మాట్లాడి, ఇళ్లకు పంపాడు. స్నానశాలలో జలకమాడాడు. కాషాయ వస్త్రాలు ధరించి, పూజా గృహంలోకివెళ్లి పూజించి, ఆ తరువాత దమయంతితో కలసి భోంచేశాడు. ఇలా నలమహారాజు దిన చర్యల గురించి వివరించబడింది.

రాజు దినచర్య గురించి కౌటిల్యుడు ఇలా నిర్దేశించాడు. [8] పగలు ఎనిమిది భాగాలుగా రాత్రి ఎనిమిది భాగాలుగా విభజించాడు (ఒక్కొక్క భాగం ఒకటిన్నర గంట)

పగలు :-

మొదటి భాగం:- దేశరక్షణ విధానం, ఆయ వ్యయాలను చూడాలి

రెండవ భాగం,- పౌరుల, జానపదుల వ్యవహారం చూడాలి

మూడవ భాగం:- స్నానం, భోజనం, గ్రంథ పఠనం చేయాలి

నాలుగవ భాగం:- ధన రూపంలో రాబడిని గ్రహించాలి, అధ్యక్ష సంబంధమైన పనులను నిర్ణయించాలి.

అయిదవ భాగం:- మంత్రి వర్గంతో చర్చించి ఉత్తరువులను జారీ చేయాలి, గూఢచారులు తెచ్చిన సమాచారాన్ని తెలుసుకోవాలి

ఆరవ భాగం :- తన అభీష్టానుసారంగా సుఖసౌఖ్యాల్ని అనుభవించాలి, లేదా మంత్రాలోచనకు వినియోగించాలి

ఏడవ భాగం .- గజ తురగ రథాలను, ఆయుధధారులను (సైన్యాన్ని) పర్యవేక్షించాలి.

ఎనిమిదవభాగం:- సేనాపతితో కలిసి యుద్ధ వ్యూహం గురించి ఆలోచించాలి.

సూర్యాస్తమయం:- సంధ్యా వందనం చేయాలి.

రాత్రి .-

మొదటి భాగం.- గూఢపురుషులతో సంప్రతించాలి,

రెండవ భాగం:- స్నాన, భోజన, విద్యా వ్యాసంగాలు చేయాలి.

మూడవ భాగం - మంగళ వాద్యాలు వింటూ శయనించాలి.

నాలుగు, అయిదు
భాగాలు :- హాయిగా నిద్రించాలి.
(రాజు దినానికి 4 1/2 గంటలకు పైగా నిద్రించకూడదని కౌటిల్యుడు పేర్కొన్నాడు)

ఆరవ భాగం :- మంగళ వాద్య పూర్వకంగా నిద్రలేచి రాజనీతి సారాన్ని (1 1/2 - 3 గం॥) ఒక పర్యాయం జ్ఞప్తికి తెచ్చుకొని, మరునటి దినం చేయవలసిన కార్యాలను గురించి ఆలోచించాలి.)

ఏడవ భాగం :- (3 గం॥ - 4 1/2 గం॥) గూఢచారులను వారి వారి ప్రదేశాలకు పంపాలి.

ఎనిమిదవ భాగం:- ఋత్విక్కులు, ఆచార్యులు పురోహితుల ఆశీర్వాదాలు గ్రహించి వైద్యుని వంటవాణ్ణి, జ్యోతిష్యుని పరామర్శించాలి. ఆ తరువాత దూడతో కూడిన ఆవుకు, ఎద్దుకు ప్రదక్షిణ చేసి సభా మంటపానికి వెళ్ళాలి.

అత్యవసర పరిస్థితిలో రాజు ఈ కార్యక్రమాన్ని మార్చుకొనవచ్చు.

ఆముక్తమాల్యద (4-271) తో చెప్పిన దాన్నిబట్టి రాయల దినచర్య ఇలా ఉండేదని చూపించవచ్చు ప్రాతఃకాలంలో వైద్యులు, జ్యోస్యులైన బ్రాహ్మణులు 'సుఖనిద్ర' అడగడానికి రాజును దర్శించాలి. రాజు వాళ్ళతో ముచ్చటించి ఆరోగ్యానికి అవసరమైన, గ్రహానుకూల స్థితికి కావలసిన విషయాలను గురించి తెలుసుకోవాలి. జాము పొద్దు గడచిన తరువాత మంత్రి సామంతులతోను, ధనార్జన కోసం నియమింపబడ్డ కరణాలతోను, కొంతసేపు గోష్ఠి జరిపి మంత్రాలోచనాది కార్యక్రమాలను నిర్వర్తించి, ఆయ వ్యయ విశేషాలను తెలుసుకోవాలి. అంగమర్దనం, మల్లురతో వ్యాయామం, వంటవాళ్ళతో, వేటకాండ్రతో తెచ్చిన మాంసాన్ని గురించి, తేవలసిన వాటిని గురించి విచారించాలి. తెచ్చిన వాటిని వండే విధానాన్ని, విశేషాల్ని గురించి ఆజ్ఞాపించాలి. అపరాహ్ణంలో దేవతార్చన సమయంలో పెద్దలతో, ధర్మాధికారులతో, సన్యాసులతో సల్లాపాలు, భోజనానంతరం విదూషకుని వినోదం, పౌరాణికులతో, కవులతో గోష్ఠి నాలుగో జాములో బాడులకు దర్శనం, పాట కచ్చేరి, రాత్రి సుఖనిద్ర, ప్రేయసి సల్లాపాలతో రాజు దిన చర్యను ముగించాలని రాయలు వివరించాడు. ఋతధ్వజ మహారాజు.

"ఒకవేళ దండ నాయకులు పౌజులు దీటి
పొడగానగా స్వారిపోయి మరలు,

నొకవేళ వెనువెంట నూడిగాల్గొనుచు ఘో
ట్టాణంబు నెక్కి జోడనలు చూపు,
నొకవేళ మంత్రి గాయక ముఖుల్గొలువగా
సుముఖుడై నిండోలగమున నుండు,
నొకవేళ మారు వాలకము తో వసి సహా
యంబుగా బుర శోధనం బొనర్చు,
నొక్కవేళను భరత శాస్త్రోక్త రీతి
జాణలు నటించు నాటకాల జూచు .. " నట (కువ.చ. 1.93)

ఇలాగే భోజరాజు సంగీత విద్యా ప్రశస్త మానసులతో కలిసి కొంతసేపు, సాహిత్య విద్యావిశారదాత్మకులతో కలిసికొంత సేపు వాదన, విద్యానిరవద్య భావుకులతోకొంతసేపు, శబ్దశాస్త్ర మంత్ర శాస్త్ర, ధనుశాస్త్ర, తురగ శాస్త్ర విమలశ్రోకొంత సేపు, నయశాస్త్ర వేదులతో కొంతసేపు ముచ్చటించి వినోదాన్ని పొందేవాడు హంసతూలికా తల్పంపై ప్రియురాలితో మదుపానంతో సుఖించేవాడట! (బో.చ. 2.85. 86) రాత్రివేళలో రాజు నగర శోధనకు మారువేషాలతో వెళ్లేవాడు. (కృవి. 2-64)

కర్ణాటక రాజుల దినచర్యల గురించి రాయవాచకం (పుట 2, 21, 22)లో విపులంగా వుంది.

## రాజు - ధార్మిక జీవితం

ప్రాచీన భారతీయ రాజరిక పాలనకు ధర్మం మూలం రాజులు ధర్మం పట్ల, ధార్మిక జీవితం పట్ల ఆకర్షితులు కావడం గమనార్హం దీనికి కారణం మత ప్రభావమే. వైదిక, జైన, బౌద్ధ, శైవ మతాలలో దేన్నో ఒక దాన్ని రాజులు అవలంబించక తప్పలేదు. మతపిచ్చి ముదిరిన రాజులు ధర్మాన్ని వదలి మారణ హోమం జరిపారు దీనికి పాలితులు బలికావడం అనాడే కాదు, ఈనాడు కూడా ప్రపంచమంతట జరుగుతున్నదే.

రానురాను రాజు చెప్పిందే వేదంగా, రాజు ధర్మంగా భావించడం జరిగింది.

"రాజాను మతము ధర్మము
రాజు నిశాకరుడు మాకు బ్రాహ్మణులారా!
రాజు ప్రవర్తించిన పే
రోజన గురుతల్ప గమనము చితము మాకున్. (శృం నై 7-68)

అనడం లాంటిదే,

"శ్రీజానికి ప్రియముగ మము
నోజ వ్రతము సలుపు మనుచు నూదగ నేలా
రాజానుమతితో ధర్మం
బీజగమున వినమె మాట యెప్పుడును నృపా, (రుక్మాం.చ. 1-112,

అని కొలువులో వున్న వాళ్లంతా అన్నారు

దానం చేయడం, యజ్ఞ యాగాదులు నిర్వహించడం, వైదిక కర్మలు ఆచరించడం, ధర్మగోష్ఠులు, సత్సంగ సమావేశాలు నిర్వహించడం, వినయవిధేయతలు చూపడం, మునులను భక్తిశ్రద్ధలతో సేవించడం, ప్రజలను ధర్మంతో పాలించడం మొదలైన విషయాలన్నీ రాజు ధార్మిక జీవితానికి సంబంధించినవే.

రాజులు లోకకల్యాణాన్ని ఆశించి యజ్ఞయాగాదులు చేయాలి. 'యజ్ఞాలు చేయడం వల్ల దేవతలు ఆనందాన్ని పొందుతారు. వారికి ఆనందమైతే అన్ని విధాల ప్రజలు అభివృద్ధి చెందుతారు కాబట్టి క్రతువులు లోకకల్యాణ కారణాలు. (అం వి పు. 1-91) హరిశ్చంద్రుడు (హరి పూ. 2-50), ధర్మరాజు (భార. సభా 2-72) రాజసూయ యాగం చేశారు. సగర మహారాజు (హరి.పూ. 2-69) (అం.వి పు. 5-256), దశరధుడు (రం.రా. పుట 13, భాస్క. బాల -51) రాముడు (నిర్వ. 10-102 నుంచి 108), విక్రమార్కుడు (విక్ర. చ. 5-92) అశ్వమేధ యాగాన్ని చేశారు. రావణుడు శుక్రాచార్యుని సలహాతో పాతాళహోమం చేశాడు (భాస్క. యుద్ధ 18, 55) రుక్మాంగదకుమహారాజు ఏకాదశి వ్రతం చేశాడు ఈ వ్రతప్రభావం వల్ల 'బాటతర భోగభాగ్య, శ్రీరమ్యస్ఫూర్తి ధాత్రి జేస్పు ఏహించెనట! (రుక్మాం.చ. 1-135)

"వలెనన్నయప్పుడె వర్షించు మేఘము
లావులు పాలుచన్నవిసి పిదుకు
కోరినసస్యముల్ కొండవేలును బండు
నెల్లకాలము పలియించు తరులు
వినుత సంతానాభివృద్ధి నొందిరి జనుల్
దర్మంబు నాల్గుపాదముల నడచె
శ్రీధాన్య కటకమై చెన్నొందె దేశంబు
బహుభోగభాగ్య సంపదలు మించె

"క్రమము దప్పిన మరణముల్ కట్టువడియె
వ్యాధులుడి పోయె నపమృత్యు వదటణంగె

కలవు గలవయ్యె బోటుల కాంక్షలు డిగె
వసుధ రుక్మాంగదుడు సల్పు వ్రతము కతన"
(రుక్మా చ. 1-136)

ఇదీ వ్రత ప్రభావ ఫలితం. ఇలాంటి సత్ఫలితాల కోసం రాజులు వైదిక కర్మలు ఆచరించేవారు, వ్రతాలు చేసేవారు.

యజ్ఞాలన్నిటిలో రాజసూయం, అశ్వమేధం ప్రసిద్ధి పొందాయి. అన్ని యజ్ఞాలు దాదాపు వేద బోధితాలే. వైదిక కర్మలే బ్రాహ్మణులు, క్షత్రియులు ఈ యజ్ఞాలను, చేయడానికి అర్హులు. రాజసూయం, అశ్వమేధం, దిగ్విజయ యాత్ర చేసిన రాజులు మాత్రమే చేయాలి. ఈ రెండింటిని రాజకీయ యజ్ఞాలుగా పేర్కొనవచ్చు. లౌకికమైన ప్రయోజనాన్ని ఆశించి రాజులు ఈ యజ్ఞాల్ని చేసేవారు. దేశంలో శాంతి భద్రతలు ప్రజాక్షేమం, అభివృద్ధి అనే లౌకిక ప్రయోజనాల్ని దృష్టిలో వుంచుకొని వేదాలలోను, శ్రౌత సూత్రాలలోను రాజసూయ, అశ్వమేధ యజ్ఞాల ప్రణాళికలు నిర్మించబడినట్లు తెలుస్తోంది.

<u>రాజసూయం</u>:- శుక్ల యజుర్వేదం, ఐతరేయ బ్రాహ్మణం మొదలైన వాటిలో ఈ యాగ వివరణ వుంది. రాజసూయం చేయాలనుకునే రాజు సామంత రాజులను జయించి, దేశంలో శాంతి నెలకొల్పి, ప్రజలకు అన్న వస్త్రాలు కొరత లేకుండా చేయాలి. "రాజసూయ యాగము నందు ప్రథమ దివసము నందు ఇష్టాపూర్త హోమములు జేయుదురు. ద్వితీయ దివసమునందు, దక్షిణ ఇష్టి జరుగును. మూడవ దినము నందు ఉదవపాన ఇష్టి జరుగును దీని యందు పశు విశసనము జరుగును. జయింపబడిన రాజులలో నొకనిని పశువుగ నుపయోగింతురని హరిశ్చంద్రుని చరిత్రము వల్లను, శునశ్శేపుని కథ వల్లను దెలియుచున్నది Colebrook అను ఆంగ్లేయ పండితుడు ఇది యొక సాంకేతికమేగాని నిక్కముగ నరమేధము జరిగి యుండలేదని దృష్టాంతములున్నవని జెప్పి యున్నాడు. నాల్గవ దినమందు మరికొన్ని యాగములను హోమములును జరుగును. ఐదవ దినమందు మహారాజు పట్టాభిషిక్తుడగును...."[3]

బ్రహ్మదత్తుని కుమారులు హంస డిభకులు రాజసూయ యాగాన్ని చేయలని అంటుంటే వాళ్ల మంత్రి పుత్రుడు, స్నేహితుడైన జనార్ధనుడు,

"రాజసూయంబు చేయనే రాజు దలచు
నాతనికి రాజులరిగాపు లయిన గాని

నిర్వహింపదు మనమెల్లి నేడు సేయు
లావు మెఱయునే ధర యింగలాలపుట్ట" (ఉ.హరి, 4-120)

అని చెప్పడాన్ని ఒట్టి రాజసూయ యాగ నిర్వహణ కష్టమని తెలుస్తుంది.

అశ్వమేధయాగం – ఈ యాగాన్ని గురించిన వివరాలు ఋగ్వేదంలో (1-162 163) కనబడతాయి. శతపద బ్రాహ్మణం, తైత్తరీయ బ్రాహ్మణం, కాత్యాయన, ఆపస్తంబ, అశ్వలాయన, శాంఖ్యాయన మొదలైన గ్రంధాలు ఈ యాగాన్ని గురించి చెబుతాయి.

దిగ్విజయ యాత్ర చేసి చక్రవర్తి కావడానికి, రాజు ఈ యాగాన్ని నిర్వహిస్తాడు. రాజధర్మాన్ని అనుసరించి యుద్ధాలలో ఎంతోమందిని వధించాల్సి వుంటుంది. ఇందువల్ల వచ్చే పాపాన్ని తొలగించు కోవడానికి ఈ యాగాన్ని చేస్తాడు. ఈ యాగం చేయడానికి ఎక్కువ మొత్తంలో ధనం అవసరం (జై.భా. 1-64, 65) ఇందులో అశ్వం ప్రధాన పాత్ర వహిస్తుంది.

"హాటీర హీర వర్ణము
హాటక పుచ్ఛము నల్లనగు చెవులు నిరా
ఘాట జవంబును నధ్వర
మోటకి లక్షణము లివి యగోచరమైనన్" (జైభార. 1-75)

"కాయము నిత్యవర్ణము లు గల్గి మనోజవమైన యశ్వమే
దీయహయంబు నాగము విధిన్ విడువందగు చైత్ర పూర్ణిమన్...."
(జై.భార. 1-76)

ఇవి యాగాశ్వానికి వుండాల్సిన లక్షణాలు. చైత్ర పూర్ణిమకు ఆగమ విధిని అనుసరించి విడవాలట! ఇష్టం వచ్చినట్లు తిరగడానికి వీలుండాలి. యాగాశ్వం వెంట 100 ముసలి గుర్రాలు, 400 మంది అస్త్రకవచధారులైన యోధులు వెళ్లాలి. ఈ గుర్రం యొక్క బ్రహ్మచర్యాన్ని ఒక సంవత్సరంపాటు కాపాడాలి.

"శూరులు గల్గిన బట్టుడు
ధీరతనని హయము నిటల దేశంబున బం
గారపు బట్టముపై బతి
వీరాంకము వ్రాసి కట్టి విడువగ వలయున్" (జై.భార. 1-77)

ఇది శత్రురాజుల రాజ్యాలలో సంచరించడం వల్ల ఆ రాజ్యాలు అశ్వానికి కట్టబడిన వీరాంకాన్ని పడుపుకొని దాన్ని బంధించి యుద్ధానికైనా దిగాలి. లేదా అయాగాశ్వాన్ని. దానివెంట వచ్చే యోధులను సగౌరవంగా అదరించి, యాగాన్ని నిర్వహించే రాజు యొక్క చక్రవర్తిత్వాన్ని ఆమోదించాలి. సంవత్సరం తరువాత ఇది నిరపాయంగా యజమాని వద్దకు చేరుతుంది.

"విణ్మూత్రములు ఒప్పి విడిచిన తావుల
నెల్ల హోమంబు సేయించి యచట
గోసహస్రంబు ధాత్రీసు పర్వుల కాగ
మోక్త దక్షిణలతో నొసగవలయు
దీక్షితుండు హయంబు తిరిగి వచ్చెడు దాక
నియత భోగంబు లన్నియును మాని
భార్యతోడుత నసిపత్ర వ్రతము బూని
బ్రహ్మచర్యంబు సల్పంగవలయు.." సట' (జై.భార ?-78)

ఇదీ వ్రత దీక్షా విధానం

ఈ యాగం మూడు రోజులపాటు జరుగుతుంది. మొదటి రోజు పాటలు, నృత్యాలు, చేస్తూ రాజుచేసిన దేవ. ధర్మాకార్యాలను వివరంగా ప్రజలకు చెబుతారు. రెండవ రోజు రాజు సాగించిన విజయ యాత్రలను తెలియచేస్తారు మూడవ రోజున యాగాశ్వాన్ని వధిస్తారు. ఆ తరువాత రాజు పట్టాభిషేకంతో ఈ యాగం ముగుస్తుంది.

ఈ యాగంలో యజ్ఞదక్షిణలు ఎక్కువ ప్రాముఖ్యాన్ని పొందాయి. దశరథుడు తన భూమిని నాలుగు భాగాలు చేసి వారికిస్తే రాజా మేము విప్రులం వేదాధ్యయనం మా వృత్తి. భూభారాన్ని వహించే శక్తి మాకులేదు. గోవులు గాని, వెండిగాని, బంగారంగాని దక్షిణగా ఇచ్చి మీ రాజ్యాన్ని మీరే స్వీకరించండి. (భాస్క బాల 126 నుంచి 129 ప.) అని అంటారు

ఈ యాగాన్ని గురించి రామాయణం, జైమిని భారతం, విక్రమార్క చరిత్రం మొదలైన కావ్యాలు విపులంగా పేర్కొన్నాయి.

<u>పాతాళ హోమం</u>.- దివ్యాయుధాలు పొందడానికి ఈ హోమాన్ని చేసేవారని తెలుస్తుంది. రాముని చేతిలో రావణుని సుతులు, సోదరులు, హితులు, చతుర్విధ బలాలు నాశనమైనాయి.

"ఏ చందంబున బ్రతుకుదు, నే చొప్పున నడచువాడ
నెఱింగింపు తగన్" అని రావణుడు శుక్రాచార్యుని ప్రార్థించాడు.
(భాస్క.యుద్ధ. 18) శుక్రాచార్యుడు అతన్ని ఓదార్చి.

"ఉరుతరమైన ధైర్యమున హోమమునీకు నపేత విఘ్నమై
జరిగిన దివ్య ఖడ్గ శరచాప రథాశ్వములున్ మణి ప్రభా
గురుతర విస్ఫురత్కవచకుండలముల్ ప్రభవించు నగ్నిలో
నరుదుగ వాని దాల్చి రిపుతాలి జయించెద వీవు నాజిలోన్"
(భాస్క.యుద్ధ. 1835)

"కాను మీ వరమంత్రంబుల, జనుమింటికి హోమ విధియు జలుపు" మని సలహా ఇచ్చాడు, పాతాళ హోమాన్ని చేయడానికి రావణుడు నిశ్చయించు కొన్నాడు.

"స్నానాది క్రియలు నిర్వర్తించి పాతాళంబు బోని గుహా గర్భంబు మృత్యు ముఖ గహ్వరంబు సొచ్చు క్రియను ప్రవేశించి రక్త ప్రసగను తేపనపటాలంకృతుండై గంధకుసుమాక్షతార్చితమైన వేదికయందు యథావిధి ననలంబు ప్రతిష్ఠించి హోమియోంబులగు పాత్రలు సంస్కరించి తత్సమీపంబుల వస్త్ర పరిధులు సేర్చి బిల్వ భల్లాతకకరంజంబుల సమిధలు దర్భలంబులును సర్షపాగురుగుగ్గులు దూర్వలును దధిమధుఘృత రక్త సురలును ప్రవాళపాయసదర్భలును గాకగృధ్ర కంక శ్యేనకుర రభల్ల సర్పంబులును బాగ జాన మకరంచ్చ పమేషంబులును ధాతు రసంబులును గర్పూరకుంకుమ చందన కుసుమంబులను గేశంబులును వేల్పుచు నిశ్చల నియమంబున హోమంబు సేయునంత" (భాస్క, యుద్ధ. 1839) హోమం నుంచి వస్తున్న ధూమాన్ని చూసి రావణుడు పాతాళ హోమం చేస్తున్న విషయాన్ని పసికట్టి ఆ యాగానికి అంతరాయం కలిగించమని విభీషణుడు రామునితో అంటాడు. (భాస్క యుద్ధ, 1844) అంగదాదివానరులు ఆ హోమాన్ని నాశనం చేస్తారు. ఇలా జరగకుండా వుంటే హోమ ఫలితంగా రావణుడు బలవంతుడై వుండేవాడు. యజ్ఞయాగాదులు ఆచరించడం రాజుల ధార్మిక సంస్కృతిలో భాగ మైనప్పటికీ ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించడం గమనార్హం.

రాజు దేవబ్రాహ్మణ పూజలు చేయాలి (సిం ద్వా. 10-12), అనుదినం బ్రాహ్మణులతో కలిసి ధర్మశాస్త్ర గోష్ఠిలో పాల్గొని ఐహిక ధర్మాలను, సకల దాన మహిమలను తెలుసుకోవాలి. (సిం,ద్వా. 4-7) మునులను గౌరవించాలి. వారిని భక్తి శ్రద్ధలతో పూజించాలి (కువ.చ. 2-12), బ్రాహ్మణులకు దానాలు ఇవ్వాలి, (భీ. పు. 5-58) ప్రభువు ధర్మోపదేశాన్ని చేయాలి [భాగ. 4-567)

568) పుణ్య కధలను వినాలి (కృ.వి 2-58) తనకంటే అధికుల పట్ల భక్తి, సమానుల పట్ల, హీనుల పట్ల కృప కలిగి వుండాలి. (కుమా. 10-188) మునులు చేసే యాగ కర్మల్ని రక్షించడం కూడ రాజు ధార్మిక జీవితంలో ఒక భాగం.

రాజు - వైవాహిక జీవితం:- వివాహబంధాలు రాజకీయాలలో ఒక భాగంగా మారడం మధ్యయుగంలో కనపడుతుంది. దశరథునికి నలుగురు భార్యలు. ఆయన కేవలం సంతానాపేక్షతో వాళ్లను వివాహం చేసుకున్నాడు. అతని కుమారుడు రాముడు ఏకపత్నీవ్రతుడు. ఇది ఆనాటి ఆదర్శ వివాహ పద్ధతి. అయితే మధ్యయుగంలో ఈ సంప్రదాయం నశించింది. స్త్రీని విలాస వస్తువుగా పరిగణించడం మొదలైంది.

రుక్మాంగద మహారాజుకు నూరు మంది అందమైన భార్యలు (రుక్మా.చ. 4-16). వాళ్లందరిని కాదనీ 'మోహిని' అనే యువతిని గాంధర్వ వివాహం చేసుకొన్నాడు. అది తెలిసిన అతని భార్యలు బాధతో భయంతో,

> "ఈ యిగురాకు బోణిబలెనే మమునిందర గారవింపు భూ
> నాయక నీవు మమ్ము జతనంబుగ నూని వెంబడేద్వృణ
> ప్రాయముగాగ బ్రాణముల బట్టి విసర్జన సేతుమిప్పుడే
> యీమెడ నీవు కన్గొనమినీతకు మిక్కిలి లోతు గల్గునే"
>
> (రుక్మా చ 4-22)

అని రాజును దీనంగా వేడుకున్నారు. ప్రతాపరుద్రగజపతి రాయల చేతిలో ఓడి పోయి, అతనికి తన కూతురు నిచ్చి అతనితో సంధి చేసుకున్నాడు.

"ఆ భార్యను కృష్ణదేవరాయలు సరిగా చూడలేదు ఆమె కర్నూలు జిల్లా కంబంలో నివసిస్తూ ఏకాంతంగా బతికిందట"[10]

విజయనగర రాజు "రెండవ దేవరాయలకు భార్యలూ, ఉంపుడుకత్తెలూ ఏడు వందల మంది అని రజాక్ వ్రాసేడు, కృష్ణదేవరాయలకు పన్నెండు మంది భార్యలు. అంతఃపురంలో పన్నెండు వేల మంది. ఏ ముసలి వానినో తప్ప మగవాడి మొగం ఎరగని స్త్రీలు ఉన్నారని పయోస్ వ్రాసేడు. అచ్యుతరాయలుకు అయిదు వందల మంది, మరో అంత మంది ఉంపుడుకత్తెలు ఉన్నారని నన్నిజ్ వ్రాసేడు. వారంతా సర్దార్ల బిడ్డలే నంటాడు. ఒక్కొకామెకు ఒక్కొక్క గది వరుసగా కట్టించేడనీ, ఆస్త్రీలు గదిగుమ్మంలో నిలుచుని, విశ్రాంతి తీసుకొనేందుకు పోతున్న రాజు, గుమ్మంలోనికి వచ్చినప్పుడు ఆహ్వానిస్తుంటారనీ, రాజు ఆసమయానికి తనకు తోచిన ఆమె గదికి వెడతుంటాడనీ ఆయన వ్రాసేడు"[11]

పై వివరణ బట్టి రాజుకు ఎంతమంది భార్యలూ, ఉంపుడుకత్తెలూ వుంటే అంత గౌరవం వుండేదని తెలుస్తోంది. స్త్రీని భోగ వస్తువు అన్నారంటే ఆమెకు సమాజంలో సముచిత స్థానం లేదని అర్థం. ఆనాటి రాజులకు వివాహబంధంలో వుండే ప్రేమానురాగాల కంటె స్త్రీల అందచందాలే తృప్తి నిచ్చాయి.

## రా జ ధ ర్మ ం

రాజ ధర్మాన్ని గురించి తెలుగు కావ్యాలు విరివిగా పేర్కొన్నాయి. 'రాజ' పదవి చాలా బరువు బాధ్యతలతో కూడుకొని వుండడాన్ని దృష్టిలో వుంచుకొని కాబోలు అతనికి దైవత్వం ఆపాదించబడింది.

ధర్మశాస్త్రాలు ప్రవృత్తి రూప ధర్మానికి, నివృత్తిరూప ధర్మానికి సమ సమప్రాధాన్యాన్నిచ్చాయి. ప్రవృత్తి రూప ధర్మాలు ఒక వ్యక్తికి సంబంధించినవికావు, అవి విశ్వశ్రేయస్సుకు ఆధారాలు ప్రవృత్తిరూప ధర్మాల్లో రాజధర్మం ఉన్నత స్థానాన్ని ఆక్రమించింది [12]

"ప్రజల సుఖమే రాజునకు సుఖము, ప్రజల హితమే రాజునకు హితము. తన ప్రియమే రాజునకు హితము కాజాలదు. ప్రజలకేది హితమో అదియే రాజునకు హితము"[13] అని కౌటిల్యుడు రాజధర్మాన్ని నిర్దేశించాడు, "ద్రోహులను దండించాలి. శత్రువులను జయించాలి. ఉత్సాహంతో ప్రజలను రక్షించాలి. ఈ విధులు నెరవేర్చడానికే బ్రహ్మ రాజు లను సృష్టించాడట! (స నీ స. 1-141)

> "సకల జనాను రంజనము సత్యము శౌచము మంత్రగోపనం
> బకృపణ వృత్తి దక్షతధనార్జిత శీలత భోగ మీగి నా
> స్తిక ఖలసంగ వర్జనము శిష్ట విధేయత దుష్ట నిగ్రహం
> బకుటిల భావ మింద్రియ జయంబు గుణంబులు భూమి భర్త కున్"
> (స.నీ.స. 1-144)

ఇవి రాజుకు వుండాల్సిన గుణాలు. అన్ని ధర్మాల్లోనూ రాజధర్మం గొప్పది. ఏనుగు పాదంలో అన్ని జంతువుల పాదాలు ఇమిడి పోతాయి. రాజ ధర్మంలో అన్ని ధర్మాలు ఒదిగి వుంటాయి. రాజు ధర్మ స్వరూపుడు. సమస్త ధర్మాలు రాజు చేత రక్షించబడతాయి.

> "శరణన్న వారి గాచుట
> దురమున వీరారి వరుల దునుముట ప్రజలన్

బరి పాలనంబు సేయుట
ధరణీపాలునకు ముఖ్యధర్మం బెపుడున్" (రుక్మ.వ. 3-65)

రాజ ధర్మాన్ని గురించి ఇంకా ఇలా చెప్పబడింది.

"పార్థివోత్తములకు బ్రజల రక్షించుట
పరమ ధర్మంబగు నరవరేణ్య!
ధరణీశులకు బ్రజాపరి పాలనంబున
బూని లోకులు సేయు పుణ్యమందు
షష్ఠాంశ మర్థిని సంప్రాప్త మగునట్లు
ప్రజలబ్రోవని రాజు ప్రజల చేత
నపహృత సత్పుణ్యుడై వారు గావించు
ఘనపాప ఫలము దాననుభవించు

గాన నీవును విప్రవరానుమతము
సాంప్రదాయక విధమునై జరుగు ధర్మ
మహిమ జేపట్టి యర్థ కామముల యందు
సమత నమ్మూటి యందు నాసక్తి లేక" (భాగ 4-541)

ప్రజలకు అనురక్తుడై రాజు రాజ్యాన్ని పాలించాడట। (భాగ. 4-543) రాజులకు ప్రజల్ని రక్షించడమే పరమ ధర్మం ఆ ధర్మాన్ని ఆచరించిన రాజుకు ప్రజలు చేసుకొన్న పుణ్యంలో ఆరవ భాగం సంప్రాప్త మవుతుంది ప్రజల్ని రక్షించలేని రాజు ప్రజలు చేసే గొప్ప పాప ఫలాన్ని అనుభవిస్తాడు. కాబట్టి విప్రశ్రేష్ఠుల అనుమతితో సంప్రదాయంగా జరిగే ధర్మాన్ని పాటించి అర్థ, కామాలలో సమత్వాన్ని చూపాలి.

ప్రజారంజనం కోసం వ్యక్తిగత సుఖాల్ని చాలామంది రాజులు త్యజించారు. "ప్రజల ఆరాధన కోసం స్నేహం, దయ, సౌఖ్యం, చివరికి జానకిని కూడా ఏమాత్రం బాధ పడకుండా త్యజిస్తాడు అంటాను రాముడు"[14] అందుచేత ఈనాటికి రామరాజ్యం అంటే ప్రజాసంక్షేమ రాజ్యం అనే అర్థంతోనే వుంది.

"ధరణీశ్వరులకు ధర్మం
బరయంగా బ్రజల యార్తి యణచుటయె కదా...."
(మా.పు. 1-179)

ఎలాంటి కష్టాలున్నా విసుగు చెందకుండా రాజు ప్రజల్ని కాపాడాలి. ఆపదలో వున్న వాళ్ల మొరల్ని ఆలకించి, వాటిని తొలగించాలి. కార్యనిర్వహణ భారాన్ని మర్జనులకు వదలిపెట్టకూడదు (ఆము. 4-204)

ఆర్తజన రక్షణ - రాజు దుష్టుల్ని శిక్షించాలి. శిష్టుల్ని రక్షించాలి. నిర్మల చిత్తంతో రక్షించె రాజుకు ఏ కష్టాలు రావు. (భార.శాం. 2-341)

"అతి భీతుడైన శరణా
గతునార్తుని శత్రునైన గడుకొని కరుణా
న్వితుడై రక్షింపని దు
ర్మతియగు క్షత్రియుని బ్రతుకు బ్రతుకే తలపన్"
(మా.పు. 8-263)

అని అన్నారు కాబట్టే శరణు వేడిన శత్రువును కూడా రక్షించారు ప్రాచీన భారతీయ ప్రభువులు"... క్షత్రియునకు శస్త్రధారణం బార్తత్రాణ రక్షణార్థంబు.." (మా పు. 8-165)

.త మ క్షత్రకులజులు పిత్తగి పి, యాదరింతురు కరుణతో నార్తరవము"
3-97)

అంతేకాదు "దుష్టశిక్షణ, శిష్టరక్షణ, చేయలేని క్షత్రియులకు సత్కీర్తి కలగదట! (ద్వి.భార. 3-64)

"ప్రాణేచ్ఛ వచ్చి చొచ్చిన
ప్రాణుల రక్షింపవలయు ప్రభువులు..." (భాగ. 8-234)

ఇలాంటి మాటల వల్ల ప్రాచీన రాజులు ఆర్తజన రక్షణపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపేవారని తెలుస్తోంది.

"దుష్టజన విగ్రహంబును
శిష్ట ప్రతిపాలనంబు జేయుచు ధర్మా
విష్టుడగు రాజు చెడడు వి
కృష్టుండగు రాజధర్మకృతి చెడిపోవున్" (భాస్క.యుద్ధ. 302)

ఇలాంటి రాజధర్మం స్పష్టం చేయబడింది.

"ఏ యెడ ననదల మొఱవా
లాయము వినవలయు దుర్బలస్య బలం రా

జా యన వినవే? ధరణీ
నాయకులకు నార్త రక్షణంబులె క్రతువుల్" (మను. 4-74)

పంటల్ని, జనపదాల్ని నాశనం చేసే దున్నపోతులు, మదించిన ఏనుగులు, ఎలుగుబంట్లు. పందులు, జింకలు మొదలైన జంతువుల్ని చంపి ప్రజల్ని రక్షించాడు రుక్మాంగదుడు,

"భయమున భూప్రజలాడిన మాటలు
పార్థివ శేఖరుడాటకఁజన్
గయికొని యేల విచారము నే గలు
గన్ మృగకోటుల ద్రుంచెదనే
భయమును వద్దు సుఖంబున నిండుల
పట్టున నుండు డటంచు మహా
దయనిగుడన్ ప్రజ నంపి విభుండు ప్ర
తాప మెలర్పగనక్షణమే" (రుక్మాం.చ 3-13)

వేటకు బయలుదేరడానికి సిద్ధమైనాడు. ప్రజల భయాన్ని తొలగించి, వారిని రక్షించడం రాజు తక్షణ కర్తవ్యం. ఆ కర్తవ్యాన్ని మహారాజు నెరవేర్చాడు.

నరకుడు పెట్టే బాధలు భరించలేక ముని బృందం కృష్ణుని శరణు వేడింది. "ముని యాదవేంద్ర సమితి సంతసము నొంద నరకుని చంపువాడ " సని (ఉ.హరి, 1-110 నుంచి 121) ప్రతిజ్ఞచేసి నరకుని వధించాడు కృష్ణుడు

"రాజు నిజప్రజా సముభిరక్షణ మెప్పుడు సేయ భూజనుల్
రాజున కర్థ వృద్ధియు ధరన్ బహు భంగుల గూర్తు రిందు లో
రాజభివృద్ధి కంటె జనరక్షయె యుత్తమ మెందు భూజనుల్
రాజు సురక్షలేక చెడి రాజభివృద్ధి యొనర్ప నేర్తురే"
(ప.నీ.స. 1-98)

పొంగలబారి నుంచి రాజు ప్రజల్ని రక్షించాలి. దొంగల పట్ల కరుణ చూపక క్రూరంగా ప్రవర్తించాలి. (రుక్మా చ. 3-33) దుర్మార్గుల్ని శిక్షించకపోవడం, సన్మార్గుల్ని కోపంతో వధించడం రాజుకు పాపం కలగడానికి కారణాలు ఇలా చేయడం వల్ల ఆరాజు ప్రజల చేత భంగపడడం కూడా జరుగుతుంది. (రుక్మాం.చ. 3-55) రాజు దండన చేయకపోతే బలవంతులు బలహీనుల్ని మట్టుపెడతారు. జార, చోరులు అధికమవుతారు (రుక్మా చ. 3-56)

రాజు వర్ణాశ్రమ ధర్మాల్ని రక్షించాలి:- "బ్రాహ్మణాది వర్ణాలను, బ్రహ్మచర్యాశ్రమాల్ని రక్షించడానికి బ్రహ్మ రాజును సృష్టించాడు.

"నాలుగు పురుషార్థములకు
నాలుగు వర్ణముల వారి నడవడికిని, భూ
పాలకుడు కారణము త
త్కాలంబున నెపుడు సర్వమండల పోషణన్"
(శ్రీ.రం.మ. 5-89)

ధర్మార్థ కామమోక్షాలనే నాలుగు పురుషార్థాలకూ బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగు వర్ణాల వారి నడవడికి రాజే ఆధారం. వీటిని రక్షించాల్సిన బాధ్యత రాజు మీద వుంది.

వర్ణవ్యవస్థను కాపాడడం రాజ ధర్మం. వైదిక ధర్మానికి, వర్ణవ్యవస్థకు అవినాభావ సంబంధముంది. జైన బౌద్ధాల నుంచి, తరువాతి కాలంలో ఇస్లాం మతం నుంచి వైదిక ధర్మాన్ని రక్షించడానికి వైదిక సమాజాన్ని సంఘటితం చేయవలసిన అవసరం రాజులకు ఏర్పడింది. అందుకే వర్ణవ్యవస్థను పటిష్టం చెయ్యడం, ఆశ్రమ ధర్మాల్ని రక్షించడం తమ ధర్మంగా రాజులు భావించారు.

నాలుగు వర్ణాల వారిని,

"..... ..... ..... ..... ..... .....
బ్రహ్మ సృష్టి క్రియా పరత నొంది
వక్త్రంబు నందును వక్షంబు నందును
దొడల యందును దనయడుగు లందు
నుద్భవింప ......" వేశాడట' (మా.పు. 4-35)

అనాటి సమాజ నియమాల ప్రకారం ఎవరి వృత్తి ధర్మాన్ని వారు ఆచరించాలి. అధర్మాన్ని చెడకుండా చూడడం రాజ ధర్మం. ప్రాచీన సాహిత్యంలో వర్ణాశ్రమ ధర్మాన్ని గురించి అధికంగా చెప్పబడింది. ఇవి సుదీర్ఘంగా వున్నా, సంక్షిప్తంగా వున్నా వీటి సారాంశం ఒక్కటే. చాతుర్వర్ణ్య ప్రజల లక్షణాలిలా పేర్కొనబడ్డాయి.

"ధర్మ శాస్త్రముల యర్థ రహస్యము లెఱింగి
జరుపు బ్రాహ్మణుడు మోక్షంబు గాంచు
న్యాయ మార్గము నొకింతయును దప్పక ధాత్రి
పాలించు జనపతి పడయు ముక్తి

క్రయ విక్రయముల నారయ సర్వసముడైన
వైశ్యుండు పొందు గైవల్య పదము
నారాయణ స్మరణయు విప్ర పూజయు
కావించు శూద్రుండు గను బరంబు
నాల్గు వర్ణంబులును నిట్లు నడచి పొందు
ముమ్మరంబుగ నైహికా ముష్మికములు ..."
(జై భార 3-27)

బ్రాహ్మణ లక్షణాలు :

దమమున శౌచము దపమును
శమమును మార్దవము గృపయు సత్యజ్ఞాన
క్షమలును హరి భక్తియు హ
ర్షము నిజ లక్షణముల గ్రజాతికి నధిపా (భాగ 7 412)

క్షత్రియ లక్షణాలు :

"శౌర్యము దాన శీలము బ్రసాదము నాత్మజయంబు దేజమున్
ధైర్యము దేవ భక్తియును ధర్మము నర్థము గామమున్ బుధా
చార్యముకుంద సేవకులును సత్కృతి సంచరితోషణంబు స
ద్వీర్యము రక్షణంబు బ్రథి వీర శేఖర రాజ చిహ్నముల్"
(భాగ 7-413)

వైశ్య లక్షణాలు :

"ధర్మార్థ కామ వాంఛయు
నిర్మల గురుదేవ ప్రవివహార్చనముల్
నిర్మద భావము ప్రమదము
శర్మకరత్వమును వైశ్యజనలక్షణముల్" (భాగ 7-414)

శూద్ర లక్షణాలు :

"స్తేయము లేని వృత్తియు శుచిత్వము సన్నుతియు న్నిజేశులన్
మాయలు లేకిడాయుటయు మంత్రము సెప్పక పంచ యజ్ఞముల్
సేయుటయున్ ధరామరుల సేవయు గోవుల రక్షణంబు న
న్యాయములేమియున్ మనుజనాథ యెఱుంగుము శూద్ర ధర్మముల్"
(భాగ. 7-419)

జాతి మాత్రం చేతనే పురుషునికి వర్ణాన్ని నిర్దేశించరాదు 'శమదమాది వర్ణలక్షణ వ్యవహారాల'ను కూడా చూడాలంటాడు నారదముని (భాగ. 7-415)

"చతుర్వర్ణ చతురాశ్రమములతో కూడిన ఈ లోకం రాజదండముచే పాలింపబడి స్వధర్మకర్మల యందభిరుచి కలిగి ప్రజలను తమ తమ మార్గములందు నడుమన్నట్లు చేయు చున్నది"[16] అని కౌటిల్యుడు పేర్కొన్నాడు."

రాజు నిజధర్మ తత్పరుడై సకల వర్ణధర్మ రక్షణ వదలకుండా వుండాలి. తన కర్మలను విడిచేవాడు. తన పుత్రుడైనా అతన్ని దండించాలి అలా చేస్తే ఎవ్వరైనా కర్మ పరిత్యాగం చేయడానికి భయపడతారు. (శృ.శా 5-32)

ఇలా వర్ణవ్యవస్థను కాపాడడానికి ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా అది విచ్ఛి న్నం కాక తప్పలేదు. ఈ వ్యవస్థలో కొందరు అగ్రజాతి బ్రాహ్మణులు వైదికా చారాలకు తిలోదకాలివ్వడం ఒక కారణమయింది. మరి కొందరు బ్రాహ్మణులు మద్యాన్ని సేవించడం ధనాన్ని దొంగలించడం, సత్కర్మలు ఆచరించక పోవడం చేశారు (భార. శాం. 2-89) ఇంకా కొందరు చండాలుని వల్ల దానాన్ని గ్రహించి బహిష్కృతులైనారు. (కాశీ. 7-237 నుంచి 250) అంతేకాదు ఇతర వర్ణాల స్త్రీ లతో సంపర్కం పెట్టుకున్నారు. (భార. ఆది 5-235) వాళ్ళ స్త్రీలను క్షత్రియు లు పెళ్లిచేసుకున్నారు (భార ఆది 5-23.) వర్ణవ్యవస్థను రక్షించడానికి ఎంత కఠినంగా వ్యవహరించి నప్పటికి అందులో లోపాలు తప్పలేదు, లోపభూయిష్ఠమైన వర్ణవ్యవస్థ అధర్మ వ్యవస్థగా మారింది. అందువల్ల కులం కంటె గుణం ప్రధానం అని గ్రహించారు (భార అర 5-126) అన్ని వర్ణాల ప్రజలు ఒక్కటి కావడా నికి ప్రయత్నాలు జరిగాయి పాలకులు కూడా వర్ణవ్యవస్థ పట్ల తమ దృక్పధాన్ని మార్చుకున్నారు. బ్రాహ్మణుల్ని తమ మంత్రులుగా నియమించుకునే ఆచారాన్ని వదిలివేశారు (ప.పీ చ పుట 50)

"నిర్వోటభుజియించి రేని కార్యస్థులై
సామంత నృపతులు చాపకూడు .... ...." (క్రీడా -122)

అనడం వల్ల వర్ణవ్యవస్థ నిర్మూలనకు నాంది పలికినట్లయింది. దీన్ని శైవమత ప్రభా వంగా పేర్కొనవచ్చు.

ధర్మార్థకామాలు వర్గత్రయం. ఇవి భౌతికాలు. నాల్గోదైన మోక్షం అధ్యా త్మికం. అన్నిటిని కలిపి పురుషార్థాలు అంటారు. రాజు ధర్మవర్తనుడై ధర్మ మార్గంలో అర్థం సంపాదించాలి. ఆ అర్థాన్ని ప్రజల కోసం వ్యయం చేయాలి సక్రమమైన మార్గంలో కామాన్ని తీర్చుకోవాలి. ఇలా రాజు ప్రజలకు ఆదర్శంలి. ప్రవర్తించాలి.

"అధిప! పెఱయా శ్రమస్థుల కందఱకును
విను గృహస్థాశ్రమము వాడె వెలయ నూత
యట్టి గృహమేధులకు గీడు పుట్టకుండ
గాచు కర్తలు రాజులు గారె యరయ (భోజ. 2-64)

రాజు ఆశ్రమ ధర్మాలకు - బ్రహ్మచర్య, గృహస్థ వానప్రస్థాశ్రమ ధర్మాలకు - కీడు కలగకుండా చూడాలి.

"మంత్రుల మర్మకర్మము లెఱింగెడు చాటె
కోటలు కాపాడు కొనెడు నేర్పు
తలికాపు పెడకుండ సరిగోరు గానురీతి
యీతి బాధలు చెందనీని సొంపు
పరులయాలోచనల్ పరికించు గఱియఱు
నర్థార్జనము మీది యాదరంబు
వేట తోటల మీది విలసిల్లు నాసక్తి
యుద్యోగి గుండు నొప్పిదంబు
తగిలి పిఱిపీకు సేయు, నుద్దండ వృత్తి...." (ఇపచ 4-82)

రాజు విశిష్ట లక్షణాలు.

రాజు కళల చేత పూర్ణత్వం పొందాలి. (భాగ 1-297) రాజు ప్రజా రక్షకుడు తన మేధ, పరాక్రమం మొదలైన గుణాలతో ప్రజలను రక్షిస్తూ, వాళ్ల జీవనస్థాయిని పెంపడానికి కృషి చేయాలి రాజ ధర్మాన్ని నీతినీ ఆచరించడం తేలికకాదు. కుటిల రాజకీక వ్యవస్థలో రాజు సత్యవంతుడుగా, నీతిమంతుడుగా ఉండడం చాలా కష్టంగా వుంటుంది. తన పదవిని హెూదామ, రాజ్యాన్ని రక్షించుకోవడానికి రాజు వక్రమార్గంలో పయనించాడు. మధ్యయుగంలో ఇలా ప్రవర్తించడం ప్రతీ మించింది. రాజు అధర్మపరుడైతే ప్రజలూ అలానే తయారవుతారు 'యథా రాజా తథా ప్రజా!' కాబట్టి రాజు ఆదర్శ పాలకుడుగా వుండాలి రాజ ధర్మాన్ని తుచ తప్పకుండా పాటించాలి.

రాజు - రక్షణ - రాజ్యం యొక్క అస్తిత్వం రాజుపైన ఆధారపడి వుంటుంది, కాబట్టి రాజును మట్టుబెట్టడానికి శత్రువులు పరిపరి విధాల ప్రయత్నిస్తారు. అందువల్ల రాజు తన రక్షణ గురించి అనుక్షణం జాగ్రత్తగా వ్యవహరించాలి. 'శత్రువులే కాదు. తన బంధువుల్ని దాయాదుల్ని చివరికి తన భార్యా బిడ్డల్ని కూడా నమ్మకూడదు

"పుట్టిన నిమిషము మొదలు రాజపుత్రుల వలన కలుగు ప్రమాదముల నుండి రాజు తన్ను రక్షించుకొనవలెను. ఏలయన "రాజపుత్రులు ఎండ్ర కాయతో సమానమగు ధర్మము కలవారు. అందువలన తండ్రినే భక్షించెదరు"[17] అని కౌటిల్యుడు చాలా కటువుగా చెప్పాడు.

"తల్లి దండ్రినైన దమ్ముల నన్నల
సఖులనైన బంధు జనులనైన
రాజ్యకాంక్షచేసి రాజులు చంపుదు
రవనిదఱచు జీవితార్థులగుచు (భాగ 10-55)

రాజు ఎవరినైనా చంపడానికి వెనుకాడ డనడాన్ని "....రాజ్యకాముకులకు నన్నత మ్ముండను వావిగలదె?" (మా.పు. 8-25) అనే వాక్యం బలపరుస్తోంది.

శత్రువుల నుంచి ఏ రూపంలో అపదలు సంభవిస్తాయో వూహించడానికి వీలుండదు. అందువల్లే రాజును రక్షించడానికి "లెంకలు" అనే అంగరక్షకు లుండేవాళ్లు.

"చక్రవర్తికి లెంకలు అంగరక్షకులు. రాజును, రాజసౌధాన్ని సర్వకాల సర్వావస్థలలో కాపాడుటయే వారి వృత్తి ధర్మం వీరు రాజునకు పుత్రులతో సమానం. రాజ సంరక్షణ వారి వ్రతం. రాజు భోజనంచేసి వదలి పెట్టినదే వారి ఆహారం. ఉద్యోగంలో చేరునప్పుడు రాజే వారికి గురువు దైవమని, రాజు సంరక్షణే వారి నిరంతర కర్తవ్యమని ప్రమాణం చేసేవారు. రాజుతో వారు యుద్ధ భూమికి వెళ్లి రాజా ప్రక్కగా నిలబడి శత్రువుతో యుద్ధం చేసేవారు. ఒకవేళ రాజు మరణించినచో వెంటనే వారుకూడా ఆత్మహత్య చేసుకొంటారు. 'రాచపీనుగ తోడు లేనిదే పోదు'అన్న సామెత పుట్టుటకు ఈ లెంకలే కారణం"[18]

నాయకురాలు నాగమ్మను గోపన్న దూషిస్తే నలగాముని లెంకలు అతనిపై దాడిచేసి చంపారు.

"తమగము పయినుండి తమకంబు తోడు
కోపించి లెంకలు గొదకొని యురికి" (ప.వీ.చ. పుట 155)

గోపన్నపై పడ్డారు. కామాయ లెంక, పెండేల యెరలెంక, పెద్దపోతు లెంక, భీము లెంక, పెద్ద జన్నాయ లెంక మొదలైన వారు నలగాముని లెంకలు. (ప.వీ. చ. పుట 155, 156)

శత్రువుల్ని, శత్రువుల బంధువుల్ని, తన కొలువులో వుండే వారిని, వుండని వారిని, పూర్వం తన చేత కీడు పొందిన వారిని రాజు ఎన్నడు నమ్మరాదు. పూర్వం ఒక రాజు కొలువులో వుండి, అతనికి ఎగ్గువేసి వచ్చిన నీచుని తగిమి వేయాలే తప్ప వాణ్ణి హితునిగా భావించి ఆదరించరాదు. (రుక్మాంచ, 3-16,17)

పరీక్షించనిదే ఏ వస్తువును రాజు వుపయోగించరాదు, "ఇతరులు బహువిధాలైన ఆహార పదార్థాన్ని పంపితే, వాటిని ముందుగా ఒకనిచేత తినిపించి అతనికి అవి జీర్ణమైనట్లు తెలిసిన తరువాతనే రాజు ఆ పదార్థాల్ని భుజించాలి (రుక్మాం.చ, 3-18) వస్త్రాలు కూడా పరీక్షించనిదే ధరించరాదు.

నాగమ్మ మలిదేవుని దూషిస్తుంది అలరాజు ఆమెను కత్తితో చంపడానికి ప్రయత్నిస్తే ఆమె నలగాముని వెనక్కి పోయి తప్పించుకుంటుంది. ఆ మరునటి దినం నాగమ్మ

"అలరాజునించేరి యవలీల మొరగి
ఈ బెండు యని చేనిచ్చి యాఘ్రాణ
మొనరించుమనట్లుగా నొనరించి తేని
ఇచ్చ వచ్చిన మెచ్చు లిచ్చెదపాలు
మాలికతో నీవు మరలితివైన
నడుమ తునుకలుగాను నరకింతు నిన్ను
తడయక చను" మని తంబళ కొమ్మ జియ్యరును చెర్ల గుడిపాటికి పంపింది. (షృవీంచ పుట 2-74)।

ఆ జియ్యరు నమ్మకంగా ఆపూల చెండ్లను అలరాజుకు ఇచ్చాడు. కన్నమ నమూనించి నప్పటికి అలరాజు "జియ్యరుకు మన యెడ మిక్కిలి మర్యాద కలదు" అని అంటూ ఆ పువ్వుల బంతుల్ని మక్కువతో ఆఘ్రాణించి మృత్యువువాత పడ్డాడు.

విషప్రయోగాల నుంచి రక్షణ పొందడానికి తీసుకోదగిన చర్యలలో విషాన్ని గుర్తించే పక్షులను పెంచడం ఒకటి

"కొనగొని కొండ ముచ్చులజకోరములన్ శుకశారికాళిన్
బెనుతురు భూపతుల్ విషము వెట్టిన యన్నము జూచి యోలిజ
య్యనవవి పెంటిక ల్విడువనక్షులు మూయగ గూయుచుండగా
గనికుటిల ప్రయోగములు గాంచుటకై నృపమంత్రిశేఖరా
(స నీ.స. 1-35)

ఇలాంటి జాగ్రత్తలనే కౌటిల్యుడు పేర్కొన్నాడు.[19]రాజుకు ప్రీతి పాత్రుడైన కుమారుడు కూడ వేళకాని వేళలో నిర్భయంగా రాజమందిరంలో ప్రవేశించరాదు.

అంతఃపురంలో భద్రతా చర్యలు ఇంకా ఎక్కువ తీసుకోవాలి. "మంగళ్ళు నౌకర్లు ముందుగ స్నానముచేసి, తమ వస్త్రములను చేతులను శుభ్రపరచుకొని అంతఃపుర రక్షకుని నుండి ముద్ర వేసిన వస్తువులను తీసుకొని రాజునకు పరిచర్య చేయవలెను."[20]

"వృద్ధ స్త్రీలు శుద్ధురాలని చెప్పిన తరువాతనే లోపలి కక్షలోని రాణిని చూచుటకు రాజు వెళ్లవలెను. ఏలయన, రాణి గదిలో దాగియున్న సోదరుడు భద్రసేనుని, తల్లి పడకలో దాగియున్న కుమారుడు కరూశుని చంపిరి తేనేయని విషమును పేలాలతోకలిపి కాశీరాజును, విషము పూసిన కడియముతో వైరంత్యుని, విషము పూసిన మేఖలామణితో సౌవీర రాజును, అద్దముతో జాలూథుని వారివారి రాణుల చంపిరి జడలో అస్త్రమును దాచి యుంచుకొని విదూరథుని అతని రాణి చంపెను కనుక ఇట్టి యవకాశములు రాకుండ నతడు జాగ్రత్త పడవలెను"[21] అని కౌటిల్యుడు రాజులను హెచ్చరించాడు.

పై విషయాలను మడికి సింగన కూడ పేర్కొన్నాడు. (స.నీ.స. 1-288)

రాజు రక్షణ గురించిన ఇంకా కొన్ని జాగ్రత్తలు.

'కంచుకోష్టీషముల్ గల వర్షధర కుబ్జ
కైరాత వామనుల్ చేరి కొలువ
సమయోచితమ్ముగను రాజన్యుడంతఃపురో
ర్వీతలంబున విహరింప వలయు
విత్తజ్ఞులును శుద్ధ విత్తులు నగునట్టి
సవిషలింపుగ నరేశ్వరుని జేరి
శస్త్రాగ్ని విష వివర్జనముగ నొయ్యన
నర్మ వాక్యమ్ము లొనర్చ వలయు

నంతిపురములోన నధిపతి యున్నప్పు
డచట బోయకుండు నాత్మ సైన్య
మతని జేరి మిగుల నాయితమై నిల్చి
వెలగి రక్షణంబు సేయ వలయు" (స.నీ.స. 1-283)

రాజు నమ్మకమైన వారినే తన అంగరక్షకులుగా నియమించుకోవాలి. అలా చేయక పోవడంవల్ల ఆపదల్ని ఎదుర్కోవలసి వుంటుంది. అంగరక్షకుల నియామకంలో అజాగ్రత్త చూపడంవల్ల దారుణ ఫలితాల్ని చవిచూడవలసి వుంటుంది[22]

"గుంపు గూడిన వారి నడుమ రాజు ప్రవేశించరాదు" అని కౌటిల్యుడు చేసిన సూచన ఈనాటికీ పాటించదగిందే [23] అతని దెంత ముందుచూపు!

<u>రాజ దోషాలు</u> :- రాజుల పతనానికి కారణాలైన దోషాల్ని రాజు త్యజించాలి ఎంత పెద్ద నావకైనా ఒక చిన్న చిల్లు చాలు నీటిలో మునిగిపోవడానికి ఎంత గొప్ప చక్రవర్తికైనా ఒక చిన్న దోషం చాలు అతను, అతని రాజ్యం పతనం కావడానికి (ఆంగ్ల విషాదాంత నాటకాలన్నీ ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకొని వ్రాయబడ్డవే!) కాబట్టి రాజులు దోషాల్ని గుర్తించి జాగ్రత్తగా మెలగాలి.

"మంత్ర గోపనమునే మఱుట యు దీర్ఘచిం
తయు నిరర్థకపు చింతయు ప్రసాద

"విరహితత్వము బుధావిజ్ఞానము ఓబా ప్ర
మోగంబు విషయాళి రాగభరము
నన్ఋతంబు నాలస్యమును నాస్తికత్వంబు
నర్థంబు లందు ననర్థమతియు
దీర్ఘసూత్రత్వంబు దీర్ఘరోషంబు ని
ర్జిత కార్యము లాచరింపమియును

భూపతికి దోషములు నివి పదునాల్గు
వీని దెలిసి నెఱయ విడువ వలయు
గాన దోషంబులై మాఱినట్టి స
ప్తవ్యసనములందు దగుల వలదు" (కళా. 7-266)

ఇలాంటి రాజదోషాల్ని నన్నయ అంతకు ముందే పేర్కొన్నాడు (భార. సభా. 1-56)

"కొండియములు విన్నపములు
దండువ యర్థార్జనంబు తరుణులె భృత్యుల్
మండు చనువికి యెలావుగ
నుండెడి భూవిభుడు ప్రజకునుత్పాతమిలన్" (స.నీ.స. 1-230)

ఇతరుల దోష కథల్ని వింటూ ఆనందపడేవాడు, ఇతరుల్ని పీడించేవాడు, బలంతో పరస్త్రీలను చొంగలించడమే సుఖమనుకునే రాజు ప్రజలకు ఎక్కువ ఆపదల్ని కలిగిస్తాడు (స.నీ.స. 1-231)

ఎవరైనా తప్పుచేస్తే ప్రజలు వాళ్ళపై రాజుకు విన్నవిస్తారు. రాజే తప్పు చేస్తే ఎవరికి చెప్పాలి? (స.నీ.స. 1-233) కాబట్టి రాజు ఇలాంటి దోషాల్ని తన దరిదాపులకు రానీయకూడదు.

రాజులు - వ్యసనాలు -

వ్యసనపరులైన రాజులు, వాళ్ల రాజ్యాలు నాశనంకాక తప్పవు. తద్వారా ప్రజలు ఇబ్బందుల పాలవుతారు. కాబట్టి రాజులు వ్యసనపరులు కారాదు. వ్యసనాలు సప్త విధాలు రాజులు వీటికి దూరంగా వుండాలని ప్రాచీన భారతీయ సాహిత్యం ఏకకంఠంతో ఘోషిస్తోంది.

"స్త్రీపానాక్ష మృగ వ్యధ
నాపహరణ దండ నిష్ఠురాలాపములన్
పాపగ సప్త వ్యసన
వ్యాపారములుడుగ వలయు వసుధేశునకున్" (కుమా. 10-184)

వేట, జూదం, పానం, మాట బిరుసు కఠిన దండం కాంత, తగని దానం. అనే సప్త వ్యసనాల పట్ల ప్రభువులకు ఆసక్తి వుండరాదు. (రుక్మాం.చ. 3-76)

"వెలది జూదంబు పానంబు వేట పలుకు
ప్రల్లదంబును దండంపు పరుసదనము
సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ము సేత
యనెడు సప్త వ్యసనముల జనదు తగుల" (భార.ఉద్యోగ 2-44)

ఈ పద్యపాదాల్ని పుడిసిట బట్టినట్లున్నాయి ఈ క్రింది వాక్యాలు.

"బోటి జూదంబు పానంబు వేట జనుట
తిట్టుటయు హేతువుగను దండించదలచు
టొకిత దొలింగి యనుచితంబైన వ్యయము
సేయుటయు నివి వ్యసనముల్పాయ వలయు" (కృ.వి. 2-54)

"వేట జూదంబు పానంబు మాటబిరుసు
కఠిన దండంబు తరలాక్షి కానియీవి
యనెడి వ్యసనంబు లేడింటి యందు మమత
తగదు కావింప ధారుణీ తల విభుండు" (రుక్మాం.చ. 3-76)

సప్తవ్యసనాలు వల్ల పతనమైన రాజుల్ని గురించి ఇలా చెబుతోంది.

"వేట పాండు క్షమావిభుడు శాపము నొందె
　　ద్యూత సంగతి నైషధుండు నొగిలె
పానంబునను యాదవానీక మలకూలె
　　పరుషోక్తి కొంప ప్రతతి నమసె
కరిన దండమున మృగధుడు మేను దొఱంగె
　　భామి నీరతి సింహబలుడు గెడసె
తగని యీవితిశరకు ధరణీ పాలసుతుండు
　　తలపోయ రాని దుర్దశ చరించె

కాన వ్యసనంబు లేడును కాని వగుట
యెఱిగి మనమున నెందులో నించుకైన
తగులొనర్పక నిల్చిన ధరణి యెల్ల
నేలు నిష్కంటకముగ భూమీశ్వరుండు" (రుక్మాం.చ. 3-77)

ఇదే విషయాన్ని మంచన (కే బా.చ. 4-206) పేర్కొన్నాడు.

వే ట:- రుక్మాంగద మహారాజుతో అతని భార్య సంధ్యావళిదేవి వేటాడడం దూషితమంటుంది.

"వేటలాడగ దూషితంబులు వేట లార్య విరోధముల్
వేటలూర్జిత ధర్మ హీనులు వేటలక్రమ మార్గముల్
వేటలుగ్రత రాఘశాలలు వేటలత్యపవాదముల్
మాట లేటికి భూప! వేటలు మాని యుండుము సుస్థితిన్"
(రుక్మాం చ 3-75)

అయితే ప్రజలకు అపద కలిగించే క్రూరమృగాలను వేటాడడం ధర్మ హానికాదు. (రుక్మాం.చ. 3-79)

వేటాడడం ఎందుకు నిషిద్ధమో ఇలా చెప్పబడింది.

"పోశెంబు పరువుల బొడెము ఖేదంబున
　　దగదొట్టి వడదాకి తనువు నలగు
నన్మోదకంబు లాయాయి వేళల లేక
　　యొకరోగమెద్దియే నుద్భవించు
వలమీఱి క్రూరసత్వము లాగ్రహంబున
　　బయి వచ్చెనేని నొప్పమి ఘటిల్లు

దటి వేచిపొదలలో దరుల బాటున శత్రు
నరుగాచిన ప్రాణహానిపుట్టు

నవ్వయాగత ధర్మంబు లాచరింప
గాల వేళలు తప్పుట గలుష మంతు
నందు నష్టత బొందు రాజ్యాభివృద్ధి
వలనుగానిది వేట భూవర తనూజ (శృ శా. 4-165)

జూదం:– సమయం, ధనం రెండూ జూదం వల్ల వ్యయమవుతాయి. రాజ్యపాలనకు, రాజ్యాభివృద్ధికి సంబంధించిన వ్యవహారాల్ని చూడడానికి రాజుకు సమయం వుండదు. కాబట్టి కీలకమైన నిర్ణయాలు కూడా ఇతరులే తీసుకోవలసి వస్తుంది. అందువల్ల రాజుకు ఆపద ఏర్పడుతుంది. ఆ కారణంగా రాజు జూదమాడరాదు.

"ఆహార వేళ శయ్యారతి నంతఃపు
రాంగనాకేళి సౌఖ్యములు దొఱగు
గెలుపోటములు రెంటి వలననుత్సాహదై
న్యముల జిత్తము పీతి నందెపుడు
తమియు మత్సరము డెందమున నంతంతకు
బొడమికానడు పొద్దుపోడుపు గ్రుంకు
నొకసాయమై పందె మెక్కించి యోడెనే
గలధనం బెల్లను బొలిసి పోవు

గెలని నోడించు విధము దాగెలుచు విధము
దలచు కొనుచును రాజ్యతంత్రంబు బాగు
రీతి గోల్పడి యంచితఖ్యాతి బాయు
నెడప నొప్పడు జూదంబు నృపకుమార!" (శృ.శా. 4-164)

పానం – మత్తు పదార్థాల్ని సేవించడం వల్ల ఆరోగ్యం క్షీణించడమే కాకుండా, విచక్షణ, జ్ఞానాన్ని కోల్పోతారు. సమాజానికి లేదా రాజ్యానికి సంబంధించిన కీలకమైన నిర్ణయాల్ని తీసుకునే రాజు ఇలాంటవాటికి బానిసగా మారితే ప్రజలంతా ఇబ్బందులకు గురి అవుతారు.

"త్రావియానాడు మత్తాగొని పొరలాడు
నెఱుగడుల్లములోన వెదిరి దన్ను

బనిలేక చూపు గోప్యప్రసాదంబులు
భావింపనేరదు వావివరుస
విప్రలాపము లాడు విడువని వేలంబు
నూట నొక్కటి లేదు మాట నిజము
గుప్తి సేయగ నోపడాప్త రహస్యంబు
లైన కాములు దెలియంగ లేడు

లజ్జవోలియించు దాలిమి యజ్జగించు
నిద్ర కొడిగట్టు శీలంబు బిందజేయు
బ్రహ్మ హత్యాదు ములునూపు పాపవితతి
పానగోష్ఠి విధంబు భూపాల పుత్ర!" (శృ శా. 4-166)

<u>స్త్రీ లోలత్వం -</u>

రాజుకు స్త్రీ వ్యామోహం వుండరాదు ఆదర్శవంతుడైన రాజు సామాజిక నియమాల్ని గౌరవిస్తాడు. ఏకపత్నీ వ్రతం హైందవ సంస్కృతికి చిహ్నం. రాజు ఈ సంస్కృతిని కాపాడాలి. స్త్రీలోలుడుగా వుండరాదు

"అంగన కుచమండలాసక్తమై బుద్ధి
భూమండలము దెసబోవదయ్యె
లలన భ్రూ చాపవిలాసంబు మెచ్చుల
చాపమెన్నడు దృష్టి సైపదయ్యె
భామినీ రుచిరాంగ పరిరంభ లోలత
సప్తాంగ రక్షణ స్మరణ మెడలె
దరళాక్షి చూడ్కుల దాసాజ్ఞపడియుణ్కి
దరనాజ్ఞ చెల్లించు తగవు మఱచె

రమణి తోడ సంతతి రతి రాజతంత్ర మో
హమున రాజ్యతంత్ర విముఖుడయ్యె...." (కే.బా.చ. 1-70)

సౌఖ్యానికి బానిస కావడం చేత రాజు రాజ్య రక్షణను, రాజ్యపాలనను నిర్లక్ష్యం చేయడం. పూర్తిగా రాజ్యతంత్రాన్ని వదలి వేయడం జరుగుతాయి.

"ఎప్పోటు విలాసినులకు
మెచ్చిక చన విచ్చినం బ్రమాదము పతికిన్

వచ్చు నవశ్యము కాంతలు
వచ్చునప్పుడు విశ్వసింప ఒనదెవ్వరికిన్" (జై.భార, 3-32)

స్త్రీ వ్యసనాన్ని గురించి పేర్కొన్న సందర్భాలు ఇంకా వున్నాయి. (శృం. శా. 4-163)

మాట పరుసదనం:- రాజు ఎంత సహృదయుడైనా కఠినంగా మాట్లాడితే ప్రజలు అతనిని గౌరవించరు. చల్లని వర్షానిచ్చే మేఘం భయంకరంగా గర్జిస్తే భయపడడం లోక సహజమే కదా! రాజు కఠినంగా వుంటే కలిగే అనర్థాలు ఇలా వుంటాయి.

"తల్లి దండ్రులకు డెందము విరక్తి భజించు
నన్నదమ్ములకు పేరాస పడును
గురుకళత్రము పుట్టినిలుసేరనూహించు
ప్రాణ మిత్రుండును బగతుడగును
బావలు మఱదు లేర్పడమోము జూడరు
దాసదాసీజను లోసరదురు
తలగి పోవుదురు తాతలనాటి హితులు జు
ట్టాలు మేల్గీడు మాటయు నడుగరు

పాలనము సేయు చేపట్టి స్వజన బాపు
సకల జనులకు నట్టింటి శత్రుజేయు
నయము కెడయాక యెల్ల వెంటలను జెఱచు
మాట పరుస దనంబు కుమార చంద్ర!" (శృ శా. 4-167)

ఉగ్రదండం:- రాజు దండధరుడుగా వుండాలి అయితే దండం తగినంత మాత్రమే ఉపయోగించాలి. అతి మృదువుగా కాకుండా అతి కఠినంగా కాకుండా మధ్యమార్గంలో దండాన్ని ప్రయోగించాలి.

"అపరాధమునకు నర్హముగాక వెగ్గలం
బగు శిక్ష ప్రజపాల వెగడు గుడుచు
వెగడొందిన మనసున, బేడెత్తి నిలువక
వేఱొండు కడుగా పువిచ్చి పోవు
వినయ హీనత గాపువిచ్చి పోవిచ్చిన
నచిరంబ పారడయగు ధరిత్రి

ధరణి పారడయైన సరిగోరు మొదలుగా
దనకు ఘటిల్లు నాదాయనష్టి

ధాన్య ధనముల యందు నాదాయనష్టి
యైన నిర్ధనుడగు ధన హీనుడైన
దొడిగి పట్టుదరిద్రంబు దొలగు లక్ష్మి
యుగ్రదండంబు నను నృపాలాగ్రసూతి! (కృ.శా. 1-168)

కాబట్టి రాజు సప్త వ్యసనాలకు దూరంగా వుండాలి వీటికి బానిసలైన వాళ్ళను మార్చడం అంతసులభం కాదు.

రాజ దూషణ :-

రాజుల్ని ఆశ్రయించి బతికినా వాళ్ల దోషాల్ని వేలెత్తి చూపిన కవులు కొందరున్నారు వాళ్లు తమ రచనల్ని ప్రజా సంక్షేమం కోసం ఆయుధంగా వాడారు.

బైచరాజు వేంకటనాదుడు, దూర్జటి, మంచన, పోతన, గౌరన, పేమకూరి వేంకట కవి మొదలైన వాళ్లు రాజుల్ని గర్హించడంలో చొరవ చూపారు.

"హత దాక్షిణ్యుల నర్థకారులభిమానాద్యాత్ముల వ్యంగన
ప్రతిపక్షుల్గుజన ప్రియంవదులు సంపత్సన్నిపాతస్మృతి
క్షతి కుల్సత్యపరాఙ్ముఖుల్గన పిశాచగ్రస్తులాద్యా వన
చ్యుతు లక్షాంతుల నాంతరంగికులు రాజుల్ గారె యూహింపగాన్"
(బై వేం.పం.తం. 1-435)

" .. నీతులెన్నవా రాజులకున్" (బై వేం పం.తం. 1-439)

" . మేలు డిగద్రావి కీడుద్గమింపజేయు
పాపకర్ముండు రాజైన బ్రదుకు గలదె (బై.వేం.పం.తం. 1-456)

అంతేకాదు 'మంచి-చెడు న్యాయం-అన్యాయం తెలుసుకోలేని వాళ్లు రాజులు (పం. తం. 1-532,533) అని బైచరాజు వేంకటనాథుడు రాజుల అవలక్షణాల్ని బహిర్గతం చేశాడు ఆయన దృష్టిలో ఆనాటి రాజులు, కోప స్వభావులు, అబద్ధాలు ఆడేవారు, పరమలోభులు, దుష్కరులు, పాపకర్ములు.

శ్రీ కృష్ణరాయ కిరీట కిలితమణి గణార్చితపదాబ్జద్వయ
శ్రీ వహించిన ధూర్జటి కవీంద్రుడికి రాజు శబ్దమే పరమ
అసహ్యంగా కనబడింది.

"రాజుల్మత్తులు. వారి సేవ నరకప్రాయంబు, వారిచ్చునం
భోజాక్షీ చతురంతయాన తురగీ భూషాదులాత్మ వ్యథా
బీజంబుల్, తదపేక్షచాలు ... (కాళ.శ) అని రాజుల్ని
గర్హించాడు

రాజుల్మత్తులు, మూర్ఖులు, లోకకంటకులు, అధములట! రాజన్నంతనే కృప, ధర్మం, అభిజాత్యం, క్షమ, సత్య భాషణం, సౌజన్యాలనే మంచి లక్షణాలు నశిస్తాయట! రాజ శబ్దంబు ఛీ! ఛీ!! జన్మాంత గమంద్రైన తానొల్లనని సూటిగా స్పష్టంగా ప్రకటించాడు. పద్దెనిమిది పద్యాలలో రాజుల్ని విమర్శించాడు

"నైజ గుణంబున దశ మది
రాజసమప్పటికి గప్పి ప్రజతో నాయా
యోజ జరించిన యంతనె
రాజులు సాధులని నమ్మరాదెవ్వరికిన్ (కే.బా చ. 2-86)

అని సుమతి అనే పరిచారికతో అనిపిస్తాడు మంచన. చాలా మంది కవులు తమ కావ్యాల్ని రాజాలకు అంకిత మిచ్చి శ్రీమంతులయ్యారు. మంచన అందుకు ఇష్ట పడక ఇలా అంటాడు,

బాల రసాల పుష్పనవ పల్లవ కోమల కావ్యకన్యకన్
గూళల కిచ్చియప్పుడపు గూడు భుజించుట కంటె సత్కవుల్
హాలికులైన నేమి మఱియంతకు నాయతి లేని నాడు గౌ
ద్దాలికులైన నేమి నిజదార సుతోదర పోషణార్థమై"
(కే.బా.చ. 1-13)

ఇదే పద్యాన్ని కొన్ని చిన్నమార్పులతో పోతన చెప్పాడు.

"ఇమ్మను జేశ్వరాధములకిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములు గొన్ని పుచ్చుకొన్ని చొక్కి శరీరము వాసి కాలుచే
సమ్మెట పోటులం బడక........" (భాగ పీఠిక -13) భక్తితో భాగవతాన్ని శ్రీహరికి అంకితం చేశాడు పోతన.

"కారే రాజులు రాజ్యముల్ గ్రాగవే గర్వోన్నతిన్ పొందరే వారేరి సిరి మూట గట్టుకొని పోవంజాలిరే భూమిపై పేరైనం గలరే." (భాగ 8-594) అని ప్రజాక్షేమాన్ని నిర్లక్ష్యం చేసిన రాజుల్ని తీవ్రంగా నిరశించాడు పోతన.

"... మహీధవుల చిత్తంబు
తెలిసి యెవ్వారి నివర్తింపంగ వచ్చు
వొలుచు చిత్తరువు సొమ్ములు నీళ్రావాలు
కలలోని వార్తలు గంధర్వ నగర
ములు జల దాకారములు మాయ లేళ్ళు
నిలనెండమావు లెయ్యెడ రాచమాట...." (నవ.చరి.పుట 298)

"ఎరీతి చూచినా నెట్టివారలకు
భూరి ప్రమాదంబు భూపాలు సేవ"

ఇంతటితో ఆగలేదు. ఇంకా ఇలా అంటాడు గౌరన.

"సంతతి వ్యసన ప్రసక్తులై కుటిల
చింతా పరాయణ చిత్తులై రాజ్య
మత్తులై వర్తించు మండలాధీశు
లెత్తు అంగున రోయరే పాపమునకు" (నవ.చరి. పుట 316)

అని ఎలాంటి జంకు గొంకూ లేకుండా రాజుల్ని నిందించాడు.

"... ఎందున్ నృపులుత్తరోత్తర పదానూన స్పృహాచంచలులుల్ (వసు. 2-64) అని రామరాజభూషణుడు అంటే

"దుష్ట చరిత్రులైన నృపతుల్ ధరయేలుట కంటె గలునే
కష్టము శిష్టలోకము సుఖస్థితి నుండదు . ." (వరా.పు. 5-15)

అని అంటారు జంటకవులైన మల్లయ్య, ఘంటసింగయ.

"జలరేఖచే గిరి గీయబడిన ఈ కొంతమట్టి ముద్దకై
భూమి తగవులాడి, భాగించుకొని, అనుభవిస్తున్న
ఈ నీచరాజులు ఒకరికిత్తురా? చాలా నికృష్టులు వారిపై
కొద్ది ధనాపేక్ష గల మనుష్యులు ఇంకా నీచులు గదా!
అని అంటాడు భర్తృహరి (భ సుభా. 50 శ్లో)

రాజులు చాదుల 'బొమ్మకూడిని పెరిగారు కాబట్టి వారిలో నీతి వుండదట! (వి.గా.వి. 12-93)

"రాజులు కుటిల సర్పమహోగ్రతరమూర్తులు, చండ శార్దూల సమచిత్తులు, భద్ర కరి మందాంధమనీషులు" అని (చక. 2-164) పాలవేకరి కదిరీపతి అంటాడు

"ఇలా రాజుల్ని తీవ్రంగా విమర్శించిన కవులలో వేమకూర వేంకటకవి ఒకడు. రాజుల్ని నిందించే సామెతలు, అర్థాంతర న్యాసాలు, సారంగదర చరిత్రలో చాలా వున్నాయి

1 "రాజుల చిత్తములెరియా రాదె పోయెటు వచ్చునో (2-7)
2 "రాజునకుందమ్ముల మీద కాంక్షలవి యెబ్బోలునట్టగానేర్చున్" (2-273)
3 "కోపమే చూతురుగాని బిడ్డడని చూడరుగా దరణి తలాధిపుల్" (3-22)
4 "మన జాదీశడనట్లు సేయదగనే మందలదా భూపతుల్" (3-30)
5 "ధరణిపతి నమట వెఱ్ఱి తనంబు" (3-32)
6 "ఏయెడ గోపగించి దరణీశుకు గొల్చిన వారినే క్షయం
జేయుడటన్న గాదనక చేయవలెంగద...." (3-37)
7 "చెవులె కన్నులు రాజులకుం దలంపగన్ (3-52)
8 "రాజా ంతే నరకం ప్రమవం..." (3-65)
9 "వెదుళ్ల పందిరియు రాజుల మాటలు చిక్కనేగదా!" (3-72)
10 ".. ఎంత కరినాత్ముల్ రాజులూహింపగన్" (3-75)
11 "రాజు మెత్తనా నలిమెుగ సాలకున్నాడు...." (3-80)
12 "దొరల చిత్తంబు లీకరిణ బాటిల్లు" (3-121)

రాజుల్ని గర్హించడంలో శతక కవులు అందరి కంటె ముందున్నారు

"ఎంతచేసిచేసి యేపాటు పడినను
రాచ మూక నమ్మరాదు సుమ్ము" అని నిష్కర్షగా అంటాడు వేమన

"కోపంబెక్కువ, తాల్మియిల్ల, పరుషోక్తుల్ పెల్లు సత్యంబుతోల్
కాపట్యంబు ఘనంబు, లోభము నహంకారంబు హృచ్చాపల్యం
బధికంబు, ద్రోహమని విస్తారంబు ఛీ! యట్టి దుర్వ్యాపార
ప్రభులేరి..." (శ్రీభర్గ.శ. 77)

అని అంటాడు కూచిమంచి తిమ్మకవి.

అంతేకాదు,

"తన పొట్టకై ప్రజగలచు దురిత రతుడు వాడొక రాజా తరాజుగాక"
(శుక్ర శ. 61)

అని నిర్మోహమాటంగా విమర్శిస్తాడు

"కాడనెడివారు లేకున్న బలిసృఖుడు కాని పనిసెంతకైన నగ్గంబుగాదే"
(రా లిం శ)

అని సూరకవి దుర్మార్గులైన రాజుల్ని ఎదిరించడంటాడు. ఇలా రాజుల్ని. వాళ్ల అరాచకపాలనను నిశితంగా విమర్శించడంలో ఆనాటి కవులు చూపిన సాహస శ్లాఘనీయం. ఇలాంటి వాళ్లే ప్రజా కవులు.

రాజులు సక్రమ పరిపాలన చేయడానికి ఇలాంటి కవుల విమర్శలు తోడ్పడి వుంటాయి. ఆనాటి రాజుల పరిపాలన గురించి తెలుసుకోవడం అవసరం

అ ను బం ధ ము


1 ప్రాచీన భారతదేశ చరిత్ర (డి డి. కోశాంబి పరిచయం) పుట 65

2 ఎల్లిన జనజీవన చిత్రణ పుట 12

3 కౌటిల్యుని అర్థశాస్త్రము పుట 50, 51

4 మత్స్య పురాణం పుట 148, 149

5 కౌటిల్యుని అర్థశాస్త్రము పుట 47

6 ,, పైదే ,, పుట 6 నుంచి 11

7 ,, పైదే ,, పుట 13

8 ,, పైదే ,, పుట 54, 55

9 భారతి–ఆగష్టు 1952 పుట 120

10 ఆంధ్రుల సంస్కృతి చరిత్ర-II పుట 151

11 ,, పైదే ,, పుట 188

12 కవిత్రయ భారతం-రాజనీతి పుట 95

13 కౌటిల్యుని అర్థశాస్త్రము పుట 6

14 ఉత్తరరామ చరిత్ర నాటకమ్–ప్రథమాజ్కః శ్లోకం. పుట 5
"స్నేహం దయాం తథాసౌఖ్యం యదివా జానకీమపి
ఆరాధనాయ లోకస్య ముఞ్చతో నాస్తి మేవ్యథా"

15 మనుస్మృతి—7-35
"స్వే స్వే ధర్మే నివిష్టానాం, సర్వేషామనుపూర్వశః
వర్ణానామాశ్రమాణాంచ రాజా రాజా సృష్టోఽభిరక్షితా||

16 కౌటిల్యుని అర్థశాస్త్రము పుట 11

17 ,, పైదే ,, పుట 47

18 దక్షిణ భారతదేశ చరిత్ర పుట 256

19 కౌటిల్యుని అర్థశాస్త్రము పుట 58

20 ,, పైదే ,, పుట 61

21 ,, పైదె ,, పుట 59

22 ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ తన అంగరక్షకుల **చేతనే** చంపబడింది. [31-19-1984]

23 గుంపులోకి చొచ్చుకు **పోవడం** వల్లనే రాజీవ్ **గాంధీ** చంపబడ్డాడు. [21-5-1991]



# 4. రాజు - పాలనా వ్యవస్థ

ప్రాచీన భారతదేశ రాజులు పరిపాలన గురించిన సమాచారాన్ని కావ్యాలు సమగ్రంగా అందించలేవు. అనాటి శాసనాలు, విదేశీయుల రచనలు మొదలైనవి దీనికి కొంత తోడ్పడతాయి. ప్రాచీన రాజ్యపాలన వివరాలను తెలియచేయడంలో కౌటిల్యుని అర్థశాస్త్రం ప్రథమ స్థానంలో ఉంది. అనాటి ఆర్థిక, రాజ్యపాలనా విధానాలు ఇందులో ప్రతిఫలిస్తున్నాయి.

రాజు రాజ్యానికంతటికీ కేంద్ర బిందువైనప్పటికీ, తానొక్కడే రాజ్యాన్ని పాలించలేడు. ఇతరుల సహాయ సహకారాలు అవసరమవుతాయి. రాజు పాలనా యంత్రాంగానికి సంబంధించిన అన్ని విషయాల్ని ఆకళింపు చేసుకోవాలి. రాజ్యాన్ని రాష్ట్రాలుగా, మండలాలుగా, గ్రామాలుగా విభజించి తన ప్రతినిధులను నియమించాలి. ఈ మండలాలు వివిధ రాజ వంశాలలో వేరువేరు పేర్లతో పిలువబడ్డాయి.

"పరమండలోద్భేద పదములా లోకించి
మంత్ర రక్షణ కళామహిమ దాల్చి
ద్వీపాంతరంబుల తెఱగు లాకర్ణించి
గడినున్న మన్నీల క్రమము మెఱింగి
దుర్గాధిపతుల సుద్దులు విచారము చేసి
బలము నప్పటప్పటికి జూచి
నిజరాజధానిలోని విశేషముల్గని
మంత్రిసామంతుల మతము దెలిసి

పేద సాదల విన్నపం బాదరించి
వ్రతులమైనట్టి మము బోటి వారి నరసి
రాజ్యమేలిన దగు గాక, ప్రాజ్యవైభ
వంబు గలదని సుఖియించు వాడు నృపుడే!" (రాజ.చరి. 2-25)

రాజు రాజ్యపాలన ఎలా చేయాలో మునులు పేర్కొన్నారు.

రాజు తనకు సహాయపడిన వాళ్ళని వాళ్ళెలాంటి వాళ్ళైనప్పటికీ సముచితంగా గౌరవించాలి. శివుని తపస్సు భంగం చేయడంలో ఇంద్రునికి మన్మదుని సహాయం అవసరమైంది. అందుకే అతన్ని ఇంద్రుడు తనతో సమానంగా కూర్చోబెట్టుకున్నాడు.

.... .... .... ... .. సూ
క్షేత్రీక జాడ కార్యగతి గాంచెడరహో ప్రభువుల్ ప్రయోజనా
పేక్ష నొకప్పుడాశ్రితుల కీచె సమంచితగౌరవోన్నతుల్
(హర. 3-39)

"రాయిటు రష్మని వేతికి
చేయిచ్చి ప్రమోదరేఖ విగురొత్తమరు
న్నాయకుడు నిల్పె సుమన
స్నాయకు సరిగద్దె మీద సౌహార్దమునన్" (హర 3-40)

ఇది రాజ్యపరిపాలనలో తన కార్యాన్ని నెరవేర్చుకోవడానికి రాజు చూపాల్సిన లౌక్యం. రాజు కేవలం తన ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే ఇబ్బందులకు గురి కాక తప్పదు. తన రాజ్యాన్ని కూడా వదులుకోవలసి ఉంటుంది. కాబట్టి రాజు తన రాజ్యాన్ని అభివృద్ధి చేసుకోవడానికి తనకు సహాయంగా అధికారులను, అనధికారులను నియమించుకోవాలి. ఈ విషయాన్ని శుక్రనీతి ఇలా పేర్కొంది.

"Hence for the development of the state the ruler should always appoint assistants who are high by birth, attainments and character, who are valorous, devoted and sweet-tongued, who can advise well, and bear pain who have nirtuous habits, and who by the strength of their wisdom can deliver a king who has gone astray Men who are pure, and who have no envy, passions anger, cupidity and sloth"[1]

## రాజ పురోహితుడు

పురానికి హితం చేసేవాడు పురోహితుడు.[2] ఋగ్వేద కాలం నుంచి రాజులకు వలసా ఇవ్వడంలో పురోహితుని పాత్ర అగ్రస్థానంలో ఉంది. దేవుని అనుగ్రహం లేకుంటే అపదల నుండి రక్షణ, యుద్ధాలలో విజయం కష్టం అనే అభిప్రాయం రాజులకు, ప్రజలకు ఉండేది. కాబట్టి దేవుని అనుగ్రహాన్ని సాధించడానికి పురోహితుడు సహాయపడేవాడు పురోహితులు దండనీతి శాస్త్రాన్ని అమలు పరచడంలో మంత్రుల కంటె అనుభవం ఉండేవాళ్ళు కాబట్టి మొదటగా నీతి శాస్త్రాల్ని వీళ్ళే రచించారు. నీతి శాస్త్రాల్ని రచించిన శుక్ర బృహస్పతులు పురోహితులే!

రాజ కుటుంబానికి పురోహితుడు సన్నిహితంగా ఉండటమే గాక రాజుకు ఆచార్యుడుగా కూడా ఉంటాడు. తత్ఫలితంగా రాజుకు సంబంధించిన అన్ని

వ్యవహారాలో మార్గదర్శిగా ఉపదేష్టగా పురోహితుడుంటాడు.[3]

"అత్యున్నతములైన కులశీలములు గలవానిని, వేదవేదాంగములందు, జ్యోతిష, ప్రశ్న శాస్త్రములందు దండనీతి యందు ఆరితేరిన వానిని, దైవకృత మానవ కృతములగు నాపదల నుండి అథర్వవేద విహితములగు ఉపాయముల ద్వారా రక్షింపగల వానిని పురోహితునిగ నియమింపవలెను."4 అని కౌటిల్యుడు చెప్పాడు.

పురోహితునికి ఉండాల్సిన లక్షణాల్ని గురించి శుక్రనీతి ఇలా పేర్కొంది.

"One who is versed in mantias and rituals, master of the three Science, skilful at work, conqueror of the senses, subduer of anger, devoid of greed and passions, equipped with a knowledge of six Angas (Vedangas) and of the Science of Archery with all its branches one who knows the Science of moral as well as religious interests, one fearing whose anger even the king takes to virtuous ways of life, one who is well up in Niti Sastra and Master of Military implements and tactics is the priest"[5]

"దరగల పురాణ ముని వ్యా
కరణంబుల శాస్త్రముల నిగమముల గవితం
బరిణతుడ మాళవేంద్రుని
పురోహితుడ నన్మ సంజ్ఞబరుహూతుండున్" (సిం ద్వా. 6-43)

మాళవేంద్రుని పురోహితుడైన పురుహూతునికి ఈ లక్షణాలన్నీ వున్నాయి

"నృపతి పురోహితుండు నృపనీతివిదగ్ధుడై తయీ
నిపుణుడునై తనర్చి ధరణీపతి కెప్పుడు హితాభిలాషి యై
రిపు నృప కర్మ భేదన ధురీణత శాంతిక పౌష్టిక క్రియా
విపుల మనీషి జేయదగు వేడ్కదలిర్ప గృహ ప్రయోక్తయై
(స.నీ.స. 2-323)

వుండాలట పురోహితుడు.

పుత్ర కామేష్టియాగాన్ని చేయాలనుకున్న దశరథుడు తన పురోహితుడైన వశిష్ఠునితో ఇలా అంటాడు.

"అనఘ వసిష్ఠ సంయములార యిపుడు
ఘనమైన హయమేధకంబు నాచేత

జేయించి ప్రత్త్యేక సిద్ధి నొందుటకు
జేయింపుడీ దాని జేచ్చెర నన్ను
నలవడ నీ చేయు హయ మేధమఖము
నెలకొని యే మింక నిర్వహించెదము...." (రం.రామ.బాల పుట 9)

యాగాశ్వాన్ని విడవడానికి, యజ్ఞశాలను నిర్మించడానికి కూడా పురోహితుని అనుమతిని తీసుకోవడం తప్పనిసరి అన్నమాట. (రం.రామ.బాల. పుట -13)

కరణం

రాజ్యపాలనలో కరణం మంత్రితో సమానుడు రాజగృహంలో రత్న దీపం. విజ్ఞాన స్ఫురణతో ఇతరుల బాధలను తొలగిస్తాడు. ఆయ వ్యయాల లోని చిక్కులను పరిష్కరిస్తూ ప్రజల చేత పొగడబడతాడు. (స.నీ.స. 2-291, నుంచి 294) ఆయ వ్యయాలలో ఎలాంటి తేడా రాకుండా ఏకస్థానాలు, దశమ స్థానాలు జాగ్రత్తగా మరచి పోకుండా లెక్కలు రాస్తాడు.

"ఆయ వ్యయంబుల జాడ లూహించి
యాయాయివర్గువు లమర నిలిపి
పురుష వర్గువులోలి పరికించి నెఱసులు
దప్పి పోవక యుండు నొప్పదీర్చి
యవనీశ ప్రోలాకుర విణల, గ్రితచొప్ప
కవిలె సంప్రతులను గలుగ నెఱిగి
వరుస నాయవ్యయ వాచనంబులు వ్రాసి
వడినెత్తుటావర్గువులకు బాటి

గాగ నిర్ణయించి కలతరుగువు పాత్ర
తెలిసి దాన్యరొక్కములకు నిలువ
పేరు బడియు దెలుప బెద్దయు నేర్పుట
కరణికంబు ధాత్రి గందమంత్రి" (స.నీ.స. 2-295)

అంతేగాదు,

"ధరణీశ సొమ్ము ప్రజలన్
బొరయింపక ప్రజల సొమ్ము భూపతి యందున్
జొరనీక రెంటనుం దా
బొరయక యున్నట్టి కరణమునకున్ వరియే" (స.నీ.స. 2-300)

అదీ అతని నేర్పు

"కరణము తన యేలిక కుప
కరణము, నిర్ణయగుణాధికరణము, ప్రజకు
స్మరణము, పగవారలకును
మరణము నా జెల్లు నీతిమంతుడైనన్" (సిం.ద్వా 11-99,

ఇంతటి ప్రశస్తి పొందిన కరణం

"వనముంచు తెలివలి పంపు పింజియలు
పొనగ చుట్టిన యట్టి బోడ కుల్లాలు
చింపి కుప్పనములు చెవిదోరములను
సంపుటంబుల తోడ జంపాడు నొడలు
బిగువుగా చెంపదోపిన ఒలపములు .." (పరమ పుట 458)

ధరించేవాడు, రానురాను ప్రజల్లో ఈ కరణాలపై నమ్మకం సడలింది.

"ఒకదెస దెచ్చినమాయం
బొక దిక్కున జెల్లు వ్రాసి యొకదెస వ్యయము
ట్లొక దిక్కన జనవ్రాసిన
బ్రకటంబుగ వాడు మిగుల బాపాత్ముడగున్" (సిం.ద్వా. 11-97)
ఇలా పాపాత్ముడయ్యాడు.

సేనాపతి :-

సైన్యాన్ని నడిపించడానికి, క్రమశిక్షణతో ఉంచడానికి సేనాపతి తోడ్ప డతాడు. "నానావితరణ విజయ మహానిపుణుల వార్య వీర్యుల"నే సేనాధ్యక్షు లుగా వేయాలి. (స.నీ.స. 2-400)

సత్కులుడు, ఔదార్య సంపన్నుడు, అభిమానవంతుడు, సత్యవంతుడు, మంత్రజ్ఞుడు ఉత్సాహ మంత్ర నమ్మతుడు, బహు బంధు మిత్ర సద్భట సమగ్రుడు, పతికార్యదక్షుడు, యుద్ధకౌశలుడు అయిన వాణ్ణి సేనానిగా నియమించాలి.

"నయ విజ్ఞానము దక్ష యోగములు నానా వాహనారోహణ
క్రియతో నాయుధ కౌశలంబు నుచిత క్రీడారణామర్ష మెం
తయు నాయాస సహత్వముంబర బలాంతస్సార వేదిత్వమున్
జయ శీలత్వము గల్గు సైన్యపతి రాజప్రీతిపాత్రం బగున్"
(స నీ.స. 2-402)

రాజు పట్ల భక్తిని, స్నేహావేశాన్ని కలిగిన హూరుని వ్వదేశీయత, ప్రభుభక్తి వివేకం, మంచి ప్రవర్తన వివిధ ఆయుధ ప్రయోగ కౌశలం, సైనిక వ్యూహ రచనా శక్తి మొదలైన లక్షణాల్ని కలిగిన వీరుని సేనానిగా నియమించాలి.

పాలనా నిర్వహణలో కానీ, యుద్ధ విజయాలలో కానీ సేనాపతి అకుంఠిత కార్యదీక్ష ప్రధాన పాత్ర వహిస్తుంది.

"కులజుడైన విక్రమ బలవంతుడగు రాజు
బడసిన దేశంబు ప్రజయు బోలె
సదమల సంపూర్ణ చంద్రోదయంబున
రమణీయ మగు చున్న రాత్రి వోలె
సుదుసత్త్వుడగు మహా యూధాధిపతి గూడి
తనరు వన్యేభ బృందంబు వోలె
నాయక ద్యుతి గ్రాలు నాయక మణితోడ
నొడగూడి పొలుపారు తొడవపోలె

నా మహేశ్వర నందును ననుపమాన
శక్తి సంపన్ననివార్య శౌర్యదనకు
దగిన సేనాని గని పేర్మి మిగిలి వెలిగె
నమర వల్లభుడాదిగా సమరగణము" (కుమా. 10-115)

గూఢచారులు ,—

రాజ్యపాలనకు, రాజ్య రక్షణకు గూఢచారులు అత్యంత అవసరం. వీరు తెలియచేసే నివేదికల ఆధారంగా రాజు తగిన వ్యూహాన్ని అవలంబిస్తాడు. శత్రువుల ఎత్తులను, అధికారుల కుట్రలను ప్రజల అభిప్రాయాలను గూఢచారుల వల్ల తెలుసుకుంటాడు. కృష్ణుడు సాత్యకితో చరుల బనిచి వైరి తెరువులరసి గెలిచే యుక్తి పన్నాలి' (హరి.ఉ. 5-131) అంటాడు.

రాజు తెలివైన గూఢచారులవల్ల తన పక్షంలోను, వైరి పక్షంలోను జరిగే విశేషాలను తెలుసుకుంటే అపదలపాలు కాడు (స.నీ.స. 2-372)

"జనపతిచార చక్షుడయి చాలగ రంధ్రము రోసి శత్రుపై
జని గెలువంగబోలు జరచక్షుడు గాని నృపాలు డంధు డౌ
ననిశము శత్రు సంపదుదయంబును సర్వదశా విచేష్టలుం
గను గొనుటొప్పు శత్రుజన కల్పిత కృత్యము చారదృష్టియై
(స.నీ.స. 2-391)

వారచక్షుడు కాని రాజు అంధుడవు తాడనడం వల్ల వారుల ప్రాధాన్యం తెలుస్తుంది.

సంస్థలని, సంచారులని గూఢచారులు రెండు విధాలు, ఒకే ప్రదేశము లో నివసిస్తూ రహస్య కార్యాలను నిర్వహించే వారిని సంస్థలని, దేశ సంచారం చేస్తూ కార్యాలను నిర్వహించే వారిని సంచారులని అంటారు.

కౌటిల్యుడు తొమ్మిది విధాలైన గూఢచారులను పేర్కొన్నాడు.[6] వీరిలో సంస్థలకు చెందిన గూఢచారులు, సంచార గూఢచారులు వున్నారు.

సంస్థలకు చెందిన గూఢచారులు -

1. కాపటికుడు ,- ప్రగల్భాలు పలికే శిష్యుడు.
2. ఉదాస్థితుడు - పరివ్రాజిక వృత్తి విసర్జించి, శిష్యులతో ఒకనిర్దిత ప్రదేశంలో కాపురం పెట్టి రహస్య కార్యాలను నిర్వహించేవాడు.
3. గృహపతికుడు ,- వ్యవసాయంలో నష్టపడిన కర్షకుడు.
4. వైదేహకుడు :- వ్యాపారంలో దెబ్బతిన్న వర్తకుడు.
5. తాపస వ్యంజనుడు ,- కపట సన్యాసి.

సంచార గూడచారులు -

6. సత్రులు :- అనాథలు, ప్రభుత్వం పోషించబడేవారు
7. తీక్షులు :- జన పదాలలోని శూరులు, ప్రాణాలకు తెగించిన వాళ్ళు ధనాపేక్షతో ఏనుగులతోను, అడవి మృగాలతోను పోరాడేవాళ్ళు.
8. రసదులు:- బంధువులపట్ల ప్రీతి లేని వాళ్ళు, క్రూరులు, సోమరులు
9. భిక్షుకి :- జీవనానికై ఎలాంటి వృత్తినైనా కోరేవి. దరిద్రురాలు విధవ, ప్రగల్భురాలు, బ్రాహ్మణి అయిన పరివ్రాజక.

ఇలాంటి వాళ్ల ప్రాచీన కాలంలో గూడచారులుగా నియమింపబడే వాళ్ల వీళ్ళను గురించి ఇలా పేర్కొనబడింది.

"అధ్యాపకుడు భిక్షుకాఖ్యుండు లింగియు
వణిజుండు మఱి కృషీవలుడు వరుస
గాపట్యు దాసీనతాపస వైదేహ
గృహపతులే వేళ నహితు వీట

జడులకు దాపిగా జరియించు కొలకు నై
ధనమిచ్చి తగుపోట్ల కనుప వలయు
రసదుండు సత్రిప్రవజితుండు దీక్షితుం
డనువారు గరదుండు దనరు తపసి

వరుడు వేషధారి తిరిపెము సాధన
గురువు లనగ మాయ బెరసి యుంట్రడు
వీరు నలువురరయ వేగుల వారలొం
డొరుల నెఱుగకుండ దిరుగ వలయు" (స.నీ.స. 2-385)

రాజు ఇలాంటి గూఢచారులను నియమించాలి.

"ఒజ్జలు వాప శిక్షకులు యోగ్యులు భోగ్యులు రాజయోగ్యధీ
మజ్జనులైంద్ర జాతికులు మల్లులు సూపకరుల్ విదూషకుల్
గుజ్జులు దేశికుల్ యతులు కోమటులాడెడు వారు గాయకుల్
వెజ్జులు లోనుగా గలుగు వీరి మహీపతి సేయు జారులన్"
(స.నీ.స. 2-386)

వీళ్ళను నియమించడంలో రాజు జాగ్రత్త వహించాలి. "రహస్య పరీక్షల ద్వారా శుద్ధులని తెలిసిన అమాత్య వర్గముగలవాడై రాజు గూఢ పురుషుల నియమించవలెను"7 అని కౌటిల్యుడు అంటాడు.

"రాజు ఎల్లప్పుడు శత్రురాజుల గురించి, రాజ్యం లోపల, బయట జరిగే విషయాల్ని గురించి చారులనే నేత్రాలతో వీక్షించాలి (స నీ.స 2-371). మంత్రి పురోహితుడు సేనాధ్యక్షుడు మొదలైన కీలక పదవులలోని వ్యక్తులపై అతిరహస్యంగా చారులను నియమించాలి, వాళ్ళ విషయాల్ని ప్రతి దినం తెలుసుకోవాలి. మంచి చరిత్ర గల సంస్థలను కార్యాన్ని సాధించడానికి ఆధారంగా చేయాలి. అందులో చారులు వుంటూ విదేశాలలోని శత్రువుల రాజధానిలోని రహస్యాల్ని తెలుసుకోవాలి. సూక్ష్మ కార్యాలు "జన సంచార విస్రంభాలాపంబుల" లో తెలుస్తాయి.

కాబట్టి ఆయా స్థలాలలో తనకు అప్తులైన సేవకుల్ని రాజు చారులుగా నియమించాలి. చారులు తమ దేశంలోను, పరదేశంలోను గూఢంగా తిరుగుతూ విశేషాల్ని సేకరించి రాజుకు ప్రతిదినం తెలపాలి. ఇతరుల చేష్టితాదులను వూహించి అసత్యాన్ని చెప్పకుండా, రాజు పట్ల సత్యవాదిగా వుండాలి. (స.నీ.స.

2-379 నుంచి 377) వారులు రాజుకు దూరదృష్టి వంటివారు. వారచక్రవులు కలిగి వున్న రాజు నిద్రపోతూనైనా వికాసాన్ని చూస్తాడు వారిలను ఊతగా చేసుకొని రాజు ప్రపంచాన్నంతా తెలుసుకోవాలి. (స.నీ.స 2-380 నుంచి 382) రాజు పారితోషికాన్ని జీతాల్ని వారులకు క్రమం తప్పకుండా ఇవ్వాలి. ఎందుకంటే భక్తితో సేవించే ప్రజలు కూడా సమయం చూసి రాజును మోసగించడానికి ప్రయత్నిస్తారు. (స.నీ.స 2-392, 393,

ఎలాంటి పగనైనా వారగూఢ మంత్రశక్తి చేసి రాజు విజయన్ని సాధించాలి. వివిధ దేశాల రాజుల శత్రువులను, బుధులను బంధువులను వై దేహకులనే వారుల వల్ల రాజుతెలుసుకోవాలి. (స.నీ.స 2-395,396)

శూర్పణఖ తనకు జరిగిన పరాభవాన్ని రావణునికి చెబుతూ, "నీవు రాజ్యమదంబున నిన్ను మఱచి, వేగులరయింపకున్న "నీవెతలువచ్చె" (భాస్క.అరణ్య -269)

"దూరస్థులయ్యు గార్యము
వారులచే గనుట జారచక్షులు రాజుల్
వారని చెప్పగ వినవె ని
వారము దోచునె కుమంత్రి సహితునకెందున్" (,, -270)

అని వారుల ప్రాముఖ్యాన్ని గురించి చెప్పింది.

రాముని సేవను గురించి తెలుసుకోవడానికి రావణుడు మొదటి సారిగా శుకసారణులనే వేగులను పంపాడు. వారు కపటవేషాలతో వానరసేనలో ప్రవేశించారు విభీషణుడు వాళ్ళను గుర్తించి, వనచరుల చేత పట్టించి, రాముని దగ్గరకు తెచ్చిఇలా అంటాడు,

"వీరలు శుకసారణులను
వారలు దశకంఠు వేగు వారలు కపటా
కారములు పూని మర్కము
లారయు నుండుదురు తిరిగి యఖిల జగములన్"

(భాస్క యుద్ధ-309)

ఆ మాటలకు శుకసారణులు భయకంపితులైనారు.
చేతులు జోడించి,

"దేవా దూతలము దశ
గ్రీవుడు పుత్తెర నిట్లు కృత్రిమ భంగిన్
దేవర సైన్యము చూడం
గా వచ్చిన రాక, తప్పు గలదని పలుకన్"( 311)

రాముడు నవ్వుతూ వాళ్ళని క్షమించి విడిచాడు (304 నుంచి 316)

రెండవ సారి శార్దూలాది చారులను పంపాడు. వాళ్లు కూడా విభీషణుని చేత పట్టు పడ్డారు (371) పురంలోని విశేషాలు తెలుసుకోవడానికి రాముడు గూఢచా-రులను నియమించినట్లు తెలుస్తుంది.

"ఇనకులుడు గూఢచారుల
గనుకొని యీ పొద్దు మత్పకాశంబునకుం
జను దెంచినార లేమే
వినబడి మెనె పురములోన వింతలు మీకున్" (జై భార 6-24)

నాతో బుట్టువులను, నన్ను, సీతను గురించి పురజనులు మరొక విధంగా మాట్లాడు కోవడం లేదు గదా! మీరు సత్యాన్ని చెప్పండి అని రాముడు గూఢచారులను అడిగాడు.

'రావణుడు దొంగలించిన సీతను తిరిగి తెచ్చుకొని ఏలుకొంటున్న రాముణ్ణి కాను, నా భార్యను ఏలుకోవడానికి అన్న నిజకుని మాటల్ని చెప్పారు. ఇలా చారుల వల్ల సేకరించిన ప్రజాభిప్రాయాలకు రాజులు విలువనిచ్చే వారని తెలుస్తోంది.
(జై భార. 6-22 నుంచి 29)

మంత్రి బాగు రాయణుడు గూఢచారుల వల్ల పరరాజుల ఏలుబడిలోని ప్రదేశాలలోని విశేషాలన్నీ తెలుసుకోవడం వుంది.

"నానాదేశమ్ములకు న్
దానటుబహుపంగ జనిన తనచారులలో
ధీనిధి మతి మంతుడనం
గా నొక్కడు వచ్చి సమయుకర్తవ్యంబుల్"

"నడిపి యుండనే కాంతం బిచ్చిన వాడు నందన యరయం బోయిన లాట దేశమందలి విశేషంబు లెఱింగించి" నట్లు తెలుస్తుంది (కే.బా చ 1-72,73)రాజు చారులవల్ల అన్యదేశాల వార్తలు వినడాన్ని సింహాసన ద్వాత్రింశిక (4-85) వివరించింది.

ఇబ్బంది లేకుండా, రాజు రాజ్యాన్ని పరిపాలించడంలో గూఢచారుల పాత్ర చాల వుంది.

<u>సేవక నీతి :-</u>

"బ్రాహ్మణులకు రాజులకు, వైశ్యులకు సేవకులు లేకపోతేపనులు సాగవు. కాబట్టి వాళ్ళను సేవించడానికి బ్రహ్మ శూద్ర జాతిని సృష్టించాడట!(స,నీ,స2-455) మనుజపతి దేవతామయుడని మనువు చెప్పాడు. అందుచేత తెలివైనవాళ్లు అతనిని ఇంకొక విధంగా చూడకుండా సేవించాలి. రాజు బాలుడైనప్పటికీ దైవాంశ సంభూతుడు. అతన్ని మానవునిగా చూడకుండా ఈశ్వరుడని భావించాలి.
(స నీ.స 2-457, 458)

సేవకులు రాజును భక్తి విశ్వాసాలలో సేవించాలి. రాజు కూడా వాళ్ళని ప్రేమతో ఆదరించాలి. 'అలిని, భృత్యుని దయతో ఆదరించిన రాజు అభివృద్ధి చెందుతాడు. (బద్ది- సేవ-ప్ర-ప.8) ఈ సేవకులలో ఉత్తములు, మధ్యములు. నీచులు అని మూడు విధాలు"ఉత్తముడు రాజకార్యాన్ని ఒక్కడే చేసాడు, మద్యముడు తోడు వున్నప్పుడు చేస్తాడు. నీచుడు కార్యాన్ని ఎప్పుడు కూడా మనస్సులో తలపోయడు. అసహాయ శూరుడు అత్యుత్తమ భృత్యుడు కపికులోత్తముడు అంజనేయుడు(భా.స్క యుద్ధ-4). రాజుల దగ్గర సేవచేయడం కత్తి మీది సాము. సేవకులు రాజు మనస్తత్వాన్ని సమయాసమయాల్ని తెలుసుకోవడం కష్టమైనది.

హాలికుడు భూమిపై విత్తనాల్ని చల్లి, తరువాత మొక్కల వల్ల ఫలాన్ని పొందినట్లు, సేవకులు రాజు హృదయాన్ని తెలుసుకొని కార్యాన్ని ఫలవంతము చేసుకోవాలట! (భా.పం.తం 1-95)రాజులు బహు కార్యనిమగ్నులు వాళ్ళ మానసిక స్థితి పరిస్థితులని బట్టి మారుతూ వుంటుంది అందుకే కాబోలు " దొరల చిత్తం మాన్లనీడ" అనే సామెత వుంది. సేవకులు వాళ్ల మానసిక స్థితిని పసిగట్టి మెలగడం నేర్చుకోవాలి.

"కోప ప్రసాద గుణముల
భూపాలుని యందు దెలిసి బుద్ధి నధికుడై
పాపల విరహిత హృదయుం
డై పెంపున గొలువ, నధిపుడగు సేవకుడున్"(బా.పం.తం-1-82)

సేవకుడు ఎలాంటి పరిస్థితిలో కూడ రాజుకు ఆగ్రహాన్ని కలిగించరాదు. అలా కలిగిస్తే తనంతట తానే అవమానాన్ని పొందడమే, (బద్ధి-సేవ-5)

యోగులకు,యాగాలు చేసిన వాళ్లకు లేని సుగతి రాజు కోసం ప్రాణాలు, విడిచిన గొప్ప సేవకులకు లభిస్తుందట! (స నీ స-2-430). జీతాన్ని ఆశించే రాజుల

దగ్గర సేవకులుగా చేరుతారు.

"జీవిత మిచ్చి యాదరము జేసి జతదానసం విభాగ సం
భావన కల్మినే ధరణి పాలుడు భృత్యుల బోచు నద్దరి
శ్రీ విభుపుప్తతంబున శరీరమలక్ష్యముగా దలంచుచున్
జీవితమిచ్చు గాయములచే బడు నొందె భటుండు దగ్గతన్
(వై.వేం.పం.తం 1-389)

రాజులను సేవించడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనప్పటికీ వాటినన్ని టినీ సహించడానికి కారణం రాజులు వాళ్ళకు చెల్లించే జీతం.

"కొలిచిన వారల జీతం
బులు వేళలు దప్పకుండ బూర్ణముగానీ
వలయును, వారల ప్రేమము
బలము నృపాలునకు వెల్లపట్లను మిగులన్" (కళా. 7-267)

సేవకులకు సక్రమంగా జీతాలివ్వడం రాజుకు సర్వ విధాల క్షేమం. సేవ కులకు శక్తిసామర్థ్యాలను బట్టి జీతాలు ఇవ్వాలని శుక్రనీతి పేర్కొంది

"Servents are three kinds-inactive, ordinary and quick. Their wages therefore have to be low, ordinary and high respectively"[8]

కఠినంగా తిడుతూ తక్కువ జీతాలు ఇస్తూ, తీవ్రంగా శిక్షిస్తూ, అవమా నిస్తూ వుంటే సేవకులు ఆ రాజు శత్రువుకు తోడ్పడతారు. అంతేకాదు రాజు వాళ్ళపై కోపాన్ని చూపుతూ ప్రసాద గుణాన్ని చూపకపోతే, అలాంటి రాజును కొలవడంవల్ల పాపం వస్తుందట! (స.నీ.స. 2-447)

ఒళ్ళు దాచుకోకుండా కష్టపడి పనిచేసే సేవకులను గురించి,

"....  ....  ....  ....భర్త హితము గోరు,"

వారు రేయును బగలును వంచయును
నలసతము లేక యిప్పవి యాచరింపు
డిట్టు సేతకు గారణం బిట్టిదగుట."
దెలియ కుండంగ వలయు నెవ్వలన నొరుడు"
(హరి.పూ.భా. 5-94)

"మంత్రముల నౌషధముల నమానుషంపు
జందముల నోపి యుద్యోగమెందుజేయు
నట్టి వారికి ననుకూలమైన ఫలంబు
నెలపు జూడడు దైవంబు నిక్కమింత" (-95)

అని తన సేవకులతో అంటాడు కంసుడు.

"పనుపడ మారాజు బంపెనిన్ జంప
నిలబరాధీనుల కేలిక మనసు
కొలది నేపనియైన కోరి కావింప
వలయును గాని కేవల పాపములకు
దలగెద మనరాదు దలగిన యపుడె
మే కొన వలయు స్వామి ద్రోహము కని
భీకరంబుగ గిన్క బిట్టు వేయుటయు...." (నవ.చ.పుట. 329)

రత్న గోరక్కుని చంపి తమ స్వామి భక్తి పరాయణతను చాటుకున్నారు రాజ సేవక్కులు.

సేవకులు అంతఃపురంలో జాగ్రత్తగా మెలగాలి. అంతఃపుర స్త్రీలతో ఎలాంటి అక్రమ సంబంధాలు పెట్టుకోరాదు. ఎక్కడపడితే అక్కడ తుమ్మడం, దగ్గడం, వీదడం, ఆవలించడం చేయరాదు. రాజు దగ్గర దర్పంగా తిరగరాదు. రాజుతో పరుషంగా మాట్లాడరాదు

రాజు—సేవకుల మధ్య సమన్వయం వుండాలి.

"పరివారంబునకును భూ
వరునకు హృదయంబు గలసి వర్తింపనగున్
పరివారము నిలిపెడు చో
ధరణీపతి సేరువాడి తానునుపదగున్" (రుక్మాం.చ. 3-63)

రాజు చెప్పిన కార్యాన్ని మారుమాట్లాడకుండా చేసేవాడే ఉత్తమ సేవకుడు.

"ఎత్తఱినైనను బతిదన
చిత్తగతిం దగవు మీఱ చెప్పిన పని మా
ఱుత్తర మీయక చేసిన
నుత్తమ సేవకుడు వాడె యుర్వీరమణా!" (సిం.ద్వా. 11-106)

ఇబ్బంది కలిగించే సేవకులు ఏడు రకాలు. వీళ్లని కష్ట సేవకు లంటారు.

"పనిచిన బోని వాడొకడు, పంచిన దానొకు బంచు నొక్కరుం,
డను విడిగాదటంచు నెదురాడు, నొక్కం, డొకడొంటి బోవ రా
దను, నొకడప్పు రోగినను, నా పని గాదను నొక్కరుండు, పొ
మ్మనగ జలించు నొక్కడు జనాధిప యేడ్వురు గష్ట సేవకుల్"
(సిం.ద్వా. 11-107)

రాజాజ్ఞను సేవకుడు నెరవేర్చాలి. లేకపోతే ప్రాణత్యాగానికైనా సిద్ధపడాలి. చచ్చిన సుకుమారుణ్ణి తీసుకుపోవడానికి ఎచ్చి యమ శివదూతలు పోటీపడ్డారు.

"చిత్తము చెఱబడుదుము కడు
నొత్తుము మాచేత నెట్టు నందగవుమముం
బుత్తెంచిన పతి సన్నిధి
నుత్తర మెట్లిత్తు మాజ్ఞ యుపహతి బొందన్" (శి.మ. 4-70)

తమ విధ్యుక్త ధర్మాన్ని దృఢసంకల్పం స్పష్టమవుతోంది.

దౌవారికుడు (ద్వారపాలకుడు), వైతాళికుడు, కంచుకి, ప్రతిహారకాంతలు, సూతమాగధులు, పరిచారకుడు అనే రాజభృత్యుల ప్రసక్తి వుంది. వీళ్లంతా రాజ మందిరాల్లో అంతఃపురాల్లో నియమించబడ్డవారు. ఇక పాలనా వ్యవస్థకు సంబంధించి భటుడు, సేనాపతి, పురోహితుడు, మంత్రి, కరణం, సామంతుడు, మొదలైన వారిని గురించి పేర్కొనబడింది.

1) దౌవారికుడు :- రాజభవనంలో ద్వారపాలకుడు. రాజును చూడాలనుకునే వాళ్ల చెప్పిన విషయాన్ని దౌవారికుడు రాజుకు చేరవేస్తాడు.

"ముకుళిత కరుడై దౌవా
రికుడెదురున్నిలువబడి ధరిత్రీశ్వర కా
నికగా సాహసమును గొని
యొక నల్లని చెంచు వచ్చియున్నాడనుడన్" (సిం.ద్వా. 8-7)

నాసికేతుడు తాను వచ్చిన విషయాన్ని,

"దౌవారికునకు జెప్పిన
నా వివరము చిత్రగుప్తుకాతడు చెప్పన్

చూపినత నాసికేతును
రావించెను లోనికతడు రయమున వచ్చెన్" (నాసి పా. 3-35)

రాజు అనుమతితోనే దౌవారికుడు సందర్శకులను లోపలికి పంపుతాడు.

రాజ ద్వారాన్ని విడువకుండా సంరక్షించే వాళ్ళకి అన్ని భయాలు నశిస్తాయి. పాపాలు తొలగుతాయి. సంపద, తేజం, యశం ఒనకూడుతాయట! (రుక్మా.చ. 3-42)

వైతాళికులు:- రాజును వేకువ జామునే నిద్రలేపడానికి గీతాల్ని ఆలపించేవాళ్లు. ప్రాతఃకాలంలో వైతాళికులు మేల్కొలుపు గీతాలు ఆలపిస్తారు. మధ్యాహ్నం, సంధ్యా సమయాల్లో ఇలాంటి గీతాలు ఆలపించడం వుంది (శృం నై 8-3, 18. 91, 92)

కంచుకి:- అంతఃపురపు కావలి రాజుకి అవసరమైన వాళ్ళను పిలుచుకొని రావడం, రాజు బయటికి బయలుదేరేటప్పుడు అందర్ని పక్కకు తొలగించడం మొదలైన పనులు చేస్తాడు

"కంచుకి నొక్కనిం బిలిచి గ్రక్కున నేగి ప్రధానుదోడి
తెమ్మంచు ననుజ్ఞ యిచ్చిన దదాజ్ఞ శిరంబున దాల్చివేగమే
తెంచి . .... .. " (బె ఐ పు 1-166)

సూతమాగధులు:- రాజులను పొగడడానికి నియమించబడ్డ వాళ్లు వీళ్ళనే స్తుతి పాఠకులని అంటారు. పృథు చక్రవర్తి భూలోకంలో అన్నివిధాల పీడలూ తొలగిపోవడానికి యజ్ఞయాగాదులు చేశాడు. "అక్రతు హోమ సూత్ర సుత్యాహుతుల" వల్ల ఇద్దరు శిశువులు పుట్టారు. వారే సూత మాగధులు (అం వి పు. 2-14), వీళ్ళ సౌకుమార్యాన్ని, సొంపులను, వాగ్విలాసాన్ని కోమల కంఠాన్ని చూసి ముని సంఘం వాళ్ళతో నేటి నుంచీ మీరు ఈ రాజును (పృథు చక్రవర్తిని) పొగడమని చెప్పారు.

అని సూత మాగధులకును
ఘనతర వాగ్విభవ మహిమగలిగింపగన
మ్మును తెల్లనుఁబని ప్రమదం
బున బొందగ వారా రాజు బొగడిరి గరిమన్
(అం.వి.పు. 2-151)

వాళ్ళ పొగడ్తలకు అనుకూలంగా రాజు ప్రవర్తించాడు.

వంది జనంబులు లోకము
లందు నవిదితవర కర్ములగు భూపతులన్
నందించుట వశ్యం బై
నందగదు నుతింప శిబజనంబుల పగిదిన్ (భాగ. 4-448)

అని పృథు చక్రవర్తి వంధి మాగధులతో అంటాడు.

అడప కత్తెలు :- ప్రభువు తాంబూలం వేసుకునేటప్పుడు ఆకు మడుపులు అందిస్తూ ఎల్లప్పుడు తాంబూల పేటికను పట్టుకునే వాళ్లను అడపకాళ్లు, అడప కత్తెలు అని అంటారు.

"కృష్ణదేవరాయల వారు తమ వద్ద అడపకాళ్ళగా ఉండే నమ్మకస్తులకు మండలాధిపత్యం ఇవ్వడం ప్రారంభించారు, క్రీ.శ. 1529కి ముందు విశ్వనాథ నాయకుడనే ఉద్యోగి కృష్ణదేవరాయల వద్ద అడపంగా ఉండేవాడు."[9]

రాజసభ - రాజసభను కొలువు కూటం, పేరోలగం అనికూడా అంటారు. ఈ సభలు రాజధానిలో వుంటాయి, రాజ్యానికి సంబంధించిన సమస్యల్ని రాజుకు ఈ సభలో విన్నవించుకోవచ్చు, ప్రజల కష్టాలు, నష్టాలు అన్ని ఇక్కడే వినిపించాల్సి వుంటుంది. సామంతుల్నీ, దండనాయకుల్నీ, మండలాధికారుల్ని ఈసభకు పిలిపించి వారి ప్రవర్తనపై ప్రభువులు సంజాయిషీ అడిగేవారు. వారికి బహుమతులిచ్చినా, కప్పం తీసుకున్నా ఈ సభలోనే జరిగేది. న్యాయనిర్ణయాలు, శిక్షలు మొదలైనవన్నీ ఇక్కడే పరిశీలించబడేవి, ఇక్కడి నుంచే రాజు తన ఆజ్ఞలు జారీ చేసేవాడు. రాజకీయ సమస్యలతో పాటు విద్యావినోదాలు కూడా ఈ సభలో చోటుచేసుకునేవి. అయితే మంత్రాంగం మాత్రం ప్రత్యేక రహస్య స్థలాల్లో చేయబడేవి.

ఈ సభ రెండు విధాలుగా వుండేదని తెలుస్తోంది. ఒకటి సమితి, రెండు సభ వేదకాలంలో సమితి అనేది ప్రధాన పాత్ర వహించినట్లు తెలుస్తుంది. సమితి అంటే సమావేశం కావడం అని అర్థం. ప్రజలందరు జాతీయ సమావేశం కావడాన్ని సమితి అనవచ్చు, "రాజును ఎన్నుకోవడానికి ప్రజలందరు సమావేశం అయ్యేవారు."[10] రాజతంత్రానికి సమితి ఎక్కువ అనుకూలంగా ఉండేది.

సమితికి యుద్ధ క్షేత్రమని కూడా అర్థమున్నట్లు కశ్యపుని బుక్కు పేర్కొంది.[11]

సభ – ప్రజాపతి ఇద్దరు కుమార్తెలలో సభ అనేది సమితికి సోదరి లాంటిదని అధర్వవేదం చెబుతుంది.[12] (Sabha means, lit, a body of men shinning together) మంత్రులు, అంతరంగికులు, సామంతరాజులు, పురోహితులతో సభలు నిర్వహించబడేవి.

## రాజసభ వర్ణనలు

"హితబంధు జన పురోహితచయం బొకవంక
సత్తమ క్షత్రియు లొక్క వంక
కవి గాయకర్థి మాగధ సంఖ్య లొక వంక
సుడు రాజబింబాస్య లొక్క వంక
వేద వేదాంగ కోవిద విప్రలొక వంక
నూర్జిత శ్రీమంతు లొక్క వంక
రణ సముద్భట వీర బాహుత్తు లొక వంక
సుతు మంత్రి సామంతు లొక్క వంక

జతురు లొకవంక సకల శాస్త్ర ప్రవీణ
హృదయు లొక వంక గొలువ సమిద్ధ మహిమ
బరగు రుక్మాంగద క్షోణిపాలు కడకు
నరుగు దెంచిరి శుక శౌనకాది మునులు (రుక్మాం చ. 1-79)

పాండ్యరాజు ఇలా కొలువు తీరి వున్నాడు.

"ఆ రాజు మూడు మెట్లు గల ఉన్నతమైన, విశాలమైన, వివిధ చిత్రాల్ని చిత్రించిన కొలువు కూటంలోని పెద్ద తివాసిపై వున్న గద్దె మీద కూర్చున్నాడు. ఆ తివాసిపై అతని చుట్టు జటాధారులై పులితోలు ఉత్తరీయంగా ధరించిన వృద్ధ శైవులు కూర్చున్నారు. రాజు ముత్యపు పేరులతో వాటి మధ్య లెక్కలేని రుద్రాక్షలను ధరించాడు, నుదుటిపై అంటించిన విభూతి గాలికి రాలుతోంది. అతని నేత్రాలు విశాలంగా వున్నాయి. అయన ఒక గుండ్రని దిండుపై మోచేతిని నందీశ్వర ప్రతిమను చెక్కిన వుంగరంతో వేతితో గండస్థలాన్ని ఊసుకొని వున్నాడు. వెళ్ళలకు బంగారం చుట్టిన చిన్న రుద్రాక్షల అంటుజోడు మెరస్తుంటే తెల్లని పాగాను ధరించి దానిపైకి వచ్చే విధంగా దుప్పటి కప్పుకొన్నాడు. అతని ప్రక్కన ఒక స్త్రీ అడపాన్ని, పదునైన కత్తిని చేతపట్టుకొని వుంది. పట్టపుదేవి వింజామర

వీస్తోంది. (అము 4-58) ఈ రాజసభలను గురించి కువలయాశ్వ చరిత్ర (2-9), నాసికేతోపాఖ్యానం (2-125) కృష్ణరాయ విజయం (1-61) మొల్ల రామాయణం (బాల. 45) విపులంగా వర్ణించాయి. స్త్రీలు కూడా రాజసభా కార్యకలాపాలలో పాలుపంచుకునే వాళ్లు. తంజనాయకి అనే ఆమె సభలో మాట్లాడింది.

"సభలల మాటాడెనా చల్లగా బన్నీరు
చిలికిన రేవను జెలువు మీఱు" (రా.సాం. 1-20)

కుంతి, గాంధారి, పురుషులతో సమానంగా రాజసభలో కూర్చున్నారు. (భార.శాం. 1-371)

రాజు - ఆజ్ఞాపాలన :-

ప్రజలకు తగిన ఆజ్ఞలను జారీ చేయలేని రాజు గోడపై రాసిన చిత్రంలాంటివాడు. రాజు అన్నదమ్ములకు, కొడుకులకు, గురజనానికి, బంధువులకు, ప్రధానులకు సంపదలు ఇవ్వవచ్చు. "ఆజ్ఞ పాత్రీదురా" తన ఆజ్ఞను మీరితే వీళ్లందర్నీ కూడా శత్రువులుగా పరిగణించి, కోపాన్ని చూపించాలి.

"భూతలపతి వితతాజ్ఞా
జ్యోతి ప్రవర్తింపకున్న సూర్యాగ్ని శశి
జ్యోతులు వెలగవు గాన వి
చేతనముం బొంది సృష్టి చీకటిగాదే?"

ఇది రాజాజ్ఞకు పరాకాష్ఠ.

నిరంతర సుఖానుభవాలు, అతిశయవిభవాలు అనే రాజ్య ఫలాలు రాజుకు ఆజ్ఞవల్లనే లభిస్తాయి. పొలంలోకి పశువులు రాకుండా చుట్టు కంచెవేసి, ఆ పొలం సమృద్ధిగా పండిన తరువాత, కాళ్ళతో నులిపి ధాన్యాన్ని ఎలా పొందుతామో, తన ఆజ్ఞతో ప్రజల నుంచి కప్పం, కానుకలు పొందాలి. పశువును పులిగాను, పులిని పశువుగాను చేయుడానికి రాజుకు ఆజ్ఞా బలమే ఉపకరిస్తుంది. రాజు చేత మన్ననలు పొందినవాడు మొగ సింహం, మన్ననలు పొందలేనివాడు ఆడ సింహం. బలవంతుడి అండతో బలహీనుడు కూడా బలవంతుడనుకుంటాడు - మన్మథుడి చేతిలో పుష్పాలు కూడా బాణాలయినట్లు.

దండనలేకుంటే మత్స్య న్యాయం ప్రబలి ప్రజలు ఒకరి నొకరు భక్షిస్తుంటారు, వర్ణాశ్రమ ధర్మాలు నశిస్తాయి, దండి పని రాజుకు రాజ్యం ఏర్పడదు.

వంచకులను దుర్మార్గులను రాజు శిక్షించాలి. తప్పుచేస్తే భార్యనైనా శిక్షించాలి."
(స నీ.స 1-77 నుంచి 91)

రాజు - ప్రజాపాలన, ప్రజా సంబంధాలు :-

రాజు 'ఆత్మ సంపద్వరయుతు'డై 'లోకవర్తన విషడై' తిరుగుతుంటే సమస్త లోకం తండ్రి వున్న ప్రజలలాగ అత్యంత సుఖంగా వుంటుంది. 'నృప జన చోరాయత్తము' నృపవల్లభ రాజలోభ నిజహేతువులున్" భూమికి రాజ్యానికి భయాన్ని కలిగిస్తాయి. ప్రజలకు క్రమంగా రాజుకు ఆపదల్ని తెచ్చిపెడతాయి న్యాయపాలకుడైన రాజు తాను పాటిస్తూ తన ప్రజలు ధర్మార్థకామాలతో ప్రవర్తిల్లేటట్లు చేస్తాడు. రాజు అన్యాయంగా పాలిస్తే అన్నిటినీ నాశనం చేసినవాడవుతాడు. ప్రజల జీవనాన్ని పట్టించుకోని రాజుకు రాజ్య సుఖం కలగదు వారికి మేలుచేస్తే కీర్తి, కీడుచేస్తే అపకీర్తి కలుగుతాయి వాగ్వితాదులు (కవి, గమకి, వాది, వాగ్మి, వంది మాగధులు) రాజుకు ఆత్మ సంపదలు. అలాంటి సంపదాత్ముడైన రాజును కలిగిన ప్రజలు ఇంద్రుని ఆశ్రయించి జీవించే దేవతల వలె విశేషంగా అభివృద్ధి చెందుతారు. రాజు ప్రజలందర్నీ సమబుద్ధితో రక్షిస్తే, ప్రజలు రాజుకు అర్థవృద్ధిని, భూమిని వివిధ విధాల సమకూరుస్తారు 'రాజభివృద్ధి కంటె జనరక్షయే' ఉత్తమమైంది. మంచి రక్షణ లేక చెడిపోతుంటే ప్రజలు రాజుకు అభివృద్ధిని సమకూర్చలేరు. కోశసేకరణకు వివిధ మార్గాలుండగా రాజు కేవలం కాపులనే ఒక వర్గం ప్రజలను పీడిస్తే సంపదలు పొందలేడు. రాజు ఇంద్రుడిలా తన భూ ప్రజలను రక్షించాలి. అలా చేయకుంటే ఎండిపోయిన సరస్సును వదలి వెళ్ళిపోయే పక్షుల వలె ప్రజలు రాజును వదలి పోతారు. నీతితో ప్రజల్ని పాలించిన రాజే "ఉత్తమ యానములు ఘన విత్తములు రత్న ధాన్యవితతులు" పొందుతాడు. పాదులు చేసి, నీరుపోసి, పూలతీగల్ని కాపాడి పెంచి పెద్ద చేసిన వనపాలకుడిగా రాజు ఫలాన్ని ఆశించక నీతితో భూ ప్రజల్ని రక్షించి అభివృద్ధికి లేవాలి. రాజుకు ప్రజలే భాండాగారం. వాళ్ళని ప్రతి నిమిషం జాగ్రత్తగా రక్షించాలి. రాజు ప్రజల్ని తల్లి పెంచినట్లు పెంచితే ప్రజలు రాజును "పెద్దవారైన కొడుకులు తల్లిని పెంచినట్లు" పెంచుతారు. అతి క్రూరంగా అతి సౌమ్యంగా కాకుండా సాధారణ రీతిలో రాజనీతి పారగుడై ప్రజల్ని పాలించాలి. ఆపదలలో వున్న ప్రజలకు సహాయం చేసి కాపాడాలి. రాజుకు రాజ్యమే కుటుంబం ప్రజల్ని బాగా రక్షించకుండా, మిక్కిలి ఆశతో అధర్మంగా వారివద్దనుంచి సంపదల్ని (పన్నులు మొదలైన రూపాల్లో) దోచుకునే రాజు ధాన్యం కుప్ప కాలిపోతుంటే అందులో పేలాల్ని వెదికి తినే మూఢుడు రాజ్యం (ప్రజలు) చెడితే రాజు చెడతాడు రాజు చెడితే రాజ్యం చెడుతుంది. రాజ్యం రాజు కాపాడి కుండల

లాగా వుండాలి. చిరకాలం నుంచి పెంచిన వృక్షాలు, పశువులు తమ కాలానికి ఫలాలు, పాలు ఇస్తాయి. అలాగే రాజు ప్రజల్ని కాపాడితే తరువాత ప్రజలు రాజుకు తగిన ఫలాల్ని ఇస్తారు. రాజుకు ప్రజాపాలన వల్ల సద్గతి కలుగుతుంది. సంపదలు చేరతాయి. ప్రజల్ని పీడిస్తే ధర్మక్షయం, ధనహాని, అపజయం కలుగుతాయి. రైతులకట్ల రాజు ఉదారంగా ప్రవర్తించాలి. రాజు బంధుహీనులకు ఆప్త బంధువుగా, నేత్ర హీనులకు నేత్రాలుగా ఏలవాలి. ప్రజల్ని కన్న తల్లిదండ్రులాగా చూడాలి. తన రాజ్య ప్రజల్ని బాధించే కంటకుల్ని శోధించని నాడు, శత్రువుల్ని జయించిన బలం వృధా అవుతుంది. రాజు తానే స్వయంగా ప్రజల్ని కాపాడాలి. ఆపని అన్యుల చేతికిస్తే ఆతని సొమ్ముతిని పెరచడానికి ప్రయత్నిస్తారు దొంగలు, దుర్మార్గుల బారి నుంచి ప్రజన్ని రక్షించడానికి రాజేదిక్కు.

ప్రజా పీడనచేస్తే రాజు యొక్క ప్రాణం, వంశం, సంపదలలో ఏదో ఒకటి ప్రజల శోకాగ్నిలో తగులుకొని బూడిదకాక తప్పదు. ఇతరుల వల్ల ఆపదలకు గురిఅవుతున్న ప్రజల్ని రక్షించలేనీ రాజు, రాజుకాడు. జగతిలో పుట్టిన యముడు. శత్రువులవల్ల బాధ పడకుండా రక్షించడానికి రాజు లేకుంటే ప్రజలు సముద్రంలో నావికుడు లేని నావలాగా, అవస్థలు పడతారు బలవంతుడైన రాజు నీతిమంతుడు కాకుంటే చిల్లుపడిన నావలాగా, పతనమవుతాడు ప్రజారక్షణ చేయలేని రాజును వెంటనే వదలివేయాలి.

ధర్మ పరిపాలకుడు అభివృద్ధి చెంది ప్రకాశిస్తే అధర్మ పాలకుడు పతనమవుతాడు ప్రజల్ని పీడించి కూడపెట్టిన ధనం వ్యయ మవుతుంది. ప్రజలు, ధనం లేకుండా కేవలం భుజబలంతో రాజు విలవలేడు. (ధనం కోసం సింహంవలె ప్రజలపై పడి వారిని వధిస్తే అతనికి తృప్తి కలగవచ్చుకాని పాలించడానికి అతనికి రాజ్యం వుండదు.) (స.నీ.స. 1–92 నుంచి 124)

"సొమ్మున కొడయలు మీరా
జ్యమ్మున కుంగర్త లీర యంచిత కల్యా
ణమ్ములకు ప్రవర్తకులరు
మిమ్మలరించుటయె యెల్లమేలును నాకున్ (హరి.ఉ.భా. 4-242)

రాజు అహంకారాన్ని విడిచి, వీర సామంతాదులకు, తక్కిన దొరలకు, ప్రజానీకాన్ని వీలా మచ్చికతో చూడాలో చెప్పి, సంపదల్ని ఒక్కడే అనుభవించక అందరికి భాగం కల్పించి, రాజ్యరక్షణావసరం అందరూ ఆ రాజ్యం తమదని భావించి రక్షించేలా చేయాలి.

రాజు–ప్రజా సంబంధాలు  రాజు ప్రజలతో సత్సంబంధాలు పెట్టుకోకపోతే రాజ్య పాలనా నిర్వహణలో ఇబ్బంది పడతాడు. రాజ్యోత్పత్తిని గురించి వివరించే అన్ని సిద్ధాంతాలూ రాజు ప్రజా సంరక్షణకై ఆవిర్భవించాడని పేర్కొన్నాయి. తమ అభ్యున్నతి కోసం కృషి చేయడానికి పాటుపడే రాజుకు ప్రజలు అన్ని విధాల సహకరించాలి  రాజు మూర్ఖుడైతే ప్రజలూ అలాగే తయారవుతారు. 'యదా రాజా తథా ప్రజా' అనే నానుడి నిజమవుతుంది.

"రాజునకు బ్రజ శరీరము
రాజు ప్రజకు నాత్మగాన రాజుం బ్రజయున్
రాజోత్తమ! యన్యోన్యం వి
రాజితులై యండవలయు రక్షార్చనలన్" (భార.శాం. 2-274)

రాజు–ప్రజల మధ్య ఉండాల్సిన అన్యోన్య సత్సంబంధాలు పేర్కొనబడ్డాయి. పన్నుల వసూలు చేయడానికి రాజు ప్రజల్ని బాధించరాదు. ప్రజలకు ఎలాంటి భారం లేకుండా రాజు పన్నుల్ని విధించాలి.

"ఎనిమిది నెలలును నల్లన
దనకరముల బూరసంబు దలుగంగొను భా
నుని క్రియ సూక్ష్మోపాయం
బున దరి గొనవలయు నృపతి భూప్రజ చేతన్"
(మా పు. 3-136)

ప్రజారంజకుడైన రాజుకు ఎలాంటి ఆపదలు సంభవించినా ప్రజలు తమ సహకారాన్ని మనస్ఫూర్తిగా అందిస్తారు. రాజుకు సంభవించిన ఆపదల్ని గురించి విచారిస్తారు.

హరిశ్చంద్రుడు విశ్వామిత్రునికి తన రాజ్యాన్ని అంతటిని ఇచ్చి తన కుటుంబంతో కలిసి వెళ్లిపోతుంటే అది తెలిసి పురజనులు "మీద మిన్ను విఱిగి కూలిన యట్టి కరణి గుండెలవిసి" (మా.పు 1-175 నుంచి 182) దీనంగా రోదిస్తారు.

"ధరణీశ్వరులకు ధర్మం
బరయంగా బ్రజలయార్తి యణచుటయె కదా
ధరణీశ్వర! యే మార్తిం
బరి తాపము బొంద జనుట పాడియె నీకున్" (మా.పు. 1-179)

కాబట్టి మమ్మల్ని వదలి ఎక్కడికీ వెళ్లవద్దని ప్రజలు పరిపరివిధాల ప్రార్థి,

వడాన్ని బట్టి రాజైన హరిశ్చంద్రుని పట్ల ప్రజలకున్న ప్రగాఢమైన అభిమానం అభివ్యక్తమవుతోంది.

రాజు ప్రజా సంబంధాలు గురించి ఇలా వుంది -

రాజ్య వర్ధన భూపతి రాజ్యభారాన్ని కుమారునికి అప్పగించి తపస్సు చేసుకోవడానికి అడవికి బయలుదేరాడు. ప్రజలు అతన్ని వారించారు. ప్రజల్ని పాలించే ధర్మంలో పదహారవపాలు నీవు అడవిలో చేయబోవు తపస్సు ఉండదని చెప్పారు. వయసు పైబడ్డం చేత తాను రాజ్యపాలన చేయులేనని కృతాంతుని దూతలు వచ్చేదాక తపస్సు చేస్తూ కాలం గడుపుతానని వారితో చెప్పాడు. అయినా ప్రజలు అతని ఏక కంఠంతో ప్రార్థించారు. రాజు తన ప్రయత్నాన్ని మానుకోలేదు. ఏమి చెయడానకి దిక్కుతోచని ప్రజలు రాజ్యవర్ధుమని ఆయుర్వృద్ధికై సూర్యుని ఆరాధించారు. బ్రాహ్మణులు కూడా అందులో పాలు పంచుకున్నారు వారి భక్తికి మెచ్చి సూర్యుడు ప్రత్యక్షమైనాడు. ప్రజలందరూ భక్తితో మోకరిల్లి ఇలా అన్నారు.

> "యుదియకు ంతత విజయా
> స్పదుడై సుశీల నీప్రసాదమున భువిం
> బదివేల సంవత్సరంబులు
> బ్రదుకంగా వలయు మానృపాలుడు తరుణీ!" (మా.పు. 7-165)

అని కోరారు. సూర్యుడు వాళ్ళుకోరిన వరాన్ని ఇచ్చి అదృశ్యుడైనాడు. అ విషయాన్ని మానిని అనే స్త్రీ రాజ్యవర్ధునునికి చెబితే అతడు సంతోష పడకుండా దుఃఖించాడు.

> "పౌరులు భృత్యులు నాకుప
> కారం బొనరించి యుండగా నక్కట ! నే
> వారలకు మే లొనర్పక
> యూరక భోగముల దగిలి యుండం దగునే?" (మా.పు 7-172)

అని ఆమెతో అన్నాడు, అంతేకాదు తన ప్రజల్ని, భృత్యులు పుత్త్రపౌత్రులు కూడా పదివేల సంవత్సరాలు బదకడానికి వరాన్ని పొందడానికై సూర్యుని గురించి తపస్సుచేసి వరాన్ని కూడా పొందాడు. ఇలా ప్రజలు రాజు కోసం, రాజు ప్రజల కోసం తపస్సు చేసి సూర్యుని నుంచి వరాల్ని పొందడానికి కారణం రాజుకు ప్రజలకు మధ్య ఉండే అత్యంత ప్రీతిపాత్రమైన సంబంధాలే.

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా వాటిని రాజు స్వయంగా తొలగించాలి. "తమ పంటల్ని నాశనం చేసూ తమను బాధిస్తున్న క్రూర మృగాల తాకిడికి తాళలేక పుర ప్రజలందరూ సమావేశమై రాజును దర్శించి, అతనికి 'చక్క జాగిలి' మ్రొక్కి హస్తములు మొగిచి,

"అవధరింపుము రుక్మాంగ దావ నీశ !
నీవు రాజ్యంబు సేయంగ నేటిదాక
చల్లనై యున్న మీ పదాబ్జముల నీడ
బ్రతికి యుంటిమి పిన్న పాపలము మేము" (రుక్మా.చ. 3-7)

అంటూ తమకు క్రూర మృగాల వల్ల వచ్చిన అపదల్ని ఏకరువుపెట్టారు. ఆక్రూర మృగాన్ని వేటాడితమ ఆపదల్నితొలగించకపోతే ఈ వ్యవసాయాన్ని వదలి ఎక్కడికైనా వలస పోతామని చెప్పారు.

"భయమున భూప్రజలాడిన మాటలు
పార్థివశేఖరుడా దరణన్
గయికొని యేల విచారము నే గలు
గన్ మృగ కోటుల ద్రుంచెదనే
భయమును వద్దు సుఖంబున నిండుల
పట్టు నుండు డటంచు మహా
దయనిగుడన్ ప్రజనంపి విభుండు ప్ర
తాపమెలర్పగ నక్షణమే ...." (రుక్మా. చ. 3-13)

వేటకు ప్రయాణం అవుతూ రాజ్యాన్ని కుమారునికి అప్పగించాడు.

ఇలా ప్రజల బాధల్ని భయాన్ని తొలగించడానికి నిరాలస్యంగా రాజు బాధ్యత తీసుకోవడం చేత రాజుకు ప్రజలకు వున్న సత్సంబంధాల్ని అంచనా వేయవచ్చు.

రాజ్య ఆర్థిక పాలన - రాజ్యానికి అవసరమైన సప్తాంగాలలో 'కోశం' కూడా ప్రధానమైందని ఇంతకు ముందే (రెండవ అధ్యాయంలో) వివరించబడింది.

రాజు తన రాజ్యపాలన విషయంలో ఎలాంటి చిక్కులు లేకుండా ఉండాలంటే ఆర్థిక విషయంలో జాగ్రత్త వహించాలి,

అతి ప్రాచీన భారతదేశ చరిత్రలో ప్రజలు స్వచ్ఛందంగా ఇచ్చే కానుకలపైన రాజ్యపాలన ఆధారపడి ఉండేది. కాలక్రమేణా రాజ్యం స్థిరపడగా కొన్ని

పన్నతుల సంహారం నిర్బంధంగా ప్రజలు కానుకలు చెల్లించడం అవసరమైంది[13] రాజ్యం యొక్క ఆదాయం పలు వనరుల ద్వారా సమకూరుతుంది. రాజ్యం తొలి దశలలో ప్రజలపై పన్నుల భారం ఏమాత్రం ఉండేదికాదు. కాలక్రమేణ రాజ్య అవసరాల్ని బట్టి ఈ పన్నుల భారం ప్రజలపై పడింది

రాజ్యానికి ముఖ్య ఆదాయం పన్నులు. రైతుల నుంచి పన్నులు వసూలు చేసేవారు. తరువాత కాలాలలో వాణిజ్యపరులు, ఇతర వృత్తులకు సంబంధించిన వాళ్ళ దగ్గర నుంచి పన్నులు వసూలుచేశారు. కొంత మంది అవినీతి పాలకుల పరిపాలనలో ఈ పన్నుల స్వరూపం వికృత రూపం దరించింది. ఇలాంటి పన్నులు విధించడానికి నిరంతర యుద్ధాలు జరగడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. ప్రజలలో అసంతృప్తి ప్రబలి రాజ్యపాలకులను హత్యలు చేయడం కూడా భారత దేశ చరిత్రలో కనబడుతుంది, చంద్రగుప్త మౌర్యుని కాలంనాటి ఆర్థిక వ్యవస్థ గురించి చాణుక్యుని అర్థశాస్త్రం చెబుతోంది.[14]రాజ్యం ఆదాయాన్ని అతడు రెండు విధాలుగా వర్గీకరించాడు. మొదటి వర్గీకరణ ప్రకారం రాజ్యం ఆదాయాన్ని ఏడు విధాలైన శాఖల నుంచి సేకరించడం జరిగేది. అవి 1) రాజధాని (The Capital) 2) దేశ ఇతర భాగాలు (The Country Parts) 3) గనులు (Mines) 4) ప్రభుత్వ కార్యకలాపాలు (Public works) 5) అడవులు (Forests) 6) పశువులు మేపే భూములు (పచ్చిక బయళ్లు) (Pasture lands) 7) వాణిజ్య రహదారులు (Trade routes) రెండవ వర్గీకరణలో పన్నుల విధింపువల్ల వచ్చే ఆదాయం పన్నులు విధించకుండా వచ్చే ఆదాయం అని పేర్కొంది.

ఆర్థిక వ్యవస్థను మెరుగు పరచడానికి దేశాభివృద్ధిని సాధించడానికి రాజు కాలువలు, చెరువులు త్రవ్వించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలి గనులు ఎక్కడున్నాయో పరిశోధించి వాటిని ఉపయోగంలోకి తేవాలి, ఆదాయ వ్యయాలను క్రమబద్ధం చేయాలి. ఆదాయం కంటే వ్యయం ఎక్కువైతే ఆరాజ్య ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నం అవుతుంది.

అశ్వమేధ యాగాన్ని చేయమని వ్యాసుడు ధర్మరాజుకు సలహా ఇచ్చాడు అయాగ నిర్వహణకు అవసరమైన ధన వ్యయాన్ని ప్రజలపై వేస్తే వాళ్ల దూషిస్తారని ధర్మరాజు వ్యాసునితో అంటాడు (జై భార. 1-64).

న్యాయపాలన:- ఆదిమానవుడు తనకు జరిగిన అన్యాయానికి బల ప్రయోగంతో

కసి తీర్చుకునే వాడు. రక్తానికి రక్తం అనేది ఆనాటి న్యాయం. కాలక్రమేణ సమా

గోపనంద కుమారుల గూడుదము " ॥ కృష్ణా॥
అంటూ గోపికలు, కృష్ణుని గురించి పాడినట్లు పాడుకుంటారు

"మామ కంసుణ్ణి జంపి గోపాలానీవు
మదనపురిని ఏలినావె గోపాలా
అత్తపూతకిని చంపి గోపాలా నీవు
అయోధ్య నేలినావె గోపాలా"
అని కృష్ణుని స్తుతిస్తారు.

కోలాటం కేవలం వినోదాత్మకమైనదే కాదు. ఆటగాళ్ళకు మంచి శారీరక వ్యాయామం కోలాటం వల్ల కలుగుతుంది. కోలాటాన్ని అందరూ కలిసి ఆడటం వల్ల కులమత భేదాలను, వయోభేదాలను పట్టించుకోరు. ఈ ఐకమత్యం మన జాతి పురోభివృద్ధికి దోహదపడుతుంది. జాతి సమైక్యతకు కోలాటం వంటి జానపద ప్రదర్శన ఎంతైనా అవసరం.

ఫిబ్రవరి 1999 న ఆధ్యాత్మిక పత్రిక 'శుభం' - లో ప్రచురితమైన వ్యాసం.

* * *

# 15. సాహిత్యంలోని గ్రామ దేవత-జాతర

యజ్ఞ యాగాదుల్ని శిష్టులు ఆచరిస్తే గ్రామాల్లో జానపదులు గ్రామ దేవతల్ని పూజిస్తారు. పల్లీయుల మూఢ విశ్వాసాలకు, మూఢ నమ్మకాలకు ప్రతీకలుగా వెలసినవే గ్రామదేవతలు. గ్రామ దేవతలు పల్లెల్లోని దుష్ట శక్తులను శిక్షించి, అదృషశక్తుల నుంచీ అంటు వ్యాధుల నుంచీ రక్షిస్తుందని పల్లీయుల ప్రగాఢ విశ్వాసం అంతేగాక పశుసంపదను, ధాన్యసంపదను గ్రామదేవతలు అభివృద్ధి చేస్తారనీ ఆగ్రహిస్తే పశునష్టం, ప్రాణనష్టం, ధననష్టం, ధాన్యనష్టం, అతివృష్టి, కరువు కాటకాలను సృష్టిస్తారని జానపదుల నమ్మకం. అందువల్ల గ్రామ దేవతల అనుగ్రహం కోసం జానపదులు బలులను, నైవేద్యాలను అర్పించి జాతరలను జరుపుతుంటారు. తమ కష్టాలు, సుఖాలు అంతా ఆ అమ్మ చలవే అని విశ్వసిస్తారు

అగ్రవర్ణాలవారు వ్రతాలు, నోములు చేస్తే మిగిలినవారు గంగమ్మ-ఎల్లమ్మ-అంకాలమ్మ-పోలేరమ్మ ఇత్యాది గ్రామదేవతలకు జాతర్లు చేస్తారు. గ్రామదేవతలనే వీరు అమ్మవార్లని పిలుస్తారు. గ్రామదేవతల చివర 'అమ్మ' అని సర్వసాధారణంగా ఉంటుంది. అందర్నీ కాపాడే తల్లి అనే అర్థంలో యీ విధంగా వాడబడి ఉంటుంది. గ్రామాన్ని ఆ దేవతలు రక్షిస్తారనే నమ్మకంతో అనాది నుంచి పల్లీయులు జాతరలు జరిపిస్తున్నారు.

యాత్రాశబ్దభవమైన 'జాతర' శబ్దానికి ఒక ప్రత్యేకమైన అర్థం కనిపిస్తుంది.

"దేవత-తీర్థం పర్వతం సముద్రం మొదలైన వాట్ని గురించి చేసే ప్రయాణమే జాతర" అని సూర్యరాయాంధ్ర నిఘంటువు. కాని, ఆధునిక కాలంలో ఈ పదానికి అర్థం విపరిణామం వచ్చి 'అల్లరి' అనే అర్థంలో వ్యవహరింప బడుతున్నది.

గ్రామాలలో ఆయా సందర్భాలననుసరించి గ్రామ దేవతలకు ఊరేగింపుతో కూడిన పండుగ చేసుకుంటారు దీన్నే జాతర అని పిలువవచ్చు

"పుర గ్రామము (రాజ గ్రామము) లో స్థాపన చేయబడిన సభను ప్రతిష్ఠిత సభ యందురు. ఇతర గ్రామములందుండు సభలను అప్రతిష్ఠిత సభలందురు. ఈ రెండును మరల ముద్రితములు, శాసితములు అని మొత్తం నాలుగు విధములుగ చెప్పబడినవి, ముద్రితము అనగా న్యాయాధికారి (ప్రాడ్వివాకుడు) మొదలగు అధికారి అధ్యక్షుడుగా గలది. శాసిత సభ అనగా రాజే అధ్యక్షుగా (ముఖ్య) తీర్పు చెప్పు సభ .. ... రాజు న్యాయము తప్పి విపరీత నిర్ణయములు చేయునపుడు సభ్యుడు న్యాయమును తెలియజెప్పి రాజును మందలించవలెనని చెప్పబడెను అట్లు చేయనిచో సభ్యునిదే పాపమగును. రాజు వినకపోయినను సభ్యుడు న్యాయమును చెప్పి తీరవలయునని ధర్మము శాసించుచున్నది "[22]

న్యాయస్థానం -

బృహస్పతి న్యాయస్థానాన్ని దాని వివిధ అంగాలను ఇలా ప్రతిపాదించాడు.

1 రాజు ;— రాజాధిష్ఠత న్యాయస్థానము శాసిత న్యాయస్థానము.

2 ప్రాడ్వివాక్.— అతనిచే అధ్యక్షత వహింపబడిన న్యాయస్థానము. ముద్రిత న్యాయస్థానము.

3 సభ్యులు - వీరు రాజులచే నియుక్తులు న్యాయపాలనలో ప్రాడ్వివాక్ వీరి సహాయము గైకొనును.

4 సభాసదులు,— వీరు ఆయా వివాదముల పరిష్కారములో సహాయపడుటకు ఆహుతులు. అని యుక్తులు అని కూడ వీరిని వ్యవహరింతురు.

5 గణకుడు:— ఇతడు అవసరమగు లెక్కలు వేయుట ధనమును లెక్కబెట్టుట మొదలగు పనులను జూచును,

6 లేఖకుడు.— ఇతడు కక్షిదారులను, సాక్షులను న్యాయస్థానమున హాజరు కావలెనను తాఖీదులను వారికి అందజేయును."[23]

పంచాయితి సభలు;- పంచతంత్రం, వైజయంతీ విలాసం మొదలైన కావ్యాలు పంచాయితి విధానాన్ని గురించి వివరించాయి.

ధర్మబుద్ధిని మోసగించిన దుష్టబుద్ధిని రాజపురుషులు,

"చెల్లు సెల్లముల కీక్షింప నిచ్చిన సొమ్ము
మగుడ నీలేవి కోమటిగులామ !

చేనేత విశ్వసించిన వారి వెచ్చ స
　　చ్చముల గీడ్చరచు వై జాతి తొండ!
... ....వెడగరపు డొక్క! యోరోరి
　　సెట్టికుక్క .. ....” అని తిట్టిసొమ్ము అతనికి

ఇప్పించి దుష్టబుద్ధికి కొరతవేశారు. (వై. వేం.పం.తం. 1-700 నుంచి 764)

తలార్లు అపరాధుల్ని పట్టేవాళ్లు. గ్రామాలలో రాత్రిపూట కోలదివిటీలతో కాపలా కాసేవాళ్లు తప్పెటవేసిన తరువాత ప్రజలు సంచరించరాదు. అనుమానం వున్న వాళ్లను రాత్రి అంతా తమ రానాలో బండకొయ్య తగిలించి కూర్చోబెట్టి తెల్లవారిన తరువాత వాడు "అచ్చో, ముచ్చో" ధృవీకరించుకొని అపరాధి కాకుంటే వదిలేవాళ్లు. (శుక. 3-204)

ధర్మరక్షణలో కన్నకొడుకు మీద కూడా వాత్సల్యంలేకుండా శిక్ష విధించబడేది. సారంగధరునిపై చిత్రాంగి చేసిన ఆరోపణను పురస్కరించుకొని రాజ సుహేంద్రుడు అడిగిన సలహాకు నయార్జితుడనే మంత్రి పినతల్లిని చెవికిన పాపానికి కఠినంగా శిక్షించాలని అంటాడు. మతిమంతుడు సారంగధరుడు అలాంటి పనిచేసి వుండడని చెప్పాడు. కామాతురులైన వాళ్లు దేనికైనా తెగిస్తారని నయార్జితుడు వాదించాడు. సారంగధరుని శిక్షిస్తే దశరథునిలాగా పశ్చాత్తాపం చెందాల్సి వుంటుందని మతిమంతుడు మందలించాడు వీళ్ల వాదనల్ని విని నీతిజ్ఞుని నను సరించి, చిత్రాంగి సారంగధరు వాదనల్నివిని సారంగధరుడు దోషి అని అందరూ నిర్ణయించారు. తగిన శిక్షను సూచించమని ధర్మశాస్త్రవేత్తలను రాజు కోరాడు.

“... .... .. ... అట్టి దురాత్మ
గొనిపోయి నడురేయి ఘోరాట వందు
గనెలుగా జేతులు గాళ్ళు గోయింప
జను నని ధర్మ శాస్త్రములు శోధించి
పలికిన నృపుడు నప్పని సేయుదనుచు
దలవరులకు జెప్పి తగువారి బంచి” (నవ్వచరి. పుట -85)

ఇలా కుమారుడని కూడా చూడకుండా రాజు శిక్షను అమలు చేయడం విస్మయాన్ని, గగుర్పాటును కలిగిస్తాయి.

యజ్ఞదత్తుడనే మంత్రి కుమారుడు సుకుమారుడనేవాడు ధూర్తుడై తిరిగే విషయాన్ని ప్రజలు రాజుకు విన్నవించారు. రాజు అతన్ని మంత్రి ద్వారా సభకు పిలిపించి వాగ్దండంతో దండించి, పురబహిష్కరణ చేశాడు. (శివ. మహా. 315 నుంచి 18)

"ధర్మాధర్మాలూ, దోషాదోషాలు నిర్ణయించడానికై అగ్న్యాది పరీక్షలు పెట్టడం అపారంగా వుండేది. కౌటిల్యుని కాలానికివి లేవు. మనువు, యాజ్ఞవల్క్యస్మృతుల నాటికి ప్రారంభమయి, బృహస్పతి కాలం నాటికి తొమ్మిది తరహాల పరీక్షలు అమలులోకి వచ్చేయి. ఈ పరీక్షలను 'దివ్య' లంటారు.

1 తులాదివ్య: నేరస్తుడివి ముందు తూచాక న్యాయాధికారి కొన్ని మంత్రాలు చదువుతాడు. తరువాత మళ్లీ తూస్తాడు. రెండోమారు ఎక్కువ తూకం వుంటే అతడు దోషి.

2 అగ్నిదివ్య:- దోషిని రావికర్ర నిప్పుల మీద నడవ మంటారు. అతని కాళ్లు కాలకుంటే నిర్దోషి.

3 జల దివ్య - ఒక సైనికుడు ప్రయోగించిన బాణాలను వెతికి తెచ్చే వ్యవధి వరకు నీళ్ళలో మునిగి వుండగలిగితే నిర్దోషి

4 విష దివ్య:- తాచుపాము వున్న కుండలోంచి కాటు పడకుండా వుంగరం తియ్యగలిగితే నిర్దోషి.

5 కోశ దివ్య,- దేవతా విగ్రహాలను కడిగిన నీరు తాగి 14 రోజులు బ్రతికితే నిర్దోషి.

6 తండుల దివ్య:- మంత్రించిన బియ్యం నమిలి రావి ఆకు మీద ఉమ్మెయ్యాలి. ఈ బియ్యానికి తడిలేక పోయినా, రక్తం కనిపించినా అతడు దోషి.

7 తప్త మస్క దివ్య:- మరుగుతున్న నూనెలోంచి నాణెం తీయాలి. వెయ్యి కాలకపోతే నిర్దోషి.

8 పల దివ్య - కాలుతున్న బల్లెపు అడను చేతబట్టుకొని కొన్ని అడుగులు వెయ్యాలి. తర్వాత ఆ చేతిలో ధాన్యం నలపాలి. చేతులు కందక పోతే నిర్దోషి.

9 ధర్మాదర్మ దివ్య,- వెండితో చేసిన ధర్మమూర్తినీ, సీసంతో చేసిన అధర్మ మూర్తినీ జాడీలో వేస్తారు. అతడు తీసే విగ్రహాన్ని బట్టి దోషాదోషములను నిర్ణయం చేస్తారు."[24]

రాజు ధర్మానికి రక్షకుడై కాని సృష్టి కర్త కాదు.

A basic tent of Hindu political and legal thought was the belief that the king should regard himself not as the creator of the law, but only as its guardian"[25]

దొంగల సాధనాల్ని, దొంగతనం చేసే విధానాన్ని పరమ యోగి విలాసం (పుట. 485, 526), సింహాసన ద్వాత్రింశిక (10-118) హరిశ్చంద్రోపాఖ్యానం (పుట 431) ఆముక్తమాల్యద (7-7 నుంచి 26) పేర్కొన్నాయి.

చీకటి పడగానే ప్రజలు తమతమ పనులను వదలి ఇళ్లు చేరేవారు, తలారులు జాగ్రత్తగా నగరాన్ని కావలి కాసేవాళ్లు. అయినా దొంగలు శబ్దంకాకుండా సంచరిస్తూ సందుల్లో ఇళ్లకు కన్నాలు వేసి దొంగతనం చేసేవాళ్ళు. పట్టుబడిన వీళ్లను తలారులు బంధించి రాజు దగ్గరికి తెచ్చేవాళ్లు, రాజు కోపించి కాళ్ళేయి గోయించి వెళ్లగొట్టేవాడు. (సిం.ద్వా.10-129)

దొంగలు నేరాల్ని అంగీకరించక పోతే

"ఇడుమ కట్టున వేడి యెండలో మిగుల
జడియ వీపుల మీద బాపరాలెత్తి
పొగడ దండలు వైచి పోనీక యెదుట
వెగడ డిట్టుచు నడ్డపెట్టి......." (పరమ. పుట -324)

తలారులు బాధించే వాళ్ళు. దోషుల కాళ్లు చేతులు నరకడం, వాళ్ళను గానుగలలో వుంచి బాధించడం, నిప్పుతో కాల్చడం మొదలైన శిక్షలు అమలులో వుండేవి

ధన లోభంతో రాజకుమారుని చంపిన బ్రాహ్మణుని శిక్షించాలని,

" . . . . నారాయణా యని వీని బట్టి తి
త్తొలిపింపదగునని పలుకువారు
గాళ్ళను చేతులు గనియలుగా బట్టి
విదిమింపదగునని పదరువారు
గాయంబు నగ్గుగా గలుగాను గల బెట్టి
త్రిప్పుట తగునని తెలుపు వారు
మేన వెంటులు చుట్టి పైనగ్గి తగిలించి
మిడికింప దగునని నొడువు వారు...." (సిం.ద్వా. 3-60)

బహుశా హంతకులకు ఆనాడు ఇలాంటి శిక్షలు వుండేవేమో!

వ్యభిచారానికి శిక్షగా కొట్టి హింసించే వాళ్ళు (వా.రా 2-179)

"ముక్కు సోణంబు దాకను చెక్కు టొకటి
కోసి నోరుగ బండ్లూడ బొడుమటొకటి
గూ బలంటగ జెదోయి గోయి టొకటి
లంజె తల్లి యొనర్చు కల్లలకు శిక్ష" (క్రీ.డా. _271)

ఇవి వేశ్యమాతకు విధించే వివిధ విధాలైన శిక్షలు.

అన్యాయంగా ప్రవర్తించే వాళ్లకు ఇంకా ఎలాంటి శిక్షలు విధించేవాళ్లో చూడండి.

"........కొందఱీ యన్యాయ శీలుని
బట్టి కొఱ్ఱెక్కింప బాడియండ్రు
కొందఱీతని సందు సందులు చక్కగా
బాడిద నలికింప బాడియండ్రు
కొందఱీతని కండలందందదిగ జెక్కి
భక్షింపుమని పెట్ట బాడియండ్రు
కొందఱీతని దలక్రిందుగా గట్టించి
పై చర్మమొలిపింప బాడియండ్రు
కొందఱితని బచ్చి గుడియల నోదించ
బాడియండ్రు.... ... ...." (భోజ 5-316)

బ్రాహ్మణులు వధానర్హులని నమ్మేవాళ్ళు కాబట్టి అపరాధులైన బ్రాహ్మణులకు దేశ బహిష్కరణ లేక కుక్కచ్చు ఒత్తించడం శిక్షగా వుండేది

"చంపిన వాని సరిగా
జంపుట తగు విప్రుడైన జంపక పతిత
త్వంపద గొని తలగొరిగి ప
దంపడి కుక్కచ్చు వ్రాసి దండింపదగున్" (విజ్ఞా. 2-64)

ఈ శిక్షను ఇలా అమలు వేసేవాళ్ళు.

"తలగొరిగించి కుక్కడుగు తప్పక ఫాలమునందు వ్రాసి ముం
గల దన మెల్ల బుచ్చుకొని గాడిద నెక్కగ జేసి గ్రామమున్
వెలువడ ద్రోచి పుచ్చుటయు విప్రుని జంపుట క్షుద్రజంతులన్
జొలువన చంపు తప్పు గలచో దగ చంపుట ధర్మ మెమ్మెయిన్"
(విజ్ఞా. 3-42)

సయవంచకుడైన పురోహితుడు తన శిష్యులతో

"　　మేదినీ నాదు
డిట్టి నాదుర్వృత్త మెఱిగిన వెడల
గొట్టించు మే నెల్ల పుక్కచ్చు లొత్తి" అని రోదిస్తాడు
(నవ.చ.పుట 199)

దొంగల్ని కొరత వేసే వాళ్లు (మా.పు. 2-167)

అన్యాయపు వ్యాపారస్తులను కఠినంగా శిక్షించే వాళ్లు (కే బా.చ. 3-201)

పన్నులు చెల్లించని వాళ్ళని

"పడతాళ్ళ చేద దీర్పరుల మున్నీల తడయక
పిలిపించి తద్వార్త చెప్పి ...... . ." శిక్షా
నిర్ణయించేసే వాళ్ళు (పరమ. పుట. 457)

సుంకాన్ని వసూలు చేయడానికి సుంకరులను నియమించేవాళ్ళు. వీళ్ళు దయా దాక్షిణ్యాలు లేని క్రూరులు.

" .... .... .... ..
జూదము కంటె వాదమును సుంకరి కంటెను పాప కర్మమున్...."
(నీ.ము. 151) లేదట!

పన్ను కట్టలేక మహాకవి శ్రీనాథుడు కూడా శిక్షలు అనుభవించాడు. ఆ శిక్షల్ని గురించి తానే కంఠోక్తిగా చెప్పుకున్నాడు.

దేశ ద్రోహులను వధ్యశిల మీద వుంచి శిరః ఖండనం చేసేవాళ్ళు. వధ్య శిలను ఎక్కించడానికి ముందు దోషిని ఎర్రటి వస్త్రాల్ని తొడిగే వాళ్ళు... " వధ్య చిహ్నమైన రుక్తాంబక" మని (సిం.ద్వా5-211)చెప్పడం వల్ల ఈ విషయం తెలుస్తోంది వధ్య స్థలానికి తీసుకు పోబడే దోషిని అలంకరించే వాళ్ళు. ఆ అలంకరణ ఇలా వుండేది.

" .... .... .... .... .... .... ....
నడురేయి యగుటయు నగర రక్షకులు
తడయక సారంగధరుని బంధములు
సడలించి వీడిన జడ జక్కనల్లి
మొగలి రేకుల మీద మురువుగా జెరివి

మృగ నాభి తిలకంబు మెచ్చుగా దీర్చి
పలుచగా గుంకుమ పంకంబునలది
చెలువారు నెఱి పట్టుచీరగట్టించి
పొలుపొంద భూషణంబులు చక్కదిద్ది
కలువ పువ్వుల దండ గళమున వేసి '' (నవ.చ,పుట -93)

పటు ఖడ్గఖేటక పాణులై నగర రక్షకులు దోషిని వధ్యస్థలానికి తీసుకుపోయేవాడు. అప్పులు తీసుకోవడానికి పడేపాట్లూ, వాటిని ఎగవేయడానికి వేసే ప్రయత్నాలూ చాలా నీచంగా వుండేవి.

"ధనికుల ఇండ్లకు పోయి, ప్రియవచనాలు పలికి, వాళ్ళకు సేవచేసి, నమ్మకాన్ని పుట్టించి, మనసులు కరగించి, మాయ సొమ్ములు, లక్క పొదుపులు మాయ బంగారు, బంగారు నీరెక్కించిన ఇత్తడి, ఇనుప సొమ్ములు, మాయమణులు, గుప్తంగా రాత్రిపూట తీసుకొని పోయి, వాటిని దాచమని లక్క ముద్రలు వేయించి, లందు బోతుల పూటగా పెట్టి, అప్పులు తీసుకొని, ఎగగొట్టి పట్టుబడి, రచ్చకీడ్వబడి, వారువేసే శిక్షలన్ని అనుభవించి, రాళ్ళుమోసి, దెబ్బలుతిని అయినను మందిని ముంచాలి" (హరిశ్చంద్ర.ఉ.భా. పుట 151-152)

ఇలాంటి నేరాల్ని అదుపులో పెట్టడానికి రాజు నేరస్తులను కఠినంగా శిక్షించేవాడు. చేసిన నేరాల్నిబట్టి శిక్షలుండేవి. శారీరకమైన హింసలున్నా దోషుల్ని మానసికంగా మార్చడానికి కూడా ప్రయత్నాలు జరిగేవి. ప్రజల ప్రాణాల్ని, సంపదల్ని రక్షించడం రాజు కర్తవ్యం. అందువల్ల రాజు నిరంతరం జాగ్రత్తతో రాజ్యాన్ని పాలించాలి.

మంత్రాంగం - రక్షణ.-

మంత్రాంగం అంటే ఆలోచన. అన్ని కార్యాలు ఆలోచన పూర్వకంగా చేయాలు. ఈ ఆలోచన అతి గోప్యంగా వుండాలి. రాజు రాజ్యపాలనకు సంబంధించి మంత్రులతోను, ఇతర అధికారులతోను సంప్రదించవలసి వుంటుంది. వాళ్ళతో కలసి విడివిడిగాను, ఉమ్మడిగానూ ఆలోచించాలి. ఈ ఆలోచన బహిర్గతమైతే రాజ్యానికి రాజుకు అధికారులకు ఇబ్బందులు ఎదురవుతాయి, పైగా చేపట్టిన కార్యం నెరవేరదు. మంత్రాన్ని గురించి దూబగుంట నారాయణ కవి ఇలా నిర్వచించాడు.

"దృష్టముగ గార్యమంతయు దెలియు కొఱకు
నెసగు ప్రవర్తనం బెఱుగు కొఱకు

దుదిననర్థ కార్యంబుల ద్రోచు కొఱకు
దగిన దెయ్యది యదియ మంత్రంబు సుమ్ము" (పం తం. 1-215)

ఈ మంత్రం ఏకాంత ప్రదేశంలోనే జరగాలి బయటివాళ్లు ఆ మాటల్ని వినడానికి ఏ మాత్రం వీలుండకూడదు. "... పక్షులు సహితము చూడ శక్యము కానట్టిదై ఉండవలెను" అని కౌటిల్యుడు అంటాడు[26]

"రాజిత మంత్ర బీజము దరావలయేశ్వరు రాజ్యలక్ష్మికిన్
బీజముగాన మంత్రమవనీపతీ రక్షయొనర్చ టొప్పునా
యోజ మటింపడేని నతడొక్కట నాశనము బొందు నట్టివి
భ్రాజిత మంత్ర రక్షదగు రాజన పాయ సుఖంబు గైకొనున్"
(స.నీ స. 3-688)

మంత్ర రక్షణ చేయడం రాజుకు తప్పనిసరి.

"మంత్రంబును రక్షింపుదె
తంత్రాచరణంబు లందు దత్పరమతివై
మంత్రము పరతంత్రి మన
న్మంత్రా సార ప్రభావ సంపన్నులతో" (విక్ర చరి. 4-9)

రాజులకు మంత్రం అనేది విజయ హేతువు. దాన్ని పరులకు తెలియకుండ గోప్యంగా వుంచాలి.ఎలాంటి స్థితిలోకూడ మంత్రాన్ని బహిర్గతంచేయరాదు. రాజు తన స్నేహితునికి మంత్రాన్ని చెబితే అతనామంత్రాన్ని తన ఇంకొక స్నేహితునితో చెబుతాడు.

"హితుడని యొకనికి జెప్పిన
నతడును దనకూర్చు సఖునికది దెలుపు నర
క్షితమై నృప మంత్రం బీ
గతి బలువురు వినుట విఘాతత నొందున్"
(బై.వేం.పం.తం. 3-30)

కొత్త అధికారులను మంత్రాలోచనలో చేర్చితే వారి వల్ల కూడ మంత్రం బహిర్గతమవుతుంది.

"తానవంబుగ దొరజేయు వానీ మంత్ర
మునకు వేగమెలో జేయ జనదు వాడు
క్రొత్త మన్ననీ రహిననుగులకు జెప్ప
నయిన నది చెడు, మఱివాడు నడగు గాన" (అము. 4-160)

మంది ఎక్కువైతే మజ్జిగ పలచన అనే సామెత ఈ విషయంలో భంగ్యంతరంగా వర్తిస్తుంది.

"ఆప్తులెఱింగిన నాప్తుల
యాప్తులెఱుంగుదురు తత్తదాప్త శ్రవణ
ప్రాప్తమగుచుండు గావున
నాప్త పరంపరల మంత్రము వియున్ బతిరీన్" (బద్ది రాజ-42)

"దూత, అమాత్యుడు, రాజు — వీరి ఇంగితము మూలముగను ఆకారము మూలముగను మంత్రభేదము సంభవించును. ఇంగిత మనగా మామూలు దానికంటె భిన్నమగు ప్రవర్తన. ఆకారమనగా ముఖవైఖరి. కార్యము పూర్తియగు వరకు రహస్యమును రక్షించవలెను."[27] అని అంటాడు కౌటిల్యుడు.

మంత్రం వెల్లడికాకుండా రాజు రక్షించుకోవాల్సి వుంటుంది.

"అతి గుప్తమయ్యు మంత్రము
హితనికర శ్రుతము చేత నివురంబడుని
కృత మెఱిగి ప్రాంత జన సం
గతి రాజు రహస్య మొసగి కావగవలయున్"

(బై వేం.పం తం. 3-31)

దండయాత్ర గురించి మాట్లాడడానికి సత్యదాత్మునితో కలిసి వెళ్లిన కళా పూర్ణోదయుడు అక్కడికి ఎవ్వరినీ రానీయకుండా ద్వార రక్షకులను నియమించి జాగ్రత్త పడ్డాడు.

"లోనికి నపుడేవ్వారిని
రానీకుండంగ ద్వారరక్షల నిడి, ధా
త్రీనాదుడేగే మంత్ర వి
ధానోచిత భవనమున కతండును దానున్." (కళా.7-241)

రాముడు వానరసేనతో లంకకు వచ్చిన విషయాన్ని చారుల వల్ల తెలుసుకున్న రావణుడు అతన్ని జయించడానికి మంత్రాలోచన చేశాడు.

(భాస్క యుద్ధ 48 నుంచి 154)

"అఖిల సమ్మతి గావించు నదియు బహు వి
చారముల దోప నందొక్క సరణి నడపు
నదియు నౌగాదు నాజేయు నదియు నివ్వి
ధంబులుత్తమ మధ్యమాధవములంద్రు" (భాస్క యుద్ధ -51)

"కాన మంత్రు లొక్క కార్యమందఱు గూడి
నిశ్చయింపుడంబు నిధిగ డాక
మున్నరిపుల గెలిచి మూడు లోకంబుల
కళుకు పుట్ట జేయ వలయు ననిన" (భాస్క.యుద్ధ-52)

ఇలా రావణుడు కొలువులో మంత్రాలోచన చేయడం జరిగింది.

శకమహీపతి దివ్యాస్త్రాల్ని ఎలా ఎదుర్కోవాలో అర్థం కాక విస్తుపోయిన విక్రమార్కునికి, నివారణోపాయాన్ని భట్టి ఇలా సూచించాడు.

"చరణాబ్జంబులు యోగపాదుకలతో సంధించి యాకాశ సం
చరణారంభ విజృంభ మాణరణ దీక్షాదక్షతన్మించి, వా
చిరి బ్రహ్మాస్త్రము నిన్నరేశ్వరుని పయిన్ వేగం బ్రయోగింపు సు
స్థిరలీలన్ సమకూడు నీకు జయలక్ష్మీ నిత్యసాంగత్యముల్"
(విక్ర.చరి. 4-123)

"అత్యవసర విషయములో నతడు (రాజు) మంత్రులను, మంత్రి పరిషత్ను సమావేశపరచి వారితో ఆలోచించవలెను. వారిలో అధిక సంఖ్యాకులు చెప్పిన దానినిగాని, కార్యసిద్ధికి తోడ్పడు దానినిగాని అతడు చేయవలెను. దానిని చేయు చున్నప్పుడు అతని రహస్యము శత్రువులకు తెలియకూడదు. కాని శత్రువుల లోప ముల నతడు తెలుసుకొనవలెను, తన పరిపాలనారంగములను తాబేలు వలె బట్టబ యలు కానీయక గుప్తముగ నుంచుకొనవలెను"[28] అని, కౌటిల్యుడు అంటాడు.

రాజు రాజ్యాన్ని పాలించడానికి సమయా సమయాల్ని బట్టి నడుచుకోవాలి. ముక్కు సూటిగా పోవాలనుకుంటే తాను ఇబ్బందుల పాలవడమే కాకుండా ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తాడు.

"సత్యంబు దప్పక జరుపు నొక్కక చోట
నన్నృతంబు లొక చోట నడర జేయు
నరసంప్రియములు సలుపు నొక్కక చోట
బరుషంబులొక చోట బల్క జేయు
బరమ కారుణ్య స్వభావ యొనొక చోట
నొకచోట హింసకు నుత్సహించు
నర్థార్జనాతి సమర్థ యొనొక చోట
నుచిత దానాఢ్య యొనొక్కచోట

విత్యవ్యయంబులు వెలుపు నొక్కక చోట
నొడగూర్చుచుహు ధన మొక్క చోట

సమర నృపనీతి పెక్కు రూపములు గలిగి
చతుర వారాంగనయు బోలె జగతి మెఱయ
.... . .... .... .... (దూ.నా.పం.శం 1-577)

ఇదీ ఆనాటి రాజులు రాజ్యపాలనలో పాటించిన మెళకువలు. రాజుల పరిపాలన గురించి ఇంకా ఇలా వుంది.

పద్మాకరుని పరిపాలన నిగ్రహానుగ్రహాలతో నిండి, సంధి విగ్రహయానాసన ద్వైధీభావ సమాశ్రయ సమ్మిశ్రితమై, శత్రు దురభిప్రాయాలకు తావులేక లోకంలో సంశ్లోకించబడ్డ కీర్తితో, రసికతకు మూలమైన అభిప్రాయాలతో హెచ్చుగాగల ఆయుధాల నేర్పుతో యుద్ధంలో వీరవరులు మెచ్చే విధంగా వుందని (వారు. 2-79) పేర్కొనబడింది. ఇలా రాజు మంత్రాంగాన్ని రక్షిస్తూ, అధికారులు అనధికారులతో చక్కని సంబంధాలు కలిగి వుండి వారుల వల్ల ఎప్పటి విషయాల్ని అప్పటికి గ్రహిస్తూ, ప్రజల మానప్రాణాల్ని, ఆస్తుల్ని రక్షిస్తూ ప్రజామురంజకంగా రాజ్యాన్ని పాలించాలి అప్పుడే అది ఆదర్శవంతమైన పాలన అని అనిపించు కుంటుంది.

ప్రజల్ని రక్షించడానికి, తన రాజ్యాన్ని విశాలంగా చేయడానికి, రాజు యుద్ధాలు చేయాల్సి వస్తుంది. ఈ యుద్ధ సంబంధిత విషయాల్నీ, విదేశ వ్యవహారాల్ని గురించి తెలుసుకోవడం అవసరం.

అధస్సూచికలు


| | | | |
|---|---|---|---|
| 1 | శుక్రనీతి | పుట | 5 |
| 2 | కవిత్రయ భారతం-రాజనీతి | పుట | 149 |
| 3 | .. పైదే .. | పుట | 154 |
| 4 | కౌటిల్యుని అర్థశాస్త్రము | పుట | 22 |
| 5 | శుక్రనీతి | పుట | 69 |
| 6 | కౌటిల్యుని అర్థశాస్త్రము | పుట | 26 |
| 7 | .. పైదే .. | పుట | 26 |
| 8 | శుక్రనీతి | పుట | 99 |
| 9 | సమగ్ర ఆంధ్ర సాహిత్యం (10వ భాగం) | పుట | 7 |
| 10 | హిందూపాలిటి | పుట | 12 |

11 ఋగ్వేదము 9-92-6. (ఋగ్వేద అర్యులు) పుట 140 నుంచి
12 హిందూపాలిటి పుట 17
13 పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ ఏనిషియంట్ ఇండియా పుట 173
14 కౌటిల్యుని అర్థశాస్త్రము పుట 86 నుంచి 99
15 విజ్ఞాన సర్వస్వం -11వ సంపుటి పుట 2
16 కౌటిల్యుని అర్థశాస్త్రము పుట 212
17 కింగ్‌షిప్ అండ్ కమ్యూనిటీ ఇన్ ఎర్లి ఇండియా పుట 10
18 విజ్ఞాన సర్వస్వం - 11వ సంపుటి పుట 38, 39
19 శుక్రనీతి పుట 184
20 కౌటిల్యుని అర్థశాస్త్రము పుట 208
21 "పైదే" పుట 208
22 భారతి జనవరి 1974. పుట 46

ప్రతిష్ఠితా ప్రతిష్ఠితా సుముద్రితా శాసితా సభా।
చతుర్విధా సభా ప్రోక్తా సభ్యాశ్చైవ తథావిధాః॥
ప్రతిష్ఠితా పురే గ్రామే నానాగ్రామే ప్రతిష్ఠితా।
ముద్రితాధ్యక్ష సంయుక్తా రాజయుక్తాచ శాసితా॥

అధర్మాజ్ఞాత యథారాజా నియుంజీత వివాదినామ్।
విజ్ఞాప్య నృపతిం సభ స్తదాకార్యం నివర్తయేత్॥
న్యాయమార్గా దపేతస్తు జ్ఞాత్వా చిత్తం మహాపతేః।
వక్తవ్యం తత్ప్రియం వాత్ర న సభ్యం కిల్బిషీ భవతే॥
(రాజనీతి రత్నాకరము-సభ్య నిరూపణము -5)

23 విజ్ఞాన సర్వస్వం -11వ సంపుటి పుట 41
24 ఆంధ్రుల చరిత్ర సంస్కృతి -11 పుట 126, 127
25 కింగ్‌షిప్ అండ్ కమ్యూనిటీ ఇన్ ఎర్లి ఇండియా పుట 234
26 కౌటిల్యుని అర్థశాస్త్రము పుట 39
27 ,, పైదే ,, పుట 39
28 ,, పైదే ,, పుడ 42

# 5. రణతంత్రం విదేశాంగనీతి

పోరాటం అనేది మానవ జీవితంలో ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే వుంటుంది. ఆత్మరక్షణకు ఆహారసేకరణకు ఆదిమానవులు పోరాటాన్ని సాగిస్తే స్వార్థతత్వంతో, కీర్తికాంక్షతో, తరువాత మానవులు పోరాడుతూ వున్నారు మధ్య యుగాల రాజరిక వ్యవస్థలో యుద్ధం అనేది సామాన్య విషయం.

"శత్రు శోణితమున శాత్రవకామినీ
వారునయన బాష్ప సలిలములను
నవనిదడపడేని యారాజులావును
జీవనంబు వేఱ చెప్పనేల" (స.నీ స. 3-773)

శత్రువుల రక్తంతోనూ వాళ్ళ భార్యల కన్నీళ్ళతోనూ నేల తడియని నాడు రాజుకు గొప్పేముంది? ప్రతిష్ఠేముంది? అని మధ్యయుగంలో రాజులు అనుకున్నారు కాబట్టే యుద్ధాలు విరివిగా సాగాయి.

భారతీయ సంగ్రామ చరిత్రను వివేచిస్తే ఋగ్వేదంలో ప్రసక్తమైన దాశరాజ్ఞ యుద్ధం మొదటి గొప్ప యుద్ధంగా చెప్పవచ్చు.

యుద్ధకారణాలు — ప్రాచీన కాలంలో రాజులు ఆత్మరక్షణ, రాజ్యవిస్తరణ, సార్వభౌమాధిపత్యం. శిష్టరక్షణ, కీర్తి, మతం, స్త్రీ కారణాలుగా యుద్ధాలు సాగించినట్లు తెలుస్తోంది.

రామరావణ సంగ్రామం స్త్రీ (సీత) కోసం జరిగింది. అర్జునుడు స్త్రీ (సుభద్ర) కోసం యాదవుల్ని ఎదురించడానికి ఇలా వుంది.

"శూరకులంబు సర్వమొక జోకయి వచ్చి మెదిర్చెనేని నే
నీరమణీ శిరోమణి గ్రహింపక పోనని గట్టిగా నహం
కారము మీఱ గంకణము గట్టుక యుండెడు నిప్పువస్తునుం
డౌర రణంబు పెండ్లి కొడుకంచు మతించిరి మీ ఘంగపుల్"

(శిజ వి. 3-155)

అలాగే జైత్రయాత్ర పేరుతో చిన్నచిన్న రాజ్యాలను కబళించడం, సిరి సంపదలు దోచుకోవడం చేశారు. యాగ నిర్వహణ అనే మిషతో సార్వభౌమాధిపత్యాన్ని పొందడానికి ప్రయత్నించారు. ఆత్మరక్షణ కోసం శత్రువులను జయించడం పాపం కాదు

"ఆత్మరక్షణార్థమరుల జయించిన
పాప మొందదది శుభాకరంబు.... (స.నీ.స. 3-800)

"ధనమును సైన్యము మిక్కిలి
తనకుం గలయపుడు వలయు దండోద్యోగం
బొనరింపనట్లు సేనా
ధనబలువకు గలుగు సకలధాత్రీ తలమున్" (స.నీ.స. 3-768)

దండయాత్ర చేయడం సమర్థించబడింది. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేయలేని క్షత్రియులకు సత్కీర్తి కలగదు. (ద్వి.భార.శల్య. 3-64) ఈ కీర్తిని కాంక్షించి చాలమంది రాజులు యుద్ధాలు చేశారు.

సామ్రాజ్య నిర్మాణం చేయడానికి బలవంతుడైన రాజు తన సేనలతో ఇతర దేశాలపైకి దండెత్తిపోయి, ఆదేశాల రాజుల్ని యుద్ధ రంగంలో పరాభవించి, వాళ్లని తనకు సామంతులుగా చేసుకొని, వాళ్లవల్ల కప్పం పొందడం అతి ప్రాచీన కాలం నుంచి ఆచారంగా వస్తుంది.

ఇలాంటి దిగ్విజయ యాత్రలు చేయడం రఘు మహారాజు కాలం నుంచీ వున్నట్లు తెలుస్తోంది. యశస్సును సంపాదించడానికి వీటిని చేసేవాళ్లట ("యశసే విజిగీషూ ణాం" రఘు. 1-7)

రాజ్యాల మధ్య సంభవించిన సమస్యల్ని తొలిగించాలంటే యుద్ధం అవసరమని భావించారు.

"కంటికి నిద్ర వచ్చునె? సుఖంబగునే రతికేళి? జిహ్వకున్
వంటక మిందునే? యితర వైభవముల్ పదివేలు మానసం
బంటునె? మానుషంబు గల యట్టి మనుష్యన కెట్టి వానికిన్
కంటకుడైన శాత్రువు డొకండు తనంతటి వాడు గల్గినన్"
(కాశీ. 1-108)

అని శ్రీనాథకవి వింధ్య పర్వతంతో అనిపిస్తాడు. ఇలాంటి శత్రుత్వాలు కూడా యుద్ధ హేతువులవుతాయి.

రాజ్యం యొక్క విదేశీ విధానాలు, యుద్ధం చేయడం క్షత్రియ ధర్మం అని విశ్వసించడం, ప్రాచీన కాలంలో యుద్ధాలకు దారితీసింది.

పార్థా! నీ స్వధర్మం అనుసరించి అంటే క్షత్రియ ధర్మం అవలంబించి

యుద్ధమంటే జంకవద్దు. ఉత్తమ క్షత్రియునికి ధర్మయుద్ధం కంటే శ్రేయస్కర మైన కార్యం మరొకటి లేదు అని రణవిముఖుడైన అర్జునితో కృష్ణుడు చెప్పాడు.[1] (భగ. 2-31)

సైనిక వ్యవస్థ శిక్షణ.- ప్రాచీన భారతదేశంలో సైన్యాన్ని 'షడంగదళంగా విభ జించినట్లు తెలుస్తోంది. ఈ దళాన్ని గురించి కౌటిల్యుడు ఇలా పేర్కొన్నాడు'.

1) మౌలబలం (Heridity troops)

ఈ బలం శాశ్వతంగా, వంశపారపర్యంగా రాజును సేవించే సైన్యం. ఇది చాల సమర్థవంతమైందిగా కౌటిల్యుడు పేర్కొన్నాడు.

"మన్నీల బలిమి గలదని
యున్న మహీపాలుకడమి యుండదు రాజ్యా
భ్యున్నతికి మూల బలమూ
సన్నంబై యుండవలయు సమధికమగుచున్" (రుక్మా చ. 3-46)

2) భృతక బలం (Macenaries):-

తాత్కాలికంగా జీతాలిచ్చి కూర్చుకునే సైన్యం. యుద్ధం ముగిసిన తరు వాత ఈ సైన్యంతో పని వుండదు.

3) శ్రేణి బలం (Glids) :- ఆయుధ సహితంగా సైన్యంతో వ్యవహారాన్ని నడపాలను కుంటే ఈ శ్రేణీ బలాన్ని ఉపయోగించాలి ఒక వృత్తిని అనుసరిస్తూ యుద్ధ కాలంలో వాళ్లవాళ్ల నాయకులతో ఏర్పడిన ప్రత్యేక సైన్యాన్ని శ్రేణి బలం అంటారు.

4) సుహృద్బలం : మిత్రులు పంపిన బలం.

5) ద్విషద్బలం : జయించబడ్డ శత్రువు లేదా సామంతులు పంపిన బలం.

6) అటవీ బలం : పుళిందులు, శబరులు మొదలైన ఆటవికులతో కూర్చబడ్డ సైన్యం.

పై షడంగ దళంలో అన్నిటికన్నా మౌలబలం శ్రేష్ఠమైంది. అమిత్రబలం, అటవీ బలం నీచమైనవిగా కౌటిల్యుడు పేర్కొన్నాడు.

ఇవేకాక చతురంగ బలం సైన్యంలో ఉండేది రథ, గజ, తురగ,

పదాతిదళ సైన్యాన్ని చతురంగ బలం అంటారు.

ప్రాచీన సైనిక వ్యవస్థ లోపాలు :- ప్రాచీన సైనిక వ్యవస్థలో ప్రధానమైన లోపం క్రమశిక్షణ లేకపోవడం. యుద్ధంలో తమ నాయకుడు వదించబడ్డా, ఓడించబడ్డా, పారిపోయినా మిగతా సైన్యం అంతా చెల్లాచెదురై లొంగిపోయేది.

అనుసాళ్వుడి చేతిలో కృష్ణుడు మూర్ఛపోతే అతని సైన్యం పటాపంచలైంది.

"హరిపాటు జూచిన సైన్యము పటాపంచలై
తండ్రి బిడ్డసకన్న తమ్ము డనక.... (జై.భార. 3-113)

బాలచంద్రుని ధాటికి నిలవలేక

"పగవారు మిము గని పారిపోవుదురు
మీకేవి భయమని మెలత నాగమ్మ
బాగుగా నమ్మించి పంప వచ్చితిమి
జీవముల్ దక్కిన చిన్నల గలసి
బలుసాకు తినియైన బ్రతుకంగ గలము" (ప.వీ.చ.పుట -111)

అని సైనికులు ప్రార్థించాడు. ఇలాంటి సేనవల్ల విజయం సిద్ధించదు.

"వల్మీకముల మీద వసియించు వారు
గడ్డితో జొరబడి కదలని వారు
వేళ్ళు చీకెడి వారు, వెన్నిచ్చు వారు,
వెంద్రుకల్ విప్పక విదలించు వారు" (ప.వీ.చ పుట -466)

సైనికులయితే రాజు అపజయాన్ని పొందడంలో అనుమానమేముంది?

నాచన సోమనాథుని కాలంలో మానాన్ని ప్రాణాలతో సమానంగా భావించి యుద్ధం చేసే వీరులే కాకుండా, శత్రువులకు వెన్నిచ్చి పారే పిరికి బంటులు వుండే వాళ్లు. ఈ విషయం బాణాసురుని సైనికులు ఓటమితో పరిగెత్తడంలో గమనించ వచ్చు.

"అసుర సేన వెనకం జాలక మొనలకుం దలంగియు గలంగియు పరదళబులతో దాగియుం దూగియు ద్విరదంబులతో జిక్కియుం జొక్కియు దెరువున బోవె అవియుం బఱవియుం దరువులలో దూఱియు బాఱియు బోటువడి పొరలియుంగెర

లియు వాటువడి తెరలియు మరలియు బహు ప్రకారంబులం బఱవం దొడంగె ..."
(ఉ.హరి 6-134) ఇలాంటి యుద్ధస్ఫూర్తి క్రమశిక్షణ లేని సైన్యాన్ని వెంట తీసుకొని రణక్రీడకు దిగిన రాజును విజయలక్ష్మి వరించడం కలలోనిమాట.

"ఈ నేల చుట్టు దిరిగిన
బోనీయడు రాజు. పాటిపో రాదను తీ
రూన...." (కువ చ. 2-153)

యుద్ధానికి సైన్యం సిద్ధపడింది కాని, విజయాన్ని పొందడానికి మనస్ఫూర్తిగా యుద్ధరంగంలోకి దిగలేదని తెలుస్తుంది.

పడవాళ్ల గమికి జేపుడికి దబ్బఱ నొప్పి
  పై వెమకొని. మూలబడిన వారు,
నిండ్లలోనన యుండి యొటు వోయిరో కాన
  మనిపించి, కనిపించ కడగు వారు,
నింటి కావలికి నన్నిచట నిల్పరు గదా
  యని వేల్పులకు మ్రొక్కి వేడువారు
దొలునాడె నృపుని వార్తలు విని, యొక లేని
  పనిబూని యెందెందొ చనెడు వారు

గ్రాసములు చెల్లలేదని గాసి చేసి
కొలువు జీవితముల కొప్పుకొనిన వార...." (కువ చ. 2-125)

ఇది ఆనాటి సైన్యదైన్య స్థితి.

'సైన్యవసన వర్గం' అనే పేరుతో కౌటిల్యుడు క్రమశిక్షణ లేని సైన్య వివరాలు పేర్కొన్నాడు.[2] రాజుల విజయానికి సైన్యం ఆయువుపట్టు కాబట్టి సైన్యాన్ని క్రమశిక్షణతో నడపాలి. రాజు సైన్యానికి సరైన సమయంలో జీతాలు అందచేయాలి. నిర్లక్ష్యం చేయకూడదు. వాళ్లకి ఉత్సాహం కలగడానికి వాళ్లతోనే కలిసి తానూ వాళ్లలాగా జీతం తీసుకొనే సైనికుణ్ణనని అందరం కలిసి రాజ్యం కోసం ప్రాణాలకు తెగించి పోరాడి శత్రువును జయించాలని చాటాలి. రహస్యంగా సైనిక వేషాలలో వాళ్లలో తిరుగుతూ సైనికులలో వుండే లోపాల్ని పరిశీలించి వాటిని తొలగించడానికి ప్రయత్నించాలి "దోష నివారణము, క్రొత్త సైనికుల సంపాదనము బలిష్ఠమగు ప్రదేశము జేరి శత్రువు నధిగమించుట, బలవంతునితో సంధి చేసుకొనుట ఇవి సైన్య వ్యసనములను తొలగించుటకు సాధనములు"[3] అని కౌటిల్యుడు పేర్కొన్నాడు.

కుశలవుల యుద్ధ తీవ్రతకు భయపడిన సైనికుల ప్రవర్తన ఇలా వుంది.

"గజ శరీరముల మార్గణ రంధ్రముల వెంట
జొరబారి దివి కొంగి చూచువారు
భగ్న శతాంగ కూబర చక్రముల క్రింద
నొదిగి చప్పుడు సేయకుండు వారు
హయక బంధముల బాయగ ద్రోవి యెడరైన
యెడ బక్కెరలలోన నీగు వారు
భట విగ్రహముల కుప్పల క్రేవ దలలపై
హరిగలుమాటుగా నడగు వారు
నైరణ స్థలినీతడెవ్వారి మీది
కొఱగు నోయవి మది వెఱచఱవి ప్రాణ
రక్షణోపాయపరతవస్త్రములం విడిచి
కళవళించిరి శౌర్యంబు గట్టిపెట్టి" (జై.భార. 6-170)

ఇలా ప్రాచీన సైనిక వ్యవస్థలో లోపాలు వుండడం వల్ల అనాటి రాజులు విదేశీయుల దాడులను సమర్థవంతంగా తిప్పికొట్ట లేక పోయారు.

వీర సన్న్యాసులు - యుద్ధానికి బయలుదేరే ముందు వీరులు సన్న్యాసాన్ని స్వీకరించేవాళ్లు వీళ్లనే వీర సన్న్యాసులు అంటారు.

"పాలునేయుడు గూడిన భంగి వోలె
నొనరి లెయ్యంబుతో గూడి యున్న భటుడు
వీర సన్న్యాస విధి దన్ను విడుచు టెఱిగి
వనిత నిట్టూర్పుతోన జీవంబు విడిచె" (కుమా. 11-54)

" . వఱడియల్ వెలువడు వీర భటావలితోన
వీర సన్న్యాసులున్ వెడలి...." (కుమా. 11-54)
యుద్ధాలలో పాల్గొనేవాళ్లట!

వీరపానం:- వీరులు యుద్ధానికి ముందు లేదా యుద్ధానంతరం (మదిరా) పానం సేవిస్తారు. దీనికే వీరపానం అంటారు.

"వీరపాణంతు తత్పానం వృత్తే భావిని వారణే" అని అమరం మధురా విజయం (9-24, ఈ వీరపానాన్ని గురించి పేర్కొంది.

వీరగౌరవ :- గద్ధ వీరులకు సమాజంలో అత్యున్నతమైన గౌరవం వుండేది. ముఖ్యమైన కార్యాలకు, యుద్ధాలకు వెళ్లే వీరుల్ని వీరతాంబూలంతో గౌరవి చేవాళ్లు "నాకుందగిన కెలసంబు గంటిదీని కంతకుమైకొంటి దాంబూలంబు దయసేయు.." (కుమా. 4-54) అని మన్మథుడు ఇంద్రుని అడిగి సత్కారం పొందుతాడు.

వందవోలు రాజును అనుగు రాజు జయించాడు. దీనికి కారకులైన వీరు లను అనుగు రాజు ఇలా గౌరవించాడు.

" .... .... .... ...
వీరులందరికిని వేడ్కతో నపుడు
దివ్య భూషణములు దివ్య వస్త్రములు
దివ్య మాల్యమ్ములు తెరగొప్ప నిచ్చె .. "(ప వీ చ.పుట 28, 29)

మందాడిలో వున్న పశువుల మందను వాశవం చేయడానికి నలగాముడు పలినేడుని పంపుతూ "వేగపొమ్మనుచు తావిడియంబు నిచ్చె" (ప వీ చ. పుట 203)

రాజు వీరులను గౌరవించడాన్ని కుమార దూర్జటి ఇలా పేర్కొన్నాడు.

"మీరలందఱు నటువంటి శూర వరు
లౌరకావున మాకు విచారమేమి
కార్య మొనరించి జయలక్ష్మి గాంచుడనుచు
వీడెము లొసంగె వేర్వేఱ వేడ్క మాఱ" (కృ వి ?-2 )

రాజు ఇలా విడియం ఇవ్వడమేకాదు, చివరికి తాను ధరించిన అలంకారాల్ని తీసి వాటిని యుద్ధ వీరులకు అలంకరించి గౌరవించేవాడు. జైత్రయాత్రకు బయ లుదేరే తన కుమారునికి బుక్కరాజు తన అలంకారాల్ని ధరింపజేసి సంభావించాడు (మ. విజ. 3-45)

రావణుడు కుంభకర్ణుని ఇలా గౌరవించాడు.

"....సేనా సమేతుండవయి చనుమనుచు దాను బూనిన మణిహారం బయిత బెట్టి మఱియు ననేక దివ్యాంబరాభరణంబు లిచ్చి గౌరవించి" వీడ్కొల్పడం గమ నించదగింది. (భాస్క.యుద్ధ -910) రాజరిక వ్యవస్థ చివరిదశ వరకు ఇలాంటి సంప్రదాయం కొనసాగింది.

మల్లయోధులకు, వీరులకు రాజులు ప్రత్యేక గౌరవాలిచ్చారు, అలాంటిదే 'వీర పతాక' దీన్నే బిరుదు టెక్కెం, లేదా బిరుదపడగలు అని అంటారు మల్ల యుద్ధ వీరులైన చాణూర ముష్టికులకు కంసుడు వీరపతాక బహూకరించాడు "మల్లు తనంబునన్ భువనమున గల వీర పతాక లీనమై మీకమై, వెల్లు" నన్నాడు కంసుడు (హరి పూ భా. 9-55)

ఇలాంటి విశేషమైన గౌరవాల్ని రాజు వీరులకు ఇవ్వడం వల్ల వాళ్లు యుద్ధాలలో ఉత్సాహంగా పాల్గొనే వాళ్లని తెలుస్తుంది.

దుర్గ రక్షణ -

యుద్ధ విజయాన్ని నిర్ణయించేది దుర్గమే. శత్రువు దీన్ని వశపరచుకుంటే రాజ్యాన్ని వశపరచుకున్నట్లే. ఆ రాజ్యాధిపతిని జయించినట్లే కాబట్టి రాజు శత్రువుల నుంచి రక్షించుకోవడానికి దుర్గాన్ని పటిష్ఠంగా నిర్మించుకోవాలి. ఇది దీర్ఘ కాలపు ముట్టడికి కూడ తట్టుకునే విధంగా వుండాలి. ఇందులో వివిధ ఆయుధాలు, ఆహార పదార్థాలు నిజువ వుండాలి

నీరు, కట్టెలు, పచ్చిక, తైలం, ఆకుకూరలు, ధాన్యం, సేనలు, యంత్రాలు, అట్టడులు (యుద్ధనిమిత్తం వాకిటలో మండపం పైనో, క్రొత్తడం పైనో ఏర్పరచు కొన్న గదులు కందకాలు, ప్రాకారాలు, ఆయుధ సామగ్రితో వున్న, ధర్మ బలంతో వర్ధిల్లే స్థల, జల, గిరి దుర్గాలు రాజుకు వుండాలట! (రుక్మాం.చ. 3-24)

"దుర్గమునకు వెలుపల మోకాళ్ళను విరుగగొట్టు సాధనములు, శూల సముదాయములు, కూపములు, దాచబడిన వలలు, ముండ్ల (ఇనుప) తీగెలు అహి పృష్ఠములు తాళపత్రములు శృంగాటకములు, కుక్క దవడలు, (ఇనుప) కమ్ములు, ఎగుడు పాదుకలు, పెనములు నీటి గుంటలు -వీటితో కూడిన ఒక (పైకి కనిపించని) ప్రచ్ఛన్న మార్గమును నిర్మించవలెను [4] అని కౌటిల్యుడు పేర్కొన్నాడు.

"తన దుర్గంబులు భూమియు
గనుములు బదిలములు సేయుగాక గర్వం
బున బగరమీదనడచిన
జనపతి రాజ్యమును సిరియు శత్రునిజేరున్" (రుక్మాం.చ. 3-54)

కాబట్టి తనను తాను రక్షించుకోవడానికి జాగ్రత్త పడకుండా శత్రువుపైకి దండెత్తితే తనకే ముప్పు వాటిల్లుతుంది.

రావణుడు తన కోటకు కావలి ఇలా ఏర్పరిచాడు.

"పడమటి వాకిట బదివేల సంఖ్య
లక్షదైతేయు లాలంకాపురంబు
దక్షిణద్వార ముద్ధతిగాతురెపుడు
నట దూర్పువాకిట నమరారియుండు
బటుతరచతురంగ బలసమేతముగ
నగణిత శస్త్రసహాయులై యుండు
దగనొక్క లక్షయుత్తరపు వాకిటను
వాల రాక్షసులు లక్షయు దిర్వ్యధేను
వేలు తత్పుర మధ్య వీధి నుండుదురు"(రం.రా.యుద్ధపుట 245)

ఇందరు వాలక రావణుడు కూడా కోటను పర్యవేక్షించేవాడట.

"ఒక్కొక్క గవని వాకిట
నొక్కొక యేనూరు కోటు లుందురుదైత్యుల్
పెక్కుర గావలి యుంచును
దక్కక మఱి యెల్ల కడల దానునుదిరుగున్"

(మొ.రామా,యుద్ధ. 34)

కృష్ణుడు కైలాస యాత్ర పోవడానికి నిశ్చయించుకొని, కోటరక్షణ గురించి మంత్రులు, సామంతులు, ఉద్ధవుడు, బలరాముడు, సాత్యకి, కృతవర్మ మొదలైన వాళ్లందరికీ జాగ్రత్తలు చెప్పాడు.

"కోట సింగారించి కొత్త శంబుల నెల్ల
నట్టిళ్లు వన్నించి యాళువరికి
బందిళ్ళు వెట్టించి పైకొమ్మలెగయించి
గుండు దూలము వసికొయ్య గూర్చి
యగడిత శీతనీరలవడ ద్రవ్వించి
వెలిచుట్టురాములు వెలుగువెట్టి
డంచనంబులు దద్దడంబులు నెత్తించి
పలుగాడితలుపులు బలుపుచేసి
బొంకెముల్వెట్టి క్రొంకులు బద్ధపరులు
గత్తిగొంతంబు లొడిసెల్లు గత్తళములు
నారసములును విండులు నగరిలోన
బెట్టిపెట్టుచు నడు హట్టిమట్టిలావు" (ఉ.హరి. 2 92)

నగర ద్వారాలన్నీ మూయించి వుంచండి. కోట వాకిళ్ళలో ఒకటి మాత్రం తెరిచి వుంచండి. ఆవాకిలిగుండా అనవాలు వున్న వారలకు మాత్రం రాకపోక లకు అనుమతించండి నగరంలోకి రక్షకభటుల ఆజ్ఞలేనిదే ఎవర్నీ ప్రవేశించని వ్వద్దు నగరం నుంచి ఎవర్నీ బయటికి పంపవద్దు కోట బురుజలపై గోపురా ల్లో ఎత్తైన ధ్వజాలు నాటండి. వీరులు వాటిపై గాత్రు గలు కావలి వుండండి. శత్రువుల గుండెలు తల్లడిల్లేటటు భేరీమ్రోగిస్తూ వుండండి. అప్రమత్తులై నగ రాన్ని రక్షిస్తూ వుండండి. కోటరక్షణ గురించి కృష్ణుడు తీసుకున్న జాగ్రత్తల్ని గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. సాత్యకిని ప్రత్యేకంగా నగరరక్షణ చూడమ న్నాడు "సాత్యకి నగర రక్షణ భారాన్ని ముఖ్యంగా నీపై పెడుతున్నాను. నీవు ప్రతిరోజు రాత్రిపూట నిద్రపోకుండా, కవచం, ఖడ్గం, శిరస్త్రాణం, ధనుర్బా ణాలు ధరించి ఎప్పుడూ సన్నద్ధుడవై వుండు ఎక్కడ ఏంజరుగుతుందో వెయ్యి కళ్ళతో కనిపెట్టివుండు. ఇతరుల మాటల్ని, అభిప్రాయాల్ని తెలుసుకుంటూవుండు అనవసర వాదప్రతివాదాలలో జోక్యం కలిగించుకోవద్దు వేదధ్యయనాదుల జోలికిపోవద్దు. నలుగురి చేత మాటతేవద్దు. జాగ్రత్తగా పురరక్షణ బాధ్యత నిర్వర్తించు. (ఉ హరి. 2-96) అని పూసగుచ్చినట్టుగా జాగ్రత్తలు చెప్పడాన్ని బట్టి దుర్గం రాజ్యాంగాల్లో ఎంత బలవత్తరమైందో స్పష్టమవుతోంది.

ఇలా చెప్పడానికి కారణం శత్రువు (పౌండ్రక వాసుదేవుడు) తాను పురంలో లేనప్పుడు దాడిచేస్తాడన్న అనుమానం కృష్ణునికి వుండడం కావచ్చు దుర్గసంర క్షణ ఇంకా ఇలా చేయవలసి వుంటుంది

"దళవాయి తోడ గోడరు
వెలుపటి యిండ్లెల్ల గొట్టివేయించి, పిరం
గులు లగ్గంబుల మీదన్
నిలిపించగ బనిచి, నిగుడునెడునెవ్వగతోడన్" (కువ చ. 3-3)

"పరగ బిరంగుల బలుగుండ్లకైడాగ
బలుకల్పుర్చిన పాతరలును
వెలుపటి మందు తిత్తులు చూలివ యరాబ
కొలుక మర్చిన పచ్చి గోడగుంపు
లెనని మార్తురు లగ్గకెక్కకుండగ దా
ర్చిన కాంచనంపుదంచనపుదేతు
లెడుటి సురంగంబు లెటిగి యాబాయగా
గల్పించుప్రతి సురంగములగములు,

ప్రతిబలముప్రేయు తిరుగుడు జాళ్లపతన
గుమ్ములాసిన బంగారు గోడలందలి
పడిన మగరాలు చూర్ణమైపడమిరాలు
నీలముల వాలు జూవి వర్ణించుకొనుచు" (కువ చ. 3-18)

ఇవి కోట రక్షణకు సంబంధించిన జాగ్రత్తలు

"కోటకావలికై యాప్త కోటితోన
నీవు నీపవి వియమించి నిలిపి " (కువ.చ. 2-127)

రాజులు దండయాత్రకు బయలుదేరేవాళ్లు.

దండయాత్రకు ముహూర్తం

గొప్ప కార్యాన్ని వేయడానికి ముందు శుభఘడియలు, శకునాలు చూసుకోవడం పరిపాటి. రాజపురోహితుడు సూచించిన శుభముహూర్తాన్ని అనుసరించి శత్రువుపై దాడిచేస్తే విజయం సిద్ధిస్తుందని భావించేవాళ్లు.

"దేవబ్రాహ్మణ పూజలు
గావించి ప్రశస్తతారాగ్రహబలుడై
కేవల తద్భేదయుతుం
డై శుభదభియాతి మాదికదుగగపల యున్" (స నీ స. 3-794)

అయినా

" ....... . .. .. సమరజయము
శంభుకృపలేక యెబ్బంగి సంభవించు...." (హర. 7-26)

ననే నిశ్చయం కూడా లేకపోలేదు. దండయాత్రకు శరత్కాలం అనుకూలంగా వుంటుందట! (అము. 4-75)

".... దివ్యాయుదోదగ్ర మా
నలముస్యందన మెక్కి దైత్యగురుక ప్తామోఘ లగ్నంబునన్"
(శ వి. 5-16)

యుద్ధానికి బయలుదేరాడు చంద్రుడు.

ఇలా ముహూర్తాలతో పాటు శుభ శకునాల్ని కూడా చూసి యుద్ధానికి బయలుదేరేవాళ్లు

"క్షేమకారి తీర్చె పెలరేగి యనుకూల
మారుతంబు వీచె, మాంస ఖండ
ములును బూర్ణకుంభములు పుష్ప ఫలములు
నెదురుగొండి యెదురగహేష లెసగె" (అని వ. 4-36)

దండయాత్రకు బయలుదేరడం.

సైన్యం శత్రురాజు పై దండెత్తి పోయే టప్పుడు చేసే ప్రయాణాన్ని యానం అంటారు.

"ప్రస్థాన సముచిత బ్రహ్మ మంత్రముల భూ
గీర్వాణ పంక్తు లాశీర్వదింప
జయజయ దేవయన్ శబ్ద జృంభణముతో
బిరుదావళులు వందివరులు చదువ
వేత్రహస్తులు వేళ్ళు వివరించి మాపు సా
మంత భూనాథు లంతంత మ్రొక్క
పట్టపేనుగు బైడి పల్లకి, దేజీని
దగనాయితము వేసి దండ బెట్టి.

జైత్రభేరీ దాంకార శబ్ద మహిమ
గరము ఘూర్ణిల్ల, దిక్కులు గ్రక్కదలగ,
లలిత గుణ విక్రముగు భవుగన్న వేళ
దనదుభవనంబు వెడలె భూతల విభుండు" (కళా. 8-31)

రాజులు దండయాత్రలకు ఇలాగే బయలుదేరేవాళ్లేమో! రాయలు దండయాత్రకు బయలుదేరడాన్ని కుమార దూర్జటి పేర్కొన్నాడు.

"అనవద్య చిత్రవాద్య ప్రపంచంబుల తోడ
భేరీ నినాదమ్ము లోకము కలగ
గంధేభ ఘీంకార ఘనతర ధ్వని తోడ
తురగ హేషారవ స్ఫురణ మెనయ
వర భూసురాశీరవ ప్రభావముతోడ
వందిమాగధ శబ్ద బృంద మొనర
సకలా భరణ పంక్తి చకచక ద్యుతి తోడ
సురుచి రాయుధ దీప్తి సొబగు మీఱ

సకసమస్నీలు దుముదార్లు చతురంతత
సకల సేనా సమేతులై సందడింప
రమణ జెలు వొందు రాజమార్గమున వచ్చె
రమ్య గుణపాళి శ్రీకృష్ణరాయ మౌళి (కృ వి 2-149)

యానం చేసే సమయంలో సైన్యం ఇబ్బందులకు గురికాకుండా రాజు జాగ్రత్తల్ని తీసుకోవాలి. "పశు గ్రాసము, కట్టెలు, నీటి సదుపాయముల బట్టి మార్గ మందుండు గ్రామములతోను అడవులలోను ఎన్ని మజిలీలవసరమో లెక్కవేసియు, స్థానమునకు ఆసనమునకు ప్రయాణమునకు ఎంత కాలము పట్టునో అంచనా వేసు కొనియు యాత్రను ప్రారంభించవలెను కావలసిన దానికంటే రెండింతల ఆహార పదార్థములను ఆయుధములను తరలించవలెను. అది సాధ్యము కానప్పుడు వానిని సైన్యమునకే అప్పగించవలెను. లేదా మార్గములో నచ్చటచ్చట సేకరించి యుంచ వలెను" [5] అని కౌటిల్యుడు సూచించాడు. ఇలాంటి జాగ్రత్తలింకా వున్నాయి.

"మునుపుగా నేగి యసిమి గొల్లెనలు వన్ని
త్రోవ నెక్కడెక్కడ నేమి గావలసిన
యట్టి భక్ష్యభోజ్యాదుల యమ్మకమున
దనియ జేసిరి వణిజులు తద్బలముల" (కళా 8.43)

"సేనల రాపిడి వల్ల నేల నుండి నల్లని దుమ్ము వ్యాపించి లోకాన్ని చీకట్లలో ముంచినా వీరుల కిరీటాలలో వుండే మాణిక్యాల కాంతిచే ఆ చీకట్లు నశించాయట" పాం.మ. 1-166)

దండయాత్రకు వెళ్ళే సేనలో వివిధ వర్గాల వాళ్లు ఉండేవాళ్లు. సరోవర తీరం చేరిన కృష్ణుని సేన ఇలా వుండేది.

"విప్ర-క్షత్ర విట్శూద్ర గాయక
నట విదూషక వంది నాగరికులం
కుడ్య కృత్కారు శాకునిక రంగా జీవ
నటకార సాచికాంబ వికులు
నిర్ణేజక గ్రామణీ కులాల కువింద
దాశ కళాద వైతంసికులును
జర్మ కర్మకర చికిత్సక పుష్పలావిక
తక్షక పాషాణ దారకులును

సంఫసారి గోరోచ నాగరు సితాభ్ర
పట్టపటరత్నభూషణా పణికపటులు
బట్టువాలక వీధు లేర్పడగ విడిసి
రంబుజాకర ముభయ పార్శ్వంబు లందు (జై.భా. 3-66)

నవరం చిన నారాయణ నాయకుని కాలంలో ఇలాంటి సేన దండయాత్రకు బయలుదేరేది.

"అధిపభృత్య పరస్పరాన్వేషణాకార
ణ ప్రతి వక్త్ర తన్నామ కార్య,
మననుగత స్వామి హయవేగ భూదుహ
చ్ఛాయా సమాశ్రితచ్ఛాత్రకంబు
దావనాయాసాత్మ జీవన వృత్తి ది
గ్వాచ కాందోళికావహ జనంబు
సమ్మర్ద బహుళాది సరణికోభయ పార్శ్వ
వారితవారణా దోరణంబు

సరయు సరదుష్ట నిష్పతజ్జరద దూర్త
గణ్య గాణిక్య సంపవత్క్రమన హస్య
వారణ క్షమ తత్పుతా క్రూర దృష్టి
సంవృతాశంబు సైన్య మచ్చటికి వచ్చె" (కువ భ 2 84)

దండు దేరీజ (విడిది) :- సైన్యం గమ్య స్థానాన్ని చేరగానే గుడారాల్ని ఏర్పర చుకుంటారు.

ఆ సమయంలో సైనికులు చేసే పనులు ఇలా వుంటాయి.

"బొంగులు నిల్పి యుబ్బుగ బైడి వ్రాత
బొమ్మల గుడారంబులమర్చు వారు
గొయ్యలునాటి, యాకులతోడి రెమ్మల
వాటంపు గుడిసెలు వైచువారు
బొక్కళ్ళవలె గుంతముల చేర్చి యా మీద
గడితంపు బచ్చడాల్గప్పు వారు
బచ్చికల్పెక్కు డు పాఱల జెక్కి, పూ
బొదరిండ్ల మున్నుగా గదియు వారు

నచ్చముగ నీటి కందువలరయు వారు
బరుగు పుట్రలు నెదర నుబ్బుమను నొక్క
పరిగ నవ్వుచు జప్పట్లు పఱచు వారు
నైరి. తద్వేళ బాళెబు వార లెల్ల" (కువచ 2-107)

ఈ గుడారాలు పలు రకాలుగా ఆకర్షనీయంగా వుండేవి. కృష్ణదేవరాయల సైన్యం విడిది కోసం ఏర్పాటు చేసుకున్న గుడారాలివి.

"కెందమ్మి చెంగల్వ చందమ్ములం గెల్వ
జెల్వైన కెంబట్టు జిగి గుడార్లు
రంగారు బంగారు సింగారము లెసంగు
మేలైన వెలిపట్టు మిహి గుడార్లు
బిగుబాకు తెగ సౌరు నగ రాజిలు హుశారు
వగమీఱు రత్నాల వహిగుడార్లు
హెచ్చైన విలువ మేల్పచ్చడాల్ పచ్చడాల్
వచ్చడాల్ గలజీని పనిగుడార్లు

గొప్ప హంరుమంజి మప్పాణి కూర్పడంపు
డంబు పగడంబు జగడంబు పంబతంబు
లెసగిన గుడార్లు గలుగు నవ్వ సుమతీశ
పాళె మీక్షించి గజరాజు భయము మించి" (కృ.వి. 3-75)

కుమారుని సైన్యం తారకాసురునిపై దండెత్తి వచ్చి దేవపతాకని మహానదీ తీరమున విడిది చేశారు. ఆ సైన్యం చేసే కోలాహలం ఇలా వుంది.

"వాహనంబులు డిగ్గువారును, బన్నులు
విడుచు వారును, దమ వీళు లెఱుగ
దమ తమ చిహ్నముల్ దనరంగ బట్టించు
వారు, నోండొరు బిల్చువారు, జెంగి
గుళ్ళ మండియలును గుడారములును బం
డిళ్ళను గలయ నెత్తించు వారు
మడుగుల పొందుల మ్రాకుల నీడల
వెరవుల గని కని విడియు వారు

బిఱుద జిక్కిన వారల బిలువ బోవు
వారు, నెడగని తోడ్కొని వచ్చువారు

వీథు లెఱుగక దెస దప్పి వెదకు వారు,
నెఱిగి తమతము వీళ్లకు నేగు వారు" (కుమా. 11-30)

గుడారాల్లో రాత్రిపూట వంటలు వండుతూ సైనికులు సందడిగా వుండేవాళ్లు.

"రాతిగుండ్లు పెట్టిన పొయ్యి మంటవి రగుల్కొపిన అగ్నితో కూడిన పొగ లచే దట్టమైన చీకట్లు ఏర్పడ్డాయి. వేగంగా వీస్తున్న గాలి వల్ల వూదకనే అగ్ని శిఖలు బగ్గుమని లేస్తున్నాయి. అవి వ్యాపించిన ప్రదేశంలో పట్టపగలున్నట్లుంది. వేడెక్కిన మూకళ్లను సగం తెరచి వుంచగా అన్నం వుదికి పైకి వస్తోంది. ఎర్రటి నిప్పులపై పొరలించి కాల్చిన కఱకుట్లు (ఇనుప కడ్డీకి చెక్కిన మాంస ఖండం) వాసన ఆ ప్రదేశ మంతా క్రమ్ముకొని వుంది. బల్లెములతో వేటాడి తెచ్చిన జింకను కడిగి వ్రేలాడగట్టి, చర్మాన్ని ఒలిచే దృశ్యం బీభత్సంగా మహా భయంకరంగా వుంది. తృప్తిగా భోజనం చేసిన సైనికులకు బ్రేవ్ మంటూ త్రేపులు వస్తున్నాయి (కువ.చ 2-108)

కావలసిన చోట్లకు కమ్మలు రాసే రాయస గాండ్ర గంటాల శబ్దాలు, రాజు ఆలోచించిన కార్య పద్ధతిని గురించి అమాత్యులు చేసే గుసగుసలు. వేగుల కలకలాలు, వరుసకింత మందని వంతులేసుకొని గుడారాలకు కావలికాసే వీరుల కోలాహలం, సంగీత మేళాల, మద్దెలల మ్రోతలు రాజు పవళించే గుడారాం చుట్టు వ్యాపించి వున్నాయి. (కువ చ. 2-110) ఇంకా కొందరు వెలిచెలులతో సుఖిస్తున్నారు. (కువ చ. 2-111 నుంచి 114). మరికొందరు నిద్ర లేకుండా గడుపుతున్నారు. రణాన్ని భయంకరమైన మృత్యు హేతువుగా కాకుండా సాధారణమైన క్రీడగా ఆనాటి వీరులు భావించారు కాబట్టి యుద్ధ శిబిరాలలో ఎలాంటి జంకు గొంకూ లేకుండా కాలం గడపడం కనబడుతుంది.

సమరోత్సాహ గీతాలు:- సైనికులు తమ జన్మ భూమిని రక్షించడానికి జీవితాన్ని త్యాగం చేసే మనో నిబ్బరాన్ని కలిగి వుండాలి. ప్రాణం పోతుందనే భయం, దాన్ని కాపాడుకోవాలనే ఆశ వాళ్లలో వుండరాదు. కాబట్టి వాళ్ల మనస్సులో జీవితం శాశ్వతం కాదనీ, సాధించిన విజయాలే చిరస్థాయిగా వుంటాయనే నమ్మకాన్ని ఏర్పరచాలి, సమరంలో జయించినా, మరణించినా మేలే కలుగుతుందని పురికొల్పాలి.

రణ విముఖుడైన అర్జునునికి కృష్ణుడు మరణ రహస్యాన్ని ఇలా వివరించాడు.

"జాతస్యహి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ।
తస్మాద పరిహార్యే ర్థేనత్వం శోచితు మర్హసి॥ (భగ. 2-27)

లతని జ్ఞానబోధ చేసి అతన్ని సమర క్రీడకు సిద్ధం చేశాడు. వీరులను ఉత్సాహపరిచే సమరగీతాలు వైదిక కాలం నుంచే కనబడుతున్నాయి. ఋగ్వేదంలో,

'Go forward and conquer ye heroes!
May God give you protection
Valiant be your arms so that you
May remain unwounded'[6]

అని వీరులను ఉత్సాహపరిచే వాక్యాలున్నాయి. కొన్ని శాసనాల్లో కూడా ఇలాంటి సమరోత్సాహ గీతాలు కనబడుతాయి.

"జితేన లభ్యతే లక్ష్మీః
మృతేనాపి సురాంగ
క్షణ విధ్వంసినీకాయే
కాచింతా మరణేరణే"

విజయమో, వీర స్వర్గమో! గెలిస్తే సంపదలు, మరణిస్తే దేవతా స్త్రీల పొందు దొరకుతాయి. కాబట్టి యుద్ధంలో చావడానికి బాధపడడం అనవసరం. (బ్రై.వేం పం. తం. 1-539)

"సమర మొనరించి నంతనే చావురాదు
పారిపోయినంతనే బ్రతుకురాదు
జీవితంబును మరణంబు దైవకల్పి
తములు వానికి మదమంద దలక వల..." దని (మా పు 1-54)

దేవతల చేతిలో ఓడిపారిగెత్తే రాక్షసుల్ని నిలబెట్టి యుద్ధోన్ముఖుల్ని చేశాడు భార్గవుడు.

కుంభకర్ణుని ధాటికి తాళలేక వెల్లాచెదరైన కపి సైన్యానికి సమరోత్సాహాన్ని కలిగిస్తూ,

"పాఱకుడేల పాఱెదరు ప్రాణము లెన్నటికేని నీగతిం
బాఱిన భూతముల్ నగవె పాపుపునమ్ములు వీనిపై వడిం
బాఱెడు నంతదాక ధృతి పట్టుడ గుందక దిక్కులం గొనల్
మీఱెడు మీ యశంబులకు మేలగు పెంపుదలంపుడీయెడన్"
(భాస్క.యుద్ధ. 916)

ఒకనికి బయపడి ఇంతమంది పఱుగెత్తి లోకనిందపొందడానికన్నా యుద్ధంలో మరణించి బ్రహ్మలోకాన్ని చేరడం మంచిదని చెప్పి వారిలో సమరో

త్సాహాన్ని కలిగిస్తాడు. సమరం నుంచి పరుగెత్తే దండ నాయకులతో వృద్ధ్రాను రుడు ఇలా అంటాడు.

"బావు ధ్రువమైప ప్రాణికి
జావులు రెండరసి కొనుడు సమరము నందున్
భావింప యోగమందుచు
జావంగా లెని వెడుగ బావుంజావే" (భాగ. 6-382)

అంటే వీరులు, యోగులు ఊర్ధ్వ లోకాలకు చేరుకుంటారని అర్థం.

యుద్ధానికి భయపడకుండా ముందుకు నడిచే వీరునికి అశ్వమేధ యాగం చేసిన పలం లభిస్తుంది. అందుకు భిన్నంగా వెనక్కి తిరిగే వీరునికి దుర్గతి పడు తుంది. ఎక్కడికి పోయినా మరణం తప్పదని తెలిసి కూడా సమరం చేయకుండా వెనక్కి మరలే వానికి అపకీర్తి కలుగుతుంది. (న.నీ.స. 3-930. 931)

రణరంగంలో మరణించిన వీరునికి దేవతా స్త్రీ సౌఖ్యం లభిస్తుందని అనాటి యుద్ధ వీరులు విశ్వసించారు

"ఇంచుక సూది వేదన సహించిన మాత్ర నృపాంగనా కుచో
దంచిత సౌఖ్యకేళి సతతంబున గంచులి గాంచు వాజి వి
ర్వంచన దీవ్ర బాణ నికరక్షత దేహుల కబ్బవే మరు
ద్చంచల లోచనా ఘనకుచస్తబకద్యుతి సంగ సౌఖ్యముల్"
(విక్ర చరి. 4-71)

విరక కాస్త సూదిపోట్లు ఓర్చుకొన్నంత మాత్రంచేత రాణుల పాలిండ్ల సౌఖ్యకేళిని నిరంతరం నోచుకుంటుంది యుద్ధంలో తీవ్ర బాణాల వల్ల క్షతదేహులైతే, అలాంటి వీరులకు దేవతా స్త్రీల సంగమ సౌఖ్యం లభిస్తుందట!)

"....వీరగతి యందు ఫలంబిది యెల్ల దేవతాం
గనల ముదంబునం గవయ గాన్పు విజంబిది...."
(కుమా. 11-56)

రాజు, సఖి, గోవులు, బ్రాహ్మణులు మొదలైన వాళ్లకోసం ప్రాణాలర్పిస్తే కైవల్య సౌఖ్యం అనుభవిస్తారట! (జై భార. 7-16)

యుద్ధ సమయంలో కవి దృక్పథమే వేరు. అతని వస్తువే వేరు. అతని కవితలో సైనికులే నాయకులు. యుద్ధోన్మాదుల గుండెలు బ్రద్దలుకొట్టే వీరుడే ఆదర్శ

ప్రాయుడు ప్రజలలో, సైనికులలో ఉత్సాహం రేకెత్తిస్తాడు. నరనరాల్లో రక్తాన్ని పొంగిస్తాడు—"[7] ఈ విషయంలో శ్రీనాథుడు ఇంకొక అడుగు ముందు కేసి, కోడిపుంజుల పోరాటంలో కూడా వీరాలాపన చేశాడు.

"హా! ఖగేంద్రంబులార! కయ్యమున నీల్గి
పోవుచున్నారె దేవతా భువనమునకు?
మీరు రంభాతిలోత్తమా మేనకాది
భోగ కార్యర్థమై కోడిపుంజులారా! (క్రీ.డా. -236)

ఇలాంటి మాటలు ఆనాటి రాజులకు సైన్యానికి, ఉత్సాహాన్ని, పౌరుషాన్నీ కలిగించేవి.

సమరోత్సాహ సంగీతం:-

ప్రాచీన భారతీయ సంగ్రామాలలో వాద్య ఘోషలు సైనికులకు సమరోత్సాహాన్ని కలిగించేవి

"భేరీలు డమరుకల్ పెద్ద బూరలను
భోరున వాయించి...." (ప.వీ చ పుట 15)

"తమ్మట ధ్వనులు" (పుట 89) మోగిస్తు యుద్ధానికి వచ్చేవాళ్ళు.
భేరులు శంఖముల్ పృథుమృదంగములు
భూరి ఘోషంబు లద్భుతముగా మ్రోయ... "(రం రా పుట 321)

ధూమ్రాక్షుడు యుద్ధానికి వచ్చాడట!

"పటుతర నిస్సాణ భాంకారములును
బటహ భేరి శంఖ భయద రావముల..." (పుట 334)

మధ్య రావణుడు యుద్ధానికి బయలుదేరాడట!

రణ భేరీలు:- ఈ సంగీత సాధనాలలో భేరీ ఆనాడు ప్రసిద్ధిగాంచింది. దీన్నే దుందుభి అంటారు. శత్రువుపై దండెత్తి తమ ఉనికిని తెలియజేయడానికి భేరీ మోగించే వాళ్లు. లేదా దండయాత్రకు బయలుదేరేటప్పుడు, దండయాత్ర పూర్తి చేసుకొని వచ్చేటప్పుడు ఈ బేరీలను మ్రోగించే వాళ్లు భేరీ గంభీరంగా మోగడం రాజుకు విజయ సూచకం (భార.భీష్మ. 1-14)

"అంతట ద్వారకా పురము నందు సభా పరిపాటుడర్జునో
దంతము యాదవుల్ దెలియునట్లు హజారమునందు భేరియ
త్యంతరుషాకషాయిత హృదంతరుడై చలపించె, మించె ది
గ్దంతి ఘటా శ్రవః పుటాభిదాచణ భీషణ భూరిభాంకృతుల్"
(విజ.వి. 3-160)

ఇది అర్జునుడు వేయించిన భేరి

కళాపూర్ణుడు దండయాత్రకు బయలుదేరే సందర్భంలో

"జైత్ర భేరి ధణంధణ శబ్ద మహిమ
గరమ ఘూర్ణిల్లి దిక్కులు గ్రక్క దలగ
లలిత గుణ యుక్తమగు శుభ లగ్నవేళ
దనదు భువనంబు వెడలె భూతల విభుండు" (కళా. 8-31)

కృష్ణుడు బాణునిపై దండయాత్రకు బయలుదేరేటప్పుడు భేరి మోగించారు.

"భేరీ ధణంధణంధణ
భూరి ధ్వానయున భూపబోభాగంబుల్
భోరుమని మ్రోసె. నాశా
వారణములు చెదరె, నదరె వసుధాధరముల్ (అని.చ. 4-24)

రాజపుర ప్రవేశం చేసేటపుడు కూడ భేరుల్ని మోగించే వాళ్లు

"భేరులులోనుగా గల గభీరపు వాద్య చయంబు మ్రోతలం
దోరపు ప్రౌఢిమించెను .." (కళా. 8-142)

ఇలా సంగీత వాద్యాలను యుద్ధానికి బయలుదేరి వెళ్ళేటప్పుడు తిరిగి వచ్చే టప్పుడు మోగించడాన్ని చాలా కావ్యాలు పేర్కొన్నాయి. ఇలాంటి తతంగమంత యుద్ధవీరులను ఉత్సాహంగా వుంచడానికి చేసేవాళ్లు. వీరుల యుద్ధ ప్రేరణకు కూడా ఇవి వినియోగించబడేవి. యోధులకు బలాన్ని, ఉత్సాహాన్ని, ఆనందాన్ని, కల్గించడానికి, పారిపోయే వీరులను హేళన చేయడానికి, యుద్ధం చేస్తున్న వీరులకు వీరావేశం కలిగించడానికి, యుద్ధంలో చనిపోయిన వీరుల పట్ల విచారాన్ని తెలియ చేయడానికి సమర గీతం ఉపయోగపడుతుంది. ఇంకా చెప్పాలంటే వీరుల్ని "హిప్నటైజ్" చేయడానికి సమర గీతం ఒక సాధనం.

దూత పాత్రం - యుద్ధాన్ని ఆపడానికిచేసే ప్రయత్నాలలో దూత ప్రతిపాదనలు అతి ప్రధానమైనవి. రాజు అనుకోగానే యుద్ధం జరగదు. తాను విధించే నిబంధనలను సమ్మతించమని దూత ద్వారా శత్రురాజుకు తన సందేశాన్ని పంపుతాడు. దూత కార్యాలు విఫలమైన తరువాతే యుద్ధతంత్రం మొదలవుతుంది,

రామాయణంలో హనుమంతుడు, అంగదుడు, రాముని దూతలుగా రావణుని దగ్గరకు పోయారు, హంస డిభకుల తరపున జనార్దనుడు, కృష్ణుని పక్షాన సాత్యకి దూత కార్యాన్ని నడిపారు. మహాభారతంలో సంజయుడు కౌరవుల పక్షాన, కృష్ణుడు పాండవుల పక్షాన రాయబారాన్ని సాగించారు. యుద్ధానికి ముందు ఇలా దూతల్ని పంపడానికి చాలా కారణాలు ఉన్నాయి, రాజు దండెత్తి వచ్చి విడిది చేసి శత్రు రాజు దగ్గరకు దూతను పంపుతాడు.

ఈ రాజదూతలు తమ రాజు, పంపిన సందేశాన్ని శత్రు రాజుకు యథాతథంగా చెప్పాలి, తన రాజు బల పరాక్రమాల్ని గుర్తు చేసి శత్రు రాజును భయపెట్టాలి. తన వాక్చాతుర్యంతో శత్రు రాజును వశపరచుకోవడానికి ప్రయత్నం చేయాలి. యుద్ధం గురించి జరిగే నష్టాలను వివరించి తమ రాజు యుద్ధ సన్నాహాలు ఎలా చేస్తున్నాడో, ఎవరెవరు ఆయనకు మిత్రులో, ఆ రాజు సేనా సంపతి ఎలాంటిదో, ఆయనకు వ్యతిరేకులు ఆ రాజ్యంలో ఎవరైనా ఉన్నారో మొదలైన అంశాలన్ని దూత గుర్తించాలి.

రణ తంత్రం—గూఢచారుల పాత్ర :-యుద్ధ తంత్రంలో గూఢచారులు విశిష్టమైన పాత్ర వహిస్తారు, శత్రు రాజ్యంలోను, స్వరాజ్యంలోను జరిగే అన్ని విషయాలను పసిగట్టి రాజుకు తెలియజేయాలి. గూఢచారులు చెప్పిన విషయాల్ని బట్టి రాజు తన రణ వ్యూహాన్ని పన్నుతాడు. రాముని సైన్యాన్ని పరీక్షించడానికి రావణుడు రెండుసార్లు గూఢచారులను పంపాడు. శుకసారణులు రాముని సేనలో బలవంతుల్ని గుర్తిస్తే శార్దూలాదులు ఎలాంటి వ్యూహం పన్ని రాముడు యుద్ధానికి వస్తున్నాడో రావణునికి తెలియజేస్తారు. (భాస్క. యుద్ధ 324,375)

రామునిపక్షాన విభీషణుని మంత్రులు పక్షిరూపంలో లంకలో ప్రవేశించి గూఢచారత్వం నడుపుతారు. యుద్ధానికి ముందు ఇలా గూఢచార్యుల్ని పంపడం ప్రాచీన యుద్ధతంత్రంలో ఒక భాగంగా పరిగణించారు శత్రురాజు బలాబలాలను, అంచనా వేయడానికి గూఢచారులను పంపడం తప్పని సరి

ఆయుధ వర్ణన :- విజయ నిర్ణయంలో ఆయుధాలు ఎంతగానో తోడ్పడతాయి. ఈనాటి ఆయుధాలకు ఆనాటి ఆయుధాలు మూలంగా నిలిచాయి. అనాటి ఆయుధాలివి.

"పరశులు గొంతముల్ భల్లము డగలు లమ్ములు విండ్లు గంకటుల్
సురియలు వజ్రముష్టులు ద్విశూలము లీటెలు మండలాగ్రముల్
పరిఘలు జక్రముల్ పవ్వలు పాశము లంకుశముల్ సబళ్లము
ద్గరములు దోమరంబు లెడగత్తులు శంఖులు బిండివాలముల్"
(కుమా 12-5

ఇవేకాక ముక్తములు, అముక్తములు, ముక్తాముక్తములు, యంత్రముక్తములు అనే అయుధాలు కూడ ఉన్నాయి. (కుమా. 11-128, 12-8) చక్ర, వజ్ర, వలయ, శక్తి, తోమర, కుంత, పాషాణాలు, మొదలైనవి ముక్తములు. అంకుశ, పాశ, క్షురికా, అసి, గదా, ముసల, దండాదికాలు అముక్తకములు పాశ, వాగురా, రజ్జు, వలయాదికాలు, ముముక్తాముక్తాలు వాప, శతఘ్ని శల్యక మంజూషార్క వర్ణాధికాలు యంత్ర ముక్తాలు.

1] సురియ 2] ముప్పిడియమ్ము 3] కరారము 4] తరువలి 5] కొంగవాలు 6] గండ్రగొడ్డలి 7] కత్తి 8] అడిదము 9] కుంతము 10] సబళం (గడ్డపార) 11] ఇనుప కోల 12] పట్టెం 13] డొంకెనలు 14] చక్రము 15] క్రొంకులు 16] బద్దపరులు 17] వడిసెల 18] దంచనపు గుండ్లు 19] ప్రాస 20] ముసలము 21] సెలకట్టె 22] శూలము 23] చాపము 24] కుమ్మెడుదగరు 25] భల్లెము 26] గద 27] ముద్గరము 28] ఒడ్డనములు 29] కణయము 30] కంపణము 31] మొలలకరాలు 32] పలకలు 33] క్షురప్రము 34] అసి 35] రొహణ 36] వజ్రముష్టి 37] లౌడివంకిణి 38] బింధివాలము 39] భల్లాతకను 40] శిలా యంత్రాలు 41] జబురజంగులు 42] గ్రద్దగోళ్లు మొదలైన ఆయుధాలు ప్రాచీన కాలంలో యుద్ధంలో ఉపయోగించే వాళ్లు.

కుమార సంబవం, ఉత్తర హరి వంశంలో పేర్కొన్న అయుదాలు ఒకే రీతిగా ఉన్నప్పటికి వాటిలో కొన్ని అయుధాలకు పేర్లు మారినట్లు గమనించవచ్చు. ప్రహరణాలు, కైదువులు, అని యుద్ధ సాధనాలు రెండు రకాలు.

ప్రహరణాలు :- కణయ, కంపన, ముసల, ముద్గర, పరిఘ, పరశ్వధ, కరవాల, భిండి వాలాలు.

కైదువులు :-

"సురియు, ముప్పిడి యమ్ము, కరారమ్ము
దరవలి కొంగవాలడి దమ్ము గండ్ర గొడ్డలి, కత్తి

గొంతంబు సబళం బీటె యినుపకోలసెలకట్టె
పట్టెంబు నిరాణంబు చక్రంబు...." మొదలైనవి (ఉ.హరి. 4-209)

ప్రహణణాలు అంటే యుద్ధంలో శత్రురాజుల మీదకు విసరబడే ఆయుధాలు. కైదువు లంటే చేతిలో ధరించే ఆయుధాలు.

యుద్ధంలో ఈ ఆయుధాల ప్రయోగాన్ని గురించి ఇలా వుంది.

"పరిఘ విభిన్నులై ముసల పాటితులై కరవాల కృత్తులై
శరపరికీర్ణులై పరశు సంప్ర విదారితులై గదా విభం
గురులయి తోమర ప్రకర కుంఠితులై సమరావనిన్ సురా
సురులు పరస్పరాభిహతి శోణిత పూరము నింబిరయ్యెడన్"
(హరి.పూ.భా. 4-14)

"ముసలముల్ గదలును, ముద్గరచయము
వెనభిండి వాలముల్ విచ్చు కత్తులును
పరిఘలు చక్రముల్ బాను కటార్లు
అరుదగ మెరయు, చంద్రాయుధములును" (ప వీ చ పుట 25

అని ఆనాటి ఆయుధాల్ని పేర్కొంది. ఇలాంటి ముప్పది రెండు ఆయుధాలను నేడు కూడ అజంతా చిత్రాలలో చూడవచ్చును.

ధనుర్విద్యలో నేర్పరులైన విలుకాండ్రు తమ పేర్లను బాణాలపై చెక్కించుకునేవాళ్లు.

"చివురు గజితోడలేమావి పువులు శరము
జేసి మధు మాస కాలంబు చిత్తజునకు
నళికులంబుల పేరనాక్షరములు
వరుసతో నిల్పెనని బోల్చె వాని యందు" (హర. 3-57)

శతఘ్ని అనే ఆయుధాన్ని నాటి యుద్ధాలలో వుపయోగించే వాళ్లు హనుమంతుడు లంకలో ప్రవేశించి శోధించే టప్పుడు శతఘ్నిని ధరించిన వీరుల్ని చూశాడు.

"... పరిఘ పట్టిస పరశు ప్రాసాసి దండిభిండివాల
తోమర హలి చక్ర గదాముసల ముద్గర చాపబాణ
ఇష్టి శతఘ్ని హస్తులను జిత్ర వర్మధారులను..."
(భాస్క.సుం. 87) చూశాడట!

కృష్ణుడు నరకాసురుని వీరులపై శతఘ్ని అనే దివ్యాస్త్రాన్ని ప్రయోగించగా ఒకేసారి వారంతా 'మహావ్యధ' చెందారట! (భాగ. 10 ఉ భా. 192) అంతేకాదు,

"శరవిచ్ఛిన్న తురంగమై, పటుగదా సంభిన్న మాతంగమై
యుదు చక్రాహత వీర మధ్యపద బాహుస్కంధ ముఖ్యాంగమై
సురభిత్సైన్యము దైన్యముంబొరయుచున్ శోషించి హైన్యంబుతో
హరిఁ ద్రోలన్ నిలువంగ లేక పఱచెన్ హాహా నినాదంబులన్"
(193)

ఇది శతఘ్ని యొక్క శక్తి సామర్థ్యం.

'శతఘ్ని = పిరంగి - నూర్గురను' చంపేది.[8]

యుద్ధాలలో మంటల ఆయుధాల్ని వాడేవారు 1309-1310లో వరంగల్లు పై మాలిక్ కాఫర్ దాడి చేశాడు. కాకతీయ ప్రతాపరుద్రుడు రాజుగా వున్నాడు. ఈ యుద్ధాన్ని గురించి అమీర్ ఖుస్రో ఇలా చెప్పాడు.

"తురష్క సైన్యాధిపతి ఆజ్ఞ లిస్తూంటే.

ప్రతి దినమూ, ప్రతాపరుద్రుని సైన్య నాయకులతో యుద్ధాలు జరుగుతు న్నాయి. వారు తెచ్చిన యంత్రాల నుంచి పెద్దపెద్ద (ఫిరంగి) రాతిగుండ్లు కోట గోడ మీద పడి దానిని గుంట చేస్తున్నాయి. లోపలి నుంచి కూడా ప్రతాపరు ద్రుని సైనికులు రాతిగుండ్లు విసిరేవారు. అయితే ముస్లిం గుండ్లు బలమైన తీగ బలం మీద చాలా ఎత్తు ఎగిరేవి. హిందువుల గుళ్ళు బ్రాహ్మణుల జంధ్యాలతో ప్రయోగిస్తున్నట్లు నీరసంగా వచ్చేవి."[9]

తరువాత కాలంలో తుపాకులు, సూరతు మందు గుండ్లు మొదలైన విధ్వం సక ఆయుధాలు భారతీయ యుద్ధ రంగంలో చోటు చేసుకున్నాయి ఇక్కడ నుంచి యుద్ధ స్వభావం మారిపోయింది.

"....తుపాకుల పెళపెళలు పెట్లు గ్రోవుల పెట పెటలు జబురు జంగుల ఫిరంగుల ఢిమఢిమలు డమామీల ధమధమలు. బాణపు జివ్వల జిలజిలలు—" (కృ.వి. 3-24) యుద్ధాలలో వినిపించాయి.

"రటిత దిక్తటనటత్పెట పెటార్భటులతో
ఘోరమైన తుపాకి గుండ్ల చేత

దవ్వు దవ్వున హెచ్చి రివ్వు రివ్వున వచ్చి
ప్రసరించు రామారి బాణములను...." (కృ.వి. 3-5)

సమర భూమిలో వాడారు.

"ఏ దారి జూచిగన నా దారిన తుపాకి
బలులైన జబురు జంగులు ఫిరంగి...." (కృ.వి. 3-5)

మొదలైనవి కనిపించేవి.

ఇంకా కొన్ని కావ్యాల్లో వీటి ప్రసక్తి వుంది.

కు.వ.చ. 3-3, 5, 15, 19, 20 కళా 8-73 కృ.వి. 3-5, 29, 55) బీదరు కోటలో లభించిన ఇనుప ముళ్ల కూడా యుద్ధ పరికరమే."[10]

బ్రహ్మాస్త్రం – ఇది శక్తివంతమైన అస్త్రం. భాస్కర రామాయణంలో అతికాయుని లక్ష్మణుడు బ్రహ్మాస్త్రంతోనే వధించాడు. ఈ అస్త్రాన్ని ప్రయోగించగానే అది భయంకరమైన శక్తితో శత్రువుల ఆయుధాల్ని కాల్చివేసి, శత్రువు కంఠాన్ని తెగవేస్తుంది. (భాస్క.యుద్ధ -1061)

ఈ అస్త్రం బారి నుంచి తప్పించుకోవడానికి బ్రహ్మాస్త్ర మంత్రాన్ని పఠించాలి. ఇంద్రజిత్తు రెండవసారి యుద్ధానికి వచ్చి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. వానర సైన్యం ఆ అస్త్ర ధాటికి నిలవవేకపోయింది. విభీషణుడు మాత్రం బ్రహ్మాస్త్ర మంత్రాన్ని జపించడం వల్ల ఆ అస్త్రం అతనిని వదిలి పెట్టింది. భాస్క. యుద్ధ. -1083)

లక్ష్మణుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రమే కుంభకర్ణుని చంపింది.

"ఈ బ్రహ్మాస్త్రము తాకుట
కే బలియుడు బ్రతుక" నోపడు (మొ.రా. సం. 192)

బ్రహ్మాస్త్రం యొక్క శక్తి సామర్థ్యాలిలాంటివి. బ్రహ్మాస్త్ర ప్రయోగాన్ని గురించి విక్రమార్కునితో భట్టి ఇలా చెప్పాడు.

"చరణాబ్జంబులు యోగపాదుకలతో సంధించి, యకాశ సం
చరణా రంభ విజృంభ మాణ రణ దీక్షాదక్షతన్మించి, వా
విరి బ్రహ్మాస్త్రము నిస్సరేశ్వరుని పయిన్ వేగం బ్రయోగింపు సు
స్థిర లీలన్ సమకూడు నీకు జయలక్ష్మీ విత్య సాంగత్యముల్"
(విక్రమ చరి. 4-123)

<u>ఆగ్నేయాస్త్రం</u>:- ఇది అగ్నిదేవుని ఆయుధం. దీన్ని ప్రయోగిస్తే ఇది మెరుపులు, ఉరుములు, నిప్పులు వెదజల్లుతూ శత్రువుపై పడుతుంది. రాముడు, రావణునిపై ఆగ్నేయాస్త్రాన్ని మంత్రించి ప్రయోగించాడు.

"తలుకుగా గిలిగొన్న మెఱవులు నెఱపుచు
దోరంపు ధూమ కేతువులు బోలె
నుగ్ర తేజముతోడి యుల్కల నీనుచు
వెల్లుగా బిడుగులు వెల్లి గొల్పి
బహుభేద భాస్వర గ్రహముల బోలుచు
వితతో గ్రతాణ్ణ కాతతుల మీఱి
భాను మండల కోటి భాసురాననములై, వి
లయాగ్ని ముఖములై కలయ బర్వి
జానకీ జానియాగ్నేయ సాయకములు
పొదలి రావణు శరముల బొలియజేసె
వైదికాగమ పరిశుద్ధ వాక్యతతుల
నోజ దక్కిన సాగతయుక్తులనగ" (భాస్క.యుద్ధ. 1542)

ఇవీ దాని శక్తి సామర్థ్యాలు.

<u>పర్జన్యాస్త్రం లేదా వారుణాస్త్రం</u> - ఇది ఆగ్నేయాస్త్రానికి, తత్సంబంధులకు విరుగుడు ఇది జడివానల్ని కురుస్తూ శత్రువులను చీకాకు పరుస్తుంది. అర్జునుడు సుధన్వునితో యుద్ధం చేస్తూ ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు విరుగుడుగా "విలురన్నిర్ఘాత కల్పాంబుర. చ్ఛాయ విభ్రమ గర్భితంబయిన పర్జన్యాస్త్రాన్ని" వేశా..

"మెఱుపులు దఱచుగ బెళపెళ
నుఱుముచు వడగండ్లతో జయోధారలు పె
న్నుఱ దలుగా నెల్లడ జి
చ్చుఱ పిడుగుల తోడ వాన జదిగొని కురియన్"(జై భార. 5-28

"జల్లెడెలును బక్కెరలును
బల్లంబులు జోళ్ల నాత పత్త్రాదులు న
వ్వెల్లి బడి కలిసి మిఱుసు
బల్లము నొక్కటిగ బొరలి పాఱగదొడగెన్" (జై.భార. 5-29)

దీన్నే రావణుడు రామునిపై ప్రయోగించాడు (భాస్క.యుద్ధ. 2051)

**అహిశరం (పన్నగాస్త్రం) :-** భీషణ విషాగ్నులు విమ్ముతూ శత్రువులను వధించే పాము రూపంలో ఉండే అస్త్రం. రామునిపైకి రావణుడు ఈ ఆయుధాన్ని ప్రయోగించాడు.

అది విపరీతంగా పొగతో కూడిన విషాన్ని కక్కుతూ, బుసకొట్టుతూ, నేత్రాల నుంచి మంటల్ని విమ్ముతూ, నిశితమైన కోరల్ని కోపంగా బయటపెడుతూ గరుత్మంతుని కూడా వధించే శక్తి వున్నట్లు, ఆకాశమంతా తెఱపి లేకుండా ఆక్రమించి భుజాలతోనే రాముని గెలవడానికి వచ్చింది (భాస్క.యుద్ధ. -2045)

ఈ అస్త్రానికి విరుగుడు గరుడాస్త్రం.

**గరుడాస్త్రం :-** పన్నగాస్త్రాన్ని ఎదుర్కోవడానికి రాముడు గరుడాస్త్రాన్ని వేశాడు. (భాస్క. యుద్ధ. -2046)

"చటుల పక్షానిల చలిత మహాశైల
విపులాంగములు వెనువెంట బర్వ
గులి శోగ్రపటు చంచుకోటి పుటంబుల
ఘన భుజంగంబుల గఱవి త్రుంచి
చలిన ఖరోదగ్రచరణ తాడనముల
విరిసి మేఘంబులు దొరగి పొలియ
భుజగ కులంబుల బొదివి చంపగ బూని
భూకంప మొదవించి ప్రాకటముగ"

"గారుడాస్త్రజనిత గరుడ గణంబులు
మింట సిద్ధసురలు మెచ్చి చూడ
రావణ ప్రయుక్తమై వచ్చు నస్త్రంబు
పొలుపు నిమిష మాత్ర బొలియ జేసి" (భాస్క.యుద్ధ. -2047)

ఇలాంటి దివ్యాస్త్రాలు చాలా ఉన్నాయి. ఇవే కాకుండా, శివజ్వరం, వైష్ణవ జ్వరం మొదలైన జ్వర ప్రయోగాలు కూడా ఉన్నాయి.

ప్రయోగించే ఆయుధాలు వాటి విరుగుళ్ళు ఇలా ఉన్నాయి.

"మెఱుగులు గ్రమ్మెడు మేఘాస్త్ర మేసిన
పవన బాణంబున బరిహరించె

విషములు మియు కాద్ర వేయాస్త్ర మేసిన
గరుడ బాణంబున గర్వమణచె
సమధికోన్నతమైన శైలాస్త్ర మేసిన
నింద్ర బాణంబున నేపు మాపె
దృష్టినిరోధం బైన తిమిరాస్త్ర మేసిన
వరుణ బాణంబున విరియ జేసె ..." (విక్ర.చరి. 4-117)

పతాకాల ప్రాముఖ్యం :- యుద్ధాలలో వాడే పతాకాలు కేవలం వ్యక్తిగత చిహ్నాలే ఇవి గాలికి రెపరెపలాడుతూ, వీరుల్ని ఉత్తేజపరుస్తూ వాళ్ళకీర్తి కాంక్షలకు ప్రతీకలుగా వుండేవి. పేరుపొందిన వీరులు మాత్రమే వీటిని వుపయోగించే వాళ్లు. వీళ్ళే సేనా రక్షకులు. పతాకం, కేతనం, ధ్వజం, సిడము అనేవి పర్యాయ పదాలు.

యుద్ధ రంగంలో వీరుల్ని గుర్తించడానికి ఈ పతాకాలు తోడ్పడేవి. రావణుని వెంట వున్న వీరులను విభీషణుడు రామునికి చూపుతూ,

"ఉరుతర హేమ దండరుచి నొప్పుచూ సింహ పతాకమింటితో...." భాస్క.యుద్ధ. -797) వచ్చేవాడు ఇంద్రజిత్తుడని,

"ఉరగ రాజ కేతనోజ్జ్వలమ్మై వచ్చే అతను కుంభకర్ణుని పెద్ద కొడుకైన కుంభుడని, (802) "ధూమ ధ్వజ లాంఛన మగు, భీమ ధ్వజ మొప్పుదేర బృథు పరిఘముతో " (803) వస్తున్న అతను నికుంభుడని,

'కనక దండప్రచండ కేతనము గ్రాల గాల విభ మూర్తులయిన రక్కసుల నడుమ వాడి తేజంబుతో .. " (807) వచ్చేవాడు రావణుడని చెప్పాడు.

ఇక రాముడు "గరుడధ్వజుడు'' (భాస్క.యుద్ధ -2164)

యుద్ధంలో శక్తివంతమైన ఆయుధాలతో శత్రువుల రథంతో పాటు ఈ పతాకాల్ని నాశనం చేసేవాళ్లు. ధ్వజం విరగడం అపశకునంగా భావించేవాళ్లు. (స.నీ.స. 3-807) అందువల్లే అది విరక్కుండా చూసుకోవడానికి శత విధాల ప్రయత్నించే వాళ్లు.

యుద్ధ నీతి :- ప్రాచీన భారతీయ యుద్ధ నీతి చివరి వరకు కొనసాగింది ఆంధ్ర దేశంలోనే అని చెప్పవచ్చు. కాకతీయుల తరువాత మహమ్మదీయుల ప్రాబల్యం

యుద్ధ రంగంలో కనిపిస్తోంది. అయినప్పటికీ ఆంధ్ర రాజులు సాధ్యమైనంత వరకు యుద్ధ నీతిని పాటించారు. యుద్ధ నియమాలను గౌరవించారు. కాలాను గుణంగా యుద్ధనీతిని మార్పు చేసుకోకపోవడం మన పాలకులు చేసినతప్పిదం. మన పరాయి పాలకుల చేతిలో ఆంధ్రదేశం ధ్వంసం కావడానికి కారణమైంది. మన రాజులు అనుసరించిన యుద్ధ నీతి ఎలాంటిదో చూద్దాం.

"చంప దగిన యట్టి శత్రువు తన చేత
జిక్కెనేని కీడు సేయరాదు,
పొసగ మేలు చేసి పొమ్మనుటేచాలు...." అంటాడు వేమన.

"వైరి విరాయుధుండగుచు వచ్చిన గామట కంటె బుణ్యముల్ చేరునె?..." (ఆం.వి.పు. 8-408)

శత్రువుని ఏలాగైనా మట్టుపెట్టి అతని రాజ్యాన్ని కబళించాలనే మనస్తత్వం నానాటికి పెరుగుతున్న పరిస్థితుల్లో ఇలాంటి యుద్ధ నీతివి పాటించడం అపూర్వమైన విషయం. శత్రు రాజు ఊళ్లో లేనప్పుడు దండెత్తడం యుద్ధ నీతికి విరుద్ధం.

"అధిపతి వీటలేని సమయంబున సంగర కాంక్షతోడని
ట్లధిక బలంబులంగొని వృథా తిశయంబుగనేగుదెంచి యి
వ్విధమున బని నీవనృత విక్రయముం బ్రకటించు కంటెనం
బుధినడమైన నీపురికి బోయి యెదుర్గము చాల మేలగున్"
(ని రా. 7-21)

" రాజు లేని యట్టి రాష్ట్రంబు పై జని
జయముగొన ట యేమి శౌర్యమనుచు" (కళా. 8-161)

". వైరుల జీవన్మృతులగు
వారల నెవ్వారు జంపవలదు నరేంద్రా!" (ఆం.వి పు. 5-241)

ఇలాంటి నీతుల్ని ఆచరించడం వల్ల శత్రువు సమూలంగా నాశనం కావడానికి అవకాశం లేక పోయింది. సమఉజ్జీతోనే యుద్ధం చేయాలి. "కయ్యానికైనా నెయ్యానికైనా, వియ్యానికైనా సమానత్వము ఉండాలి. అలా లేనిచో కయ్యము గెలువదు నెయ్యము నిలువదు వియ్యం పొసగదట! (బ్రై.వే పం.తం. 2-47)

యుద్ధంలో సమఉజ్జీని ఎదుర్కోవాలి అనేది అనాటి యుద్ధనీతి.

"ఒకరితో నిందర మొనర పోటాడ" తగవుకాదు అనేది (ప.వీ.చ.పుట 159)

ఇంకో యుద్ధ నీతి.

దూరంగా వున్న శత్రువును చూచి రాజు భయపడి రణ విముఖుడు కారాదు. గర్వించివున్న శత్రువు పరాక్రమం వల్లనే లొంగుతాడు కాని మరొక విధంగా లోబడడు. పరిగెత్తితే వెంటబడుతుంది. నిలిచి అదలించినప్పుడే కుక్క పక్కకు తప్పుకొంటుంది. కాబట్టి రణరంగంలో వెనుకంజ వేయకుండా సాహసంతో శత్రువును జయించాలి. (దకృ చ. 3-49, 50) శత్రు రాజు లేనప్పుడు అతని మూకల్ని చంపరాదు. సైంధవుడు పలాయన మంత్రం పఠించిన తర్వాత కూడా శత్రుసేనల్ని చంపడంలో నిమగ్నమై వున్న భీమునితో అరుముడు,

"వీతలజ్జుడై పఱచె సౌవీరవిభుడు
బొనుగు ప్రజనేల యాఱడి దునితువైవ
నదురాత్ముని వెనుకొని యసువు లిపుడు
గొనగ వలయు లేలెమ్ము సద్వినుత శౌర్య" (భార.అర. 6-238)

అని అంటాడు.

రాజు తాను జయించాలనుకున్న రాజ్యంలోని ప్రజలకు నష్టం కలిగించరాదు. రాజు అనుసరించే నియమాలలో ఇది ప్రధాన స్థానాన్ని వహించాలని కౌటిల్యుని మతం.[11]

"రాయచూరు యుద్ధములో ముసల్మాను లోడిపోగా వారిని పూర్తిగా తుడిచి వేయవలెనని సేనానులొత్తి చెప్పినను శ్రీకృష్ణదేవరాయలు వినక, పారెడి వారిని సంహరించుట ధర్మము కాదని వాదించెనని విదేశీయుడగు నూనిజ్ చకితుడై వ్రాసియుంచెను" [12]

ఈ నీతి పాటించడం వల్ల కలిగిన ఫలితం తెలిసిందే.

....పార్థివ పుత్ర యొకండు నేసినం
బలుపుర మీద నింత దలపందగ దట్టులు గాక నిద్రమై
నొలసియు దమ్ము నేమఱియు నున్నెడ వధ్యులై శస్త్ర పాణులై
నిలువని వారిని జంపదగునె రణ ధర్మము నీ వెఱుంగవే."

(భాస్క. యుద్ధ. -561)

అని రణ ధర్మం కంఠోక్తిగా చెప్పబడింది.

"కలనబడిన వారి గయికొని పోయి
పుండ్లనోమి మగుడ బుచ్చు టొప్పు

బంత మడిగి మగుడ బవర మిచ్చుట యొప్పు
నింమనేని దాన మేలు బొప్పు" (ఉ హరి 5-266)

ఇది ఇంకొక ధర్మం.

రణ క్షేత్రం – రాజు తన వ్యూహానికి అనుగుణంగా యుద్ధ భూమిని నిర్ణయిం చుకోవాలి పదాతి దళాలు, గుర్రాలు, రథాలు, ఏనుగులు యుద్ధం చేయడానికి వీలైన ప్రదేశాల్ని ఎన్నుకోవాలి.

"గట్టును జెట్టును మిట్టయు బల్లంబు
గలిగిన చోటు కాల్బలము నేల
వినుము నీళ్ళను రొంపియును లేక సమ విశా
లములైన చోటు గుఱ్ఱముల నేల
క్రమ్మి గుల్మంగక గదగద వంపులు గలు
గమి నొప్పు చోట రథముల నేల
యెడనెడ మ్రాకులు మడువులు గల చోటు
కురునాద యెలుగుమ కరుల నేల

యే బలంబు దనకు నెక్కుడు గలుగు న
బ్బలము నేల పోరు గలను గాగ
వినుడు శశియు గాలి వెనుకగా మొనసడ
పించి పొదువ సంభవించు జయము" (స.నీ.స 3-923)

చతురంగ బలాలకు అనుకూలమైన ప్రదేశాల్ని యుద్ధక్షేత్ర గా ఎన్నుకోవాలి. కౌటిల్యుడు చతురంగ బలాలకు అనువైన ప్రదేశాలు ఎలా వుండాలో పేర్కొన్నాడు.[13] రాయబారిగా వచ్చిన జనార్దనునితో కృష్ణుడు ఇలా అంటాడు.

"పరగు మోహర మేర్పను
నెరవగుబో నెల్లి నేడు విడిసెద మధురా
పురమున బ్రయాగమున బు
ష్కరమున దారేర్చి కొన్న కలనగు మాకున్" (ఉ హరి. 4-168)

మధుర, ప్రయోగ, పుష్కరాలలో పుష్కర క్షేత్రాన్ని హంస డిభకులు యుద్ధ క్షేత్రంగా ఎన్నుకున్నారు. ఆ ప్రాంతానికి కృష్ణుడు చతురంగ బలాలతో దండెత్తి వచ్చి యుద్ధం చేశాడు. (ఉ.హరి. 4-206)

## యుద్ధాలు

ప్రాచీన భారతీయ రాజులు చేసిన యుద్ధాల్ని నాలుగు విభాగాలుగా చేయవచ్చును.

1) ధర్మయుద్ధం :- ఈ యుద్ధాన్ని ప్రకాశ యుద్ధం అని కూడ అంటారు.

"[శత్రువు కంటె] అధిక సైన్యమున్నప్పుడు [శత్రు శిబిరంలో] కుట్రలు పన్నగలిగినప్పుడు, యాత్రా కాలమును గురించి అవసర చర్యలు తీసుకొనగలిగినప్పుడు, అనుకూలమగు ప్రదేశమందున్నప్పుడు [విజిగీషువు] ప్రకాశయుద్ధం చేయవలెను"[14]

రామ రావణ యుద్ధం, కురుక్షేత్ర యుద్ధం మొదలైనవి ధర్మ యుద్ధాలైనప్పటికీ రణ భూమిలో కుటిలత్వం ప్రదర్శించడం జరిగింది

కూట యుద్ధం - ధర్మయుద్ధం చేయడానికి పరిస్థితులు విరుద్ధంగా ఉంటే కూట యుద్ధం చేయాలి మోసపూరితంగా కుటిలత్వం, ఎత్తులు, జిత్తులు మొదలైన పద్ధతుల వల్ల శత్రువును జయించడం కూట యుద్ధం. వివిధ కూట యుద్ధ పద్ధతుల గురించి కౌటిల్యుడు వివరించాడు.[15]

"అపజయము కంటె గష్టము
నపమింపగ జయము కంటె నొప్పును వసుధా
ధిపులకు లేదట్లగుటన్
గపటోపాయముననైన గార్యము వలయున్" (స.నీ.స. 3-798)

అధర్మాన్ని అధర్మంతో జయించాలనీ, వజ్రాన్ని వజ్రంతోనే భేదించాలనీ చెప్పే స్వభావం కలవాడు అపకారికి ఉపకారం చేయమనడు అలా చేస్తే రాజ్యాలు నిలబడవు, రాజ్యం కోసం ఏది చేసినా తప్పు కాదనే నీతి మార్గమిది. దండయాత్రల సమయంలో శత్రువులు వచ్చే దారిలో, చెరువులతో నూతులలో విషం కలపాలని కూడా ఇది బోధిస్తుంది.

రాముని జయించాలంటే అతనిని మానసికంగా దెబ్బ తీయాలని ఇంద్రజిత్తు ఆలోచించాడు. మాయ సీతను సృష్టించి రాముని సమక్షంలో ఆమెను చంపాడు. ఇంద్రజిత్తు ఆశించినట్లే రాముడు శోకార్తుడయినాడు. కాని అంతలోనే ధైర్యం తెచ్చుకొని యుద్ధం చేశాడు. (భాస్క.యుద్ధ. -1281 -1286)

కృష్ణుడు కంసుని వధించాడని తెలిసి జరాసంధుడు హఠాత్తుగా మధురపైకి

దండెత్తి వచ్చే బలరామకృష్ణుల దగ్గరికి దూతను పంపాడు యుద్ధానికి సిద్ధంగా లేని బలరామకృష్ణులు జననష్టాన్ని జరగకుండ, రాష్ట్రం చెడకుండా ఉండడానికి ఒక ఉపాయాన్ని ఆలోచించారు.

జరాసంధుడు చూస్తుండగా బలరామకృష్ణులు నిరాయుధులుగా జరాసంధుని దగ్గరికి వెళ్ళి అతన్ని రెచ్చగొట్టారు. అతడు తరుముకొని రాగా దక్షిణ దిక్కుగా వెళ్లసాగారు, రాష్ట్రాలను, పురాలను దాటి వింధ్యాటవిలోకి వెళ్లారు. అక్కడ వున్న కొండలు, అడవులలోకి వెళ్ళి పరశురాముని చూసి అతనితో తమ వృత్తాంతాన్ని చెప్పారు. జరాసంధునితో యుద్ధం తప్పదు, ఇక్కడ వుండడం మంచిది కాదు. అతనిని జయించడానికి అనువైన స్థలాన్ని చూపిస్తాను అని పరశురాముడు వారిని గోమంత పర్వతంపై వదిలాడు. జరాసంధుడు సైన్యంతో వచ్చి ఆ పర్వతాన్ని చుట్టుముట్టి నిప్పు పెట్టాడు. వెంటనే బలరామకృష్ణులు జరాసంధుని సైన్యంపై దూకి యుద్ధం చేశారు (హరి.ఉ.భా. 1-19 నుంచి 103)

ఆకస్మికంగా దాడి చేసిన శత్రువును అనువైన స్థలానికి మళ్లించడానికి భయపడినట్లు నటించి పరగెత్తాలి. శత్రువు తరుముకుంటూ వెంటపడతాడు. ఆ స్థలం చేరగానే శత్రువును ఎదుర్కొని చంపాలి. ఇది కూట యుద్ధంలో ఒక పద్ధతి.

<u>మంత్ర యుద్ధం</u>:- దూతను పంపి శత్రువును బుజ్జగించి, హెచ్చరించి లేదా బెదరించి అతని యాన ప్రయత్నాలను భంగపరచాలి. అప్పటికీ వినకపోతే అతని రాజ్యంలో అంతర్గత కలహాలను సృష్టించి విష ప్రయోగాలను జరిపించాలి. సైనికులు, సేనానాయకులు మొదలైన వాళ్లని విభజించాలి. ప్రజల్ని భయపెట్టాలి. ఇంకా కొంత మంది ముఖ్యమైన వాళ్లని చంపించాలి. ఇలాంటి పనులకు గూఢాచారులను, వేశ్యలను ఉపయోగించాలి. రాజుపై తిరుగుబాటు చేయడానికి మంత్రులను ప్రోత్సహించాలి ఇంకా వివిధ పద్ధతుల ద్వారా ఆ రాజును లొంగదీయాలి. దీన్నే మంత్ర యుద్ధం అంటారు. గజపతిని గెలవడానికి మంత్రి తిమ్మరుసు భేదోపాయాన్ని ప్రయోగించి రాయలకు విజయాన్ని చేకూర్చాడు. (కృ.వి. 3-100 -112)

<u>అసుర యుద్ధం</u> .- స్వార్థం, లోభం మొదలైనవి ఈ యుద్ధానికి ప్రధాన కారణాలుగా ఉంటాయి. ఇంద్రజాల విద్యలు, వశీకరణ క్రియలు ఈ యుద్ధంలో ప్రయోగించబడ్డాయి. రాక్షసుల యుద్ధాలన్ని ఇలాంటివే కాబట్టి దీన్ని అసుర యుద్ధం అంటారు.

ఇంద్రజిత్తు చేసిన మాయా యుద్ధం (భాస్క.యుద్ధ. 547-555) అసుర యుద్ధంగా చెప్పవచ్చును.

"కని మాయా విద్యా బల
మున నీరంధ్రముగా మేఘములు నీహారం
బున నొనరిచి మునుు గవిసిన
పెను జీకటి దళము నేపి భీకరలీలన్'' (భాస్క.యుద్ధ. -547)

యుద్ధాలు మూడు విధాలు (స.నీ.స. 3-035)అవి,

1) సంకుల సమరం :- ఇది ఏనుగు, కోట, చతురంగబలాల యుద్ధాల నివిభజించారు. కేవలం ఏనుగు బలంతో చొచ్చుకొనిపోయి యుద్ధం చేయడం ఏనుగు యుద్ధం. దుర్గంపై విడపి యుద్ధం చేయడం కోట యుద్ధం. బయలు ప్రదేశంలో రథ, గజ, తురగ పదాతులు అనే చతురంగ బలాలతో యుద్ధం చేయడం చతురంగ సమరం అని అంటారు.

2) ద్వంద్వైకాకి యుద్ధం :- ఇది రాజులు చేసేదికాదు. మత్సరగ్రస్తులైన వీర భటులు చేసే యుద్ధం.

3) భేద యుద్ధం :- సామదాన భేద దండోపాయాలను ప్రయోగించి చేసే యుద్ధాన్ని భేద యుద్ధం అని అంటారు.

మల్ల యుద్ధం :- ఇద్దరు వ్యక్తులు పరస్పర చేసే యుద్ధాన్ని ద్వంద్వ యుద్ధం, మల్ల యుద్ధం, అంక యుద్ధం, ఎక్కటికయ్యం అని అంటారు ఈ యుద్ధాల్ని ఆయుధాలు ఉపయోగించి, ఆయుధాలు లేకుండా చేసేవాళ్ళు, ఆయుధ రహితంగా జరిగే ఎక్కటి కయ్యాన్ని మల్ల యుద్ధం అంటారు. సమానుల మధ్య ఆయుధాలతో జరిగే యుద్ధాన్ని అంక యుద్ధం అంటారు.

అనవసర రక్తపాతాన్ని అరికట్టడానికి ఇలాంటి యుద్ధాలు సమ ఉజ్జీలైన వీరుల మధ్య జరిగేవి. అంక యుద్ధం చేయదలచిన యోధులను ప్రతి శనివారం రాజు తన సముఖానికి రప్పించి, వాళ్ల పంతాలు విన్న అనంతరం, అప్రతిజ్ఞలను లిఖింప చేసి, వారికి బహుమానాలు ఇచ్చి పంపేవాడు. మరుసటి దినం ఆదివారం అంక యుద్ధం జరిగేది.

"మాయన్న బిచ్చదన్న మహిత శూరుండు
నువ్వుల పొడిని గానుగనాడు భంగి
చీరలో పోసియు చేర్చి పిండంగ" (ప్ర.వీ.చ. పుట -101)

నూనె కారిందట! ఇదీ ఆనాటి మల్లుల శక్తి. ఇలాంటి మల్లుల యుద్ధాల్ని గురించి విస్తృతంగా పేర్కొనబడింది.

రావణుడు సుగ్రీవుడు (భాస్క.యుద్ధ. -477-483) నలకూబరులు (కళా. 3-278) కళాపూర్ణుడు-కేరళ రాజు (కళా. 8-100 నుంచి 107) ఇక్ష్వాకుడు-రాక్షసుడు (కకుత్స్థ 2-137) కృష్ణుడు-బాణాసురుడు, బలరాముడు-ముష్టికుడు (ఆం.వి.పు. 7-403), కిరాతుడు, అర్జునుడు (శ్రీకాళ. 4-191, హర. 7-35) చేసిన మల్లయుద్ధాలు వీరావేశాన్ని కలిగించేవి.

ఏకాంగ వీరుడు, కలహ కంటకుడు తమ పంతాల్ని రాజుతో చెప్పే సమయంలో వాళ్ళు వేసే అంక యుద్ధాన్ని గురించి ఇలా చెప్పారు.

"పుల్లతి వెట్టిన భూమికి గొసరిన
నెదిరి పోటునకు జేయొదగు చున్న
దండకై దప్పిన దప్పు గ్రేళ్లరికిన
బంతంబు గొన్న జౌబళము గొన్న
దాణికి జొచ్చిన దాచిన మాచిన
నరువ నొడ్డిన బయలాన పడిన
జాగ బొడువకున్న లాగంబునకు గొన్న.
మడమ గెంటిన వ్రేళ్ళు మగుడఁబడిన

దాలు మాఱులైన దలవంచి పొడిచిన
బారుగా దలంచు పంతమిది యె,
బొడుచు వాడ దేవరడుగు లాన" (సిం ద్వా. 7-60)

అవి ఏకాంగ వీరుడు అంటే,

"మతిగాక దృష్టినే మఱక రక్షించుచు
సూకర దృష్టియై ఢాక గొలిపి
గర్జన సేయక మార్జాల దృష్టియై
దర లక పరిజించి తాకబూని
భల్లూక దృష్టిన పొంగ సంగతి గని
కపిదృష్టి వంచించి కాపుసూపి
చేష్ట దప్పక గృధ్ర దృష్టి గనుంగొని
యొయ్యన ఫణదృష్టి నొడియ జూచి

మనసు దేఱ జూచియును జూడకున్నట్లు
దృఢముగాగ జోరదృష్టి నడిగి
జంకి మీద నొడిసి శార్దూల దృష్టి బై
బడుట స్ఫురియ కాండ్ర పంత మిఠియ" (సిం.ద్వా. 7-62)

"తొమ్మిది దృష్టులలో నా
యిమ్మగు పులిదృష్టి జొచ్చి యెదురొమ్ము కరా
రమ్మున నడితొలు పోటు గ
గ్రుమ్మెద నే నొండు లేక కుంభిని గూలన్" (సిం.ద్వా. 7-63)

అని కలహాకంటకుడు అంటాడు.

కృష్ణుడు, బాణారుడు మల్లయుద్ధం ఇలా చేశాడు.

"తిగుచుట త్రోచుట క్రుంగుట
నెగయుట యొదుగుట తొలంగి నిలుచుట సరిగా
నగధరుడును జాణారుడు
దగిలి తిరుగు విధములద్భుతములై యొప్పెన్''
(హరి.పూ.భా. 9-126)

శబ్దం వచ్చే విధంగా ఒకదానితో ఒకటి భుజాల్ని తాకిస్తూ, పిడికిళ్లతో గుద్దుకుంటూ అరచేతితో తొడలు చరుస్తూ, భయంకరంగా యుద్ధం చేస్తున్నారు.

తలఁగి మెడలంట బట్టుట తమక మొప్ప
దంత నఖర విదారణ దారుణముగ
గడక గల్గుట దొడగాళ్లు అడఛి త్రోచు
టిరువు రందును నుగ్రమై యెసగె జూడ"
(హరి.పూ.భా. 9-129)

కిరాతుడు, అర్జునుడు చేసిన మల్లయుద్ధం ఇలా వుంది.

"తాచుచు బొడుచుచు బడుచును
నేచుచు నడుకుచును బిట్టునెగయుచు గూలం
దోచుచు దూలుచు వెసగిరి
ప్రాచీపతి సుతుడు హరుడు బాహాబాహిన్" (హర 7-85)

యుద్ధ వ్యూహాలు :- నిర్మాణాత్మకమైన వ్యూహం లేకుండా ముఖాముఖి ద్వొమ్మికి దిగడం వల్ల జయాపజయాల మాట ఎలా వున్నా అధిక జననష్టం జరుగు

తుంది. భుక్తికోసం సామాన్య ప్రజలు సైన్యంలో చేరి వుంటారు, సరైన వ్యూహం పన్నకుండా రాజు వాళ్లందర్నీ యుద్ధంలో బలిచేయరాదు. ఇరుపక్షాలలో ఏ రాజు పారిపోయినా, లొంగిపోయినా, లేక చంపబడినా అతని సైన్యం జయించిన రాజు వశం అవుతుంది. అలాకాని పక్షంలో యుద్ధభూమి నుంచి చెల్లా చెదురుగా పారిపోవడం జరుగుతుంది.

వ్యూహ నిర్మాణం అనేది శత్రువుపై దాడిచేయడానికి, శత్రువుల దాడి నుంచి రక్షణ పొందడానికి అవసరమవుతుంది.

వ్యూహం అంటే విశిష్టమైన సైన్య రచనా పద్ధతి 'వ్యూహస్తు బలవిన్యాస.' అని అమరం "వ్యూహ్యతే రచ్యతే ఇతివ్యూహః" -రచించబడేది. బల విన్యాసం అంటే సేనను ఒడ్డడం. మరొక వ్యుత్పత్తి కూడా వుంది. "విశేషేణ ఊహ్యతే ఇతి వ్యూహః ఊహవితర్కే" అంటే విశేషంగా ఆలోచించబడేది. విశేష చింతన చేసిగాని నిపుణుడైన సేనా నాయకుడు చతురంగ బలాలను యథాస్థానంలో వుంచడు. దీర్ఘంగా లోతుగా ఆలోచించాలి. కాబట్టి దీన్ని విశేషమైన ఊహా ఫలితంగా చెప్పారు. ఈ వ్యూహరచనను పాశ్చాత్యులు "మిలిటరి టాక్టిక్స్" అంటారు ఆంగ్ల విజ్ఞాన సర్వస్వం ఇలా పేర్కొంది.

"Tactics of smaller units, or of a single combat arm, is called minor tactics. Tactics of large force is termed grand tactics. Tactical mobility is the ability to more rapidly from one part of a battle field to another....In any particular military operation the choice of tactics will be influenced by a number of factors. These include the commanders mission, the forces and weapons avoilable to him, the terrain over which he must operate, the enemy's strength and dispositions, and the wether." [16]

"సైన్యం పొదుపుగాను శక్తివంతంగాను ప్రయోగించడానికే వ్యూహాలు ఏర్పడ్డాయి" [17]

క్రౌంచ, గరుడ, మకర, కూర్మ, శకట సూచీ ముఖం, శ్యేన, శృంగాటక, అచల, వజ్ర, మండలార్థ, సర్వతో భద్ర మొదలైన వ్యూహాలు అనాడు ఆచరణలో వుండేవి. వ్యూహాల పేర్ల గురించి మాత్రం భారతీయ సాహిత్యం పేర్కొంది. వాటి స్వరూప స్వభావాల్ని వివరించలేదు అయితే నయాం దేశంలోని కొన్ని అముద్రిత గ్రంథాల ఆధారంగా పాశ్చాత్య యుద్ధ శాస్త్రవేత్తలు పన్నెండు

ప్రాచీన భారత యుద్ధ వ్యూహాలను చిత్రించారు. వాటిని డాక్టరు క్వారిట్జ్ వేల్సు "ఏన్షియెంట్ సౌత్ ఈస్ట్ ఏషియన్ వార్‌ఫేర్" అనే పుస్తక రూపంలో ప్రకటించాడు. వాటిలో కొన్ని వ్యూహాలను ఆరుద్ర గారు పేర్కొన్నారు.[18]

సైన్యం ప్రయాణించే దారిలో నదులు, పర్వతాలు, అడవులు, దుర్గాలు, ఇతర స్థలాలలో ఆపదలు కలిగితే సేనాపతి వ్యూహ రచన చేసి తన సేనను నడిపించాలి. ఆపద ముందు భాగంలో ఏర్పడితే గొప్పదైన మకర వ్యూహాన్ని పన్ని ఎదుర్కోవాలి. రెండువైపుల నుంచి విషమ స్థితి ఏర్పడితే శ్యేన వ్యూహాన్ని ఏర్పరచి ఎదుర్కోవాలి. వెనుక భాగంలో ప్రమాదం ఏర్పడితే శకట వ్యూహం, పార్శ్వం నుంచి ప్రమాదం ఎదురైతే సర్వతోభద్రం (octagonal), లేదా చక్రం (wheel), లేదా వ్యాళం (snake) గాని మోహరించి ఎదుర్కోవాలి అని శుక్రనీతి చెబుతోంది.[18]

ఇదే విషయం ఇంకా ఇలా వుంది.

"మకర వ్యూహం బొందెను
వికటాస్యం బైన యట్టి వీరానన సూ
చికయైన బన్ని చనునది
ప్రకటిత శౌర్యమున నెదుర భయ మొదవునెడన్"

"వెనుక భయమైన శకటము
దనరగ బార్శ్వముల నైనదగ వజ్రముగా
మొన వేసి నడచునది యెం
దును భీతి దనర్ప సర్వతో భద్రమగున్"

(స.నీ.స. 3-857, 858)

పై విషయాన్ని ఇలా పట్టిక ద్వారా చెప్పవచ్చు.

| | ఆపదలు | వ్యూహాలు |
|---|---|---|
| 1) | ముందు భాగం నుంచి | మకర (Crocdile) |
| | | గరుడు (Bird) |
| | | సూచి (Needle) |
| 2) | వెనుక నుంచి | శకట (Cart) |
| 3) | పార్శ్వం నుంచి | వజ్ర (Thunder) |
| 4) | అన్ని దిక్కుల నుంచి | సర్వతోభద్ర (Octogonal) |
| | | చక్ర (Wheel) |
| | | వ్యాళ (Snake) |

ప్రత్యేక గుణాల్ని కలిగి విశిష్టమైన వాటిని దృష్టిలో వుంచుకొని వ్యూహాల్ని నిర్మించారు. పద్మవ్యూహం అంటే పద్మం ఆకారంలో సేనను నిలబెట్టడమని, గరుడ వ్యూహం అంటే గరుడ పక్షి ఆకారంలో సేనను నిలబెట్టడమని చాలమంది అనుకోవడం వుంది. ఇది కొంత వరకు వాస్తవమే అయినప్పటికీ వాటిలో వుండే ప్రత్యేమైన 'కదలిక' వ్యూహ రచనకు తోడ్పడిందని చెప్పవచ్చు

గ్రద్దలో వుండె 'సూక్ష్మదృష్టి', వేగం. శత్రువుని (ఆహారాన్ని) చెంచువులతో పొడవడంలో వుండే 'నేర్పు' మొదలైన ప్రత్యేక గుణాల్ని దృష్టిలో వుంచుకొని గ్రద్ధ వ్యూహం రచించి వుండవచ్చు. కన్నులు, రెక్కలు, కాళ్లు, చెంచువు ఈ వ్యూహంలో వుండే విశిష్టమైన అంశాలు. గజ, తురగ, రథ, పదాతిదళాల్ని ఆయా స్థానాల్లో వుంచే వాళ్లని వూహించవచ్చు.

మొగ్గగా వున్న పద్మం వికసించు కోవడం సహజమే కీటకాలు మకరందం కోసం అందులో వాలుతుంటాయి. అలాంటి సమయంలో వికసించిన పద్మం ముడుచుకుంటే ఆ కీటకాలు అందులో బందీలవుతాయి.

> "ఒక భృంగంబు పరాశినీ మదన తంత్రోన్మాది ప్రాణేశ్వరిన్
> మకరందాసవ మత్తనబ్జ గృహసీమం బెట్టి తాబోయి పం
> చకడన్వచ్చి తదానమమ్ముకుళమే జాడం జొరన్రాక యా
> మికుడో వాదిరిగెం; గొలంతు రమకున్మే లెంత హీనంబొ కో"
> (పా.ప. 2 33)

అని వికసించిన పద్మం ముడుచుకోవడం కవి సమయంగా చెప్పడం వుంది. ఇలాంటి ఆలోచనే పద్మవ్యూహ నిర్మాణానికి ఆధారమని చెప్పవచ్చు. ఇలాగే మిగతా వ్యూహాలు కూడా వాటి పేర్లనుబట్టి, వాటిలో వుండే గుణాల్ని బట్టి రచించబడి వుంటాయి.

అనుసాళ్వుడు గృధ్ర వ్యూహాన్ని (3-89), హంస ధ్వజుడు పద్మవ్యూహాన్ని (5-4), ప్రవీరుడు విశిఖ వ్యూహాన్ని (4 18) పన్ని యుద్ధం చేయడాన్ని జైమిని భారతం పేర్కొంది. రామాయణంలో యుద్ధ వ్యూహాలు చాలా కనబడతాయి. ఇవన్నీ శత్రువును జయించడానికి ఇరుపక్షాల వాళ్లు వేసిన ఎత్తుగడలనొ చెప్పవచ్చు

శత్రు సేనల్ని అంచనా వేయడం వ్యూహంలో ఒక భాగం. రాముని తరపున హనుమంతుడు, సుగ్రీవుడు అంగదుడు, విభీషణుడు, రావణుని తరపున శుక

సారణులు, శార్దూలాది వారులు ఈ కార్యానికి నియమించబడ్డారు. (భాస్క.యుద్ధ. -15 నుంచి 19, 311, 371, 441-446).

రాముడు గరుడ వ్యూహంలో తన సైన్యాన్ని అమర్చుకొని రణక్రీడకు సిద్ధమైనాడట! (భాస్క.యుద్ధ -375) కోట రక్షణకు రావణుడు, కోట ముట్టడికి రాముడు తమ సేనల్ని నియమించి వ్యూహం పన్నడం ఇలా వుంది.

| | రావణ వ్యూహం (కోట రక్షణ) | | రాముని వ్యూహం (కోట ముట్టడి) |
|---|---|---|---|
| తూర్పు గవని | ప్రహస్తుడు | — | నీలుడు |
| దక్షిణ గవని | మహపార్శ్వుడు | — | అంగదుడు |
| పశ్చిమ గవని | ఇంద్రజిత్తు | — | హనుమంతుడు |
| ఉత్తరపు గవని | శుకసారణులు, రావణుడు | — | అనుజుడు రాముడు |
| కోట చుట్టు | — | — | జాంబవంతుడు విభీషణుడు గొప్పదొరలు, సకల సైన్యం |
| కోట మధ్యలో | విరూపాక్షుడు | — | — |

ఇదీ రావణ వ్యూహం, దానికి రాముని ప్రతివ్యూహం (భాస్క.యుద్ధ. -449)

ఇంద్రజిత్తు యుద్ధ భూమిలో రాముని ఎదురుగా మాయ సీతను చంపి, మానసికంగా రాముని దెబ్బతీయడానికి ప్రయత్నించడం మొదలైన ఎత్తులన్నీ యుద్ధ వ్యూహాలుగా చెప్పవచ్చు. దాదాపు ప్రతివ్యూహం శత్రువును దెబ్బతీయడానికో, రక్షణ పొందడానికో పన్నడం జరిగేది.

## చతుర్విధోపాయాలు

రాజు శత్రు రాజులతో చాలా తెలివిగా ప్రవర్తించాలి. గోటితోపోయే దానికి గొడ్డలి ఉపయోగించరాదు ఏదో ఒక ఉపాయంతో కార్యం సాధించబడేట ప్పుడు వినాశహేతువైన సమరాన్ని కోరుకోవడం మూర్ఖత్వం. శతకోటి అపాయా లకు అనంతకోటి ఉపాయాలుంటాయి. శత్రువు అంటూనే యుద్ధం చేయాలనే ఆలోచన వదలి వేయాలి. యుద్ధేతర మార్గాల ద్వారా శత్రువును వశపరచుకోవ

నానికి ప్రయత్నించాలి. శత్రు రాజుతో ప్రవర్తించాల్సిన విధానాన్ని "ఉపాయా లంటారు" సామ, దాన, భేద, దండాలని ఇవి నాలుగు విధాలు. "మిత్రుల విషయములోను, శత్రువుల విషయములోను, ఉపాయములను కలిపి ప్రయోగించవలెను. ఏలయన ఉపాయములు పరస్పర సాధనకములు "[20]

"ఆపదలగురుత్వ లఘుత్వముల బట్టి ఉపాయములను నియోగముగగాని, "వైకల్పికంగాగాని, సముచ్చయంగా గాని ఉపయోగించవలెను. ఈ ఉపాయము చేతనే గాని మరి యొక ఉపాయము చేతగాదు," ఇది నియోగము. ఈ ఉపాయము చేతగాని, మరియొక ఉపాయము చేతగాని "ఇది వైకల్పికము" దీని చేతను, ఇతరముల చేతను 'ఇది సముచ్చయము'.[21]

"గోరబోవు పనికి గొడ్డలియును దాన
సలుపు పనికి గోరుబలె నృపాల
గురు లఘు వ్యవస్థ యరయని చతురుపా
య ప్రయోగ కరణమనుచితంబు!" (కళా, 7-264)

రామునితో యుద్ధం తగదని మండోదరి రావణునికి చెబుతూ,

"సమరము నందు శత్రువులె చత్తురనంజనదాత్మ హానియున్
సమకొను గెల్పు సందియము నన్నుతికెక్కిన సామ భేద దా
నములవి యుండగా మొదల నాలవ వెంట సమస్త బంధునా
శమునకు నోర్చి రాజులిటు సాహస వృత్తి దొడంగు టొప్పునే?"
(భాస్క.యుద్ధ. -776)

అని సామదాన భేదాలకు దండోపాయానికి వుండే తారతమ్యాన్ని గురించి వివరించింది. ఈ ఉపాయాలలో దేనిదేని ఎవరెవరిపట్ల ప్రయోగించాలో చెప్పబడింది.

"తన సదృశుడైన సాయం
బును, నల్పుండైన దండమును, మత్తుండై
నను భేద, మధికుడైనను
బనివడి దానమ్ము సేయబరగు ధరిత్రిన్" (భాన.పం.తం. 3-12)

ఈ విషయాన్ని మార్పుచేర్పులతో ఇంకా కొన్ని కావ్యాలు పేర్కొన్నాయి. (కళా. 7-265, రుక్మా.చ. 3-40)

"మును కొని దేశకాల బలముందగు దైవబలంబు గల్గగా
మొనసి విశేషమూల బలమున్నిజ బహు బలంబు నచ్చి పై

జని రిపులన్ జయింతురని, శత్రులు కిన్నియు గల్గి యున్నబో
జెనయక సామదానముల జేసి జయింతురు నీతి విత్తముల్"
(కుమా. 10-189)

శత్రువు బలవంతుడైతే సామ దాన ప్రయోగంతో జయించాలన్నది సారాంశం.

సామోపాయం :- చతుర్విధోపాయాలలో సామోపాయం ఉత్తమమైంది. సామోపాయం అంటే మంచి మాటలతో శత్రువును లోబరచుకోవడం. ఇవి అయిదు విధాలు 1) పరస్పరోపకారాన్ని ప్రదర్శించడం 2) మంచి చేయడం 3) గుణాల్ని కొనియాడడం 4) చుట్టరికాన్ని గుర్తుచేయడం 5) నేను నీవాడినే అని మంచి మాటలు చెప్పడం. బలవంతుడైన శత్రువుపైన ఈ ఉపాయం ప్రయోగించబడేది. సామంతో పని చక్కబడితే ఆస్తి నష్టం, ప్రాణనష్టం ఉండదు. కాబట్టి ఈ ఉపాయం శ్రేష్ఠమైంది.

"సామము నందు గార్యము నిజంబుగ బూని కొనంగ బోలు నా
సామ విధాన దండము బ్రశస్తి యొనర్తురు నీతికోవిదుల్
సామము నందె కాదె సుర సంఘము ద్రచ్చె మహాసముద్రమున్
సామ విరోధులై చెడరె సంగర భూమిని ధార్త రాష్ట్రులున్"
(స.నీ.స. 2-575)

పై పై నమృతము చిలికెడు
రూపున జిత్తముల నలరు రూపున జవులం
దాపోవకాను విధమున
తపుగ గనుగొనుచు బలుకు తెఱ గొప్పలరున్" (స.నీ.స. 2-573)

అని సామోపాయాన్ని ఇలా సాధించాలి

"పుత్రుడు, సోదరుడు, బంధువువల్ల సంభవించే ఆపదులను సామ, దానాల ద్వారా ఎదుర్కోవడం తగింది.[22]

దానం :- సామంతో కాని పనిని దానంతో నెరవేర్చుకోవాలి. ధనవంతులు. బలవంతులైన రాజులు చిన్నచిన్న రాజులకు ధన, సైన్య సహాయాలు చేయడం ద్వారా వాళ్లను తమ అదుపులో ఉంచుకుంటారు. వాళ్లను మిత్రులుగా ప్రకటిస్తారు.

"జయం గోరునృపతి శత్రుమద్ధత వాంఛ
దివిరి దానమునన తీర్పవలయు
జలధి నీరు పేర్మి బడబానలము వాంఛ
పొసగ దీర్చి జయము పొందినట్లు" (స.నీ.స. 2-598)

శత్రువు తన కంటే అధికుడైతే అతనికి అన్ని విధాలైన ధనాన్ని ఇచ్చి ప్రాణాలు దక్కించుకోవాలి. "బతికుంటె బలుసాకు తిని బతక వచ్చు"

"తనదు శాత్ర వుండు తన కంటె ఘనుడైన
నఖిలమైన ధనము నతని కిచ్చి
తన్ను గాచికొనగ దగు నీతిపరుడు దా
గలిగెనేని ధనము గలదు గాన (న.నీ.స. 2-597)

"శరీర మాద్యం ఖలు ధర్మ సాధనం"

"పౌరుల నాయకులు, జానపదుల నాయకులు, దండ నాయకు-" వీళ్ల విషయంలో దానోపాయాన్ని ఉపయోగించాలి.[23]

ఇదే విషయం ఇంకా ఇలా ఉంది.

"పౌరులను జానపదులను
సారము గల దండనాదు జనులను నృపుడిం
పారగ సాధింపగ నగు
బారు క్రిన్ సామదాన సంస్కారములన్" (న.నీ.స. 2-602)

శత్రువును తన గుప్పిట్లో పెట్టుకోవడానికి రాజు తన రాజ్యంలో సగ భాగాన్ని ధారపోయడానికైన వెనుకాడ రాదు.

అహితుడు వేడిన నేలెడు
మహిసగమేనిచ్చి, తెగని మైత్రి గొని. విభుం
డహి భయము మాన్పికోదగు
నహిభయ మహిభయము కంటె నధికముగాదే" (అను 4-249)

అని చెబుతుంది.

<u>భేదోపాయము</u> బలవంతుడైన శత్రువును జయించడానికి భేదోపాయం ప్రయోగించాలి. మిత్ర రాజుల కూటమిని, భేదోపాయం ద్వారా విచ్ఛిన్నము చేయవచ్చు. రాజు-మంత్రులు సామంతులు-ఇతర అధికారులు - మిత్రరాజులు-మొదలైన వాళ్ల మధ్య భేదాలను సృష్టించడం ద్వారా శత్రురాజును జయించవచ్చు. వాళ్లలోవాళ్లకి భేదాభిప్రాయాలు కలుగజేయాలి. ఇలా చేయడానికి గూఢచారులు బాగాఉపయోగపడతారు. అందరికీ తెలిసే విధంగా రాజు తన అధికారులను ఏదో ఒక నెపంతో

పదవీ భ్రష్టుల్ని చేసి వాళ్ళను తన శత్రు రాజ్యంలోకి పంపి శత్రురాజుతో స్నేహం చేసుకొవడానికి వీలు కల్పించాలి. వాళ్లు అక్కడి పరిస్థితులను బట్టి రాజు అధికారుల మధ్య భేదోపాయాన్ని ప్రయోగించి ఆ శత్రు రాజును నిర్వీర్యము చేయాలి.

"సామ దానముల ప్రశాంతి బొందని శత్రు
నందు వలయు భేద మొంద జేయ
భేదమునన యెట్టి పృదుసత్త్వుడైనను
బొల్లయై నశించి పోవు గాన" (స నీ.స.2-614)

సామ, దానం తరువాతనే భేదాన్ని ప్రయోగించాలి.

"మంత్ర్య మాత్య పురోహిత మండలికిని
దివిరి యువరాజునకు నైన తేట పడగ
బేద మొనరింప వలయునభేద్య వృత్తి
నట్టిదగునేని మఱియ సాధ్యంబు గలదె"(స.నీ.స. 2-604)

ఇది భేదోపాయ ప్రయోజనం.

"సామంతులు, ఆటవికులు-వీళ్ళ విషయంలో భేద దండోపాయాలు ఉపయోగించడం తగినది.[24]

రాయలు గజపతిని జయించడానికి మంత్రి తిమ్మరుసు ప్రయోగించిన భేదోపాయం ప్రముఖపాత్ర వహించినట్లు తెలుస్తోంది. రాయలు గజపతి పై దండెత్తి వచ్చాడు. పదహారు మంది రాజులతో మైత్రి కలిగివున్న అతన్ని జయించటం రాయలకు కష్టం. ఆ విషయాన్ని మంత్రితో చెప్పాడు. అంతేకాదు,

"దలప నిమువంటి మంత్రి యిద్ధాత్రి గలడె
చూడు యందుల కొక యుక్తి సూక్ష్మ మతిని" (కృ.వి. 3-100)

అని ప్రార్థించాడు. తిమ్మరసు ఆలోచించాడు.

"ఘనతర భేదోపాయం
బునకుందగినట్టియుక్తి బుట్టించిరయం
బొనరగ రాయల పేరిటి
దినసరు లాక్షత్రియులకుదేటపడంగన్"(కృ.వి 3-104)

రాయించాడు. రాయలు ధరించే ఆభరణాలు, ఇతర సంపదలు పెట్టెలలో ఉం:

భటులతో పంపాడు. వారు వంచనతో దుర్గంలోపలకు వెళ్ళడానికి ప్రయత్నించగా కోటకావలివారు ఆ భటులను బంధించి రాజు దగ్గరికి తెచ్చారు. రాజు ఆ పెట్టెల లోని లేఖలను ఆభరణాలను చూశాడు. ఆ కాగితాలలో ఉన్న దస్తూరిని చూచి చదివాడు. ఆ లేఖలో ఇలా వుంది.

"శ్రీమతు కర్ణాట సింహాసనాధ్యక్షు
 డగు కృష్ణరాయ ధరాధినాధు
డలపదారుగురు పాత్రులకు సంప్రీతి బం
 పిన సులేఖంబులు మిమ్ము మునుపు
గజపతి రాష్ట్రదుర్గ విశేషముల నుండి
 మెలపుగా పలికిన పలుకుబడుల
తీరు వ్రాసితిరి మీకోరి నట్లనే ఘనా
 భరణతుకూలముల్ బంపి నార

మట్లనే రేపు జగడానికడుగు దెంచి
నట్లు జనుదెంచి మాజేతి కతని మీరు
పట్టి యిచ్చిన యపుడె మీపట్లమేము
కొదువపడకుండ నడిపింపు కొనెదమెప్పుడు" (కృ వి. 3-108)

అని ఉంది. గజపతి తానునమ్మిన వారే మోసం జేశారు. ఎవర్ని నమ్మరాదంటూ కృష్ణరాయలకు భయపడి కోట వదలి దూరంగా పారిపోయాడు. ఆ విషయం తెలిసిన రాయలు దొరలేని రాజ్యాన్ని ఆక్రమించాడు. తన కీర్తి ప్రకాశించే విధంగా ఒక జయస్తంభం ఉంచాడు.

ఇలా రాయలు గజపతిని ఓడించడానికి తిమ్మరుసు పన్నిన భేదోపాయం కారణమైంది.

దండోపాయం :-

"సామబేధ దాన సంప్రయోగముగడు
విఫలమైన యెడ వివేకి యగుచు
దండ మార్గ మెఱిగి దండ్యుల దండింప
వలయునెపుడు భూమి వల్లభుండు." (స.సీ.స. 2-624)
"దండనీతి లేక తక్కిన విద్యలు
గలిగెనేని లేనిగతిన పొందు

రాజు దండనీతిరతుడైన దక్కిన
విద్యలెల్ల నతవి వెదకి పొందు" (స.నీ.స. 2-630)

దండనీతి ఎంత విలువైందో చెప్పక చెబుతున్నాయి ఈ వాక్యాలు.

"పెనుబొందగా సామ భేద దానముల
గొనరాని కార్యంబు గొనకొనెనేని
మఱి గదా దండంబు మాయల బెనచి
నెఱపుట మున్నె దుర్నీతి యేమిటికి" (రం రా. పుట.251)

రామునితో యుద్ధము తగదని విభీషణుడు రావణునితో అంటాడు. సామ దానభేదోపాయాలు ఫలించలేదు కాబట్టి రావణునిపై దండోపాయం ప్రయోగించి విజయం సాధించమని అంగదుడు రామునికి చెప్పాడు. (రం.రా.పుట. -303)

చతుర్విధోపాయాలే కాక, మాయోపాయం, ఉపేక్షోపాయాలు కూడా శత్రువును లోబరచు కోవడానికి రాజుకు ఉపయోగపడేవి

## మాయోపాయం

మారువేషాలు ధరించి శత్రువును నమ్మించి వధించడం మాయోపాయంగా చెప్పవచ్చు.

"మఱిదేవతా ప్రతిమాస్తంభసుషిరసం
పిహితుల చేత జపించుటయును
స్త్రీవేషధారియై చేరి చంపుటయును
రాత్రిమై ఘోరదర్శనము సేత
ఉగ్రబేతాళ మహోల్కాపిశాచశి
వారూప దారుణ వర్తనంబు
ఇవ్విధములనునేకవిచిత్ర సం
పాదనము మనుజ మాయమయ్యె.

కామరూపధరత్వంబుగడగి శస్త్ర
వహ్ని పాషాణ శరజల వర్షణంబు
తగదయోమేఘశైల సందర్శనంబు
మార్తురలుక నమానుషమాయమయ్యె." (స.నీ.స. 2-632)

సింహబలుడైన కీచకుని స్త్రీ రూపంలో వెళ్ళి భీముడు వధించడాన్ని మాయోపాయ ముగా చెప్పవచ్చు.

ఉపేక్షోపాయం :-శత్రురాజుపట్ల ఉపయోగించాల్సిన ఉపాయాలలో ఉపేక్షకూడ ఒకటి. ఇద్దరు బలవంతులు యుద్ధానికి దిగినపుడు బలహీనుడైన రాజు ఎవరి పక్షాన చేరకుండా ఉండటాన్ని ఉపేక్షోపాయం అంటారు.

"వ్యసనమునన్యాయంబును
మసలక యుద్ధమున జేయమాన్పమియదిదా
బొసగు ద్వివిధ స్వరూపత
వెసగునుపాయముల యందుపేక్ష యనంగన్" (స.నీ.స 2-635)

భీముడు కీచకుని వధించినపుడు విరాటుడు ఉపేక్షోపాయాన్ని అవలంబించి నట్లు పేర్కొనవచ్చు.

బలరాముడు కౌరవపాండవ సమరంలో ఎవరి పక్షాన చేరకుండా తీర్థయాత్ర కు వెళుతూ,

"వారు వీరునాకు బాంధవమున నొక్క రూపయె
వ్వారి గూడ నొల్లబంధు వర్గముల్బలంబున
న్నోర జాడజాల దీర్థములకు బోయెద..." (మా.పు. 1-130)

అవడంలో బలరాముడు ఉపేక్షోపాయాన్ని అవలంబించాడని చెప్పవచ్చు.

ఉపాయాలు నాలుగు కాకుండా ఉపాయాలు ఏడున్నట్లు తెలుస్తోంది.

"అయుత యతి నుత సప్తో
పాయంబులు నెఱుగ వలయు బతి సామము భే
దాయతి దానము దండము
మాయోపేక్షేంద్రజాల మార్గములోలిన్" (క.మా.10-182)

సామదాన భేద, దండోపాయాలతో పాటు మాయ, ఉపేక్ష, ఇంద్రజాలాలనుకూడ రాజు శత్రువు పై ప్రయోగించవచ్చు.

ఇలాంటి ఉపాయాలు నిష్ప్రయోజనాలైతే సంధి విగ్రహాదులైన షాడ్గుణ్యాలను ప్రయోగించాలి. హిరణ్యకశిపుడు రాజ్యం చేస్తూ, దేవేంద్రునికి కొరకరాని కొయ్య అయ్యాడు. ఇంద్రాది దేవతలతో బృహస్పతి చతుర్విధోపాయాముల ప్రయోగం గురించి ఆలోచించాడు. ఖలుడు అసహాయ సాహసుడు, అజేయుడు, ఘనుడు దుర్గ ముడైన హిరణ్యకశిపుని ముందు చతుర్విధోపాయాలు, సంధి విగ్రహాదులైన షాడ్గు ణ్యాలు, అప్రయోజనాలని బృహస్పతి నిర్ణయం. (నృ. పు 2-136)

## యుద్ధ వర్ణనలు

ప్రాచీనాంధ్ర కావ్యాలలో పేర్కొనబడిన యుద్ధాలు వీరరసంతో పరసము నోజ్ఞంగావున్నాయి. యుద్ధ దారుణ రూపాన్ని అక్షర రూపంలో చిత్రించడానికి కవులు నేర్పును ప్రదర్శించారు. యుద్ధ భీభత్సానికి చారుత కల్పించి, పఠిత మనస్సుకి హాయిని చేకూర్చడానికి ఎన్నో ఉపమానాలు ప్రయోగించారు.

ఆనాటి యుద్ధాలలో రథ, గజ, తురగ పదాతి దళాలు అనే చతురంగబలాలు పాల్గొనేవి.

"శరపరంపరలచే సైన్యంబు గ్రమ్మంగ
రథముల పఱపించు రథికవరులు
దధికులపై గుంజరములు దీకొల్పి గ
ర్వమున దాకెడు గజవాహకులును
గజవాహకులమీద గంఖాణముల దోలి
తత్తుల నఱకు రాహుత్తగములు
రాహుత్తులను బరాక్రమ లీల శోభిల్ల
జేరి యీటెల గ్రుమ్ము వీరభటులు
నగచు బోరాడె రోషంబుఁ తిశయిల్ల
నుభయ చతురంగ బలములు మక్కుమిగిలి...." (అని.చరి.5-11)

ఇదీ మనముందు కదులాడుతున్న ఆనాటి చతురంగ బలాల యుద్ధదృశ్యం.

కొమ్మరాజు చేసిన యుద్ధం ఇలావుంది.

"....చయ్యన కుంతంబు జళిపించి యార్చి
ఘోటకపటు వీరకోటుల బొడిచి
కాల్బలంబుల విదిమి గజములదునిమి
మోట పలకల్ద్రుంచి మొనలు ఖండించి
నలుగురినేగురి నలినలి చేసి" నట్లు పేర్కొనడమే కాదు ఇంకా

ఇలా తనప్రతాపాన్ని చూపాడు.

"... మావటీలను గొట్టి మన్నీల నరికి
రాజుల పడగొట్టి రణవీధిద్రోచి
ఘన వీరవరులను ఖండించి వారి
కుతికెలు వెసద్రుంచి గుండెలు పెరికి

కడగిమొనలను బాపకట్టుగా గూల్చ
అపుడు రక్తంబేరులై పారుచుండె
గజకళేబరములు కలనిమధ్యమున
తెప్పలైనెత్తుట తేలాడు చుండె," నట (ప.వీ చ, పుట 516)

అనాటి యుద్ధాల దారుణ దృశ్యం ఇది. ఇలాంటి ఘట్టాలు ప్రాచీనాంధ్ర కావ్యాల్లో కోకొల్లలు.

"చదిసెందేడులు, పాటెవారణము లశ్వమ్ముల్ధరం గూలె, గం
జెదరెన్ సైన్యము, వాలెబాహువులు, తెగ్సైన్ మాంసముల్ రాలెనం
గదముల్, తీలెగిరీటముల్, ప్పలచ్ఛేణి కయ్యాపుంజొ
క్కుదనర్చన్ భుజదర్పమొప్పఁ బిరువాగుంజేరి పోరాడగన్"
(కువ.చ, 2-147)

ఇలా యుద్ధ తీవ్రతను అవేశంతో పేర్కొనడం కనబడుతుంది.

కోటపై దాడి :- రాజ్యరక్షణకు కోట గుండెవంటిది కోటల్ని అక్రమించడంతో యుద్ధానికి ముగింపు పలికేవాళ్ళు. అందువల్ల కోటల్ని నాశనం చేయడానికి వాటిపై దాడిచేసే వాళ్లు, ఇలాంటి దాడుల్ని గురించి పూర్తి సమాచారం లభిస్తోంది.

"ప్రాకారములు ద్రవ్వి, పరిఖలుపూడిచి
కోటకొమ్మలు నేలగూలద్రోచి
వప్రంబుల గలించి, వాకిళ్ల వెకలించి
తలుపులు విఱిచి, యంత్రములు నెఱచి
ఘనవిటంకంబులు ఖండించి పడవైచి
గోపురంబులునేల గూలదర్చి
మకరతోరణములు మహిమ గూల్చి, కేతనం
బులుపించి, సోపానములు గదల్చి
గృహములెల్ల ద్రవ్వి గృహరాజముల గ్రొచ్చి
భర్మకుంభచయము పాఱవైచి
కరులు కొలనుసొచ్చి కలచినకైవడి
గపులు లంకజొచ్చి కలచిరపుడు."(భాగ.9-290)

కోటలపై ఇలాంటి దాడుల్ని గురించి అనిరుద్ధ చరిత్రం (4-40), 'ఉత్తర హరివంశం (3-34.35) పేర్కొన్నాయి.

రణగొణధ్వనులు :–

"పొడు పొడుడన్మాట పొకుడన్మాట
విడు విడుడన్మాట వ్రేయుడన్మాట
పలముడింపక పంపుపంపు పన్మాట
తొలగక తలద్రుంచు ద్రుంచుడన్మాట
యుంచు రాలేదేడి యేడి యన్మాట
యిందు రావిమ్ము రానిమ్మను మాట (రం.రా.యుద్ధ పుట-311)

ఇలాంటి భీకర ధ్వనుల మధ్య వీరులు తమ పక్షం వాళ్లని, వైరిపక్షం వాళ్లని గుర్తు పట్టడానికి కేకలు వేస్తుంటారు.

"పోకు పోక నచు, ఒక్కడ నేనుండ దెరుగవా, ఏనుండ నెక్కడకీవు పోవంగ" (ప వీ.చ పుట 156) "కోపంబు మించగా 'కో' యని...." అరవడం, (పుట. 349) రణగొణ ధ్వనులుగా చెప్పవచ్చు.

"రాకు రాకు మనెడి రట్టడితనములు
పోకు పోకు మనెడి పొగరువగలు
పొడవు పొడవు మనెడి బెడిదంపు బీరముల్
విడువు విడువు మనెడి వీక లెసగ" (విజ వి. 3-150)

ఇలాంటి శబ్దాలు ఆనాటి యుద్ధ భూముల్లో మారుమోగేవి.

యుద్ధానంతరం – యుద్ధభూమి :–

సూర్యాస్తమయంతో యుద్ధం ఆగుతుంది. ఇరుపక్షాల సైనికులు తమతమ డేరాలలోకి చేరుకుంటారు. తమ వాళ్లు ఎంతమంది చనిపోయారో, మరెంత మంది క్షతగాత్రులైనారో, ఎంత ప్రాణ నష్టం జరిగిందో తెలుసుకోవడానికి, ఇరు పక్షాల అగ్రనాయకులు యుద్ధ భూమికి రాత్రివేళ వచ్చేవాళ్లు.

హనుమంతుడు, విభీషణుడు ఇలాగే వచ్చారు.

"....తమలో నెవ్వరు సచ్చిరో నొచ్చిన వారెవ్వరో విచారింపదగుదని మహాంధకారంబు వడుమ నింగలపు గొంచవులు పట్టుకొని రణరంగంబు గలయ శోధింపుచు వచ్చి శరతల్పంబున మున్న జాంబవంతుని .... చూశారట (మొ.రా.యుద్ధ. 1-60).

రాముని చేతిలో రావణుడు మరణించాడు. మండోదరి మొదలైన రావణుని భార్యలు శోకంతో రంగభూమి మధ్యలోకి వచ్చారు. అక్కడ దృశ్యం బీభత్సంగా వుంది, విరిగిన రథాలు, పగిలిన కపాల కుంభాలు, తెగిన చేతులు, ముక్కలై పడి

వున్న దేహాలు, మంచి ఏనుగు దంతాలు, చెదిరిన తలలు, పగిలిపోయిన గదలు, కవచాలు, తెగిపడివున్న గుండెలు, తలలు, తునిగిపోయిన కత్తులు, నాశనమైన శస్త్రాలు. ముక్కలైన ప్రేవులు, విడిచిన ఏనుగులు గుర్రాలు, చిన్న చిన్న కొండల శిలల కింద అడ్డదిడ్డంగా గుడ్లు బయటికి పెట్టి పడిపోయిన భటులు, ఆ శవాల్ని చుట్టు ముట్టిన కాకులు, గద్దలు, రాబందులు ఆ యుద్ధ భూమిలో కనబడతాయి. (రం.రా.పుట-469) భీభత్సంగా వుండే ఇలాంటి యుద్ధ క్షేత్రాలు భాస్కర రామాయణం (యుద్ధ. 2220), విక్రమార్క చరిత్రం (4-97), కువలయాశ్వ చరిత్రం (2-148) మొదలైన కావ్యాలలో సాక్షాత్కరిస్తాయి.

ప్రతి జాతి యుద్ధం చేయకూడదనీ దానివల్ల చాలా నష్టాలు వున్నాయనీ అనుకుంటూనే వుంటుంది కాని తప్పని పరిస్థితులలో ప్రపంచంలోని ప్రతిప్రాణి యుద్ధ రంగానికి నడచి తీరవలసిన దుస్థితిలోనే వుంది. ఇలాంటి స్థితిలో తాటస్థ్యం అనేది అసంభవం.

యుద్ధ - లక్ష్యం :- ప్రతి యుద్ధానికి ఒక లక్ష్యం వుంటుంది. రాజకీయాది కారణాల వల్ల యుద్ధాలు జరుగుతుంటాయి ఈ యుద్ధ లక్ష్యాలేమిటో ముందుగానే నిర్ణయించు కుంటారు.

శత్రువును అశక్తునిగా చేయడం, ఆయుధ రహితునిగా, సహకార విహీనునిగా చేయడం, అతని కీర్తిని కలిగించే ప్రతి దానిని నాశనం చేయడం, అతనిని వధించడం, అతని రాజ్యాన్ని ఆక్రమించడం, సంపదలు కొల్లగొట్టడం యుద్ధం వల్ల ప్రయోజనాలు. యుద్ధం వల్ల కలిగే దుష్ఫలితాలిలా వుంటాయి

"పోరు మంచిది గాదు భూమి నెక్కడను
పాడౌను దేశంబు పగమించెనేని
ప్రజలెల్ల వశియించి పారిపోవుదురు
బండారమునకు పైకంబు లేమి
రాణువ యంతయు రహిచెడి యుండు
వేజీతగాండ్రెల్ల చెలగి కోపించి
ఈయ గల జీతంబు లిమ్మందురపుడు
పతిబంటు మేరలు పరిహార్యమగును
పంపిన పనిజేయ పాలుమాలుదురు
పగవారి వార్తలు పరికింపలేరు
తెలిసిన శాత్రవుల్ ధీరతవచ్చి
భూమెల్ల గొనుటకు బుద్ధిపెట్టుదురు...." (ప వీ చ, పుట 323)

అంతేకాదు కీర్తి ప్రతిష్టలు దెబ్బతింటాయి కాబట్టి యుద్ధం చేయడం మం చిదికాదు. యుద్ధ సమయాల్లోనూ, యుద్ధానంతరం ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం

బ్రహ్మనాయుడు గురజాలపై దండెత్తి రాగా అక్కడి ప్రజల భయాందోళన లెంత హృదయ విదారకంగా వున్నాయో గమనించవచ్చు

"ఇండ్ల లోపలి సొమ్ము లెడలించి తెచ్చి
పదిలంబు కాదని భావింప లేక
పెంటబూడిదలోన పెట్టెడు వారు" (ప.వీ.చ, పుట - 173)

"పెట్టిన తావున పెకలించి ధనము
బలువుగా మూటలు బంధించికట్టి
నూతులలోపల నూకెడు వారు" (ప.వీ.చ పుట – 173)

"హయముల చయ్యన నశ్వులు విడిచి
కుక్కలం కట్టిన గొలుసుల విడిచి
ఇండ్ల లోపల సరుకులెల్ల వెళ్ళించి" (ప.వీ.చ. పుట. 174)

"ఆడువారల నెల్ల నతి వేగనంపి
ఇండ్లు వదలి పోవుటెట్లకో మనము
ఓ దైవమా" యని యుండెడివారు" ( ,, ,, )

"ఈ పసి బాలురనీ యాడు వారి
నిటవించి పోవంగనెట్లు కాళ్ళాడు" ( ,, ,, )

అని బాధ పడేవాళ్ళు దైవాన్ని నిందించేవాళ్లు. భయంతో మెదడు మొద్దుబారగా నిర్లిప్తంగా ఉండేవాళ్ళు, ఇంకా ఎన్నో విధాల ప్రజలు మానసికమైన ఇబ్బందులకు గురి అయ్యారు. (ప వీ చ. పుట 174) యుద్ధానంతరం కోశాగారాన్ని నింప డానికి పాలకులు ప్రజలపై అధికంగా పన్నులు విధించి కట్టకపోతే హింసించడం జరిగింది. ప్రజాసౌకర్యాలు అనేవి వట్టి బూటకపు మాటలే. నిరంతరం రణభూమి లో నిద్రించే పాలకులు ప్రజలగురించి, ప్రజాజీవన సరళిని గురించి ఆలోచించ డానికి అవకాశమే లేదు. రాజ పదవి ఎందుకుందో అనే ఆలోచనకు తావులేదు.

రణముకుడుపు :- ఈవీరాచారం భయంకరమైంది. జుగుప్సను కలిగించేది. ఇలాంటి ఆచారాలు మన రాజరికవ్యవస్థలో చోటు చేసుకోవడం దురదృష్టకరం.

రణము కుడపడం అంటే "శత్రువులు నిహతులైన చోట వారి రక్తముతో

కలిపిన అన్నము వారి తలపును కలలో పెట్టుకొని యొడలికి భస్మమలదికొని నొంటిగా దిగంబరులై భూతబలి మంత్రములు చదువుచు డాకిన్యాదులకు బలి పెట్టుట "[25]

శత్రువును వధించినా కక్ష తీరక పోవడంతో వీరావేశులైన రాజులుఇలాంటి ఆహారాన్ని పాటించారని చెప్పవచ్చు. మల్ల ఎల్లరాజు తన శత్రువైన కొండ్రాజు తిరుమల రాజును యుద్ధంలో చంపాడు, అక్కడికీ కక్ష తీరక ఆరాత్రి రణము కుడిపించాడు, ఈ వీరాహారాన్ని మల్ల అనంతరాజు ఇలా వర్ణించాడు.

"ఫాల దృగగ్ని దృగ్జ్వలన భాపరి భావిభుజాసిదర్శనో
న్మీలిత సాధ్యసప్తగితవిష్టురలోచన వైరి వీర భూ
పాలక ఫాల రక్తరసపానపలాశన తుష్ట బాత భే
తాళ పరీత భైరవపత్రదణ మార్గ నటద్భట వ్రజా (కాకుత్స్థ3-166)
అని పేర్కొన్నాడు.

రణబలి:- యుద్ధంలో విజయం కలగడానికి, యుద్ధభూమిలోని దుష్ట శక్తులను తృప్తిపరచడానికి మనిషిని బలిఇవ్వడాన్ని రణబలి అని చెప్పవచ్చు.

"ఏమి విచారించి యిటు వచ్చినారో
బవరం బొనర్చిన పట్టిబంధించి
రణబలిపెట్టించు రణ భూమికెల్ల." (ప.వీ.చ, పుట-326)
అని రణ బలి గురించి శ్రీనాధుడు పేర్కొన్నాడు.

బొమ్మవెట్టడం :- యుద్ధంలో శత్రురాజులను జయిస్తే వాళ్ళ బిరుదాలను విజయుడైన రాజు గ్రహిస్తాడు, వాళ్ళ బొమ్మల్ని వేయించి తనకాలి అందెకు పొదిగించు కుంటాడు. దీన్నే 'బొమ్మవెట్టడం', 'బొమ్మకట్టడం' అంటారు. ఇది ప్రాచీన వీర సాంప్రదాయం.

"....అకాలి గండ పెండారంబు దాపున
బొమ్మలైవైరి భూభుజులు వ్రేల...." (కాశీ. 1-45)

ఇట్టి అచ్చు:- యుద్ధంలో గెలిచిన రాజు ఓడిన రాజుపై తమ ముద్ర అచ్చొత్తించడం.

తారకుడు యుద్ధంలో పారి పోతున్న చంద్రుని పిరికి వాళ్లందరికి పరాకాష్ఠగా నిరూపించడానికి జీడితో జింక ముద్రను కొమ్ముపై ఒత్తి విడిచాడు.

"పోరదన కోడి పాయునీహారరోచి
బట్టుకొని పోయి దానవప్రభుడు పిఱికి
వారికెల్లను రోగులవాని గాగ
సురముపై జీడినిట్టి యన్నొత్తి విడిచె" (కుమా. 4-16)

యుద్ధవీరునికి స్వాగతం :- యుద్ధంలో శత్రువును వధించి విజయుడై తిరిగివచ్చే వీరునికి పురప్రజలు ఘనస్వాగతాన్ని పలికేవారు. వృషకేతుని, కపికేతుని వధించి విజయుడై వస్తున్న బభ్రువాహనునికి పురప్రజలు ఇలా స్వాగతం పలికారు.

"కొలదిగా బన్నీరు చిలికించి కప్పురం
బున గృహాంగణముల ముగ్గుదీర్చి
సమకట్టు బీనాంబరములతో వెరయ జి
త్రములుగా మకరతోరణము లెత్తి
యెడనెడ వారమృగేక్షణానృత్య యో
గ్యములైన వివిధ యంత్రములమర్చి
సాంబ్రాణి ధూప వాసన గదంబించు వీ
దుల మంగళ ద్రవ్యములు ఘటించి
భూరి జయ వాద్య ఘోషముల్ బోరుకలగ
బౌరజనులెదుర్కొనెడు సంభ్రమము......." (జై.భార.7-49)

జరాసంధుని జయించి పురప్రవేశం చేస్తున్న బలరామకృష్ణులను చూడాలని

"... .... .... యున్నత సౌధములెక్కి వారిపై
బల్లవపుష్ప లాజములు పౌరపురంధ్రులు సల్లి రెల్లెడన్."
(భాగ. 10 పూ.భా-1579)

విదేశాంగనీతి

ప్రాచీన కాలంలో హిందూదేశం చిన్న చిన్న స్వతంత్ర రాజ్యాలుగా వుండేది. ప్రతి రాజ్యం శత్రురాజ్యాల బారినుంచి రక్షించుకునేందుకు బలమైన సైన్యాన్ని పోషించేది. అర్థికాభివృద్ధిని సాధించడానికి దండయాత్రలు, పొరుగురాజ్యాలపై దురాక్రమణలు జరిపేది. శత్రురాజులను జయించడానికి చతుర్విధోపాయాల్ని, వివిధ పద్ధతులను, వ్యూహాల్ని అవలంబించే, వాళ్లు దీనివల్ల మిత్రులు శత్రువులు ఏర్పడతారు. వీటన్నిటినీ సక్రమంగా చూడడానికి మంత్రులు,గూఢచారులు మొదలైన ఉద్యోగులు అవసరమయ్యేవాళ్లు. తన రాజ్యం సుఖంగా వుండాలంటే పరిస్థితులన్ని బట్టిరాజు మిత్ర, శత్రురాజులతో సత్సంబంధాల్ని ఏర్పరచుకోవాలి. ఏరాజు శాశ్వత మిత్రుడుగాని, శత్రువుగాని కాదు. తనరాజ్య ప్రయోజనాల్ని ఆశించి

మిత్రత్వం శత్రుత్వం పాటించాలి ఇది విదేశాంగనీతిలో ప్రధానాంశం.

**మండల సిద్ధాంతం :**

మండల సిద్ధాంతానికి ఆధారం షాడ్గుణ్యానికి మూలాధారమైన రాజమండలం ప్రకృతి సంపదలు, శమవ్యాయామికం అనేవి ఈ సిద్ధాంతంలో చర్చించబడ్డాయి.

రాజ్యం సప్తాంగ నిర్మితమని ప్రాచీన రాజనీతి చెబుతోంది. ఈ సప్తాంగాల స్వరూప స్వభావాలను కౌటిల్యుడు వివరించాడు.

శమం అంటే శాంతి. ఇతర రాజులతో శాంతి సంబంధాలనుకలిగివుండడం వ్యాయామం అంటే పని రాయబార కార్యకలాపాలు, యుద్ధాలు మొదలైనవి వ్యాయమంలో చేరతాయి

"భౌగోళిక కారణాల చేత, పరస్పర ప్రయోజనాలదృష్ట్యాఏర్పడ్డమిత్ర దేశాలకు, మిగిలిన రాజ్యాలు సృష్టించిన శత్రు కూటాలకు మధ్య అధికార సమతౌల్యతను [Balance of Power] సాధించడమే మండల సిద్ధాంత లక్ష్యం [26]

"శత్రువుకు శత్రువు మిత్రుడు" అనేనీతిని పాటించడం, శత్రు రాజుయొక్క మిత్రుల మధ్య విభేధాలు సృష్టించి, వాళ్ళ మనసు మార్చడం ఈ మండల సిద్ధాంతంలో ముఖ్యాంశాలు.

శత్రు రాజుకు శత్రువులైన వాళ్లని ఒక కూటమిగా చేసి, శత్రురాజ్యంపై దండెత్తడం, పొరుగు రాజులే చక్రవర్తికి బలమైన శత్రువులుగా మారడం,ఈమండల సిద్ధాంతం ప్రకారం జరిగేవి.

శత్రురాజులతో యుద్ధాలు చేసినా, సంధి చేసుకున్నా అప్రభావం ఇతర రాజ్యాలపై కూడ వుంటుంది. విజిగీషువైన రాజు ఇరుగు పొరుగు రాజ్యాలతో ప్రవర్తించే విధానాన్ని ఈ రాజమండలం పరిశీలిస్తుంది. కాబట్టి ఈ మండల సిద్ధాంతం విదేశాంగ నీతిలో ప్రముఖ పాత్ర వహిస్తుంది

రాజమండలానికి కేంద్ర బిందువు విజిగీషువు. ఇతని చుట్టు పన్నెండు మంది రాజులు వుంటారు కౌటిల్యుడు దీన్ని గురించి కూలంకషంగా చర్చించాడు. ఈ మండలం లోని రాజుల గురించి వివరించాడు [27]

| | | |
|---|---|---|
| 1. విజిగీషువు | : | జయేచ్ఛ కలిగిన రాజు |
| 2. అరి | ; | విజిగీషుని శత్రువు |
| 3. మిత్రుడు | ; | అరిసమీప రాజ్యంలోని వాడు విజిగీషుని మిత్రుడు. |
| 4 అరిమిత్రుడు | . | మిత్రరాజ్యానికి దగ్గరివాడు విజిగీషుని శత్రువు. |
| 5 మిత్రమిత్రుడు | . | అరి మిత్రుని రాజ్యానికి దగ్గర వాడు విజిగీషువు మిత్రునికి మిత్రుడు |
| 6. అరిమిత్ర మిత్రుడు | : | మిత్ర మిత్రుని రాజ్యానికి సమీపంలోని వాడు. అరి మిత్రుని శత్రువు. |

7. పార్ష్ణిగ్రాహుడు : విజిగీషువుకి వెనక నుండే శత్రువు.
8. ఆక్రందుడు : పార్ష్ణిగ్రాహునికి వెనకనుండే శత్రువు పార్ష్ణిగ్రాహునికి శత్రువు
9. పార్ష్ణిగ్రాహసారుడు , ఆక్రందుని వెనక నుండే రాజు పార్ష్ణిగ్రాహసారునికి మిత్రుడు.
10, ఆక్రందాసారుడు . పార్ష్ణిగ్రాహునికి వెనుక నుండే రాజు ఆక్రందుని మిత్రుడు
11, మధ్యముడు : విజిగీషువుకి దగ్గరి రాజు. ఎవరికి మిత్రుడు కాని శత్రువు కాని కాదు.
12, ఉదాసీనుడు ; అందరికి దూరంగా తటస్థంగా వుండేవాడు.

"ప్రకృతి మండలమునకు ఏకాంతరులగు రాజులను నేమిగను, అనంతరులగు రాజులను ఆకులుగను, నేతయగు (విజిగీషువు) తన్ను నాభిగను చేసుకొని నలు దిక్కుల వ్యాపించవలెను." [28] అంటాడు కౌటిల్యుడు.

విష్ణుద్వేషులైన రాజులు జరా సంధునితో జత కట్టారు'

"– – – – పౌండ్ర కళింగ దంత వక్త్ర శిశుపాల సాల్వ రుక్మి యవన వేణుధారి సౌవీర గాంధార త్రిగర్త భగవత్తులను మఱియు వంగవంగ సుహ్మవిదేహ కాశ కరూశ దశార్ణమత్స్య పాండ్య దేశాధీశులు – – – – " (హరి. ఉ. భా.2-9) జరాసంధునితో మైత్రి చేశారు,

కృష్ణునితో పరాభవింప బడిన జరాసంధుడు.
"దీనికి దగ మీరును మీ
సేనా సముదయముతో విశృంఖల లీలం
బూని నడచి పగతుపురం
బైన మదుర పొదలి వైరమడపగవలయున్" (హరి.ఉ.భా.2-7)

అని వాళ్ళను రెచ్చగొట్టి కృష్ణుని మీదికి దండ యాత్రకు తీసుకుపోవడం మండల సిద్ధాంతానికి దృష్టాంతం.

విదేశ వ్యవహారాలలో అరి మిత్రులు అనే వాళ్ళు, ప్రముఖపాత్ర వహిస్తారు రాజకీయాలలో శత్రుత్వం, మిత్రత్వం అనేవి శాశ్వత వ్యవహారాలు కావు. కాబట్టి రాజుమిత్రులతో కూడా జాగ్రత్తగా ఉండాలి.

<u>షాడ్గుణ్యం</u> :- విదేశాంగనీతికి "షాడ్గుణ్యం" ప్రధానమైంది.

"చనవెలిగి నడపవలయును
వినయోచితవృత్తి సంధి విగ్రహయానా

సన సంశ్రయణ ద్వైధము
లను షాడ్గుణ్యంబు పతి నిజామాత్యులతోన్ (కు.మా. 10-183)
సంధి, విగ్రహం, ఆసనం, యానం, సంశ్రయం, ద్వైదీభావం అనే ఆరుగుణాల్ని షాడ్గుణ్యం అంటారు.

1. సంధి :– షరతులతో ఒప్పందం చేసుకోవడం. శత్రువు కంటె బలహీనుడైతే సంధి చేసుకోవాలి తనకు సమానుడైన రాజు దగ్గరికి గూఢచారులను పంపించి ఆ రాజును గురించి తెలుసుకోవాలి. అతనితో స్నేహం చేసకోవడానికి లేఖలు పంపి, అతడు పంపిన లేఖలు చదవాలి. రాయబారుల చేత కానుకలు పంపాలి అతడు పంపిన కానుకలు స్వీకరించి, అనుభవిస్తూ, సంతోషంతో వియ్యం కలపడం, ఒకరితో మరొకరు స్నేహం చేయడం వల్ల సంధి ఏర్పడతుంది. (స నీ స 3-646)
2 విగ్రహం :– అపకారం లేక విరోధం. శత్రువు కంటె అధికుడైనపుడు విగ్రహాన్ని పాటించాలి.

"పరభూమి రాజు దుర్బలుడైన తఱిచిన
మన్నించు వారికి జెన్ను మిగుల
బసులు దెచ్చియు గడిపల్లెలు పొడిచియు
జిచ్చులు వైచియు జేలు గొనియు
దెరవాటు లడిచియు దెక్కలి దాకియు
నూళ్లు గాల్చియుప్పైరి నొలిచి కొనియు
బందులు పట్టియు దొంగడి చేసియు
గన్నగాండ్రను బంచి కలిమి గొనియు
కొలుచు చేలను త్రోటలు కొల్ల గొనుచు
బ్రతుకుడని తాను చతురంగ బలము తోడ
బగఱపైజని దేశంబు పాడుచేసి
వెఱపు పుట్టించు చునికియు విగ్రహంబు" (స.నీ.స. 3-647)

3. ఆసనం :– ఆసనం అంటే ఉపేక్షించడం. "నాపై పడుటకు శత్రువునకు శక్తి లేదు. శత్రువుపై పడుటకు నాకు శక్తి లేదు" అనితోచినప్పుడు, ఆసనం పాటించాలంటాడు కౌటిల్యుడు [29]

"బలువగు దుర్గంబు పాటించుకొని యాప్త
వరుల చూపుల బరుసంబు చూచి
మతిమంతులనదగు మంత్రి వర్గము బంచి
యధికులతో నెయ్యమలర గూడి

తనయంత వానిని దళవాయిగా జేసి
చతురంగ బలముతో నతని గూర్చి
పగవారి భూములపై దండు పంపుచు
భవ్య వస్తువులు గప్పములు గొనుచు
నాత్మరక్ష మేరయవ న్యాయవర్తుల
దనకు నెగ్గుసేయ దలచువారి
మదమడంచి యెందు గదలక యుండుట
యానసం బనంగ నతిశయిల్లు." (న.నీ.న 3-649)

4. యానం :- యానం అంటే సైన్యంతో శత్రువు పైకివెళ్ళడం. "గుణాతిశయము కలిగినప్పుడు యానము" పాటించాలంటాడు కౌటిల్యుడు.[30] ఇది పంచవిధాలు.

1. పంధాయ యానం : శత్రువును వశపరచుకొని దుర్గాదులను గ్రహించాలని కదలిపోవడం.
2. ప్రసంగయానం : ఒకదిక్కుకనిపోయి, వీలుపడితే మరో దిక్కుకుకదలి పోవడం.
3. విగృహ్యయానం : శత్రువును సంహరించాలని కదలి పోవడం,
4. సంభూయ యానం : శత్రువును ఒంటరిగా గెలవడానికి సాధ్యం కాకుంటె ఇతర రాజులను సమకూర్చుకొని కదలిపోవడం.
5. ఉపేక్షయానం : శత్రువును సంహరించాలనే ఆలోచనతో దేశకాలాదులను చూడకుండా కదలి పోవడం.

"యానముచేత శత్రుకార్యములను భంగపరుచుట సాధ్యము, (యానకాలములో) నాకార్యములను రక్షించుకొనుటకు కావలసిన చర్యలను తీసుకొన గలను అని అనుకొని నప్పుడు యానము ద్వారా వృద్ధిని సాధించవలెను అని అంటాడు కౌటిల్యుడు.[31]

5. సంశ్రయం :- ఇతరులకు వశం కావడం."నేను శత్రుకార్యములను భంగపరుప లేకున్నాను నాకార్యములకు కలిగిన భంగపాటును నివారించలేకున్నాను, అని అనుకొనినపుడు అతడు బలవంతు నాశ్రయించి తనకార్యములను చక్క బెట్టుకొని క్షయము నుండి స్థాపనమునకు స్థానము నుండి వృద్ధికిని చేరవలెను " అని కౌటిల్యుడు అంటాడు. [32]

"ఎల్లగుణంబుల నెక్కుడు నేర్పును
సాహసంబును లావుజలము గలుగు
పగరాజులిరువురు బలసమేతంబుగా
గడచి మైపెనెత్తి విడియుటయును

గలగక తొలగక కార్యంబు తోడవ
మదము బెరయ సేనకెదుర నడవి
(యొరు) భేదముగ జేయ నొయ్య నవ్వలి వాని
నొకరునిత్తో నెయ్య మొనరగూడి
యతడు దాను నున్న యతడు దన్నేమటి
యున్న చోట బొడిచి యుక్కడంచి
సొమ్ముల నడరియున్న జాలలు గొన్నటయు
సంశ్రయంబు (నాగ జగతి బరగు)" (స నీ స. 3-650)

6. <u>ద్వైధీభావం</u> :- ఒకవితో సంధి, మరొకనితో యుద్ధం "కార్యము సహాయ సాధ్యమైనపుడు ద్వైధీభావము అనుసరించాలంటాడు కౌటిల్యుడు.[33] ఈ షాడ్గుణ్యంలో యానం ముఖ్యమైంది. రాజు, అభిమత నయశాస్త్రస్థ ప్రభుమంత్రోత్సాహ శక్తిపరుడై"వుంటేనే యానం చేయాలి, శౌర్యం, పౌరుషం మొదలైనని రాజకు ఉండడం ఉత్సాహశక్తి కోశం, సేనలతో కూడి ఉండడం ప్రభుశక్తి మంత్రులు, దూతలు మొదలైన వాళ్ళ నుంచి లభించే శక్తి మంత్ర శక్తి అని అంటారు.

"సంధి విగ్రహముల వలన సమమగువృద్ధి కలుగ నున్నప్పుడు సంధి చేసుకొనవలెను. ఏలయన యుద్ధము మూలమున క్షయము, వ్యయము, దూర ప్రాంతములందు ప్రవాసము ఇతర ప్రయాసలు సంభవించును, దీనిని ఒటి ఆసనయానములలో ఆసనమే వరించదగినదని తెలుసుకొనవలెను " యుద్ధానికంటె సంధి చేసుకోవడం మంచిదని, కౌటిల్యుడు అభిప్రాయపడ్డాడు.[34]

<u>వాణిజ్యం :</u> విదేశాంగ వ్యవహారాలను పూర్తిస్థాయిలో ప్రభావితం చేసేవాటిలో వాణిజ్యం కూడా ముఖ్య భూమికను నిర్వహించింది. పధహారో శతాబ్దం నుంచి పంతొమ్మిదో శతాబ్దం వరకు పాశ్చాత్య వాణిజ్య సంస్థల ప్రభావం మన దేశంపై ఎంతటి ప్రభావాన్ని చూపిందో అందరికి తెలిసిన విషయమే.
మధ్యయుగంలో వర్తకులు విదేశాంగ వ్యవహారాలను ప్రభావితం చేశారని చెప్పడానికి ఆధారాలున్నాయి.

"సింధుర మహాశ్వముఖ్యముల్పేర్చు దొల
దీవి వణిజుల కూళ్ళు సద్గృహములు పురి
గొలుపు దేజంబు వెలమేలు గలుగ బ్రాత
వారిగా జేయు నరినవి చేరకుండు" (ఆము. 4-258)

ఏనుగులు, గుర్రాలు మొదలైనవాటిని తీసుకొని వచ్చే దూరద్వీపాంతర వర్తకులకు తగిన గ్రామాలు, మంచి నివాసాలు ఇచ్చి వాళ్ళని స్నేహితులుగా చేసుకోవడంవల్ల వాళ్లుతెచ్చే ఏనుగులు, గుర్రాలు శత్రువులకు చేరకుండా మేలు కలుగుతుందని రాయలు పేర్కొన్నాడు.

రాజు-బాంధవ్యాలు :

విదేశాంగనీతిని ప్రభావితం చేసేవాటిలో రాజరిక బంధుత్వాలుకూడా ప్రధానమైనవి. శత్రువు తనకంటె బలవంతుడైన పక్షంలో అతనితో బంధుత్వాన్ని కలుపుకోవడం ప్రయోజనాన్ని చేకూరుస్తుంది

రాయలు గజపతి కుమార్తెను వివాహం చేసుకోవడం విదేశాంగనీతిలో ఒక భాగమే.

"....   .... రాయల బంధుత్వంబును
నీ యుక్తిం గలిగె గాదె నీతివిచారా"   (కృ.వి. 4-20)

అని గజపతితో అనడం ఈ సందర్భంగా గమనించదగింది.

కృష్ణుని చేతిలో కంసుడు మరణించాడన్నవార్త విని అతని మామ జరాసంధుడు[21] అక్షౌహిణుల సైన్యంతో మధురపై దండెత్తి రావడం బంధుప్రీతికాక మరేమికాదు.

ఇలా బంధుత్వాలు విదేశాంగ నీతిని నిర్ణయించడానికి కీలకమైన పాత్రవహిస్తాయి.

విదేశాంగనీతి - దూతపాత్ర :-

విదేశవ్యవహారాలను సక్రమంగా చూడడానికి దూతలను నియమించేవాళ్లు. వీళ్ళనే రాయబారులని అంటారు. ప్రాచీన భారతదేశంలోని రాజ్యాల్లో రాయబారులను తాత్కాలికంగా మాత్రమే నియమించేవారు. వీరుశాశ్వత ఉద్యోగులుకారు. ఈనాటి రాయబారుల లాగా విదేశాలలో శాశ్వతంగా(పదవీకాలం ముగిసేవరకు) తిష్టవేసే వాళ్ళుకారు. రెండు రాజ్యాల మధ్య ఒక నిర్దిష్టమైన పనిని సాధించడానికి దూతలను తాత్కాలికంగా నియమించేవాళ్లు ఒకరాజునుంచి ఇంకోదేశపు రాజుకుఎలాంటి విషయాన్నైనా చేరవేయడానికి దూత అవసరం చాలవుంది. సందర్భాన్ని బట్టి దూతలను నియమించేవాళ్లు. స్వభావాన్ని బట్టి దూతలను మూడు విధాలుగావిభజించారు. నిసృష్టార్థుడు, మితార్థుడు, శాసనహారకుడు. వీళ్ళ లక్షణాలిలావుంటాయి

పతుల మాటకు బొందు పడమాట
గల్పించు నతడు నిసృష్టార్థుడనగజెల్లు
పతిచెప్పినంతయు జతురత బల్కునా
తడు మితార్థుండు నాదరణి బరగు
నటలేఖ గొని యేగినంతటనే యుండు
నాతండు శాసనహారకుండు
ఈ మువ్వురను దూత లిందులో సచివుని సా
మర్థ్యమున కంటె సరవి నొక్క

పాలు సర్గంబు ముప్పాలు పరగు గొఱత
యగుచు వర్తించు వారు వీరగుట జేసి
నీతి మార్గంబుచే వీరినెఱిగి యెఱిగి
వనుచుటెంతయు నొప్పు భూపతికి నెపుడు." (స నీ.స 2-348)

జాతి దేశాభ్యుదయం, సంధి, యుద్ధం మొదలైన అతిముఖ్య నిర్ణయాలను రాజులతో పునరాలోచించకుండా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే సర్వాధికారాన్ని కలిగివుండేరాజదూతలు ప్రధమశ్రేణి దూతలుగా పరిగణించబడేవాళ్లు ఇతనే నిసృష్టార్థుడు. కృష్ణుడు ఈ తరగతిలో చేరతాడు.

రాజు రాజ్యసంబంధికుల అనుమతితో పరరాజ్యాలతో వ్యవహారం చేయడానికి అధికారాన్నికలిగివుండే రాజదూతలు ద్వితీయశ్రేణికి చెందుతారు. ఇతనే మితార్థుడు. రాముని దూతఅయిన అంగదుడు ద్వితీయ శ్రేణికి ఉదాహరణం.

రాజ సందేశాన్ని యథాతథంగా పరరాజుకు చేరవేసే వాళ్ళు తృతీయ శ్రేణి దూతలు. ఇతనే శాసనహారకుడు. హంసడిభకుల దగ్గరికి వెళ్ళిన సాత్యకి ఈశ్రేణి వాడు. (ఉ. హరి)

ఈ త్రివిధాలైన దూతలను గురించి కౌటిల్యుడిలా వివరించాడు.

"అమాత్యుల కుండవలసిన అర్హతలుగల దూత సర్వాధికారము గలవాడు. (ఆ అర్హతలలో) నాల్గవ వంతులేని వాడు పరిమితాధికారముగల దూత. అర్థభాగములేనివాడు రాజాజ్ఞను అందించునాడు(అందుకు మాత్రమేఉపయోగించువాడు)[35]

"(తనప్రభువునకు) వార్తలను పంపుట, సంధిషరతులను పాలించుట (తన ప్రభువుయొక్క) ప్రతాపమును ప్రశంసించుట, మిత్రులను సంపాదించుట,కుట్రలు పన్నుట (శత్రువు యొక్క) మిత్రులలో భేదము కల్పించుట, గూఢచారులను సైనికులను (శత్రురాజ్యములో) ప్రవేశపెట్టుట, (శత్రువు యొక్క) బంధువులను, రత్నములను అపహరించుట, రహస్య సమాచారమును స్వీకరించుట, పరాక్రమ ప్రదర్శనము, హామీగా ఉంచబడిన వారిని తప్పించు కొనునట్లు చెయుట, రహస్యచర్యల ప్రయోగము ఇవి దూత చేయవలసిన పనులు," అని కౌటిల్యుడు అంటాడు.[36] ఈ మాటల్నిబట్టి దూతలు గూఢచారులుగా కూడా పనిచేసేవాళ్ళని తెలుస్తోంది.

శత్రువుల మధ్య సంధి చేకూర్చడంలో దూత పాత్ర కీలకమైంది, కాబట్టి ప్రత్యేకమైన లక్షణాలు కలిగివున్న వాళ్ళనే దూతలుగా నియమించాలి. రాజదూతకు వుండాల్సిన లక్షణాలివి :—

"నానాశాస్త్ర విచక్షణుండు నయనానందాంగుడున్ సత్కుల
స్థాన శ్రేష్ఠుడు నిస్పృహుండు పరిచిత్తజ్ఞుండు వాక్సిద్ధుడున్

శ్రీవిఖ్యాతుఁడును లోకమాన్యుఁడగు నిశ్చింతుండునై యుండినన్
వానిన్ మానుగ రాజదూతయని తల్పన్ వచ్చునుర్వీస్థలిన్."
(స,నీ.స. 2-339)

మేధస్సు. వాక్పటుత్వం, ప్రజ్ఞ ఇంగితక్రియాబోధం, ధైర్యం, రాజుపట్లభక్తి, శత్రువు ధర్మగుణాల్ని వెతకడాన్ని వృత్తిగాగల పరిశుద్ధచరిత్రునికి పచపక్షాదులనిచ్చి రాయబారిగా పంపాలట! (స.నీ.స. 2-34) రాయబారికి ఇంకా ఇలాంటి గుణాలుండాలి.

"పతిహితుగుల విప్రోత్తము
జతురు పదాపద్దు గార్య సంవేది బరేం
గిత విదుధైర్యాన్వితు ని
ర్గతమతియుత రాయబారిగా బంపనగున్. (కుమా. 10-123)

కళాపూర్ణుడు మాగధరాజుదగ్గరికి పంపిన రాయబారికి ఇలాంటి గుణాలున్నాయి
"అవరపాలు పాలికి షడంతర రాతి జయంబు కల్మియున్
మావగుణంబు నాప్తతయు మాటల నేరుపు ధైర్యముంబరా
స్థాన జనాను రంజన సుదక్షతయున్ వినయోద్ధతి స్థలా
నూన వివేకముంగల నయోన్నతునంపెను రాయబారిగాన్" (కళా.8-3)

దూతలను వధించరాదు :-

శత్రురాజుల దగ్గరకు వెళ్ళిన దూతలు ప్రియవచనాలతో పాటు అప్రియాలు కూడ పలకవలసి వుంటుంది. అప్రియ వచనాలకు మానధనులైన రాజులు దూతల పై కోపించవచ్చు. కోపం అధికమైతే వధించడానికి ప్రయత్నిస్తారు. ఇలా జరిగితే విదేశాంగనీతి పూర్తిగా విఫలమైనట్లే. అంటే దురదృష్టకరమైన వినాశనకరమైన యుద్ధం తప్పదన్నమాట. కాబట్టి దూతల్ని వధించడం తగదని మన ప్రాచీన రాజనీతి ఉద్ఘాటించింది.

"దూతపని బూని వచ్చిన
దూతలు తమనోరికేమి తోచిన నట్లా
నేతల నాడుదు రాడిన
దూతల జంపంగ దగదు దొరలకు నెందున్."
(మొ.రామ,సుం. -213)

హంసడిభకులు నియమించిన దూత జనార్దనుడు, వాళ్ల ఎదుటనే వాళ్ల శత్రువైన కృష్ణుని పొగిడితే వాళ్లు కోపించి ఇలా అంటారు.

"మాపట్టణమున నుండక
పో పో నిన్ను జంప రాదు పోత్తున వాడై
భూపాలకు సిరి గ్రమింగితి
పాపాత్మ ! చుట్టమైతి పగవారలకున్." (ఉ హరి. 4-131)

దూతను చంప కూడదు కాబట్టి పట్టణం నుంచి బహిష్కరించారు.

తారకుడు దేవదూతను కోపంతో చంపడానికి ప్రయత్నించాడు. శుక్రుడు అడ్డుపడి,

"గురులను మునులను సుకవుల
నరి దూతల బూతలగు వరాంగనల మహీ
సురులను మిత్రుల బాలుర
నిరతము సంపదగదెంతనేరక యున్నన్." (కుమా. 10-156)

అని దూతను చంపరాదని మంచిహిత బోధ చేశాడు.

రావణుడు హనుమంతునివధించమని ప్రహస్తుని పంపుతుంటే, విభీషణుడు ఇలాంటి హితబోధ చేసి, వారించే ప్రయత్నం చేశాడు. (రం.రా పుట 235). రెండవసారి రాముని దూతగావచ్చిన అంగదుని పై కూడా రావణుడు కోపించి తన భటులతో అతన్ని బంధింపించే ప్రయత్నం చేశాడు. (రం రా.పుట 303). ఇలా రెండుసార్లు రావణుడు దూతమర్యాదల్ని పక్కకు నెట్టాలని చూశాడు.

రాయబారుల ఎదురుగా వాళ్ల రాజును గురించి కఠినంగా మాట్లాడరాదు. ఎందుకంటే ఒకవేళ సంధి చేసుకోవలసి వుంటుందేమో. (ఆము. 4-267)

ప్రాచీన కావ్యాల్లోని రాయబారులు ఇతర ప్రయోజనాల్ని సాధించినప్పటికి అసలు విషయంలో అవి సఫలీకృతం కాకపోవడానికి కారణం రాజుల మూర్ఖత్వమే తప్ప రాయబారుల తప్పుకాదు.

భారతంలో కృష్ణుని రాయబారం దుర్యోధనునిమూర్ఖత్వంవల్ల, రామాయణంలో హనుమంతుని, అంగదుని రాయబారం రావణుని దురహంకారం వల్ల విఫలమైనాయి అయితే ఇవి ఇతరప్రయోజనాల్ని సాధించాయి ఈ రాయబారుల ప్రదాన ఉద్దేశ్యం తమ రాజుల ధర్మవర్తనులని లోకానికి తెలియచేసి కనీసం ప్రజల మానసికమైన మద్దతును పొందడం, శత్రువు పక్షంలో వున్న సైనికబలాన్ని, తమకు అనుకూలంగా వున్న వీరుల్ని గుర్తించడం.

రామాయణంలో హనుమంతుడు ఒకసారి, అంగదుడు ఇంకోసారి రావణుని దగ్గరికి దూతలుగా వెళ్లారు.

హనుమంతుడు రావణుని 'ఓరిరాక్షస వినరోరి నీ దాత్మ' అంటూ సంబోధిస్తూ సీతను రామునికి అప్పగించి శరణువేడమని అంటాడు. రావణుడు కోపించి హనుమంతుని బంధించి తోకకు బట్టలు చుట్టి నిప్పుపెట్టితే, అనిప్పుగా, లంకను కాల్చివచ్చాడు హనుమంతుడు.

సీతజాడ తెలుసుకోవడమే కాకుండా రావణుని బెదరగొట్టి రాముని దగ్గరికి చేరాడు హనుమంతుడు.

రావణుని దగ్గరకు అంగదుడు రెండవ సారి రాయబారిగా వచ్చాడు.

"ఎవ్వరి పని బూని యేగుదెంచితివి
వనచర చెప్పరా వచ్చిన కార్య" మని (ర.రా పుట. 298)

అంగదున్ని అదలించాడు రావణుడు.
దీనికి తగ్గట్టు అంగదుడు తాను వాలికొడుకునని, రామకార్యంపై దూతగావచ్చానని సమాదానమిచ్చి, రాముని పరాక్రమాన్ని వర్ణించాడు "వద్దురా రాక్షస వైదేహి నిమ్ము." రామునితోకయ్యానికి దిగవద్దని, సంధి చేసుకోమని హితబోధచేశాడు.

రావణుడు తన పరాక్రమాన్ని పొగడుకొని,

"పగవాడు దండెత్తి పైవచ్చినంత
మగటిమి చెడి సంధి ఎటి సేయువపుడె
జగతిరాజులు నన్ను సరకు సేయుదురె
తగనురా సంధి యిత్తు జి . ...." అనిఅనడం (రం.రా.పుట 300)

రావణుడి అహంకారాన్ని, మితిమీరిన ఆత్మవిశ్వాసాన్ని తెలియచేస్తోంది.
రావణునికి వున్న ఇలాంటి అహంకారమే అంగదరాయబారం విఫలంకావడానికి హేతువైంది.

అంగదుడు రావణుకు ప్రయోగించిన భేదో ప్రాయానికి లొంగకుండా దూత కార్యం నెరవేర్చాడు.

కార్యం ఫలవంతం కాకపోయినా రాముని శక్తిని రావణునికి తెలియచేసి రావణుని, అతని అనుచరులను భయపెట్టాడు.

ఇలాంటి రాయబారాలు చాల కావ్యాలలో వున్నాయి. (కుమా, ఉ. హరి, ప.వి.చ,).

కావ్యపరంగానే కాకుండా చారిత్రక దృష్టితో చూసినా విదేశరాయబారులవల్ల మనదేశానికి విదేశాలతో వున్న సంబంధాలు తెలుస్తున్నాయి.

మూడవ శతాబ్దంలో భారతచక్రవర్తి అయిన చంద్రగుప్తుని ఆస్థానానికి యవన ప్రభువు సెల్యూకస్ రాజదూత అయినమెగస్తనీసువచ్చాడు. రాజసభలలోపాల్గొని భారతదేశ సాంఘిక రాజకీయ పరిస్థితిని అధ్యయనం చేసి ఇండికా అనేగ్రంధాన్ని రచించి భరతజాతికి ఎంతో మేలు చేశాడు

అశోకచక్రవర్తి దేశవిదేశాలకు తన దూతల్ని పంపాడు. వీళ్ళంతాభారతీయ సంస్కృతిని అభివృద్ధి చేశారు.

భారతగ్రీసు దేశాల మధ్య రాయబారాలు, వ్యాపార సంబంధాలు బాగా అభివృద్ధి చెందినట్లు తెలుస్తోంది. చైనా నేపాల మొదలైనదేశాలతో భారతదేశానికి సత్సంబంధాలు వుండేవి. శ.517లో చైనాచక్రవర్తి "యుక" అనే ఆయన భారతదేశానికి "సంగయాన్" అనేదూతను పంపాడు. ఈదూత నిర్ణీతకాలం తరువాత భారతదేశం నుంచి 180 బౌద్ధగ్రంథాలను చైనాకు తీసుకువెళ్ళినట్లు తెలుస్తోంది.

చీనా రాజదూత వాంగ్-హ్యూ మూడుసార్లు భారతదేశాన్ని సందర్శించాడు ఇత్సింగ్, హ్యూయాన్ సాంగ్, ఫాయిమన్ మొదలైన వాళ్ళంతా భారతదేశానికి దూతలుగా వచ్చి, భారతదేశంతో వాళ్ళరాజ్యాలకు సత్సంబంధాలు ఏర్పరచడానికి కృషిచేశారు,

క్రీ. పూ. 3వ శతాబ్దంలో రోము చక్రవర్తి సీజర్ అగస్టస్ నలుగురుభారతీయ రాజదూతల్ని గౌరవించాడు. చాలమంది రోముచక్రవర్తులు భారత రాజదూతలను గౌరవించే వాళ్ళని తెలుస్తుంది.

చాళుక్య చక్రవర్తి పులకేశి, పర్షియా పాదుషా అయిన ఖుస్రో రాజదూతకు ఘనంగా స్వాగతం చెబుతున్న రమ్యదృశ్యం అజంతాగుహలలో కళారూపంలో చిత్రించబడింది.

విజయనగర రాజుల కాలంలో న్యూనిజ్, పెరిస్టా, అబ్దుల్ రజాక్ వంటి విదేశీయులు రాయబారులుగా భారతదేశానికి వచ్చారు. వీళ్ళ రచనలవల్లఆనాటి రాజకీయ సాంఘిక పరిస్థితులు తెలుస్తున్నాయి.

# అధస్సూచికలు

| | | | | |
|---|---|---|---|---|
| 1 | కౌటిల్యుని అర్థశాస్త్రము | - | పుట | 478 |
| 2 | ,, | - | పుట | 467 |
| 3 | ,, | - | పుట | 471 |
| 4 | ,, | - | పుట | 75 |
| 5 | ,, | - | పుట | 509 |
| 6 | సాహిత్య వివేచన | - | పుట | 108 |
| 7 | ,, | - | పుట | 109 |
| 8 | మహా భాగవతము | - | పుట | 1272 |
| 9 | ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి - II | - | పుట | 18 |
| 10 | ఆంధ్రుల సాంఘిక చరిత్ర | - | పుట | 187 |
| 11 | కౌటిల్యుని అర్థ శాస్త్రము | - | పుట | 569 |
| 12 | ఆంధ్రుల సాంఘిక చరిత్ర | - | పుట | 177 |
| 13 | కౌటిల్యుని అర్థశాస్త్రము | - | పుట | 518 |
| 14 | ,, | - | పుట | 512 |
| 15 | ,, | - | పుట | 512 |
| 16 | ఎన్‌సైక్లోపీడియా అమెరికానా భాగం-26 | - | పుట | 211 |
| 17 | కవిత్రయ భారతం - రాజనీతి | - | పుట | 221 |
| 18 | సమగ్ర ఆంధ్ర చరిత్ర భాగం - 2 | - | పుట | 47 |
| 19 | శుక్రనీతి | - | పుట | 242<br>243 |
| 20 | కౌటిల్యుని అర్థశాస్త్రము | - | పుట | 505 |
| 21 | ,, | - | పుట | 505 |
| 22 | ,, | - | పుట | 504 |
| 23 | ,, | - | పుట | 504 |
| 24 | ,, | - | పుట | 504 |
| 25 | విజ్ఞాన సర్వస్వము (3వ సం॥) | - | పుట | 305 |
| 26 | కవిత్రయ భారతం రాజనీతి | - | పుట | 253 |
| 27 | కౌటిల్యుని అర్థశాస్త్రము | - | పుట | 364 |
| 28 | ,, | - | పుట | 367 |
| 29 | ,, | - | పుట | 369 |
| 30 | ,, | - | పుట | 369 |
| 31 | ,, | - | పుట | 371 |
| 32 | ,, | - | పుట | 371 |

33 కౌటిల్యుని అర్థశాస్త్రము – పుట 369
34 ,, – పుట 378
35 ,, – పుట 43
36 ,, – పుట 45



# ఉపయుక్త గ్రంథాలు
## (BIBLIOGRAPHY)


| రచయిత | గ్రంథం | ముద్రించబడిన కాలం |
|---|---|---|
| అనంతరామశాస్త్రి, నేతి, | కవిత్రయ భారతం రాజనీతి | 1988 |
| అరుద్ర | సమగ్ర ఆంధ్ర సాహిత్య చరిత్ర | 1985 |
| కొండయ్య, జి సి | ఆంధ్రుల ప్రాచీన చరిత్ర | 1985 |
| కోటిరెడ్డి, ఎ. | ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర | 1986 |
| కోటేశ్వరరావు, తుమ్మపూడి | ఆముక్త మాల్యద సౌందర్యం | 1971 |
| గోపాలకృష్ణమూర్తి, నందుల | ఆంధ్ర మహాభారతం ఔపదేశిక ప్రతిపత్తి | 1982 |
| గోపాలకృష్ణారావు, కె. (సం) | 1) అధిక్షేప శతకములు | 1982 |
| | 2) ఆంధ్ర శతక సాహిత్య వికాసం | 1976 |
| గోపాల్ రెడ్డి, ముదిగంటి సుజాతారెడ్డి, | సంస్కృత సాహిత్య చరిత్ర | 1986 |
| గోపి, ఎన్ (వ్యా) | వేమన్నవారం | 1984 |
| చెంగారెడ్డి, డి. (డి.సి రెడ్డి) | శ్రీమదాంధ్ర మహాభారతం రాజనీతి | 1989 |
| నరసింహారెడ్డి, పి | ఎర్రనజన జీవన చిత్రణ | 1991 |
| నాగభూషణశర్మ గొల్లపల్లి | రాజనీతి | 1986 |
| నాగయ్య, జి | తెలుగు సాహిత్య సమీక్ష | 1984 |
| ప్రభాకరశాస్త్రి వేటూరి, | ప్రబంధ రత్నావళి | 1976 |
| బలరామమూర్తి ఏటుకూరి | మన చరిత్ర | 1983 |
| బాలగోపాల్, కె | ప్రాచీన భారతదేశ చరిత్ర (డి డి. కోశాంబి పరిచయం) | 1986 |
| బాలేందు శేఖరం, ఖండవల్లి | నాగరికత అంటే ఏమిటి? | 1967 |
| రాధకృష్ణశర్మ చల్లా | తిరక్కురళ్ [అనువాదం] | 1988 |
| రామచంద్రరావు, సి వి. | దక్షిణ భారతదేశ చరిత్ర | 1982 |
| రాయ్, ఎమ్.ఎన్ | రాజకీయాలు అధికారము, పార్టీలు | 1987 |
| లక్ష్మీనారాయణ, గంగిశెట్టి | భీష్ముడు చెప్పిన రాజనీతి కథలు | 1986 |
| వెంకటరంగయ్య, మామిడిపూడి | కౌటిల్యుని అర్థశాస్త్రం | 1968 |
| సత్యనారాయణ, కంభంపాటి | ఆంధ్రుల సంస్కృతి చరిత్ర 1వ భాగం | 1984 |
| | 2వ భాగం | 1982 |
| సత్యనారాయణరాజు, పెనుమత్స | సూక్తి సుధాకరము | 1963 |
| సాంకృత్యాయన్, రాహుల్ | ఋగ్వేద ఆర్యులు | 1987 |

| | | |
|---|---|---|
| సుబ్బారెడ్డి వద్దూరి, | సాహిత్య వివేచన | 1974 |
| సుభాష్ చంద్రరెడ్డి కె | రాజనీతితత్త్వ శాస్త్రము | 1984 |
| గీత డి. | | |
| సుశీల టి. | ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర | 1974 |
| సోమశేఖరశర్మ మల్లంపల్లి | విజ్ఞాన సర్వస్వము | 1961 |


## ENGLISH


| | | |
|---|---|---|
| Appa Dorai, A. | The Substance of Politics | 1975 |
| Banerjee, Pramathanath | Public Administration in Ancient India | 1985 |
| Beni Prasad | The Theory of Government in Ancient India | 1927 |
| Drekmeier, Charles | Kingship and community in early India | 1987 |
| Earnest Barker | Greek Political Theory | 1980 |
| Jaya swal, K.P. | Hindu Polity | 1978 |
| Khosla, Ramprasad & Manmohan | A History of India | 1985 |
| Krishna Murthy, K. | Social Cultural Life in ancient India | 1982 |
| Kumar Magumdar, A. | Early Hindu India | 1981 |
| Sabine, Gerorge H. | A History of Political Theory | |
| Shanta Anand | Ksatriya in An-ient India | 1984 |


## SANSKRIT BOOKS


| | | |
|---|---|---|
| Arthasastra of Koutilya (Tra) | Dr R. Shyama Sastry | 1967 |
| Madhura vijayam | Gonga devi | 1975 |
| Manusmruthi | N.R. Acharya | 1946 |
| Matsya Mahapuranam | Forward by H.H. Wilson | 1983 |
| Sukraniti (Tra) | Prof. Benoy Kumar Sarkar | |
| Vidhura Niti | P.S R. Chandradu | 1980 |
| Yajnavalkya Smrti | Edited by N.R.A. Nirnaya | 1949 |


ప్రాచీనాంధ్ర కావ్యాలు, తెలుగు నిఘంటువులు, ఆంధ్ర పత్రికలు, భారతి మాస పత్రికలు జయంతి మాస పత్రికలు, శ్రీశైల ప్రభ ఎన్‌సైక్లోపీడియాస్ ఈ గ్రంథ నిర్మాణానికి తోడ్పడినవి.

# సంక్షిప్త పదసూచిక

| | | |
|---|---|---|
| అనిరుద్ధ చరిత్ర | — | అని.చ. |
| ఆంధ్ర విష్ణు పురాణం | — | ఆం.వి.పు. |
| ఆముక్త మాల్యద | — | ఆము. |
| ఉత్తర హరి వంశం | — | ఉ.హ. |
| ఉద్భటారాధ్య చరిత్ర | — | ఉ.చ. |
| కకుత్స్థ విజయం | — | కుకుత్స్థ |
| కుక్కుటేశ్వర శతకం | — | కుక్కు.శ |
| కాశీ ఖండం | — | కాశీ. |
| కాళహస్తి మాహాత్మ్యం | — | కాళ. |
| కళాపూర్ణోదయం | — | కళా. |
| కుమార సంభవం | — | కుమా. |
| కువలయాశ్వ చరిత్ర | — | కువ.చ |
| కృష్ణరాయ విజయం | — | కృ.వి |
| కేయూర బాహు చరిత్ర | — | కే.బా.చ. |
| క్రీడాభిరామం | — | క్రీ.రా. |
| చంద్ర భాను చరిత్రం | — | చ.భా |
| చారు చంద్రోదయం | — | చారు. |
| జైమిని భారతం | — | జై.భార. |
| తారాశశాంకం | — | తా.శ. |
| దూబగుంట నారాయణకవి పంచతంత్రం | — | దూ.నా.క.పం.తం |
| ద్విపద భారతం | — | ద్వి.భార. |
| ధనుర్వేదం | .... | ధను. |
| నవనాథ చరిత్రం | .... | నవ.చరి |
| నాసికేతోపాఖ్యానం | .... | నాసి. |
| నిర్వచనోత్తర రామాయణం | .... | నిరా. |
| నీతి శాస్త్ర ముక్తావళి | .... | నీ.ము. |
| నృసింహ పురాణం | .... | నృ.పు |
| పరమయోగి విలాసం | ... | పరమ |
| పల్నాటి వీరచరిత్రం | .... | ప.వీ.చ |
| పారిజాతపహరణం | .... | పా.ప. |
| ప్రబోధ చంద్రోదయం | ... | ప్రబోధ |

SRI VENKATESWARA CENTRAL LIBRARY & RESEARCH CENTRE
TIRUPATI.
47779

| | | |
|---|---|---|
| బద్దినీతి | .... | బద్ది |
| బసవ పురాణం | .... | బసవ |
| వైచరాజు వేంకటనాథుని పంచతంత్రం | .... | వై.వేం.పం.తం |
| భగవద్గీత | .... | భగ. |
| భర్తృహరి సుభాషితాలు | .... | భ.సుభా |
| భాగవతం | .... | భాగ |
| భానయ పంచతంత్రం | .... | భా న.పం.తం |
| భారతం | .... | భార |
| భాస్కర రామాయణం | .... | భాస్క |
| భీమేశ్వర పురాణం | .... | భీ.పు. |
| భోజ రాజీయం | ... | భోజ. |
| మధురా విజయం | .... | మ.విజ |
| మను చరిత్ర | .... | మను |
| మార్కండేయ పురాణం | .... | మా పు. |
| ముకుంద విలాసం | ... | ముకు |
| మూలంలో ఇలాగే వుంది | .... | మూ |
| మొల్ల రామాయణం | —— | మొ.రామా |
| యాజ్ఞవల్క్య స్మృతి | .... | యా.స్మృ |
| రంగనాథ రామాయణం | .... | రం.రా |
| రఘు వంశం | .... | రఘు |
| రాజశేఖర చరిత్రం | .... | రాజ చరి |
| రామలింగేశ్వర శతకం | .... | రా.లిం.శ |
| రాయ వాచకం | .... | రా.వా. |
| రుక్మాంగద చరిత్రం | .... | రుక్మా.చ |
| వరాహ పురాణం | .... | వరా పు |
| వాసిష్ఠ రామాయణం | .... | వా.రామా |
| విక్రమార్క చరిత్రం | .... | వి చరి |
| విక్రమార్జున విజయం | .... | వి.మార్జు |
| విజయ విలాసం | .... | విజ.వి |
| విజ్ఞానేశ్వరీయం | .... | విజ్ఞా |
| వివరాలు తెలియవు | ... | వి.తె. |
| వైజయంతీ విలాసం | .... | వై జ వి |
| శశాంక విజయం | .... | శ.వి. |
| శివరాత్రి మాహాత్మ్యం | .... | శివ.మహా. |